


పుటము 25]   సర్వధారి : చైత్రము   [సంచిక 5

భారతి ఇరువదియైదవ సంపుటము, భా-౧

అకారాది విషయ సూచిక



సంపుటము 25
సంచిక 1

భారతి

జనవరి 1948
సర్వజిత్తు మార్గశిర్షము

స్వవిషయము

పరమేశ్వరానుగ్రహమున భారతికి ఇరువదినాలు గేండ్లు నిండి ఇరువదియైదవ యేడు పైబడినది. భారతి కిది జయంతి; పర్వదినము.

అసిధారావ్రతమువంటి పత్రికా నిర్వహణములో ఇటువంటి ఘట్టములే ఇసుమంత ఆశ్వాసము నిచ్చి ఆత్మతృప్తి కలిగించునవి. అష్టకష్టములతో కూడుకొన్న పత్రికానిర్వహణలో నిర్వాహకులపాలిటికి ఇటువంటి జయంతులే ఉత్సవసందర్భములు.

ఇంకొక్క యేడుతో రజతోత్సవము చేసుకోగల భాగ్య మబ్బనుండుట మరియొక ముదావహవిషయము.

పత్రికానిర్వహణములోని సాధక బాధకములను ఏకరువు పెట్టుట సాధ్యము కాని పని. ఈ సేవా, ధర్మపరాయణత్వములో లోపాలోపములు తలవని తలంపుగానే గలుగుచుండుట మానవమాత్రసహజము. మరి, తలచినది తలచినట్లుగా పత్రికను తీర్చి దిద్దలేక పోవుచున్నా మనుట మా యంతట మాకే పొడగట్టుచున్న ప్రత్యక్షసత్యము.

అయినను ఇటువంటి లోటుపాట్లను పాటించక, అవ్యాజముగా, ఆంధ్రమహాజనులు అన్నివిధములుగాను భారతిని ఆదరించి అభిమానించుచున్నందుకు వారి ఉదారాశ్మలకు ఈ సంతోషసమయములో మా కృతజ్ఞతను వెల్లడించుట మా ప్రప్రథమ విధియై యున్నది. ఈ ఆదరాభిమానములనే అనవరతము వారు మా పట్ల చూపుచుండవలె నని మేము కోరుచున్నాము.

* * *

భారతదేశచరిత్రలో కడచిన 1947 సంవత్సరము సువర్ణాక్షరములతో లిఖింపదగిన సంవత్సరము. అరువదియేండ్ల అపార త్యాగసాహసముల ఫలముగా భారతీయులు ఆర్జించిన స్వాతంత్ర్యముతో, 1947 ఆగస్టు 15-వ తేదీనాటికి, దేశమునకు దాస్యబంధములు వీడిపోయి స్వరాజ్య స్వాతంత్ర్యములు లభించినవి. సుమారు 150 ఏండ్లపాటు

అవక్రవిక్రమముతో భారతావనిని సర్వాధికారములతో పరిపాలించిన శ్వేతజాతిపాలకులు చివరకు, విధిలేక, భారతీయుల ఆత్మశక్తికి లొంగిపోయి, మూటముల్లెలతో స్వదేశమునకు తిరిగిపోయినారు. రక్తపాతమన్నది లేకుండ, రణరంగప్రసక్తికూడ లేకుండ, తాతముత్తాతలనాటినుండి సంక్రమించియుండిన మహారాజ్యాధికారమును, ఈ రీతిని, నడి చప్పుడు లేకుండ, చేజేతులా దేశీయులకు అప్పగింతలు పెట్టుట చరిత్రలో ఇదివరకు కని విని యెరుగని విషయము. భారతజాతికి మూలమంత్రములైన శాంత్యహింసల విశిష్టవిజయ మిది.

ఈ స్వాతంత్ర్యప్రాప్తిలో భారతప్రజ సంతోషానందముల మునిగి తేలినది. వారిలో ఎంతో చైతన్యము చెలరేగినది. ఇంతవరకును ఆత్మలలోనే అణగారియుండిన విజ్ఞానప్రతిభాసంపత్తులను విచ్చలవిడిగా వెల్లడించుకొనగల సావకాశ మబ్బినది. నేడో, రేపో ఆంధ్రరాష్ట్రముకూడ సిద్ధింపనున్నది. దేవుడు మేలుచేసి అదికూడ సిద్ధించినచో— ఇక ఆంధ్రదేశమునకు, ఆంధ్రజాతికి, ఆంధ్రవిజ్ఞానమునకు—వేయేల, ఆంధ్రతేజమునకే మంచిరోజులు వచ్చినట్లే. తొల్లింటి వలెనే ఆంధ్రతేజము తిరిగి వేవిధములుగా వెలుగగల సుదినము వచ్చినట్లే. పై జయంతి నాటికి భారతి అటువంటి సుఖసౌభాగ్యసంపత్సమృద్ధమైన ఆంధ్రదేశమును కన్నులార గాంచితీరగల దని నమ్ముచున్నాము.

* * *

కాని—'ఇల్లలుకగానే పండుగ కాలే'దన్న సామెత నిజమైనందుకు మిక్కిలి విచారముగా నున్నది. సుఖములోనే దుఃఖమును మిళితముచేయుట దైవనీతి కాబోలు. సుఖదుఃఖములకు అందుచేతనే కానోపు అవినాభావసంబంధ మేర్పడినది. లేదేని, స్వాతంత్ర్యమునకు సంతోషించి సంబరపడవలసిన సమయములో దేశమునందు పరివ్యాప్తమైయున్న ఈ అశాంతి కర్థమేమి? అస్వాతంత్ర్యప్రాప్తికి సంబరపడుటయో, లేక దేశములో కారు చిచ్చువలె వ్యాపించియున్న విద్వేషజ్వాలలకు కంట తడిపెట్టుటయో తెలియరాకున్నది. జాతికి జాతికి మధ్య పొడసూపిన విద్వేషము, తత్ఫలితముగా చెలరేగిన కలహములు, కొట్లాటలు, దొమ్మిలు, దొంగతనములు, దోపిళ్లు, నరకులాటలు, హత్యలు, నరబలులు, భ్రూణహత్యలు, శిశుహత్యలు, మానభంగములు, అజ్ఞాతవాసములు, ఆకలిచిచ్చులు —మొదలైన ఈఅరిష్టములకు మనస్సు చాల కలవరపడుచున్నది. ఈ విచారములో ఆ సంబరమును తలచుటకే పాలుపోకున్నది. ఇది చాల శోచనీయమైన పరిస్థితి.

భగవదనుగ్రహమున ఇకనైనను ఈ అశాంతిజ్వాలలు త్వరలోనే శాంతించి, భారతజాతి చిరకాలార్జితమైన తన కీర్తిప్రతిష్ఠలను నిలుపుకొని, తన దివ్యదీధితులను దిక్కు దిక్కులకును బరపితన తొల్లింటి పేరు పునస్థాపితము చేసుకొనగల దని మనసారా నమ్ముచున్నాము. పై జయంతినాటికి భారతి తప్పక అటువంటి శుభప్రాప్తిలో నోలలాడు పుణ్యమునకు నోచుకొనగల దని విశ్వసించుచున్నాము.


"సహ నా వవతు, సహ నౌ భునక్తు, సహ వీర్యం కరవావహై, తేజస్వినా వధీతమస్తు మా విద్విషావహై —ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః"

ప్రాచీన ఖగోళము

౧

— శ్రీ వేలూరి శివరామశాస్త్రి —

సూర్యుడొక నియతసమయమున నుదయించుటయూ, అస్తమించుటయూ జూచి ఆదిమ మానవులుగూడ అబ్బురపడియుందురు. అటులే చంద్ర నక్షత్ర గతులు చూచియు విస్మయానందములు గొని



యుందురు. ఆశ్చర్యము కలిగించునట్టి తేజోలోకము లోకానేక మహాశక్తిచే శక్తిమంతములై క్రమచ్ఛందమున నడచుచున్నవనియు పిదప వారూహించియుందురు. పొలములలో నున్న పశువులుగూడ సూర్యగ్రహణ వేళలందు తోకమట్టలెత్తికొని గ్రామమువైపు పరుగులెత్తుకొని వచ్చుట మనము చూచుచున్నాము. ఆకాశమునందలి యీ జ్యోతిస్సులకు ప్రపంచమునందెల్లదేశములలో గల ప్రాచీనమానవుల మనస్సు స్పందించినటులు సాక్ష్యమున్నది. ప్రాచీనజాతుల చరిత్రములు తెలిసికొనుటకు చక్కని ఉపాయములు లేవు. మరియు ఏ జాతి యెంత ప్రాచీనతమమో ఆ జాతి యితిహాసమంత గూఢతమము.

ప్రపంచమునందలి వాఙ్మయములలో ఋగ్వేదము మిగుల పురాతనము. ఇందలి పదములలో చాల పదములు

యాస్కపాణినుల నాటికే వాడుకనుండి తొలగెను. చాల పదములు మారెను. ఇందలి పదములు కొన్నిటికి పర్షియా, ఖాల్డియా, గ్రీసుదేశముల పదములతో చుట్టరికమున్నది. ఇది మొత్తముమీద అక్ష్యపరము. దీని రచనాకాలము ౮౫౦౦ ఏండ్లకంటె వెనుక. ఇందలి జ్యోతిర్విషయములే ప్రమాణము.

మిడిమిడి జ్ఞానము గల కొందఱు ఋగ్వేదమును రచించిరని పాశ్చాత్యులలో పలువురును, హిందువులలో కొందఱును వ్రాసిరి. జ్ఞానులే దీనిని వ్రాసిరని హిందువులలో పలువురును, పాశ్చాత్యులలో కొందఱును తలపోసిరి. ఈ యుభయవాదములలోని బలాబలములు అధికారముగల పాఠకులకే తెలియగలవు. ఖగోళమునందున్న కొన్ని జ్యోతులనుగుఱించి యీ ఋగ్వేద మేమి చెప్పెనో చూతము:—

'పండ్రెండు పరిధులును, మూడు కుండలును [1] గల యీ చక్ర మెవ రెఱుగుదురు? ఈ చక్రమున మున్నూట అరువది అకులు కలవు' (౧-౪౮) [2]

పండ్రెండు నెలలు, మూడు ఋతువులు, మున్నూటఅరువదిదినములు అని దీని యర్థము స్పష్టము. దీనిలోపల మఱియొక యర్థమున్నను ఈ యర్థమే దానికి వాహకము. కాన నీ యర్థమున కసంగతి లేదు.

'ఎవడు...పండ్రెండు నెలల నెఱుగునో అతడు పదమూడు నెలలయు, ఉత్పత్తి నెఱుగును' (౧-౨౫).

ఈ సూక్తము సౌరచాంద్రమానముల ఐక్యమును రక్షించుచున్నది.

'ప్రతిదినమందును ఉషలు వరుణునకు (సూర్యునకు) ముప్పది యోజనములు (పద్) ముందు నడచును.' (౧-౧౨౩).

---

1. ఋగ్వేదకాలమున హేమంతగ్రీష్మవర్షర్తువులు మూడే. చూ. ఆంధ్రమహాభారతము, ఆది-౧౧౪, ౭. అందు ఋతువు లాఱు.

2. అతి ప్రాచీనకాలమున భూమి నేటికన్న చిన్నగా నుండుటవలన ఏడాదికి ౩౬౦ దినములే. పిదప పిదప భూమి బలియుటవలన ౩౬౫ దినముల యేడాది లెక్కకు వచ్చెనని కొందఱు ఈ క్రింది సూర్యసిద్ధాంతము నుదాహరింతురు:

'బ్రహ్మదివసేన భూమే రుపరిష్టా ద్యోజనం భవతి వృద్ధిః' (గోళపాద ౭)='బ్రాహ్మదినమున భూమి కొక యోజనము పెరుగు, బ్రాహ్మరాత్రి ఒక యోజనము తఱుగు.'

చెట్లుచేమలు పుట్టి గిట్టుటవలన భూమియాకారము పెరుగు నని భాస్కరాచార్యుడుగూడ వ్రాసెను. ఆవహవాయువు (Atmosphere) పృథివ్యంశము కాదని ప్రాచీనుల తలపు. ఇది యిటు లగునేని కాలము గడచిన్న కొలది భూమి పెరుగు ననవలదు. ఏలన, ఆవహ మలతితులతిగా నేలలో నిండును. కాన భూమికి పెంపు టొంపులు కలవని తొల్లిటివారి యూహ. పురాణములును బ్రాహ్మదినమున సృష్టియు, రేయి లయమును చెప్పును.

నేటి వైజ్ఞానికులు 'తాపవికిరణమువలన భూమి క్రమక్రమముగా తఱుగుచున్నది. ఉల్కాదిపతనమువలన చేరు జడద్రవ్యము (Mass) భూమియాకారము నయిదాఱుదినములు వృద్ధిచేయునంతటిది కాదు. పైగా ఉల్కాపాతమువలన కాలమానము హ్రస్వము కాగలయును. మఱియు రవికిని, భూమికిని ఉండు దూరములో మార్పు లేదు' అని అందురు. వానలు మొదలగువానికి (Erosion) భూమి కరగి కృశించుచున్నదని జియాలజీ చెప్పుచున్నది. ఇంకొకమాట. ఋగ్వేదమునందలి ౧-౨౫ వ సూక్త మధిమాసము చెప్పుచున్నది. భూమి అసూక్తకాలమునకును, ఈ సూక్తకాలమునకును ఇంత పెరిగె నని అంగీకరింపగలరా? దానికిని దీనికిని ఒక బ్రాహ్మదివస మంతర ముండవలయునే!

ఈ సూక్తమువలన ఋగ్వేదఋషులకు భూమి పరిమాణమువిషయమున ఏదో ఒక లెక్క[3] యుండ కలదు యని తోచును. ఆ లెక్క యేదో మన కిపుడు తెలియుగల ఆధారములు లేవు. పురాణములందును, నడపటి వైజ్ఞానిక జ్యోతిషమునందును గల లెక్కలతో ఈ లెక్క యెంతవట్టు సరిపడును అని విచారించినవారు లేరు. కాని యీ విషయమున నొక చిక్కున్నది. ఈ సూక్తము ఆసియాఖండమున ఏప్రాంతమున పుట్టెను[4] అను సంగతితో ఈలెక్కకు సంబంధ మున్నటులు తోచును. కావున ఈ లెక్కకు దినవారీ విషయమును మనస్సునం దుంచుకొనవలెను. అది యెటులండె. భూమి గోళాకార మను నభిప్రాయము లేనిచో సూర్యునకు మునుముందు ఉష నడచు ననుట కర్థము లేదు కావున వారికి భూమి గోళ మని తెలియు నని కొంద ఱూహించిరి. కాని ఉష ముం దేగుట స్వాభావికము. భూమి గోళ మని తెలియని పామరు లకును సూర్యునిముందు ఉషోదయ మగునని తెలియ వచ్చును.

'గమనశీలమగు నీచంద్రమండలము అంతర్హితమగు త్వష్టృతేజముచే (సూర్యతేజము) ఇటు లగపడు చున్నది' (౧-౮౪-౧౫). 'ఓ సూర్యుడా! నిన్ను స్వర్భానుడు చీకటితో కప్పివేసినపుడు ముల్లోకము లకును తమతమ తావులు తెలియలేదు' (౫-౪౦-౬). 'ఓయింద్రా! నీవు సూర్యునిక్రింద నున్న స్వర్భానువు మాయను తొలగఁజేసినపుడు అత్రి తురీయ బ్రహ్మచే కార్యవిఘాతకమగు చీకటిలో మునిగిన సూర్యుని ప్రకాశింపజేసెను'.

గంగాధరు లీ 'తురీయేణ బ్రహ్మణా' అను రెండుపదములను విమర్శించి తురీయయంత్రముచే గ్రహణము కనుగొనుట యని వ్రాసిరి. కాని విమర్శకు లలో ఈయర్థము నెడ సందేహము కలదు. అయినను దీనికి పరమునం దున్న ఋక్కులలో అత్రివంశము వారు యంత్రసాహాయ్యమున గ్రహవేధ చేయుటలో దిట్ట లని యుండుటవలన ఈ ఋక్కులోని 'తురీయేణ బ్రహ్మణా' అనునది తురీయయంత్రమే యని బలంపూర అభిప్రాయము.

'గ్రహణ మిన్ని గడియలకు వచ్చు నని గణితము చేయుట మిగుల తెలివితేటలు గలవారి పనిగాన అది

3. సాయణులు దీనిని ఇటులు వ్యాకరించిరి: సూర్యసిద్ధాంతాదులకనుచొప్పున భూపరిధి ౫౦౫౯ యోజనములు. సూర్యు డింత మేర నడచుట కొక పగలును, ఒక రేయియు, లేక ౬౦ దండములు పట్టును.

కావున 3౦ యోజనములు నడచుటకు సుమారు $\frac{3౦}{౮౪}$ దం. పట్టును. అనగా సూర్యునికంటె ౮|| నిమిషముల ముందు ఉషోదయ మగును.

ఇది సాయణుడు స్థూలముగా చూచి చెప్పిన మాట కావచ్చును. ఏలనిన, నిరక్షరేఖమీదగూడ ఈ ౮|| నిమిషము లల్పము. ఇంకొక ముప్పు. గ్రహము లాకాశమున ప్రత్యహము ౧౨,౦౦౦ యోజనములు నడచు నని సిద్ధాంతములు చెప్పుచున్నవి. దానిని బట్టి ఉషఃకాలము 3|| నిమిషములే యని చెప్పవలెను. కావున ఋషులు చెప్పిన ఉష యేదో, యోజన మనిన నెంతో మనకు ఇప్పటికి తెలియదు. ఇదియుగాక మూలమున పదములని కలదు. దానికి యోజనము లను అర్థ మనుమానాస్పదము.

4. వేదములలో గల గంధర్వనగరము మేరుతేజస్సు (aurora). ఇది భరతఖండమున కనబడదు. కావున వేదఋషుల వాసము గంధర్వనగరములు కనబడు మేరుసన్నిహితప్రదేశము. అది నిరక్షరేఖకు పైని ౬౦° అక్షాంశములకు పై ప్రదేశము. ఈ గంధర్వనగరముల వర్ణన జ్యోతిషసంహితలందును, పురాణములందును, సుశ్రుతమునందును (సూత్రస్థాన) కలదు:

'అనేకవర్ణాకృతిశ్చ ప్రకాశతే, పురం పతాకాధ్వజతోరణాన్వితమ్.'—అనేకవర్ణములును, అనేకాకారములును గల జెండాలతోడను, తోరణములతోడను గూడిన పట్టణ మాకాశమున ప్రకాశించుచున్నది.

Polar lights ఇటులు కనబడును. ఈ గంధర్వనగరపు బొమ్మ యొకటి ఆంధ్రవిజ్ఞానసర్వస్వమునగలదు.

భారతీయులకు చేత కాదు. దానిని మొదట సాధించిన (శోధించినవారుగూడ గాదు, మఱి) దొంగిలించిన వారు చీనావారు, మఱి ఖాల్డియావారు. వారికడ వారు భారతీయులు' అని ఒక దొర వ్రాసెను.౪౨

---

౪౨ గ్రహణములు చెరుపు కలిగించునని అన్ని దేశములవారును నేటికిని అనుకొందురు. మనదేశమున గ్రహణ వేళలందు చాలాంద్రము విశ్రాంతి గొందురు. మఱియు, పంటలు పాడగు నని అనుకొందురు. పసువుల కొమ్ములకు సున్నము పూయుదురు. ఫలవృక్షములకు దిష్టిబొమ్మలు కట్టుదురు. మఱియు గ్రహణసమయములందు ప్రత్యేకముగా మంత్రోపదేశము పొందుదురు. తర్పణము లొనర్తురు. ఈ రీతిగా వాని పవిత్రతయు మనము స్మరించుచున్నాము. సూర్యసిద్ధాంతమునం దీభీతివ్యంజకమగు పవిత్రతనుసరించిన వాక్యములు కలవు.

చీనాదేశమునందును ఇట్టి భీతివ్యంజకమగు పవిత్రత గ్రహణములయెడ గలదు. చీనా రాజజ్యోతిషకులు హీ, హో అను ఇరువురు గ్రహణము పట్టునని మునిముందు చెప్పజాలకపోవుటచే క్రీ. పూ. ౨౧౫౯ వ పాలన ప్రాణదండనమునకు గుఱియయిరి. దీనివలన నాటికి చీనాలో వైజ్ఞానికులు గ్రహణము కనుగొనుట కుపాయము లన్వేషించుచుండి రను ఊహ కాస్పదమున్నది.

ఖాల్డియావారు గ్రహణముల పునరావర్తనమును గుఱించి వ్రాసిరి. దానికి సేరోస్ అని పేరు. ౨౩౦ చాంద్రమాసములకు చంద్రుని కేంద్రద్వయము భూమియొంతటను సంపూర్ణముగా ఆవర్తించును. దీని కొక కల్పమని పేరు. పరకల్పమునందును పూర్వకల్పమునందలి ఘటనల సన్నివేశములో గ్రహణములు తొంటివలెనే పునరావర్తించును. భూదోదార్యనమున నే వారిటులు కనిపట్టిరిగాని యంత్రసాహాయ్య మేమియు లేదు. ఖాల్డియావారు రాసులను కనుగొనిరి. కావున వారికడనుండియో, చీనావారినుండియో హిందువులు సేకరించిరని కొందఱు దొరలు వ్రాసిరి.

ఇక హిందువులలో గ్రహణము కనుగొనుటకు తిథినిబట్టి ఒకటియు, రాశినిబట్టి మఱియొకటియు రెండు పద్ధతులున్నవి. చాల పురాతనకాలమునందే తిథినిబట్టి కనుగొను పద్ధతి యున్నదని మహావిషువబిందువునకు గుఱుతయిన కృత్తికాదులే ప్రమాణము. అది క్రీ. పూ. ౨౩౦౦.

చంద్రుడే నక్షత్రముకడ నుండెనో కంటికగపడును. సూర్యుని వెలుగుచే నక్షత్రములు కానరావుగాన సూర్యు డే నక్షత్రముకడ నుండెనో తెలిసికొనుట అనుమానప్రమాణముచే సాధ్యము. సూర్యుని గతి నియతము. చంద్రుని గతి పార్శ్వశక్తుల ఆకర్షణమున అనియతము. కాన నిక్కచ్చిగా గ్రహణమును నిర్ధారణ మొనరించుటకు రాశిచక్రావిష్కరణ మావశ్యకము.

రాశ్యభాసము బుస్కలం దున్నను మన పండితులును, పాశ్చాత్యపండితులును దానియెడ చూపు పఱుప లేదు. పండితులు ఐతిహాసికదృష్టితో 'వేదాంగజ్యోతిషమునను, భారతమునను రాశిమాట లేదు. రామాయణమునం దున్నదికాని అది క్రీ. పూ. ౩ వ శతాబ్దికి చెందినది. మఱియు క్రీ. త. ౫ శతాబ్దిలో ఆర్యభట్టని. రాశ్యాదిమేషము, మేషాంతర్గత మశ్వని. కావున రాశిమాట హిందూదేశమున క్రీ. త. ౫ వ శతాబ్దిలో ఆవిష్కృతమాయెను. వా. వి. మ. పురాణములలోని మేషాదిరాసులు కల శ్లోకములు ప్రక్షిప్తములు' అని శ్రీ జి. వి. కే. M. A., F. R. A. S. గారు వ్రాసిరి. మఱియు 'క్రీ. పూ. ౧౮ శతాబ్దికి వెనుకటి దనుకొనదగిన బ్రాహ్మసిద్ధాంతాదులలో రాసులు కానవచ్చుచున్నవే' అని శంకించి 'అవి అధునాతనములు, లేక ప్రక్షిప్తములు' అని శ్రీబాలకృష్ణ దీక్షితులు వ్రాసిరి.

కాని గణితజ్ఞులగు ఇటీవలి విమర్శకులు 'నక్షత్రవిభాగము చేసినవారే రాశిచక్రావిష్కారము చేసి రనుటలో అర్థమున్నది. ఏలన, నక్షత్రవిభాగము రాశిచక్రమునుగుఱించి. హిందువులకంటె ముందు నక్షత్రవిభాగ మెఱుగని చీనా ఖాల్డియాగ్రీకు వారిలో నొకరు హిందువులకు ముందు రాశిచక్రము నావిష్కరించి రనుట అవిశ్వసనీయము. వారి రాశిచక్రావిష్కరణకాలముకన్న ముందు హిందువుల రాశిచక్రావిష్కరణకాలమునకు ఐతిహాసికముగా దృష్టాంతము దొరకక పోయినంతమాత్రమున హిందువుల కిది తెలియ దని నిర్ధరించుట యెటుల?' అని అందురు.

'రాత్రులం దెత్తుగ ఆకసమున గనిపించు నీ ఋక్షగణము[5] పగట నెచటికి బోవును?' (౧-౨౪)

రాత్రులందు గనబడు నక్షత్రము లన్నియు పగట కనబడవు. దాన వింత యే మున్నది! ఈ ఋక్కునం దీ వింతకు హేతు వేమి యని లోకులకు జిగి ఇచట ఋక్షగణ మనగా సప్తర్షు లని కొంద ఱర్థము చెప్పుదురు. ఉత్తరదేశము లందలి వారికి రాత్రికాలమున సప్తర్షు లస్తంగతు లగుచున్నటులు కానిపించరు. కావున పగట వారు కనిపించకపోవుట వింత కలిగించును. మఱియు క్రీస్తునెనుక మూడు నాలుగు వేల యేండ్లనుక (a Draconis) ధ్రువతార. సప్తర్షులు దాని సమీపమున నుండిరి. దానకేసి పడమటగా వారి కస్తంగతి లేదు. దివారంభమునకే వారు కనబడరు. ఈరీతిగా సప్తర్షులను, సప్తర్షి చారమును ఆకాలమువారికి తెలియును. సప్తగ్రహములు కూడ వారికి తెలియు నని సామశ్రమిపండితులును, బాలగంగాధరులును కొన్ని ఋక్కులు చూపిరి. శుక్ర బృహస్పతుల మాట కొంత స్పష్టముగనే ఉన్నది. అఘ, అర్జుని ఈ మొదలగు విశేష నక్షత్రముల మాట ఋక్కులలో గానబడును.

'ఒకడు (చంద్రుడు) భువనములందు ఋక్షు కక్ష్య చేయుచు చేయుచు ప్రపంచ మవలోకించును; రెండవవాడు (సూర్యుడు) ఋతుగణముల విధించుచు విధించుచు మరలమరల జన్మగ్రహణ మొనరించును' (౧౦-౮౫-౧౮).

వీని అన్నిటిని బట్టి మాస[6] వత్సర స్థూలసూక్ష్మ పరిమాణమే కాక సూర్యచంద్రుల లోక నిర్దిష్టమార్గమున గమనాగమనము లోచింతు రనియు, సూర్యుడు విషువద్వృత్తమునకు [7]ఉత్తరముగను, దక్షిణముగను నడచు ననియు వారికి తెన్నగా తెలియు నని తేలుచున్నది. మఱియు రవిమార్గ విషువద్వృత్తముల పరస్పరాశ్రతియు (౧-౧౧౦-౨), భూ కేంద్రపు విషయమును (౧౦-౮౬-౪) ఋగ్వేదమునందు కనిపించునని లడ్విగ్ వ్రాసెను.

'ఆదిత్యుని పండ్రెండాకుల చక్రము స్వర్గమున నలుప్రక్కల మాటిమాటికి తిరుగుచున్నను ఒకప్పుడును జరాగ్రస్తము కాదు. ఓ అగ్ని! ఈ చక్రములందు పుత్రరూపములగు ఏడువందల యిరువది జంటలు కాపుర మున్నవి' (౧-౧౬౪-౧౧).

ఏడువందల యిరువది జంట లనగా మూడు వందల అరువది పగళ్లు, మూడువందల అరువది రేలు

---

5. ఋక్షపదము భల్లూకమును, నక్షత్రమును చెప్పును. భల్లూకార్థము కల గ్రీక్ Arktos అను పదము ఋక్షభవము. ఈ Arktos లాటిన్లో Ursa గా మారెను. ఇటు లీ రూఢిపదములకును సంబంధబాంధవ్యము లున్నవి. తావన్మాత్రమున ఇచటి ఋక్షగణమునకు సప్తర్షు లర్థమని (Ursa major) నిర్ధారణచేయు టెట్లు?

6. 'చంద్రమస్'లో నుండి 'మాస' శబ్దము విడివడెను. మాస మనగా తొల్లి చాంద్రమాసమునకే గ్రహణము. ఆంగ్లమునందలి Moon, Month పదము లిట్టివి. మఱియు 'సూర్యామాసా' (౮-౯౦, అను ఋక్కున 'మాస' పదమునకు చంద్రుడని అర్థము.

7. విషు=ద్విము ! వత్ = రెంటినడుమ కలది. 'యజ్ఞమునడుము-ఏడాది పొడుగునను ఉండు సత్రము, లేక యజ్ఞమునడుము, ఏడాది నడుము' అని క్రమక్రమముగా దీనికి అర్థవ్యాప్తి కలిగెను. విషువద్దినముచే సంవత్సరము సమముగా రెండు భాగము లగుటచే దీనికి విషువత్ అనిపేరు. ఋగ్వేదము నందలి ఒక ఋక్కు కాలమున నిది (ప్రజాపతి తల) పునర్వసు నున్నది.—'యథా వై పురుష ఏవం విషువాం స్తస్య యథా దక్షిణోఽర్ధ ఏవం పూర్వోఽర్ధో విషువతో యథోత్తరోఽర్ధ ఏవ ముత్తరోఽర్ధో విషువత స్తస్మా దుత్తర ఇత్యాచక్షతే. ప్రబాహుక్సత ఏవ విషువాన్ శిర ఇవ వై పురుషస్యాపి న్యూర్మే స్తతాని ప్రబాహ్వ్యే శిర్షో విజ్ఞాయతే' (ఐతరేయ బ్రా. ౪-౨౨) = కుడియెడమ చేతులు చాపిన పురుషుని తల సరిగా నడుమనున్నటులు విషువత్తు ఉండును. ఆ సమదినమున సంవత్సరము—యజ్ఞము మొదలుపెట్టబడెను.

8. 'పశ్వపాన్మదింద్ర ఉత్తరః' అను మహిటుక్కు (చూ. Orion 173 p) ౪వ వర్గములోని ఈ ౩ ఋక్కులు ఇంకను పరిశోధనకు విషయములు. ఇవి ధృవకక్షాబోధకము లనుటయు ఆలోచింపదగినది.

మేషము మొదలగు పండ్రెండు రాసులే పండ్రెండాకుల చక్రము.

వేదకాలమునాటికి రాసులు లేవనియు, ఈ పండ్రెండును తెలియనియు కొందఱు సందేహింతురు.

కాని—'ఓ అశ్వినులారా! ఒక ప్రక్క వృషభము, రెండవ ప్రక్క శింశుమారము కట్టిన రథ మెక్కి మీరు దివోదాసునకును భరద్వాజునింటికి వచ్చితిరి' (౧-౧౧౬-౧౮).

అను ఋక్కునందలి వృషభ శింశుమారములు వృషభమును, మకరమును గాక మఱే దేమి? ఇట్టి సంగతులు గమనింపక పలువురు రాశిచక్రము పరకీయము అని వ్రాసిరి.

ఋగ్వేదము జ్యోతిశ్శాస్త్రము కాదని మనకు తెలియును. ప్రసక్తములగు పై విషయములు అనాటికి కొన్ని జ్యోతిస్సిద్ధాంతము లున్నవని తెలుపగలవు.

అథర్వమునందును, బ్రాహ్మణములందును, ఆరణ్యకములందును నక్షత్రముల సవిశేషము కలవు. అథర్వమున అభిజిత్తు కలదు9. చంద్రుని భగణకాలము ౨౭ ౧/౩ దినము లగుగాన నాటివా రభిజిత్తునుగూడ గైకొనిరి. చంద్రు డభిజిత్తున ౧/౩ దిన ముండును. చంద్రు డొకనాడు మహావృత్తపరిధిలో ౧౩ ౧/౩° పరిభ్రమించును. ఈ ౧౩ ౧/౩°లో గల చుక్కల గుంపులో ఉజ్జ్వలమగు చుక్క ప్రధాననక్షత్రము.

కొన్ని ఋక్కుల కాలమున పునర్వసు మృగశీర్షలును, తైత్తిరీయసంహితాబ్రాహ్మణముల కాలమున కృత్తికయు, ఐతరేయబ్రాహ్మణముల కాలమున కృత్తికారోహిణులును, వేదాంగ జ్యోతిష కాలమున ధనిష్ఠయు, భారతకాలమున శ్రవణమును10 ప్రథమ నక్షత్రములు. అనగా వాసంతవిషువ మాయాయా నక్షత్రములలో నగుచుండెనిది. విషువ మేటేటను ౫౦ వికలలు వెనకబడును. ౯౬౦ ఏండ్లకు సుమారు ఒక నక్షత్రము (౮౦౦ కలలు) వెనుక నగును.

బ్రాహ్మణములందును, ఆరణ్యకములందును పెక్కు జ్యోతిస్తత్త్వము లుపాఖ్యాన రూపముగా గలవు. ఐతరేయబ్రాహ్మణమునుండి ఒక ఉపాఖ్యాన సార మీదిగువ:

'ఒకపుడు ప్రజాపతికి తన కూతుమీద వలపు గలిగెను. అతడు లేడి యాయెను. అతని కూతు రాడు లేడి యాయెను. దేవతలు ఇతడు అకృతము (చేయరాని పని) చేయుచున్నాడని ఒక భూతమును సృష్టించి ప్రజాపతిని శిక్షింపు మని కోరిరి. అతడు ప్రజాపతి నకృతమును బాణమున గొట్టెను. ఆ బాణముతో ఆ మృగ మాకసమున కెగసెను. దానికే మృగ మందురు. దాని జేసినవాడు మృగవ్యాధుడు, కూతురు రోహిణి (3 పఞ్చిక, 33 అధ్యా.).

ప్రజాపతి యన్నను, యజ్ఞ మన్నను, సంవత్సర మన్నను ఒకటియే యని యీ బ్రాహ్మణము మాటిమాటికి చెప్పుచుండును. ఏడాది పొడుగునను సత్రము జరుగుగాన యజ్ఞ మనినను, సంవత్సర మనినను ఒకటియే. యజ్ఞము చేయనిచో ప్రజాసృష్టి కాదుగాన ప్రజాపతియనగా యజ్ఞము. ప్రజాపతికూతురు రోహిణి. ఈ రోహిణీనక్షత్రమునం దపుడు వత్సరారంభము. ఆకాలమున వాసంతవిషువమునందే ఉగాది. వేదఋషులకు కొండొక నక్షత్రమునందు ఉగాదియగుట తెలియును. బ్రాహ్మణకాలమునందలి ఋషులకు ఇపుడు రోహిణిలో విషువ మగుట అనుచితవ్యభిచారముగా గనబడెను. కావున అది 'అకృతి', అనగా లోకమునకు తగని పనిగా వారికి తోచెను. ఈ యుపాఖ్యానమునందలి విషువత్ప్రచ్యుతి వ్యక్తమగుచున్నది. ఇట్టి ఉపాఖ్యానములు పెక్కులు పురాణములం దట్లే గలవు. తైత్తి

9. 'ఉపరిష్టా దాషాఢానా మధస్తా చ్ఛ్రోణాయాః' = ఆషాఢలకు పైన, శ్రవణమునకు క్రింద అని శ్రీధరస్వామి (భాగ. ౫-౨౩ అధ్యా.) దీనికి గుఱుతుగాం.'

తైత్తిరీయసంహిత ఇరువదేడు నక్షత్రములనే చెప్పెను. (రవిపథమునకు ౮౦౦ కలల పరిమితమగు ప్రదేశము) వీనిలో అభిజిత్తు లేదు.

10. 'అహః పూర్వం తతో రాత్రి ర్మాసాః శుక్లాదయః స్మృతాః, శ్రవణాదీని ఋక్షాణి ఋతవః శిశిరాదయః' అని అశ్వమేధపర్వమున ౪౪ అధ్యాయమునం దుండుటచే శ్రవణాదికాలమున భారతరచన. అది క్రీ. పూ. ౫వ శతాబ్దికి వెనుక.

రీయ బ్రాహ్మణమున 11 బృహస్పతి తిష్యలో పుట్టె నని కలదు. వానకేసి సంహితలు తిష్యబృహస్పతి యోగము శుభమని చెప్పెను. తైత్తిరీయారణ్యకమున గ్రహముల పేరు లున్నవి. ఇంతకు ముందే చంద్రనక్షత్ర యోగము ననుసరించి మాసముల పేరు లేర్పాటాయెను. ఈ అరణ్యక సమయమున యుగవిభాగము మొదలయి నట్లు తోచును.

ఈ సమయముననే 'నక్షత్రవిద్య' వెలువడెను. ఆ విద్యలో స్నాతకులు 'నక్షత్రదర్శ' పదధారులు. వారు ఏడాదిపొడుగునను వ్రతము సాగించుటకు ఉత్తర దక్షిణాయనములను విషువద్దినమును తిథ్యాగములను నిర్ణయించువారు. దీనినిబట్టి యజ్ఞముకొఱకు ఖగోళ పరిశీలనము వారి కావశ్యక మాయెను. సోమరసమున కేర్పడిన పాత్రముల పేరులు గ్రహనామముల ననుసరించెను. ఆ 'నక్షత్రవిద్య' ఎట్టిదో యిపుడు మనకు తెలియదు. కాని ఖగోళ మొక శాస్త్రముగా ఆరంభమగుట యీ బ్రాహ్మణముల కాలమునం దని చెప్పవచ్చును. పై తిష్యబృహస్పతియోగము సుమారు క్రీ. పూ. ౪౬౫౦ లో అగుగాని మఱొకపుడు కాదని శ్రీవేంకటేశ్వరదీక్షితులు నిర్ణయించిరి. బ్రాహ్మణరచన నాటినుండి కృత్తికాకాలమువఱకును జరిగె నని మన మనుకొనవచ్చును.

వేదాంగజ్యోతిషము

ఇది వేదమున కంగము పరిశిష్టము. ఇందు ౩౬ శ్లోకములుమాత్రము కలవు. దుర్బోధము నీ గ్రంథము కొన్నిశ్లోకపాఠము మనిపాతముడిచిన మాణిక్య మాయెను. నలుబది యేబదియేండ్ల యీవలను పలువురు పండితులు దీనికి వ్యాఖ్యలు వ్రాసి, దీనిని సుబోధ మొనరించిరి. ఈ గ్రంథరచన క్రీ. పూ. ౧౩౭౭ న.

దీని విశేష మిది: ఐదేండ్ల యుగము. మాఘ శుక్లమున ఈ యుగము మొదలు. పుష్యమావాస్యతో అంతము. ఏడాదికి ౩౬౬ దినములు, ౬ ఋతువులు, ౨ అయనములు, ౧౨ సౌరమాసములు. ఇట్టి ౫ ఏండ్ల యుగము.

ఈ యుగమున చాంద్రసౌరవిభాగము కూడ గలదు. ఇందు ౩ ఏండ్లకు పండ్రెండు పండ్రెండు చాంద్రమాసములు. మిగులు రెండేండ్లకు పదమూడు పదమూడు చాంద్రమాసములు. ఒక యుగమునకు ౬౨ చాంద్రమాసములు, ౬౦ సౌరమాసములు. కావున రెండు మలమాసములు.

వేదాంగజ్యోతిషమునకుల మఱియొక విశేష మేమనిన 'ధనిష్ఠ నక్షత్రములకాది.'

ఒకసారి సింహావలోకనము చేసి యీ ప్రకరణము ముగింతును.

క్రీస్తువెనుక సుమారు ౮౦౦౦-౫౦౦౦ నడుమ పునర్వసులో విషువము. ఇది అదితికాలము.

క్రీ. పూ. సుమారు ౫౦౦౦-౩౦౦౦ మృగశిరలో విషువము. ఈ సమయమున ప్రాచీనకాలగణనమున సంస్కారము జరిగెను. క్రీ. పూ. సుమారు ౩౦౦౦-౧౪౦౦ నడుమ కృత్తికలో విషువము. ఐతరేయ తైత్తిరీయ బ్రాహ్మణములు, తైత్తిరీయసంహితయు ఈకాలమున పుట్టెను. తైత్తిరీయసంహితలో కొంత క్రీ. పూ. ౨౪౪౫న విరచిత మగుట కాధారము కలదు.

క్రీ. పూ. ౧౩౭౭ ధనిష్ఠలో విషువము.

క్రీ. శ. సుమారు ౪౦౧ శ్రవణములో విషువము.

---

11. తై. బ్రా. ౩-౧-౧; ఋక్ ౪-౫౦-౪; అథర్వ. ౨౦-౮౮-౪. 'ఋక్ (౧౦-౧౨౩) వందలి వేన పదము శుక్రగ్రహ బోధకము. పసిమటివారి Venus పదమును, ఇదియు నొక్కటియే' అని Orion లో (p. 161, 2) శ్రీ బాలగంగాధరులు.

సవరణ

(౬ వ సంచిక) విశ్వశ్లోకము, ౨—౫౭౨ వ పుట, రెండవదళము, ౧౨ వ పంక్తిని 'లేదని అనెనా ?' ను 'కలదని అనెనా' అనియు, ౧౩ పంక్తి 'తిరుగననుు'ను 'తిరుగదను' అనియు సవరించుకొనవలెను. మఱియు ౧౨ సంచికలో ౫౩౨ వ పుట రెండవ దళము ౨౭ వ పంక్తిలో 'మున్నూరు ఏండ్లక్రింద'ను 'మూడువేలమున్నూ ఱేండ్లక్రింద' అనియు, ౫౩౪ వ పుటలో మొదటి దళము ౭ వ పంక్తిలో 'ఇరువది రెండువేల'ను 'రెండువేల' అనియు సవరించుకొనవలెను.



చెన్నపురిలో గత మాసాంతమున జరిగిన అఖిలభారత మహిళా మహాసభ కార్యకలాపములను చూడవచ్చిన కొందరు ఇండోనీషియా ప్రతినిధురాండ్రు. (ఇందులో రెండవవారు మాత్రము శ్రీమతి అమ్ము స్వామినాథన్ గారు.)

శబ్దమూ శబ్దసంపదా

శ్రీ
వావిలాల
సోమయాజులు

"దైవీం వాచ మన్యజంత దేవాః, తాం విశ్వరూపాః పశవో వదంతి."

నేను మాట్లాడుతున్నాను; నాకీ 'మాట్లాడటం' ఎలా వచ్చింది? ఈ జిజ్ఞాస ప్రారంభిస్తే తేలే సారాంశము: చిన్నతనంలో మా అమ్మా, నాన్నా నాకు కొన్ని శబ్దాలు నేర్పారు; తరువాత మా గురువులు కొన్ని నేర్పారు; గ్రంథజాలంవల్ల నేను కొన్ని నేర్చుకున్నాను; ఈ శబ్దసంపదంతా నేను ఒకనాడుగా సేకరించుకున్నది కాదు అని తేలుతుంది. భాషాశాస్త్రపరిభాషలో చెప్పవలె నంటే నాకు భాష సంఘమూలకంగా వచ్చిన దనవలసివస్తున్నది.

—అయితే, నా కాలంవారికి శబ్దజాలం ఎలా వచ్చింది? పూర్వులనుంచి అని సమాధానం. వారి పూర్వులకో? వారి పూర్వులనుంచి. ఇలా పోగా పోగా అనాది మానవసంఘందగ్గరకూ, అనాదిమానవుడిదగ్గరకూ చేరుకుంటాము.

అప్పుడు అనాదిమానవుడికి శబ్దజాలం ఎలా వచ్చింది అనే జిజ్ఞాస కలుగుతుంది. అతడు పరిసరాలల్లో ఉన్న ఆ ఆ వస్తువులను ఆ ఆ శబ్దాలతో పిలవద్దామని ఏర్పాటుచేసుకొనిఉంటాడేమో అని అనిపించవచ్చును. లేదా జంతులోకంమధ్య తానూ ఒక జంతువుగా వ్యవహరిస్తూ సుఖదుఃఖాలను వెల్లడిచేసుకుంటానికి జంతుజాలం చేసే శబ్దాలను అనుకరించటము నేర్చుకొని ఉంటాడు అని తోచవచ్చును. లేకపోతే అనాది మానవుడు సుఖదుఃఖాది ద్వంద్వాలమధ్య చేసే అవ్యక్త ధ్వనులవల్ల భాషలో శబ్దజాలం ఏర్పడిఉండవచ్చును— అని ఆలోచన నడవవచ్చును.

భారతీయవిజ్ఞానము శబ్దము నిత్యమనీ, సృష్టితోటే ప్రారంభ మైనదనీ, సృష్టికి అదే మూలమనీ పలుకుతున్నది. 'వాగేవ విశ్వా భువనాని జజ్ఞే', 'వాక్ తంత్రిః నామాని దామాని తస్యేదం వాచా తంత్ర్యా నామభిః దామభిః సర్వం సితం' (సర్వమూ వాక్కువల్లనే పుట్టింది, దండలో దారంవలె అది సమస్తములోనూ అనుస్యూతంగా ఉన్నది) అనే శ్రుతివచనాలు ఇందుకు ప్రమాణం. 'నామరూపే వ్యాకరోత్' అనే దానివల్ల ఉపనిషత్తు సృష్టికర్త శబ్దాన్ని సృజించాడని ప్రవచిస్తున్నది.

పరమశివుని స్వరూపమైన శబ్దంలోనుంచీ ఆకాశమూ, ఆకాశావచ్ఛిన్నుడైన ఈశానునివల్లా తచ్ఛక్తి ఐన పరాశక్తివల్లా శబ్దస్పర్శాత్మక మైనవాయువూ జనించింది. వాయుతత్త్వావచ్ఛిన్నుడైన తత్పురుషునివల్లా, తచ్ఛక్తి ఐన ఆదిశక్తివల్లా శబ్దస్పర్శరూపాత్మక మైన వహ్ని సృష్టమైంది. ఆ వహ్నికి అవచ్ఛిన్నుడైన అఘోరుడివల్లా, తచ్ఛక్తి ఐన ఇచ్ఛాశక్తివల్లా శబ్దస్పర్శరూపరసాత్మక మైన జలం ఉద్భవించింది. తజ్జలావచ్ఛిన్నుడైన వామదేవుడివల్లా, తచ్ఛక్తి అయిన జ్ఞానశక్తివల్లా శబ్దస్పర్శరూపరసగంధాత్మక మైన పృథివి ఆవిర్భూత మైనది.

ఇది మహాదేవమననంలోని పంచభూతోత్పత్తి కథనం. పాంచభౌతిక మైనది శరీరం. పంచభూతాలకూ ప్రథమం ఆకాశం. ఆకాశం శబ్దగుణకము. శరీరము శబ్దం.

శబ్దము పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ—అనే నాలుగు అవస్థాభేదాలతో ఉన్నది. 'తురీయం వాచో మనుష్యా వదంతి'—మానవుడు వైఖరీవాక్కులతోనే వ్యవహారం నడుపుకుంటున్నాడు. 'గుహా త్రీణి నిహితా నేంగయంతి'—గుహాశయమై లోపల శబ్దము పరా పశ్యంతీ మధ్యమ లనే మూడు అవస్థలూ పొందుతున్నది. దాన్ని యోగసాధన లేని సామాన్య మానవుడు తెలుసుకోలేడు. 'తాని విదు ర్బ్రాహ్మణా యే మనీషిణః'—మత్సర రహితులు, అలోభులు, దర్ప దంభ క్రోధ వర్జితులూ, బ్రహ్మవిద్యావేత్తలూ అయిన శిష్టులకు ఒక్కరికే శబ్దతత్త్వం సంపూర్ణంగా గోచరిస్తుంది. సామాన్య మానవులు కొంతకొంతగా వ్యాకరణ శాస్త్ర మూలంగా దానిని గ్రహించవచ్చును. అందుకనే భగవత్పతంజలి 'మరణ ధర్మాణువులయిన మానవులను శబ్దతత్త్వాత్మకుడైన మహాదేవుడు ఆవేశించాడు; ఆ మహాదేవపదవిని పొందాలంటే వ్యాకరణ శాస్త్రం చదివితీరాలి.' అన్నాడు. 'సక్తు మివ తితఉనా పునంతః యత్ర ధీరా మనసా వాచ మక్రత, అత్ర సఖాయః సఖ్యాని జానతే, భద్రైషాం లక్ష్మీ ర్నిహితాధివాచి'—పేలాలను జల్లెడలో పట్టుకొని శోధించినట్లు శబ్దాలను శోధించి ప్రయోగిస్తే వారు సత్పురుషులై సాయుజ్యాన్ని పొందుతారు; వారి వాక్కులో లక్ష్మి ఉంటుంది అని వేదము. 'ఏకః శబ్దః సమ్యక్ జ్ఞాతః సుష్ఠు ప్రయుక్తః స్వర్గే లోకే కామధుగ్ భవతి' అని అనటంవలన శబ్దాన్ని తెలుసుకొని ప్రయోగిస్తే స్వర్గం మనపాలిటి కామధేనువు అవుతుందట!

* * *

'సర్వే వేదా యత్పద మామనంతి, తపాంసి సర్వాణి చ యద్ వదంతి, యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి, తత్ తే పదం సంగ్రహేణ బ్రవీమ్యో మిత్యేతత్'—సమస్తవేదాలూ దేనినైతే మననం చేస్తున్నవో, సమస్త తపస్సులూ దేనిని వదిస్తున్నవో, దేనిని ఇచ్ఛించి బ్రహ్మచర్యము నడుపుతున్నారో—నేను దానినిగురించి సంగ్రహంగా చెపుతాను; అది 'ఓమ్' అని ప్రణవాన్ని కఠోపనిషత్తులో యముడు నచికేతసుడికి చెప్పాడు. ప్రణవముపరబ్రహ్మ, హిరణ్యగర్భస్వరూపము. త్రిమాత్రాకమైన ఓంకారాన్ని దర్శించినవాడే పరమ యోగి. 'అనాహత మతిక్రమ్య విశుద్ధే ప్రాణా న్నిరోధ్యాజ్ఞామనుయాతః బ్రహ్మరంధ్రం ధ్యాయతః త్రిమాత్రో హమిత్యేవం సర్వదా ధ్యాయతః పశ్య త్యనాకారశ్చ భవతి' అని హంసోపనిషత్తు. అంటే అనాహతచక్రాన్ని అతిక్రమించి విశుద్ధచక్రంలో ప్రాణాన్ని నిరోధించి ఆజ్ఞాచక్రం ద్వారా బ్రహ్మరంధ్రాన్ని చేర్చి జ్ఞానపరుడై 'ఓం' కారాన్ని నేనని ధ్యానించే పురుషుడు పరాన్ని వీక్షించి అనాకారుడౌతా డని అభిప్రాయము.

ఓంకారాన్ని ఆధారంగా చేసుకొని పరమ పురుషుణ్ణి ధ్యానిస్తే కర్మనిముక్తి కలుగుతుందనీ, సాధకుడు సార్యసంపన్నుడై భాసిస్తా డనీ వేదంలో మరి కొన్నిచోట్ల కనిపిస్తుంది. ఓంకారము వ్యక్తబ్రహ్మము! అది అర్ధమాత్రాకము; అవ్యక్తము; కలాతీతము. ఏకైకళః దాన్ని ఉచ్చరిస్తే అందలి అ, ఉ, మకారాలు మృత్యుతుల్యాలై బాధపెట్టుతవనీ, ద్విమాత్రాకంగా ఉచ్చరిస్తే కొంతకాలం వ్యక్తిమనస్సులో లీనమై చంద్రలోకంలో వసించి తిరిగీ జన్మిస్తాడనీ, బృహదారణ్యకోపనిషద్వ్యాఖ్యలవల్ల వ్యక్తమౌతున్నది. ముండకోపనిషత్తులో—

'ప్రణవో ధనుః, శరో హ్యాత్మా,
బ్రహ్మ తల్లక్ష్య ముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం
శరవత్ తన్మయో భవేత్.'

అని ఉన్నది. ఓంకారము బాణము, ఆత్మ ధనుస్సు, బ్రహ్మము లక్ష్యము. అప్రమత్తతతో ఓంకార శబ్దాన్ని లక్ష్యిస్తే ఆత్మ బ్రహ్మంలో లీనమౌతుందని అభిప్రాయము. బ్రహ్మానికి సంకేతము ఓంకారము. సమస్తమూ బ్రహ్మము. సమస్తమూ శబ్దము. 'ఓ మిత్యేత దక్షర మిదగ్ం సర్వం, తస్యోపవ్యాఖ్యానం భూతం భవ ద్భవిష్య దితి సర్వ మోంకార ఏవ' అని ప్రమాణము.

* * *

'ఓమ్ ఇత్యేకాక్షరం బ్రహ్మ' అన్నారు మంత్రద్రష్టలైన మహర్షులు. ఆ బ్రహ్మను పురుష,

సూక్తం 'అంత శ్చరతి భూతేషు గుహాయాం విశ్వ మూర్తిషు, త్వం యజ్ఞ స్త్వం వషట్కార స్త్వ మింద్ర స్త్వగ్ం రుద్ర స్త్వం విష్ణు స్త్వం బ్రహ్మ త్వం ప్రజాపతిః' అని రూపిస్తున్నది. బ్రహ్మమే శబ్దము. అయినప్పుడు. ఉపాసకుల కార్యార్థము బ్రహ్మము రూపకల్పన పొందటమువల్ల కలిగిన దేవత లందరూ శబ్దస్వరూపులు. మన వర్ణసమామ్నాయము 'అ'కారముతో ప్రారంభించి 'హ'కారంతో అంత మవుతుంది. అందువల్ల 'అహమ్' అనే శబ్దము సమస్త ప్రపంచాన్ని నిరూపించటానికి యోగ్యమైనది. 'అ'కారము శివస్వరూపము; నిర్గుణము. 'హ'కారము శక్తిస్వరూపము; సగుణము. శివశక్తిస్వరూపమైన అహంకారము కామకళాస్వరూపంతో జగద్రూపాన పరిణమించింది. అక్షర సమామ్నాయము బ్రహ్మరాశి. పుష్పించి పుష్పించి అది చంద్రతారకంగా విరాజిల్లుతున్నది అన్నాడు పతంజలిమహర్షి. అందువల్ల శబ్దమే దేవత. మంత్రము దేవత. యాజ్ఞవల్క్యమహర్షి ఆహ్నిక సూత్రాలలో ఇలా అన్నాడు:

'యస్య యస్యచ మంత్రస్య ఉద్దిష్టా యాచ దేవతా
తదాకారం భవేత్ తస్య దైవతం దేవతోచ్యతే'

—మంత్రరూపమే దేవతారూపము; మంత్రమే దేవత అని తాత్పర్యార్థము. ఈ సూత్రాన్ని అనుసరించే మాతృకాన్యాసతంత్రం బయలుదేరింది.

దేవతలు కేవలం శబ్దస్వరూపులే కాదు; శబ్దగమ్యులు కూడాను. ప్రతిదేవతను గురించీ అష్టోత్తరశతాలల్లో 'శబ్దగమ్యాయ' అని కనిపిస్తుంది. ఆచార్య శంకరపాదులు 'సౌందర్యలహరి'లో 'ముఖం బిందుం కృత్వా కుచయుగ మధ స్తస్యతదధో, హరార్ధం ధ్యాయేద్యో హరమహిషి తే మన్మథకలామ్, సనద్య స్సంక్షోభం నయతి వనితా ఇత్యతిలఘు, త్రిలోకీ మప్యాశు భ్రమయతి రవీందు స్తనయుగామ్' అని వర్ణించాడు దేవిని. 'హరార్ధం' అనటంలో 'శివార్ధం'—అర్ధనారీశ్వర రూపము వ్యక్త మౌతున్నది.

'శివః శక్తిః కామః క్షితి రథ రవి శ్శీతకిరణః
స్మరో హంసః శక్రః తదను చ పరా మార హరయః
అమీ హృల్లేఖాభి స్తిసృభి రవసానేషు ఘటితా
భజంతే వర్ణా స్తే తవ జనని నామావయవతామ్'

శివ (క), శక్తి (ఏ), కామ (ఈ), క్షితి (ల), రవి (హ), శీతకిరణ (స), స్మర (క), హంస (హ), శక్ర (ల)—వర్ణాలతో హ్రీంకారాలను మూడుచివరలా కూరిస్తే తల్లీ, నీ నామధేయానికి అంగ మౌతుందని సౌందర్యలహరిలోనే భగవత్పాదులు అన్నారు. క, ఏ, ఈ, ల హ్రీం, హసకహల హ్రీం, సకల హ్రీం—ఇదే దేవనామాత్మకమైన నూతన తంత్రము. ఇది లోపాముద్రవిద్యను సూచిస్తున్న దని కొందరు వ్యాఖ్యాతలు వ్రాసినారు. ఇది గురుముఖతః గ్రహించవలసిన శబ్ద స్వరూపము.

* * *

సంగీతశాస్త్రమూ శబ్దాన్ని బ్రహ్మంగా పరిగణిస్తున్నది. పరమభక్తాగ్రేసరుడూ, వాగ్గేయకార ప్రముఖుడూ, ఋషితుల్యుడూ అయిన త్యాగరాజ స్వామి 'నాదతనుం అనిశం శంకరం' అని ధ్యానించాడు బ్రహ్మస్వరూపాన్ని. కేవలం నాదోపాసనవల్లనే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు జన్మించారని ఆయన 'నాదోపాసన చేసి శంకర నారాయణు లవ వెలసిరి ఓ మనసా' అని పాడుకొన్నాడు.

'నకారం ప్రాణనామానం దకార మనలం విదుః, జాతః ప్రాణాగ్నిసంయోగా త్తేన నాదోభిధీయతే' అని శబ్దాన్ని సంగీతదర్పణం నిర్వచిస్తూ ఉన్నది. ప్రాణానలసంయోగంవల్ల నాద మేర్పడుతున్న దని భావము.

ఈ నాదము (శబ్దము) వర్ణాత్మకమూ, ధ్వన్యాత్మకమూ అని ద్వివిధము. 'అ ఇ ఉణ్, ఋ ఌక్' ఇత్యాది మాహేశ్వర సూత్రాలవల్ల అభివ్యక్తిభాగాన్ని పొంది వేదవేదాంగాలకూ, సమస్తవాఙ్మయ సాహిత్య ప్రపంచాలకూ మూలంగా పరిణమించింది వర్ణాత్మక నాదం. అధిదేవత, జాతి, మిత్రత్వమూ, శత్రుత్వమూ, లింగమూ, కాంతి, విష, అమృతత్వాది గుణరూపాలు వర్ణాత్మక శబ్దానికి లక్షణాలు. ఇందలి ఆయా వర్ణాలకు మాతృకాన్యాసంలో అంగన్యాసకరన్యాసాలు నిరూపితాలై ఉన్నవి.

ధ్వన్యాత్మకమైన శబ్దం ఆహతమూ, అనాహతమూ అని రెండువిధాలు. ఈరెంటిలో అనాహ

తము రేచకపూరకకాదులవల్ల మూలాధారస్వాధిష్ఠాన మణిపూరాది చక్రాలను నాదాన్ని లేపి కేవలం మహాయోగులకు మోక్షసాధకమౌతున్నది.

రెండవది ఆహతము. నాదతరంగాలను శ్రుతిపుటాల్లో ప్రవేశపెట్టి 'ఆనందో బ్రహ్మ' సూత్రసమన్వయం చేయగల శక్తివంతమైన సంగీతానికి మూలము. ఇదే సామానికి మూలం. సారూప్యమోక్షసాధనము. 'మోక్షము గలదా భువిలో జీవన్ముక్తులు గానివారలకు సాక్షాత్కార నీ సద్భక్తి సంగీతజ్ఞాన విహీనులకు' అని త్యాగయ్యచే అనిపించుకున్న సంగీతానికి ఆధారము.

నాద మనే పేరుతో వ్యవహారంలో ఉన్న శబ్దము సప్తస్వరాలతో లోకపూజ్యమై ఉన్నది. ఈ ఆహతనాదశక్తి అత్యద్భుతమైనది. 'శిశు ర్వేత్తి పశు ర్వేత్తి వేత్తి గానరసం ఫణిః' అన్న వచనం లోకప్రసిద్ధమైనది. అంతే కాదు, దేవతలకు కూడా ఆహతశబ్దంమీదనే అత్యంతాభిమానమట!

యజ్ఞసమయాల్లో అధ్వర్యుడు, హోత, ఉద్గాత ముగ్గురూ ప్రధానులు. వీరు దేవతను—ఉదాహరణానికి ఇంద్రు డనుకుందాము—మొదట అధ్వర్యుడు 'ఏహి ఇంద్రా' అని పిలుస్తాడు. ఇంద్రుడు రాడు. హోత మంత్రపూతంగా అస్త్రాన్ని ప్రయోగిస్తాడు. అప్పటికీ రాడు. ఉద్గాతసామగానంతో ఇంద్రుడు సంతోషించి కామప్రదుడు కావటానికి బయలుదేరుతా డని పెద్దలు చెపుతారు.

ఒక్కొక్క స్వరానికి ఒక వర్ణమూ, ఒక రూపమూ ఉన్నదని శాస్త్రము చెపుతూ ఉన్నది. 'అందువల్లనే రాగ, రాగిణుల కల్పన జరిగింది. పాశ్చాత్యదేశాల్లో ఆహతశబ్దశక్తిని గురించి అనేక పరిశోధనలు జరిగినవి. వాటివల్ల శబ్దానికి వర్ణా లున్నవనీ, అనేకరూపాలను సృజించే శక్తి ఆహతశబ్దాని కున్నదనీ ఆ పరిశోధనలవల్ల నిరూపితమైనది. శబ్దము శ్రవణేంద్రియమూలంగా శరీరంలో ప్రవేశించి విద్యుచ్ఛక్తివలె పనిచేస్తుంది. శబ్దానికి ఓషధీగుణ మున్న దని నేటి ప్రకృతిశాస్త్రజ్ఞులు నిరూపిస్తున్నారు. దీపకము, వసంతము, మేఘాంబరి ఇత్యాదిరాగాలవల్ల ఆహతశబ్దశక్తిని తానసేన్, గోపాలనాయకాది భారతీయ సంగీతశాస్త్రవేత్తలు నిరూపించారు. మహాధానుష్కుల మంత్రపూతమైన అస్త్రప్రయోగోపసంహారాల్లో అసంబద్ధత ఉండనవసరం లేదు.

* * *

'శం సుఖం దదా తీతి వా శబ్దః'—సుఖాన్ని ప్రసాదించేది కనుకనే శబ్దము. అందువల్లనే శబ్దాధిదేవత ఐన సరస్వతిని 'యా కుందేందుతుషారహారధవళా... నిశ్శేషజాడ్యాపహా' అని స్తుతిస్తున్నాము. శబ్దాన్ని 'శప్యతే అనేకేతి శబ్దః'—దీనిచేత ఆక్రోశింపబడుతుంది కాబట్టి శబ్దము అనీ నిర్వచనం చెయ్యవచ్చును. లోకంలో సుఖానికీ, దుఃఖానికీ శబ్దమే కారణమౌతుంది. అందుకనే ఒకానొక తత్వవేత్త అన్నాడు: 'మానవలోకంలో యుగయుగాలనుంచీ వస్తూఉన్న రాగద్వేషాలకూ, సుఖదుఃఖాలకూ శబ్దమే కారణము' అని.

మానవలోకంలో శబ్దం ఎంత పని చేయటానికి శక్తి కలిగినదో మనం ఊహించలేము. బైరను మహాకవి 'డాన్ జాన్' లో ఇలా అన్నాడు:

"But words are things and a small drop of Ink-Falling like due, upon a thought produces-That which makes thousands, perhaps millions think"

అని. ఒక క్రూరమైన మృగాన్ని మాలిమి చేసుకోవచ్చును. అలనా పాలనా లేకుండా అయోమయంగా పెరిగిపోయిన అడవిని అదుపులో పెట్టి అందమైన మార్గనిర్మాణం చెయ్యవచ్చును. కాని అజాగ్రత్తతో ఉచ్చరించిన ఒక విషశబ్దంవల్ల కలిగే ప్రమాదాన్ని తప్పించుకోలేము. 'మాటలో ఏముంది మనసు లోకమైతే చాలు' ననుకోటం మనకు పరిపాటి. అయితే మనస్సు ఒకటి కావటానికి మాటే ప్రధానమని మనం మరిచిపోకూడదు. నిశితమైన నిస్త్రింశకంటె హృదయవిదారణశక్తి శబ్దానికి ఎక్కువ ఉంది. 'మాటలలో ప్రయోజన మేముంది, పని చేసి చూపాలి' అనికూడా లోకంలో వింటుంటాము.

ఒకప్పుడు మాటే పనికంటే సహస్రాధికంగా పని చేస్తుంది. అది వచ్చే సమయాన్నిబట్టీ, అందుకునే వ్యక్తినిబట్టీ, అనే వక్తనుబట్టీ అర్థభేదాలు ఏర్పడుతూ, భావచ్ఛాయలు గోచరిస్తూ ప్రళయప్రణయాలు కలగటానికి శబ్దం తోడ్పడుతుంటుంది. అది ఒక జాతిని అభ్యుదయపథం పట్టించనూ గలదు; అధోగతికి చేర్చనూ గలదు.

౫

శబ్దతత్వం తెలిసినవారికి శబ్దం పతివ్రతవంటిది. నిత్యమూ వారి భావాలను అనుసరిస్తూ ఉంటుంది. 'కార్యేషు దాసీ' మొదలు 'శయనేషు రంభా' వరకూ అనురక్తగా ఉంటుంది. శబ్దతత్వం తెలుసుకొని భ్రమపడేవారికి జారిణిగా వ్యవహరించి, తళుకు బెళుకులతో, కిలికించిత ధ్వనులతో ఆకర్షించి శుభ్రంగా 'సుబ్బిసెట్టి'ను చేసి కూర్చోపెడుతుంది. శబ్దం అతిచిత్రమైంది.

శబ్దం ధర్మార్థకామాలను అభివ్యక్తం చేస్తుంది. గృహమర్యాదలూ, సంఘమర్యాదలూ, సంబంధబాంధవ్యాలూ, రాజ్యాలనూ, లోకాలనూ, విశ్వాలనూ, దేవతనూ, పరబ్రహ్మనూ తెలియపరుస్తుంది.

శబ్దసంస్కారం లేకపోవడంవల్ల 'మోదకైః తాడయ మాం' కథవల్ల శాతవాహనమహారాజంతటివాడు అవహేళన పొందినాడు. 'మాహిషం చ శరచ్చంద్రచంద్రికాధవళం దధి' అక్షరలక్షలిప్పించింది.

* * *

శబ్దం అనేకఅంచులు ఉన్న రత్నం. ఆ రత్న శిల్పి లోకంలో ఒక మానవుని జీవితాన్ని వసంతం చేయుకలదు; నిదాఘం చేసి నిర్మూలనం చెయ్యనూ గలదు. మానవుని తత్వవివేచనాశక్తీ, జిజ్ఞాసా శబ్దజాలంమీద ఆధారపడిఉంటుంది. అది అధికమైనప్పుడు అధికమూ, స్వల్పమైనప్పుడు అల్పమూను.

జాన్సన్ మహాశయుడు ఒకచోట 'Words are the daughters of the earth and deeds are the sons of heaven' అన్నాడు. ఆ శబ్దశక్తి అనంతమైనది; అనిర్దిష్టమైనది లోకంలో. దాని స్వరూపాన్ని ఇదమిత్థమని నిర్ణయించటానికి వీలులేదు. ఆధునిక రచయితలలో ప్రసిద్ధురాలు 'వర్జీనియా వూల్ఫ్' శబ్దజాలాన్ని గురించి వ్రాస్తూ ఇలా అన్నది:

"The art of writing which is just another name for beauty is the art of having at one's beck and call every word in the language, of knowing their weights, colours, sounds, associations, and thus making them suggest more than they can suggest... Now this power of suggestion is one of the mysterious p r o p e r-ties of words. Words are the w i l d e s t, the freest, and most irresponsible, most inteachable of all things. They do not live in the dictionaries; they live in the minds. That pause was made;the veil of darkness was dropped to tempt words to come together in one of those swift marriages which are perfect images of ever-lasting beauty" శబ్దానికి శక్తీ, సాంద్రతా, వర్ణమూ, వ్యక్తిత్వమూ ఉన్నవన్న మాట.

శబ్దజాలంలోని అన్యోన్యమైత్రీమూలంగా కాంతి, ఓజస్సు, సమత — ఇత్యాదిగుణాలు కలుగుతవని సాహితీవేత్తలు చెపుతుంటారు. దానివల్లనే రచనల్లో శైలి ఏర్పడుతూ ఉంటుంది. దానిని మన ప్రాచీనసాహిత్యలాక్షణికులు 'యా పదానాం పరాన్యోన్యమైత్రీ శయ్యేతి కథ్యతే' అన్నారు. కూర్పులో గ్రొత్తందనము కలుగుతుంది గాబట్టే కవుల సమ్మోహనశక్తి నిత్యనూతనంగా పరిణమిస్తూ ఉంటుంది. 'యానేవ శబ్దాన్ వయ మాలపామో, యానేవ చార్థాన్ వయ ముల్లిఖామః; తైరేవ విన్యాస విశేషభవ్యైః సమ్మోహయంతే కవయో జగంతి'— అవే శబ్దాలు, అవే అర్థాలు. కాని వాటి విన్యాసంతోనే కవులు లోకాన్ని సమ్మోహపరుస్తారు అని కీర్తి పొందారు కవులు. దీన్నే ఉక్తివిశేషం అనవచ్చును. రాజశేఖరకవి 'ఉక్తివిశేషః కావ్యం'—కావ్యము ఉక్తివిశేషము అన్నాడు. సాహితీశాస్త్రవేత్తలు కొందరు కేవలము శబ్దమే కావ్యము అన్నవారున్నారు. శబ్దమున్నప్పుడు అర్థము దానిలోనే నిబద్ధమై ఉన్నదన్న మాట. 'రమణీయార్థప్రతిపాదకః శబ్దః కావ్యం' అన్న జగన్నాథ పండిత రాయల తాత్పర్యార్థముకూడా 'శబ్దము కావ్యము' అనే చెప్పవచ్చును. 'ఇష్టార్థవ్యవ

చ్చినా పదావళీ' అన్న ఆచార్యదండి శబ్దశాస్త్ర రహస్యవేత్త. 'మాటలు మాటల వచ్చును, మాటలనే కలుగుచుండు మణిమంత్రంబులు, మాటల పొందిక తెలిసిన మాటలనే ముక్తి కలుగు మహిలో వేమా!' అన్నాడు తాత్వికుడు వేమన.

* * *

'పూల కనుపులలో తేనె పోసి నెవడో,
దాని తీయు నేర్పు తుమ్మెదకు లభించె;
భాషలోని మాధుర్యలావణ్యభావ
సాధుభోగము కవిముఖసాధ్య మయ్యె'

అన్నాడు రాయప్రోలు. కవులు రసపిపాసువులు, రసలోలుపులు. శబ్దశక్తి వారెరిగినట్లు ఇతరు లెరుగరు. భావగోపనం చెయ్యటంలో వారు మాంత్రికులు. ఒకానొక సందర్భంలో వాల్టేరు మహాశయుడు 'One great use of words is to hide our thoughts' అన్నాడు.

* * *

పదజాలానికి మూలాలు ఏమిటని భాషాశాస్త్రవేత్తలు జిజ్ఞాస చేశారు. అర్థవత్తులైన సూక్ష్మతర రూపాలు శబ్దజాలానికి మూలకారణాలని తేలింది. వాటికే మనవారు ధాతువులని నామకరణం చేశారు. ఇవి కేవలం రసాయనశాస్త్రంలోని మూలవస్తువులకు (Elements) తుల్యమైనవి. వీటికి చాలాభాషల్లో స్వతంత్రప్రయోగ ముండదు. ఇవి అనాది మానవుడు ఉచ్చరించిన పరిపూర్ణవాక్యాలకు పరిణామరూపాలు. కాలక్రమేణా పరిణామాలను పొంది పొంది నిలిచిన అవశిష్టరూపాలు.

* * *

మహాకవి కాళిదాసు పార్వతీపరమేశ్వరులను 'వాగర్థ'ములతో పోల్చి ధ్యానించాడు. పార్వతి ఉంటే పరమేశ్వరు డున్నట్లే. పరమేశ్వరు డున్నా పార్వతి ఉన్నట్లే. శబ్దముఉన్నదంటే అర్థము ఉన్నదన్నమాటే! అయితే ఈ శబ్దానికి ఈ అర్థము అని ఎలా రూఢికి వచ్చింది! గ్రీకుదేశంలో ఎరిస్టాటిల్ అనే భాషావేత్త శబ్దార్థసంకేతాన్నిగురించి జిజ్ఞాసచేసి అనాదిమానవులకు శబ్దార్థసంకేతవిషయంలో ఒక ఒడంబడిక కుదిరి ఉంటుంది అన్నాడు. డార్విన్ మహాశయుని పరిణామవాద సిద్ధాంతాన్ని అనుసరించి మనుష్యులకు భాష (శబ్దార్థాలు) వారి పూర్వరూపాలైన వానరుల కిచకిచలనుంచి వచ్చిందని ఊహించవచ్చును.

'సంకేతస్తు పదపదార్థయో స్సంబంధః' అని మహర్షి పతంజలి స్ఫోటవాదం నిలబెట్టినాడు. నైయాయికులు 'శక్తం పదం' అన్నారు. పదానికీ, పదార్థానికి ఉన్న సంబంధం ఈశ్వరేచ్ఛారూపక మని వారి అభిప్రాయము. అయితే వైయాకరణులు ఈశ్వరేచ్ఛను అంగీకరించలేదు. పదానికీ, పదార్థానికీ ఉన్న సంబంధం కేవలం వృత్తిరూపక మనీ, తాదాత్మ్యసంబంధమైన దనీ వారి అభిప్రాయం. ఈ సంబంధం వారి మతంలో నిత్యము. కంటికి చూడటమూ, చెవికి వినటమూ ఏనాడు కలిగిందో ఎలా చెప్పలేమో, అదేరీతిగా శబ్దానికి అర్థంకూడాను అని వా రంటారు. శబ్దార్థసంబంధం అనాది అని వారి మతం.

వైయాకరణులూ, మీమాంసకులూ శబ్దము నిత్య మంటారు. నైయాయికులు అనిత్య మంటారు. 'అర్థకృతేన నామశబ్దేన ధ్వనితవ్యమ్'—అంటే శబ్దం కేవలం శ్రుతికి తగిలి ఏకో అర్థసంప్రత్యయాన్ని కలుగజేసి కనబడకుండాపోతుంది. ముఖ్యమైనది అర్థము అని వారి భావము. అంటే వాద్యంలో శబ్దం పూర్వము లేదనీ, అది క్రొత్తగా వాయించడమువల్లనే పుట్టి వాయువువల్ల అభివ్యక్తమై అర్థసంప్రత్యయము కలిగిస్తున్నదనీ వారి అభిప్రాయము.

* * *

'కావ్యలక్ష్మికి తనువగు శబ్దార్థంబులు' అని ఆలంకారికనిర్వచనము. అవిద్యాసంబంధంవల్ల బ్రహ్మము ఏవిధంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరత్వాలను ధరించాడో అదేవిధదంగా శబ్దము సత్వరజస్తమోగుణాలను బట్టి వాచక, లక్షక, వ్యంజకత్వాలను ధరిస్తూ ఉన్నది.

'వాచ్యోర్థోఽభిధయా బోధ్యో,
లక్ష్యో లక్షణయా మతః,
వ్యంగ్యో వ్యంజనయా; తాస్స్యు
స్తిస్రః శబ్దస్య శక్తయః.'

అని సాహిత్యదర్పణకారుడు. అంటే అభిధా శక్తి వాచ్యార్థాన్నీ, లక్షణాశక్తి లక్ష్యార్థాన్నీ, వ్యంజనా శక్తి వ్యంగ్యార్థాన్నీ నిరూపిస్తూ ఉంటవని అభిప్రాయము. శబ్దాలకు లోకంలో ఉండే ప్రయోగం గానీ, పరిణామంగానీ, విపరిణామంగానీ ఈ మూడు శక్తులలో ఒకదాన్ని అనుసరించి ఉంటుంది.

* * *

శబ్దాన్ని ఆధారంచేసుకొని సంస్కృత న్యాయాలు కొన్ని ఏర్పడ్డవి. అది ఒక్కొక్కప్పుడు స్వార్థాన్ని విడిచి అన్యార్థాన్ని బోధిస్తూ ఉంటుంది. 'గంగాయాం ఘోషః' (గంగలో గొల్లపల్లె) అన్నచోట 'గంగఒడ్డున' అనే అర్థము. దీన్నే జహత్ స్వార్థావృత్తిన్యాయ మంటారు.

మొదట శబ్దానికి ఒక అర్థాన్ని చెప్పి తరువాత దానికున్న సహార్థ తో రెండూ ఒకటే అని చెప్పటము జహదజహత్ స్వార్థా వృత్తిన్యాయము.

'యత్పరః శబ్దన్యాయం' మరొకటి. ముందు తేజస్సు పుట్టి తరువాత శబ్దం పుడుతుంది అని అనటం. అంటే అర్థవంతమైనదే శబ్దము అని అనటము. 'రథకార న్యాయమూ' శబ్దసంబంధి. 'రథం కరోతీతి రథకారః' వ్యుత్పత్తిచేత రథకారశబ్దానికి 'రథముచేసేవాడ' నే అర్థము. కాని ఒకానొక సంకీర్ణజాతివాడనీ అర్థము కలుగుతుంది. ఇది గౌణార్థము. 'అవయవప్రసిద్ధేః సముదాయప్రసిద్ధి ర్బలీయసీ'—రూఢ్యర్థము బలవత్తరమైనది. అందువల్లనే పంకములో పుట్టిన ప్రతిప్రాణీ పంకజము కాదు. కేవలమూ పద్మము ఒక్కటే పంకజము.

శబ్దచ్ఛలానికి శబ్దమే ఆధారము. ఇది త్రివిధంగా ఉంటుంది. ౧ వాక్ఛలము: రెండు అర్థా లున్నచోట వక్తఅభిప్రాయానికి భిన్నార్థాన్ని ప్రతిపాదించి వాదించటము వాక్ఛలము. 'పిల్లవాడు నవకంబళుడు' అన్నచోట ప్రతిపక్షి 'తొమ్మిది కంబళ్లు కలవాడు' అని వాదించటము. ౨. సామాన్యఛలము: విశేషపదంగా సంభవించే అర్థాన్ని అతిసామాన్యపదంగా చెప్పి అసంభవార్థంగా మార్చటము. 'ఈ బ్రాహ్మణుడు పండితుడు' అని చెప్పినప్పుడు బ్రాహ్మణత్వావచ్ఛేదకధర్మము పొందిత్యము అని చెప్పటాన్నే గ్రహించి, పండితులు కాని బ్రాహ్మణాలు లేరా, అబ్రాహ్మణులు పండితులు లేరా అని వాదించడము. ౩ ఉపచారచ్ఛలము: పదానికి శక్యార్థాన్ని గ్రహించకుండా లక్ష్యార్థము వివక్షితమైతే దాని వాచ్యార్థాన్నిగానీ, వాచ్యార్థం వివక్షితమైనప్పుడు లక్ష్యార్థాన్నిగానీ గ్రహించటము ఉపచారచ్ఛలము. 'మంచెలు అరచుచున్నవి. సాగాలు పోవుచున్నవి' అన్నచోట 'మంచెలే అరచుచున్నవి. సాగాలే పోవుచున్నవి.' అని వాదించటము. ఇందులో ఒకరు ముఖ్యార్థాన్నీ, మరొకరు గౌణార్థాన్నీ గ్రహించి వాదిస్తారు.

* * *

శబ్దార్థాన్ని లోకం స్వరమూ, ఊతల సహాయం వల్ల గ్రహిస్తూ ఉంటుంది. సందేహమూ, సంతోషమూ, ఆనందమూ, ఆశ్చర్యమూ ఇత్యాదిభావచ్ఛాయలు ఒక్కొక్కప్పుడు కేవలం అంగవిన్యాసాలతో కూడా చూపించవచ్చును. అందుకనే భగవత్పతంజలి 'అంతరేణాఽపి శబ్దప్రయోగం బహవోఽర్థా గమ్యంతే అక్షినికోచైః, పాణివిహారైశ్చ' అని ప్రవచించాడు. చేతులు త్రిప్పి, గుడ్లు తిప్పి చాలవరకు అర్థసంప్రత్యయం కలుగజేయవచ్చును అని ఆయనఅభిప్రాయము. ఉచ్చారణవిధానాన్ని బట్టి శబ్దంలోని భావచ్ఛాయలను శ్రోతలు గ్రహిస్తూ ఉంటారు; అవగతము చేసుకోగలుగుతుంటారు. శబ్దోచ్చారణలో ఉండే ఎగుడు దిగుడులే లేకపోతే భావ శ్రుతికటువుగా ఉంటుంది. ఇది గమనించే సంస్కృతవైయాకరణులు ఉదాత్త అనుదాత్త స్వరితాలతో కూడిన శిక్షాశాస్త్రాన్ని కల్పించారు. స్వరం తప్పినప్పుడు శబ్దం అపశబ్దమైపోతుం దన్నారు. ప్రమాదవశాన యజ్ఞకర్త ఒక శబ్దాన్ని దుష్టంగా పలికితే దానికి ప్రాయశ్చిత్తంగా సారస్వతేష్టి చెయ్యవలసిం దని 'ఆహితాగ్ని రపశబ్దం ప్రయుజ్య ప్రాయశ్చిత్తీయాం సారస్వతీం ఇష్టిం నిర్వపేత్' అని అనుశాసించారు. 'దుష్టః శబ్దః స్వరతో వర్ణతో వా మిథ్యాప్రయుక్తో నతదర్థమాహ, స వాగ్వజ్రో యజమానం హినస్తి యథేంద్రశత్రుః స్వరతోఽపరాధాత్'—స్వరంచేతనూ, వర్ణంచేతనూదుష్టమైన శబ్దము వృథాప్రయుక్తమూ, అనర్థ

కమూ అయిపోవటమే కాదు. యజ్ఞకర్తను వజ్రమై హింసిస్తుందిట. దీనికి 'ఇంద్రశత్రు' శబ్దమే నిదర్శనము అని అన్నారు, 'ఇంద్రుడనే శత్రువు నశించుగాక' అనే ఉద్దేశంలో క్రతువుచేసే దధీచి 'ఇంద్రశత్రు' శబ్దాన్ని 'ఇంద్రుని శత్రువు నశించుగాక' అనే అర్థంవచ్చేటట్లు ఉచ్చరించటంచేత అతడే నశించాడు. శబ్దాన్ని బాగా తెలుసుకొని ప్రయోగిస్తే స్వర్గం క్రతుకర్తకు కామధేను వౌతుందిట!

సంస్కృతభాషలో ప్రాతిశాఖ్యలూ, పాణినీయ శిక్షలూ, వ్యాకరణశాస్త్రమూ శబ్దస్వరూపాన్ని నిలపటానికే పుట్టినవి. అసంస్కృత, అనాగరక భాషల్లో శబ్దానికి నిలకడ లేకపోవటంవల్ల అజ్లోపము, హల్లోపము, వర్ణప్లుతి, ద్విత్వవికల్పము, హలాగమము, సంప్రసారణము ఇత్యాదులను పొందుతూ సహజస్వరూపాన్ని పోగొట్టుకుంటూఉంటుంది. అయితే విద్వద్భాషలో ఎన్ని కట్టుదిట్టాలున్నా శబ్దానికి కొంతగా 'వికృతి' ఏర్పడటం తప్పదు.

శ్లేషకల్పనలకూ, ఉక్తివైచిత్ర్యానికీ 'శ్రుతి' ఎంతో ఉపకరిస్తుంది. ద్వ్యర్థి త్ర్యర్థి కావ్యజాలం ఉక్తిమీద ఆధారపడ్డది. అంతే శ్రుతిమూలంగానే నడుస్తున్నదన్నమాట. శత్రురాజాస్థానంలో ప్రవేశించి ఆరాజును పొగడినట్లు కనిపించి నిజరాజాస్థానానికి తిరిగివచ్చి శ్రీనాథమహాకవి శ్రుతిసహాయంవల్లనే 'సర్వజ్ఞనామధేయము...రావుసింగజనపాలునకే యొర్వం జెల్లును' అని విడగొట్టి ప్రభువు మెప్పుపొందాడు. 'అరచంద్రమామ నేలిన దొరగా నెన్నదురు నెన్నదుకు నిత్తరికిక, బరువంపు మెల్లమెగ్గల దొరగా బలుకుదురు పలుకుదురు జర్వనికిక' అన్న చేమకూరకవి శ్రుతిమీద ఆధారపడ్డదే!

ఏభాషలోనైనా శబ్దజిజ్ఞాసకు పూనుకుంటే ఆశ్చర్యంతోపాటు విజ్ఞానమూ కలుగుతుంది; ప్రజ్ఞానమూ కలుగుతుంది. ప్రజ్ఞానంవిషయం పూర్వము చర్చించుకున్నాము. ఇక విజ్ఞానవిషయము. శబ్దార్థాలను గమనిస్తే ఎంతో విజ్ఞానముకలుగుతుంది. ఉదాహరణానికి సంస్కృతభాషలోని ఓషధీవర్గ శబ్దాలను నాల్గింటిని పరిశీలిద్దాము. 'శిగ్రు' అనే శబ్దానికి 'మునగ' అర్థము. 'శినోతి శమయతి కఫాదీన్ శిగ్రుః' శ్లేష్మాదులను పోగొట్టుతుంది కాబట్టి శిగ్రువైనది. కఫదోషాన్ని భక్షిస్తుంది కాబట్టి జాబిక్ష ప్లతి మైనది. 'బిలతి కుష్ఠాదీన్ బిల్వః'—కుష్ఠాదులను కొట్టివేస్తుంది కాబట్టి మారేడు బిల్వమైనది. ఆర్యభాష శబ్దజాలంలోనే విజ్ఞానాన్ని ఇముడ్చుకున్నది. ఈ రీతిగా శబ్దజాలాన్ని పరిశీలిస్తే అనంతవిజ్ఞానం కలగటానికి అవకాశమున్నది.

* * *

ఒక భాషలో పుట్టిన ఒక శబ్దం మరొక భాషలో ప్రవేశించి వేరుఅర్థంలో ప్రయోగాన్ని పొందుతూ ఉంటుంది. మహారాష్ట్రభాషలో పింగాణీశబ్దానికి సీతాకోకచిలుక అని అర్థం. తెలుగు భాషలో ఇది 'పింగాణీగిన్నె' అన్నటువంటి ప్రయోగాల్లో ఒక పదార్థానికి వాడుకలో ఉన్నది. దీనికి మొదట్లో చైనా, జపానులనుంచి దిగుమతిఅయ్యే పింగాణీ, సామానులమీద సీతాకోకచిలుక బొమ్మ ఉండటమూ, అవి బొంబాయి రేవులో దిగటమూ కారణము. సంస్కృతభాషలోని సంతాపశబ్దానికి మహారాష్ట్రభాషలో కోప మని అర్థము. 'రాగ' శబ్దానికి వంగభాషలో కోప మని అర్థము.

ఆంధ్రభాషలో అనేక సంస్కృతశబ్దాలు తత్సమాలుగా ప్రవేశించి అర్థవిపరిణామాన్ని పొందినవి. 'అనుమాన' మనే తార్కికశబ్దానికి సంశయము, సంకోచము అని అర్థము వచ్చింది. 'సృష్టి' చిద్రమైంది. 'దాహము' దప్పికగా మారిపోయింది. 'గ్రామ్యము' హీనార్థాన్ని సూచిస్తూ ఉన్నది. 'దేవానాంప్రియుడు' మూర్ఖుడైనాడు. 'పండితపుత్రుడు' కుంక. కైంకర్యం 'కాజేయట' మైనది, 'దేవతార్చన' భోజనానికి పర్యాయపద మైనది. ఈ జాతిలోవే గీర్వాణము, తద్దినము, ఫలహారము, సంభావన, సంతర్పణ, స్వయంపాకము, స్వస్తి, కుశలము, అయోమయమూ ఇత్యాదులు.

కేవలం దేశీయ శబ్దాలుకూడా అర్థవిపరిణామాన్ని పొందక పోలేదు. 'కంపు' శబ్దము భారతరచనా

i.e. issued from the place of throne
గద్యాణము = గద్దె + ఆణము =
i.e. issued from the royal mint is called 'gadyana'
గద్దె - సింహాసనము
ఆణము = ప్రకటించు స్థలము

కాలంలో సువాసనను సూచిస్తుంటే నేడు దుర్గంధాన్ని పలుకుతున్నది. కన్నడ భాషలో నేటికీ 'కంపుకూను'కు గౌరవ ముంది. వాసన నూనెలకు వాడక చేస్తున్నారు. నన్నయ వాడు యౌవనవతిని తెలియజేసే 'అవ్వ' శబ్దం ఈనాడు కాటికి కాళ్ళు చాచిన ముసలమ్మలను తెలియజేస్తుంది. యౌవనవతిని ఈ నాడు 'అవ్వ' అని సంబోధిస్తే జరగవలసిన మర్యాద జరిగి తీరుతుంది.

* * *

శబ్దాలు వలసపోతూ ఉంటవి. మృతిపొందుతవి. తిరిగి పుడుతూ ఉంటవి. నూతనంగా సృజితమూ అవుతుంటవి. నేటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ వాతావరణంలో నిత్యమూ ధ్వనించే బూర్జువా శబ్దము మొదట పరిహాసాస్పదుడైన వ్యక్తి నుద్దేశించి వ్యవహారంలో ఉండేది. కాలక్రమేణా దానికి జనసామాన్య వ్యతిరేక భావం కలిగింది.

దేశంలో రాజకీయాలు మారుతూ ఉంటే పూర్వ శబ్దాలను పదభ్రష్టాలనుచేసి వాటి స్థానాలను నూతన శబ్దాలు ఆక్రమిస్తూ ఉండటము సహజము. దండయాత్రల ఫలితంగా, దాస్యం కారణంగా భారతీయ భాషలన్నిటిలోనూ ఎన్నో అన్యదేశ శబ్దాలు వచ్చి చేరినవి. ముసల్మానులు మన దేశంలో ప్రభుత్వం చేసిన రోజుల్లో పన్ను పోయి తహశీలు, పాట పోయి ఇజారా, ఆరెకులు పోయి గస్తీలు, తప్పు బదులు జుల్మానా ఇత్యాదిగా ప్రవేశించినవి. తెలుగు రాజుల కాలంలో ఉన్న ఉద్యోగాలూ, ఉద్యోగస్థులూ మారిపోయినారు. వకీలు, సముద్దారు, సిరస్తాదారు, తహసీల్ దార్, అమీనాలు రాజ్యపాలన చేయడం ప్రారంభించారు. ఇళ్ళలో వస్తువులు మారిపోయినవి. మేజా, మెల్లా, శావిడీ, కూజా, కుర్చీ, కిటికీలు వచ్చినవి. మిఠాయి, మసాలా, పూరీ, ఫేణీ, దూదిపేడ, బర్ఫీ, హల్వా, జిలేబి, పోణీ, కోవాలు తినటం నేర్చుకున్నాము.

ఫ్రెంచివారూ, బుడతకీచులూ మన దేశంతో వ్యాపారం చేసిన దినాలల్లో కొన్ని శబ్దాలు ప్రవేశించినవి. ఇంగ్లీషువారి నాగరికతా వ్యామోహంతో, రాజ్యపాలనతో మన భాషలో ఎన్నెన్ని శబ్దాలు ప్రవేశించి అప్రయత్నంగా ముసలమ్మలూ త్రోసిరాజనలేని పదాలుగా మారిపోయినవి!

'ముచ్చె తీసుకొని తంతాను', 'దమిడీ ముండకు ఏగానీ తువరం' అనే ప్రయోగాలు పల్లీయుల వ్యవహారంలోనూ వినిపిస్తుంటవి. కాని, అవి ఎలా వచ్చినవో వారెరుగరు. 'ముచ్చె' పర్షియన్ పదము. 'దమ్మిడీ' గ్రీకు పదము. 'జముఖానా' లేనిది బ్రాహ్మణ ముసలమ్మకు మంచంమీద నిద్రపట్టదు. అయితే అవస్తువు మొదట లఖ్ణో దేశానిదనీ, ఆ పదము లఖ్ణో శబ్దమనీ ఆమెకు తెలియదు. తెలిస్తే తప్పకుండా తడిపి కాసిని పంచితం నీళ్ళు చల్లి పక్కవేసుకొనేది.

గ్లాసూ, కిరసనాయిలూ మనవి కావని తెలుసుకొంటే ఆమె ఈనాటికి గాజుసీసాలో నూనె పోయించుకోదు; మడితో కిరసనాయిలు లాంతరు ముట్టుకోదు. 'ఆసుపత్రి'కి వెళ్ళివస్తే, రైలులో ప్రయాణంచేస్తే ఇంటికి వచ్చి 'సచేలస్నానం' చేస్తుంది.

* * *

అన్యదేశాలతో సంబంధం లేకుండా నిత్యవ్యవహారం జరగదు. అప్పుడు ఇతరదేశశబ్దాలు భాషలో ప్రవేశించకుండా ఉండనూ ఉండవు. 'కోప్రా' శబ్దంవల్ల పుట్టిన 'కొబ్బరినూనె' లేనిదే కోమలాంగులు—ఛాందస కుటుంబాల్లోకూడా—కురులు ముడువరు. బత్తాయిపండును ప్రిస్క్రైబ్ చెయ్యని ఫిజిషియన్ కనుపించడు. సోడాబుడ్డీ లేకపోతే సుష్ఠుయిన భోజనం ఈదినాలల్లో సచ్ఛ్రోత్రియుడికికూడా అరగటం లేదనటంలో అసంబద్ధత అణుమాత్రమూ లేదు. సాలామిశ్రీ, సఫేద్‌మిశ్రీ, ముస్తకీ, రూమ్, గావుక్, బాల్, బాకలు లేకపోతే మన అంటురోగాలు మొదలారి ఆరోగ్యం చేకూరటం లేదు. తుపాకులు, పసీలు, బజాయీలు, జల్లీలు, తూటాలు, ఔట్లూ లేనిదే తెలుగుదేశంలోకి దీపావళిదేవత తిరిగి తిరిగి రావటం మానేస్తాడు. టెలిగ్రాఫ్, టెలిఫోనులతో పని పడకుండా ఉండటమూ లేదు. 'రేడియో న్యూస్' వింటేగాని నిద్రపట్టటమూ లేదు.

ప్రభుత్వాలతోపాటు దుస్తులూ మారుతూ వచ్చినవి. ఘనకట్టు పోయి కంచెల వచ్చింది. అది కొంతకాలానికి కనపడకుండా పైటినే రవికకు బరాబరు చేసింది. ఒకదానికి తరువాత ఒకటి జుబ్బా, జాకెట్టు, జంపర్లు స్త్రీల ఊర్ధ్వకాయాలమీద ఉజ్జ్వలంగా రాజ్యంచేస్తూ వచ్చినవి. మొదట్లో మొగవాళ్లు, తరువాత జబ్బగా ఉన్న ఆడవాళ్లూ ఆంగ్లదేశంలో ఉపయోగించిన జంపరు ఈనాడు మన దేశంలో స్త్రీలకు నిచోళమైంది. 'పాంటలూన్' అనే ఒక జర్మనీదేశ తత్వవేత్త మొదట్లో నేటి 'పంట్లం'వంటి దుస్తు ధరించుకున్నాడు. క్రమక్రమంగా అది యూరప్ దేశంలో 'ఫాషన్'నై మనదేశంలోకి దిగుమతైంది. 'నిక్కరు' మొదట్లో 'వాషింగ్టన్ ఇర్వింగ్' అనే ఒక రచయిత పెట్టుకున్న మారుపేరు. అతని దుస్తుకు నామమై నేడు క్రమంగా ప్రపంచమంతా ఏలుతూ ఉన్నది. 'బీరువా' ఎలా వచ్చిందో తెలియకుండానే గుడ్డలు పెట్టుకుంటున్నాము; నగలు దాచుకుంటున్నాము. ఫ్రెంచిభాషలో బీరువాకు 'ఒక బల్ల' అని అర్థం మొదట్లో. బీరువా అనే రంగుగుడ్డ వేయటంవల్ల బల్లకు ఆ అర్థం రూఢికెక్కింది. ఈనాడు 'ఆఫీసు' పేరైన 'బీరువా' అని పిలిపించుకుంటున్నది. పదాల చరిత్ర ఒక్కొక్కప్పుడు 'ఫార్సు'గా ఉంటుంది. 'ఫార్సు' ఫ్రెంచిమాట!

*   *   *

దుస్తులను గురించి చెప్పి అలంకరణాలల్లో మచ్చుకు ఒకటైనా చెప్పక పోవటం భావ్యం కాదు. 'అరవ చెవుల కేల అరిది వజ్రపు కమ్మ' అని అన్నాడు ఒక శతకకర్త. వజ్రపు కమ్మట! 'కమ్మ' శబ్దానికి తాటిమొవ్వ' అని అర్థం. పూర్వం స్త్రీలు తాటి మొవ్వను చుట్టచుట్టి కర్ణాలంకరణంగా ఉపయోగించేవారు. తరువాత ఆ 'కమ్మ' సంస్కృతీకరణంవలన 'తాటంక' మైనది. కర్ణాభరణ మనే సామాన్యార్థం వచ్చేసింది. ఎర్రరాళ్ళ కమ్మలూ, వజ్రపు కమ్మలూ వచ్చినవి. 'దుద్దు' అంటే 'ఆకరువు'. బంగారందైనా, రాళ్ళు పొదిగినా దుద్దురూపం ఉన్నంతవరకూ అవి దుద్దులే.—ఇలాగా, కవుల గండపెండేరాలకూ, సోమయాజులవారి సింహతలాటాలకూ, నర్తకుల లోలాకులకూ, బిబ్బీల జూకాలకూ, వనితల ఒడ్డాణాలకూ చరిత్ర ఉంది.

ఒక జాతిలోనే ఒక్కొక్క సంఘం ఒకవిధమైన సంకేతాలనూ, ఆకారాలనూ ఏర్పరుచుకుంటుంది. ఛాందసులు నెయ్యి అనటానికి 'తేజోవై' అంటారు. 'వాయవ్యం' అంటే వారి పరిభాషలో 'రూపాయి'; 'యువాను' అంటే బట్ట. బ్రహ్మచారిని 'ఆమాయంతు' అంటారు. విధవను 'ఇంద్రాణీ' అంటారు. నీటితుప్పర పడుతుంటే 'యాకుంధేందు' అనే సరస్వతీ స్తోత్రం చదువుతారు. తరుణిని 'ఆక్రంద' అనీ, ముసలి మనిషిని 'ఏతావా ఇదా' అనీ వ్యవహరిస్తారు. ఎగతాళికి మనం వాడే 'గ్రీవా' వైదికపరిభాషల్లోనిదే. అట్లాగే తాపె, యంత్రబ్రహ్మ ఇత్యాదులు మనకు వారు ప్రసాదించినవే.

*   *   *

తల్లిదండ్రులకు కొందరు బిడ్డల మీదనే మమకార మున్నట్టు కవులకూ, రచయితలకూ కొన్ని శబ్దాల మీదనే మమకారం విశేషంగా ఉంటుంది. అది సకారణమూ కావచ్చును, అకారణమూ కావచ్చును. వారు వ్యక్తంగానో, అవ్యక్తంగానో వారి కావ్యాలల్లోనూ, రచనల్లోనూ వాటిని విశేషంగా ప్రయోగిస్తుంటారు. ఆ శబ్దాలే చివరకు వారి బిరుదనామాలై జన్మ నామాలు నశించి పోయినవి. భవభూతికి భవభూతి శబ్దంమీద విశేష మమకారమట! భారవి, రత్నఖేట శబ్దాలవల్లనే వారికి ఆపేర్లు వచ్చినవి. 'జఘనచపల,' 'వికటనితంబ' లకు ఆపేర్లు శబ్దంమీద మమకారంవల్ల కలిగినవే కాని, వారి జఘనచాపల్యంవల్లనూ, నితంబవికటత్వంవల్లనూ కలిగినవి కావు.

*   *   *

శబ్ద చరిత్రే మానవజాతిచరిత్ర అని చెప్పవచ్చును. పదజాలానికి చరిత్ర అత్యవసరము. అది వచ్చిన నాడే జాతిచరిత్ర పరిపూర్ణమౌతుంది. ప్రతి జాతికీ భాషలోని శబ్దజాలాన్ని పరిశోధించుకోవడము అత్యవసరము. ఆ పరిశోధన వల్లనే ఆయా కాలాల్లో ఆయా సన్నివేశాలల్లో జాతి అజ్ఞాన విజ్ఞానాలూ, ఆకార ప్రకారాలూ, అభ్యుదయానభ్యుదయాలూ ప్రతిఫలిస్తవి. ఆంధ్ర భాషకు ఈ మహాచరిత్రరచన సంభవించే స్థితి ఏనాటికో!

సాహిత్య విప్లవము

'భరద్వాజ'

అభ్యుదయోద్యోతకమై సాహిత్యం ముందంజ వేయుచున్నప్పుడీ విప్లవశిఖ లనూహ్యంగా సమాగతమౌతూనే ఉంటవి. సాహిత్యంలో అభినవత్వం, అభ్యుదయత్వం పరిణామసంయుతమైన సంఘానికి నిసర్గం. సమాజసన్నివేశాలూ, సాహిత్యాదర్శాలూ, సహృదయతతో సహజసౌందర్యాన్నిస్తాయి. అట్టి సన్నివేశంలో సమాజాన్ని కాని, సంఘాన్ని కాని సాధించడం సహృదయతకు దూరం.

కల్లోలిత ప్రపంచంలో అనేకతరగతులుగా విప్లవ జ్వాలలు రేకెత్తి విజృంభించ సాగినై. చేతనా చేతనసృష్టిక్రమ విపరిణామాంతరాలలో విప్లవజ్వాల అజ్ఞాతంగా అలముకొన్నది. దానిని చల్లార్చుటకు, తగ్గించుటకు మానవమాత్రుడసాధ్యుడనే చెప్పాలి. అతనికి సామర్థ్యం లేదు. అనంతాలంకారతరంగ నిస్తంద్రమైన సాహితీరంగంలో బడబానలజ్వాల మిన్నుముట్టింది. అట్టి సంకులతరంగాఘాతము నోర్వ మానవుడసమర్థుడు. పురాతనాధునాతనసాహిత్యరంగాల్ని పర్యవేక్షించిన నీ విభిన్నతరగతుల గతులు దృగ్గోచరా లౌతాయి. ఆంధ్రసారస్వతం సర్వం విభిన్నమతాలతో పరిపూర్ణాలుగాను, కవికాలాదుల్లో నిశితదృష్టిలేక అపరిపూర్ణంగాను ఉంది. అట్టి సాహిత్యగమనాన్ని దిఙ్మాత్రంగా ఉదాహరిస్తాను.

ఆంధ్రంలో సనాతనంగా వాఙ్మయం లేదనే ఉటంకించవచ్చును. శాసనసన్నివేశాల్ని, మధ్యాక్కరాదుల్ని, దూరదూరంగా తొలగిపోతూన్న నాటి పదప్రయోగాదుల్ని సమీక్షచేస్తే పదవాఙ్మయం మాత్రం కించిన్మాత్రప్రచారంలో ఉండనే తేల్తుంది.

పోగా, ఆంధ్రవాఙ్మయచతుర్ముఖుడు నన్నయ దాని నుద్ధరించి, తీర్చిదిద్దిన పదవిన్యాసము నిచ్చినాడు. విభిన్న భాషారంగాలు తెలుగుమండలాన్ని సమాక్రమించిన సమయాన, సంస్కృతభాషాపదవిన్యాసం అన్ని భాషలలో కేగి సంస్కృతి నందినకాలాన నన్నయ యీ తెనుగుభాష నుద్ధరింప గలిగినాడు. ఆ యుగంలో సహితం భాషాసేవకులలో ననేక రీతుల యాతాయా లుదితాలైనై. వినూత్నభావనాశక్తితో కవిలోక మాకులపాటు నందింది. ఆంధ్రవాఙ్మయ సర్వస్వం అస్వతంత్రమై, రూపవిరహితమై యున్న నాటి కాలంలో నన్నయ-వాగనుశాసనుడు! పరసహాయంతో నద్దాని కొక రూపం కల్పించి, ప్రాణసముపార్జన చేసి, జీవద్భాషగా నొనర్చినాడు. విప్లవశిఖలు దెశదిశల ప్రజ్వరిల్లుతూ ఉంటే ఏకైకదీక్షాకంకణంతో అచంచలంగా స్థిరుడై, యితర సాహితీ అట్టహాసాలకు జంకక స్వయంభావను స్వగత మొనర్చుకొన్నాడు. ఆరంభంలోనే ఆంధ్రునికి అంతులేని అంతర్యుద్ధం కలిగింది.

నాటి సమయంలో ఉదయించిన బీభత్సవిప్లవ శిఖాసముదాయం ఆంధ్రవాఙ్మయ బ్రహ్మల తల తిరుగుడ్లు పరిచింది. సామాన్యకవి మొదలు కవిశిఖామణివఱకు నుదయించిన భావవిప్లవం అనూహ్యం, అప్రతిమం. సాహిత్యరంగంలో ఇంతటి మహోదయ విప్లవజ్వాల అనంతరం వచ్చుటలేదు. అదే విప్లవారంభ దశ. రాజకీయంగా నాటి సారస్వతవాతావరణం వినిమయాన్ని పొంది అలజడి కలుగజేసింది. నన్నయ

భారతంలో తన ఆర్తిని వెల్లడి చేసికొన్నాడు. ఇంకను సంస్కృతసాహితీపాదపశాఖల్ని పట్టుకొని ఊగు లాడే దశ పరిపూర్తి చెందలేదు. అయినా నన్నయ సిద్ధహస్తుడనే చెప్పాలి.

"మదమాతంగతురంగకాంచనలస
న్మాణిక్యగాణిక్యసం
పద లోలిం గొని తెచ్చి యిచ్చి మద మె
ప్పం గాంచి సేవించి ర
య్యుదయాస్తాచలసేతుశీతనగ మ
ధ్యోర్వీపతుల్ సంతతా
భ్యుదయుల్ ధర్మజు సత్సభాస్థితు జగ
ద్వ్యాప్తప్రతాపోదయుల్."

ఈదృశపద్యసంతతుల్ని లిఖించడంలో అతని కాతడే యుపమ. సంఘం న్యాయపథం తప్పి చరిస్తే సంఘాన్ని అదలించడం కోసం—

"నిండు మనంబు నవ్యనవ
నీతసమానము పల్కు దారుణా
ఖండలశస్త్రతుల్యము జ
గన్నుత విప్రులయందు నిక్క మీ
రెండును రాజులందు విప
రీతము కావున విప్రు డోపు నో
పం డతిశాంతు డయ్యు నర
పాలుడు శాపము గ్రమ్మరింపగన్"

అనే దారుణపద్యాల్ని వ్రాసేడు.

అనంతరం అనంతప్రతిభాశాలి పాల్కురికి సోమనారాధ్యుడు శైవవాఙ్మయప్రపంచనేతగా, జాతీయోద్రేకసంపూరితపదగుంఫనాల్తో, లోకాన్ని ఆకర్షించికొని, సాహిత్యరంగంలో సవ్యసాచిగా నిలబడినాడు. ఒక మనోహరతీరాన్ని చేరబోతూన్న సాహిత్యాన్ని సోమన్న రచ్చకీడ్చి యుద్ధం చేయసాగాడు. ఆ సోమనాథుని యుగానకూడ సంస్కృతానువాదాలు హెచ్చు పెరుగుతూ ఉంటే, నన్నయ ముసలి కాలంనాటి వచనాలే పదేపదే సాహిత్యంలో దొర్లుతూ ఉంటే సంఘానికిగాని, సాహిత్యానికిగాని మోక్షం లేదని తలచేడు సోమనారాధ్యుడు. అట్టి భావతతుల ఉద్బుద్ధమైన తతిగాం విప్లవానలం రగుల్కొల్పి, విశ్వమూర్తిగా వెలుగొంది ఆ నాటి ప్రజల మనోభావాలకు దగ్గర దగ్గరగా పోగలిగినాడు. నాటి శైవకవులలో నింతటివాడుదయింపనే లేదు. ఆ సోమన్నయే కవితా నికుంజాల్లో పరిమళాన్ని వెదజల్లే సౌందర్యరేఖాసమంచితమైన గులాబిరేకులా విరిసేడు. నన్నయవృత్తాల్ని జాతీయం చేసి, తెనుగునుడికారానికి సొంపు నింపి, పదకవిత్వానికి వన్నె దెచ్చి, కొంగ్రొత్తలైన యాంధ్ర శబ్దకుసుమాల్ని ఏరి తెచ్చి, సామాన్యపాటకజనుల హృదంతరాళాల్లో నివసించి, చక్కని కావ్యాల్ని లోకానికి అందించిన నాటి విప్లవకవి, ఏకైకజాతీయవాది కేవలాంధ్ర దేశంలో సోమనారాధ్యుడే యని చెప్పాలి. అంత కేముకీ ధురంధరుని విప్లవజ్వాలకూడ అనంతరకాలవాహినిలో బడి శీతలత్వం వహించింది. అతని మణిప్రవాళము, అతని తెనుంగుసౌభాగ్యము, నుడికారమూ ఈనాటికికూడ అచ్చటచ్చట పాటకజనులైన శైవులలో వినబడుతూనే ఉంటుంది. దానిని ధారుణీగర్భం, కాలం తెలుసుకోగలుగుతాయి.

పిమ్మట యావదాంధ్రదేశసాహిత్యక్షేత్రంలో దివ్యతేజోవిరాజి సోమయాజి ప్రభవించి, ధ్రువతారగాను, నవీనకవిగాను వన్నెకెక్కినాడు. నాటి కాలంలో వాఙ్మయదశ వివిధవిపరిణామాల్ని పొంది, మహోన్నతస్థానాన్ని ఆక్రమించుకొని, అనంతర యుగయుగాల కవులకు దివ్యసందేశాన్ని పంపించుకొనినది. అతని కాలము సాహిత్యజిజ్ఞాసువులకు నిర్మలాంబువు; అభ్యుదయకవుల కవితాతృష్ణకు భాగీరథిగా వెల్లివిరిసినది. ప్రాచ్యపాశ్చాత్యకవుల విభిన్నభావనాపద్ధతులు తి:విలో సమ్మేళనాన్ని పొందినై. ఆనాటి నుండి నేటివఱకుకూడ రాజకీయచైతన్యానికి, సంఘనిరోధకశక్తుల నరికట్టడానికి, కావ్యరూపనేతివృత్త సంగ్రహణానికి ప్రామాణికమై యొక క్రొత్తపోకడ ననుసరించింది. అతని కలానికి సర్వసమాజశక్తుల అప్రతిహతప్రతిభ అలవడింది. నానావిధాలుగా పరిణామవస్థ చెందిన తిక్కనదివ్యవాణి శాస్త్రబద్ధమై, రాజకీయవిజ్ఞానవిలసితమై, కవితామార్గదర్శకమై, శైథిల్యాన్ని పొందక, నిత్యనూతనమై అలరారింది. నన్నయ

వాహినీసంకలితపదబంధవిశేషం, పాల్కురికి వారి నిత్యనూతన భావవాహన్నివేశం సోమయాజికవిత్వంలో దాగుడుమూతలాడింది. నాటి రాజకీయతంత్రనైపుణీ పరిపక్వదశావిశేషాల్ని నాటి నవయుగంలో సోమయాజి మూర్తీభవింపజేసేడు. విభిన్నకవితామార్గాల్ని ఒక్కటితో మేళవింపజేసినవాడు సోమయాజే నని నుడువవచ్చు. అభినవవిప్లవజ్వాలతో క్రాంతికాగడా రగుల్కొల్పి అఖిలాంధ్రావనిలో సాహితీవిప్లవకారుడుగా పేరొందినాడు.

సంభావనచమత్కారాల్లోని, వర్ణచమత్కృతిలోని, సన్నివేశగతురీతులలోని అభినవభావవైశద్యంలోని, నూతనకళాఘట్టాల్లోని అందెవేసినచేయిగా పరిణతిచెంది, క్రాంతిపోకడలతో సాహిత్యక్షేత్రంలో సర్వోత్కర్షకుడైనాడీ కవిబ్రహ్మ. అతనిలో నేటి పోకడాగా విప్లవం ఇమిడియుండి సమయాన్ననుసరించి విజృంభించింది. ఆ నిరంకుశస్థితియే సోమయాజిని విప్లవకారునిగా నొనర్చింది. సోమన నాటి విప్లవోదయ మనంతసాగరంలో కలిసినట్లు సోమయాజి కవిత మటుమాయమయింది కాదు. కాలవాహినిలో శాశ్వతత్వం ఆపాదించుకుంది అతని వాఙ్ఝరి. తరువాతి కవులు నేటి అధివాస్తవికతవలె నీ ధారుణి మటుమాయమైనారు.

దివిజకవివరు గుండియలు దిగ్గురుమనిపించిన శ్రీనాథుని చరిత్ర నిసర్గసాహితీవిప్లవానికి చిత్రప్రథల్ని ఆపాదించింది. విభిన్నాలైన సంస్కృత, ప్రాకృత, భాషార్ణవాన్ని నిరంకుశరీతిగా మథ్యమాన మొనర్చి, కవిరా జనిపించుకొన్నాడు శ్రీనాథుడు. పురాతన ప్రపంచంలో మృగాక్షలని చెప్పబడే హాస్యాన్ని అత్యుత్తమపద్ధతిలో అభివృద్ధి చేసి, శేమరసవర్గంలో చవులూర జేసేడు శ్రీనాథమహాకవి. కేవలాంధ్రవాఙ్మయంలో అభివాళయాదులతో వీరవిహారాన్ని చేసి, అభ్యుదయరచన సాగించి, ఢక్కా మ్రోగించినవాడు. నైకప్రబంధాల్ని చేసి, అనువాదపట్టికల్లోకూడ నూతనత్వాన్నాపాదించుకొంటూ డిండిమభట్టుఢక్క విదళించినవాడు. నేటి ఏకైకపద్యప్రబంధకవుల రీతిగానే పల్లెపదుచు నిసర్గసౌందర్యాన్నభివర్ణిస్తూ యావదాంధ్రదేశంలోని నూతనస్థలాల్ని క్షేత్రగోచరాల్ని చేస్తూ సోమయాజిలో లేని నూతనత్వాన్ని కల్పించుకొని, సుప్రసిద్ధనర్మకవిత్వపాదపాన్ని నాటి, మనోహరమైన గ్రీకప్రాకృతివిలాసాన్నభివర్ణిస్తూ, సాహితీక్షేత్రంలో నూతనభావవిప్లవబీజాల్ని నాటి, నాటి దారి కొక వింతవెలుగు పొడసూపించి, పల్నాటిచరిత్రలో అంతటి విప్లవకవి లేడనిపించినాడు.

కృషీవలపేదభిక్షు వర్ణించునపుడు, వేదాంతజిజ్ఞాసచే పరవశత్వ మాపాదించునపుడు, అభినవఘట్టములను నూత్నావేశంతో వక్కాణించే సమయంలో యీనాటి కవితాలోకమంతా అరితేరించే అని చెప్పొచ్చు. బమ్మెరపోతన్న శ్రీనాథునితో సమప్రాధాన్యాన్ని వహించి యథార్థకృతిత్త్వంలో ప్రపంచాన్ని ముంచెత్తినాడు. భావనాపరవశులై మైమఱచి నృత్యం చేసేటట్లు చెప్పగల ఆవేశకవి పోతన్న. ఏ భావానైనా వెలిబుచ్చే సమయంలో పోతనకవిత్వం క్రొత్తజాడలను పసికట్టింది. తరువాత అట్టి కవిత్వం ఏకాలమందును ఉద్భవించలేదు. కాబట్టి సాహిత్యవిప్లవం ఏకాలమందైనా కవులలో అంతరంగమైయుంటుందనీ, రాజకీయ, సాంఘికవాతావరణా న్ననుసరించి బహిర్గత మవుతూ ఉంటుందనీ మానవు డూహించవచ్చును.

కవి నిరంకుశభావనాశక్తి నతిక్రమించి పోయే కాలం ఒక్కటీ లేదు. ఏకాలం అయినా కవిహృదయాన్ని అనుసరించిపోవలసిందే. చక్కని చిక్కని పదజాలంతో సాహిత్యావనిలో జాతీయతను నెలకొల్పడానికి చాలువాడు కవి. అంధానుకరణంగా పోయే కాలాన్ని కవికలమే సరిదిద్దుకుంది. కవిజాతీయపదవిన్యాసమే విప్లవపాంథులకు అప్రతిమశిఖిశిఖాసంకాశం, అదే విప్లవపథం.

అనంతరం సాహిత్యంలో విప్లవం తేగలిగింది కృష్ణరాయల దివ్యయుగం. అంతవరకు కళంకితముగా వచ్చిన కాలవశే అకళంకితంగా పరిణామం చెందింది. అప్రతిమప్రతిభాశాలు రీయుగంలోనే విలాసభాసుర జీవితక్రమవిపరిణామసంయుతులై, కవిసామ్రాట్టులై యుద్భవించినారు. కవికి జీవితరంగంలో సౌఖ్యం అన్న వచనం ఈ కృష్ణస్వర్ణయుగంలోనే. మను

చరిత్రాదిప్రబంధాల్ని సింహావలోకనం చేస్తే, నాటి అమూల్యపద్యరచనావిన్యాస మంతరించినందు కేడువ వలసి వస్తూఉంది. షోడశకలాపరిపూర్ణం, అభ్యుదయ ద్యోతకం, శాస్త్రనిష్ఠాత్మసంకలితం, ఆంధ్రభాషా వివర్ధకం నాటి కృష్ణయుగం. నాటి అభ్యుదయ చ్ఛాయలు నేటికీ హంపీలో శిథిలాలను ప్రాంగణాల్లో కన్పించి అప్రసిక్తకపోలాలుగా జేసి, హృదయాన్ని ద్రవింప జేస్తాయి. పెద్దనాది కవులలోని పరిణతకళా వైశిష్ట్యత, వస్తుశిల్పసౌందర్యము, సామాజికకట్టుబాట్లు వర్ణవ్యవస్థ క్రమంగా అంతరించింది. అప్పటి తెనుగు సారస్వతం నూత్న నూత్నకల్పనలకు దారి చూపిస్తూ హృదయంగమమై యుండేడిది. అనంతర కవులలో భావుకు క్రమాభివృద్ధి అగపడలేదు. భావదాస్యం, వర్ణ నలు, ఇతివృత్తానుకరణాలు అనేకాలుగా జనించినై.

శతవార్షికాలు గడచిపోగా, అంధకారంలో నడచే ప్రబంధకవులకు దివ్యదీపికగా వెలుగొందింది చేమకూరి విజయవిలాసం. తత్కర్త సాహిత్యభూమిని వింత వెలుగుతో శోభాయమాన మొనర్చె. దానటంలో సందియం లేదు. పురాతన తెనుగుకవితకు నూత్న పోకడలతో సంస్కృతభాష నుపయోగిస్తూ, పాటల్ని నిర్మించేడు విజయవిలాస ప్రణేత. గీర్వాణభాష ఆంధ్రానికి సన్నిహితం కాదని ప్రబంధాన్ని రచించి చూపించేడు. అడుగడుగునకు వివిధపద్యవిన్యాసాల్ని చూపించి, సోమయాజిపట్టికలో మొదటి విప్లవకారుడుగా గణింప బడినాడు. గీర్వాణసాహచర్యాన్ని త్యజించి, సొంత తెలుగుపలుకులతో హృద్యపద్యాల్ని ఆంధ్రకవులకు చవి చూపించి పేరెన్నిక గన్నాడు. నైసర్గికంగా వచ్చిన గుణాన్ని కవి యీ విధంగా వెల్లడి చేసేడు.

ఏ కాలానికి తగినట్టు ఆ యా కాలాల్లో కవులు నిరంకుశత వహిస్తూ కవిసమయాల్ని త్యజించక, సాహిత్యవిప్లవాన్ని, సాహిత్యాభ్యుదయాన్ని, నూతన కళోపాసనాన్ని, అభినవ పద్ధతుల్ని అవలంబిస్తూనే యున్నా రని నుడువవచ్చు. సనాతనయుగంలో ఈ విప్లవచర్యలు కేవలాంధ్ర శ్రవ్యంలోనే జరిగేయనికూడ వా కొనవచ్చు.

సమాజం మృత్యువికటాట్టహాసంలో లీనం కాబోతూంటే, సంఘవ్యవస్థలు వికలములై ధర్మచ్యుతి పొందుతూంటే తద్వ్యవస్థితుల్ని కవి తన కావ్యంలో చక్కగా పొందుపఱచుతాడు. శిల్పి స్వచాతురీధురీణత్వం బయల్పడేటట్టు చేస్తాడు. సంఘదురాచారాల్ని ప్రతినిరోధిస్తూ గాయకుడు శ్రావ్యంగా ఆలపిస్తాడు. కాలవాహిని శతాధికవేగంతో ప్రవహించిపోతూంటే సంఘంలో మార్పులు సహజసిద్ధమైనవి. పరిణామసహజంగా కావ్యలోకంకూడ పరిణామం చెందింది.

౧౯వ శతాబ్దినాటి వీరోచితకాలఝురిలో యువక కవు లుదయించి పరిణతికళాప్రాదుర్భావంతో నూతనంగా కావ్యగానం ఆలపించేరు. అన్నివిధముల వివిధ పరిణామాల్ని చెందిన పద్యప్రబంధాలు కొంత విశ్రాంతి చెందుట కుపక్రమించినై. నాటకకళా రంగము లనంతములుగా స్థాపింపబడి, తదనుస్యూతాలై దృశ్యకావ్యాలు వెలువడినవి. అఖండపరిణామము, విప్లవశిఖ, నాటక సారస్వతంలో ఉద్బుద్ధమై వెల్లివిరిసినది. అయినను స్వేచ్ఛాభావసమ్మిళితంగామాత్రం నాటకవాఙ్మయం జనించింది కాదు. అప్పటికి సర్వశక్తులు, సమస్తగౌరవాలు అందుకొన్న సంస్కృతనాటకాలు తెలుగుసారస్వతాన్ని తొంగిచూచినై. తత్కారణం ఆంధ్రానువాదాలు ప్రబలి శతాధికాలుగా అవతరించి ఆ లోటును తీర్చెయి.

౨౦వ శతవార్షిక సమారంభంలో యుగయుగాలనాటి వీరగాథ లవతరించి, అనంతసాహితీరంగాన్ని సమరాంగణంగా మార్చివేసింది. యథేచ్ఛావిహారం చేసి, కవికుమారులు సర్వతోముఖంగా ప్రాశస్త్యం గడించేరు. ఈ కాలముననే గద్యప్రబంధ రచన కంకురార్పణం అయినది. కవిహృదంతరాళ భావశక్తులు బహుముఖములై గద్యప్రబంధానికి బంగారుపూత పూసి, యొక దివ్యత్వాన్ని ఆపాదించుకొని, అనితరసాధారణగౌరవా న్నందికొన్నాయి. ప్రపంచాన్ని ఒక మధురవాహినిలో ముంచెత్తి, విభిన్నాలైన వర్ణవైచిత్ర్యాల్ని చూపి, మురిపింపజేసింది నవ్యయుగంలోనే. ఈ యుగంలోనే నరేంద్రుల భవనావాసనాసంబంధాలకు అశాశ్వతాంతము కల్పింపబడింది.

ఈ శతాబ్దిమధ్యమందే రాజాధిరాజుల గర్భగర్వానికి స్వస్తివాచకాలు పఠింపబడ్డాయి. ఈ నవోదయంలోనే యువకవు లనేకులు వివిధవర్ణ స్వరస్థముగూర్చి స్వేచ్ఛాగాన మాలపించి, స్వాతంత్ర్యశంఖాన్ని పూరించి, వీరనాదాన్ని చేసి, యితరరాజ్యాలకు ధిక్కార మొనరించి, విశ్వాన్ని పులకింపజేసేరు. నాటకవాఙ్మయం అనంతంగాను, అపారంగాను బయల్దేరిందికాని, స్వతంత్రనాటకాలుమాత్రం అనుకొన్నంత అధికంగా బయల్దేరి, ప్రపంచా న్నాక్రమించుకోవడం మాత్రం లేదు.

గద్యవాఙ్మయం మధురాతిమధురంగా తయారు చేసి, వచనవిన్యాసాన్ని సర్వాంగసుందరంగాను, విశ్వమానవసమాకర్షకంగాను తయారుచేసి తెనుగువకు ఒక వింత అందాన్ని చేకూర్చి, మాధుర్యవంతం చేసిన వాడు చిన్నయసూరి. సర్వతోముఖరితం అయిన భాషాశైలిలో గద్యగ్రంథాన్ని నిర్మించి ఆంధ్రానికి అపూర్వత్వం కల్పించినాడు. సూక్ష్మాతిసూక్ష్మలైన తెనుగుసుడికారాల సొంపులో దాన్ని గద్యప్రబంధాలకు తలమానికం చేసి, ఆంధ్రావనికి అమూల్యాభరణం చేసేడు. సూరిగారి ఆ రచన ఈ నూతనయుగానికి ప్రామాణికం అయింది. గద్యరచనే లేనినాడు విప్లవాత్మకమయిన ఒక దశావిశేషంగా నిత్యం, నూతనం అయిన గద్య గ్రంథాన్ని నిర్మించాడు సూరి. అది సాహితీవిప్లవానికి కేంద్రం. భవిష్యత్కావ్యసౌధాలకి పునాది వేసి దిట్ట పరిచాడు సూరి కావ్యలో కాన్ని. నాటి సంఘమర్యాదల్ని, సమాజవ్యవస్థల్ని తన కావ్యంలో సూరి చక్కగా ప్రతిబింబింపజేసేరు. యుగయుగాలనాటి కవులకు చక్కని దివ్యబోధ చేసేడు సూరి. అతని పదాలు లలితలలితాలు, హృదయంగమాలు, చక్కని సన్నివేశ సంయుతాలున్నూ. ఆ రచన యితరకవి కలవడలేదు. వీరేశలింగంవంటి మహాకవులు అనుకరించి, అఘాతాన్ని పొందేరనగా యితరులం కిముత!

మరియొక శతసంవత్సరానంతరం పానుగంటి వారి విచిత్రవ్యంగ్యధోరణి సమాజంలోని కల్లోలాన్ని వ్యక్తపరచి భ్రాంతిసముపార్జన చేసింది. గ్రాంథిక శైలీవిశేషాల్లో పానుగంటివారు సిద్ధహస్తులు. హాస్యరసాన్ని పరాకాష్ఠ పొందించినది పానుగంటి గద్యధోరణి. ఉద్యోగునిమొదలు ప్రభుత్వంవరకు గల లోపాల్ని సవరించి, స్త్రీలవిషయంలో అనువైన పద్ధతుల్ని నిరూపించింది. సనాతన, నూతనపరిస్థితుల్ని చక్కగా విమర్శించి, తీక్ష్ణాతితీక్ష్ణంగా ఉండి ప్రజాసాహిత్యమై, సమాజాన్ని కదిలించి విడిచింది. అంతటి విమర్శకుడు 'న భూతో నభవిష్యతి' అనే నుడువాలి. ఏ విషయాన్ని విమర్శించినా, సున్నితం, ప్రగల్భం అయిన హాస్యాన్ని యిమిడ్చి, వ్రాయడం ఆయనపద్ధతి. తెనుగులో అప్పటికే విప్లవం రేకెత్తింది. విప్లవసూచనే ఆయనకవితాపోకడలో కనబడుతుంది. ప్రాచ్యపాశ్చాత్యభావవీచికలను తన కవిత్వంలో యిమిడ్చికొని సారవంతంగాను, కొనియాడతగినదిగాను చేసికొనినవాడు పానుగంటి. ఆనాటి సారస్వతం పానుగంటిరచనలకు ప్రాధాన్యం ఇచ్చింది. ఏ రచన సాగించినను పానుగంటిధోరణి విప్లవదశకే యీడ్చివేస్తుంది. సంఘం కావ్యంలో ప్రతిబింబించక తప్ప దనడానికి పానుగంటిరచనలే సాక్షి.

గద్యవాఙ్మయం, నాటక వాఙ్మయం లేని లోటు ఈ యుగం తీర్చుకలిగింది. ఇంతలో యక్షగానం అనే నామంతో కొన్ని జనించి పేరు సార్థం చేయి. ఈ యక్షగానాలు క్రమపరిణామనిబద్ధాలుకాక, స్థిరరూపంతో నిలిచిపోవడాన్ని బట్టి క్రమంగా కాలకుక్షిలో లీనమయేయి. ఈ యక్షగానాలు హాస్యప్రతిపాదకాలు, అభినవాలు, ప్రబంధానుసరణాలు అయినను అధునికు లనేకులు అత్యంతం అసహ్యంగా చూడ్డంవల్ల క్రమంగా చరిత్రహీనాలైనాయి. ఇప్పటికే సంస్కృతపదజాలంయొక్క సహాయంతో ఆంధ్రం నూతనశకారంభంలో నవ్యభావపేశలకుసుమాల్ని కని, సంఘాన్ని పరిమళసంయుతంగా చేసింది. తెనుగుభాష నేటికి ఇతరసారస్వతశాఖల రీతిగానే ఒక విశిష్టస్థానా న్నాక్రమించింది. పాశ్చాత్య భాషా సాహిత్యంవల్ల అలంకారాలు తగ్గినా కవిత్వంలో నిత్యం పరిణామం కనబడుతూనే ఉంది. సంఘంలో పరిణామం, కవిరచనలో పరిణామం, భావంలో పరి

ణామం. కనుకనే నేటి కాలాన్ని అనుసరించి కవి సంఘాలు, పరిషత్తులు, అభ్యుదయాలై వాసికెక్కి, యితోధికంగా వర్ధిల్లగలిగేయి. తదనుసారులై కవులు కూడా అనేకులుగా నున్నారు.

పాశ్చాత్యదేశభాషల్లో 'నవల' అనే నామంతో విజృంభించిన వాఙ్మయం అనంతం; తద్దేశభాషా సంపర్కంవల్ల, తద్దేశీయాభిజాత్యమురహంకారంవల్ల, తద్దేశీయుల అనుచితాచారాలవల్ల మన దేశంలో, మన సమాజంలో, మన సారస్వతంలో సంపూర్ణపరిణామం కలిగి, నవలాయుగం ఆరంభమైంది. నవలాయుగాన్ని గౌరీశంకరశిఖరాశిరోహణాన్ని గావించేరు వెంకట పార్వతీశ్వర కవులు. వారి సమాజపాండితీధోరణిలో నవలావాఙ్మయం పెరిగి, అనూహ్యమైన భావతరంగాల్ని జనింపజేసింది. వారే నూతననవలాయుగానికి శంకుస్థాపన చేసేరనవచ్చు. క్రమ క్రమంగా కవి ప్రజ్ఞలు నానాముఖాలుగా బయల్దేరి సమాజవిరోధశక్తుల్ని గడచి, సంఘాన్ని మేల్కొల్పేరు. అనేకజాతీయాలు, వివిధవ్యంగ్యప్రధానాలు, సమప్రాధాన్యం వహించిన రచనలు పుట్టి కావ్యగతి నభివృద్ధి నొందించి తత్కాలంలో ప్రముఖస్థానా న్నాక్రమించేయి. మేధావంతులైన కవులు అనేకవిధాలుగా కవితాకోకిల గానా న్నాలపించేరు. వెంకటపార్వతీశ్వరకవు లీ గద్యకావ్యాలకు, నవలానిర్మాణాలకు మూలకందాలై, కవితాలోకంలో చక్కని పూలబాటల్ని నిర్మించి, సమాజపరిస్థితుల్ని సరిదిద్దడానికి ప్రయత్నించారు. సంఘదురాచారాల్ని నానావిధాలుగా తమ కావ్యాల్లో ప్రతిబింబింపజేసి ధన్యులైనా రనే చెప్పాలి.

చిలకమర్తి 'గణపతి' హాస్యం అనే పేరుతో సంఘంలోని దురాచారాల్ని, సమాజంలోని గ్రుడ్డితనాన్ని, లోకంలోని అసభ్యతావృత్తుల్ని చిత్రించి, కావ్యంలో ఒక విశిష్టస్థానాన్ని ఆక్రమించింది. అతని రచనలన్నీ నూతనదృక్పథా న్ననుసరించి పోయినాయి. సంఘాన్ని పట్టిన క్రిమికీటకాల్ని కావ్యం అనే పేరుతో సంహారం గావించి సమాజానికి వింత కాంతి నాపాదించేడు. అంతటి విశాలభావనాశక్తియుతుడు లోకంలో లేడనే చెప్పాలి. నవలలు, నాటకాలు, ప్రహసనాలు, కథలు రచించి, కావ్యాని కింకా అభ్యుదయం కావా లని తపించుకుపోయేవాడు. వీరేశలింగం, కొక్కొండ, చిలకమర్తి మొదలైన దిగ్గజశ్రేణిలో చేరదగిన కవు లనేకు లనేకరీతులుగా వాఙ్మయాన్ని త్రిప్పిత్రిప్పి, సంఘాని కత్యంతం సమీపంలోకి తీసుకుపోయేరు. అయినా ప్రజల కందుబాటులో లేని రచనల్తో కావ్యాల్ని నింపేరనే అపవాదుని తప్పించుకోలేకపోయేరు. ఎన్నెన్ని ప్రయత్నాలొనరించినా సహజంగా వ్యావహారికానికి మాత్రం యీ రచయితలు రాలేకపోయే రనే చెప్పాలి. వ్యావహారికానికి ప్రాముఖ్యం యిచ్చిన 'గిడుగు' వారితో వీరు ప్రథమంలో ఎదుర్కొని వాదప్రతివాదాల్ని సాగించేరు. సంఘసంస్కరణాభిలాషి కాబట్టి వీరేశలింగం తత్క్షణం గిడుగువారి ఆశయాల్తో ఐక్యత నొంది అట్టి రచనలకు ప్రాధాన్యం ఇచ్చేరు.

పండితప్రకాండుల ఆర్భాటం ప్రపంచంలో నిండి మరింత అలజడి చేసింది. వీరి అట్టహాసాలకు, ఆర్భాటాలకు, అగ్నిబాణాలకు, ఆక్రోశాలకు వెనుకంజవేయక ధీరత్వంతో నిలబడి సంఘంలోని ప్రజాసామాన్యానికి విద్య అలవడాలంటే, ప్రజాసాహిత్యం కావాలి, వ్యావహారికంలో రచనలను సాగించా లని గర్జించుచు పండితుల్ని పారద్రోలగలిగినారు గిడుగువారు, వ్యావహారికభాషాసంచలనం ప్రతియుగంలోను, ప్రతికవికావ్యంలోను, ప్రతిశిల్పిచాతుర్యంలోను కల బడుతూనే ఉంటుం దని చాటు నాటి రచయితల ఉద్గ్రంథాల్ని ఎత్తిచూపి రణభేరి మ్రోగించేరు. ఆనాటి మహాకవుల నందర్ని భాషావివాదంలో ఓడించి, ప్రముఖస్థానాన్ని సమాక్రమించి, కోవిదుల కొక వాఙ్మయం సృష్టించి సారస్వతబ్రహ్మ అనిపించుకోగలిగేడు.

అనంతరం గురజాడవారు తన జాతీయాలైన ముత్యాలసరాలతో ప్రపంచా న్నలంకరించి, ప్రజాసమూహాన్ని తనవైపు మరల్చుకొనగలిగేరు. అప్పటికీ ప్రపంచం ఒక విశిష్టస్థానాన్ని ఆక్రమించుకోలేకపోయింది. ప్రజల కొక దివ్యసందేశా న్నిస్తూ ఆంధ్రులను తేజితుల్ని చేసి, తన ఉద్బోధచే దివ్యత్వం కల్పిం

చేరు. గురజాడరచన లన్నీ ఏదో ఒక నూతనపథం లోనే నడచిపోయి, లోకాన్ని ప్రేమించి ప్రజా సాహిత్యం అయింది.

భావకవిత్వం

భావకవిత్వం బజారుకవిత్వం అనేవారు, భావకవిత్వం వానిసకవిత్వం అనేవారు, భావకవిత్వం బాలకవిత్వం అనేవారు, భావకవిత్వం బాలంతకవిత్వం అనేవారు, భావకవిత్వం భారకవిత్వం అనేవారు బయల్దేరేరు ఈనాడు. కావ్యలోకంలో అలజడి, గుసగుస, నిర్లక్ష్యత, అసహ్యం, హేళన ఇత్యాదులు బయల్దేరి ఆ మహోద్యమాన్ని అణచేసేయి. ఏ యుగంలోగాని, ఏ కాలంలోగాని, ఏసమయంలోగాని సారస్వతసంఘంలో యింత బ్రహ్మాండమైన ఉద్యమం బయల్దేరలేదు. ప్రజాజీవితాని కనుగుణంగా గేయాలు, గీతాలు, ఖండకావ్యసంపుటులు, ఉద్రేకపూరితరచనలు, దేశభక్తిపూరితకవిత్వాలు, వీరరసప్రధానఅక్షరవిన్యాసాలు, కార్మికకర్షకనిత్యజీవితకష్టపరంపరలు మొదలుగా వివిధంగా బయల్దేరి దేశాన్ని కల్లోలంలో ముంచింది. అదే కావ్యంలో ప్రతిబింబితం అయింది. అట్టి కావ్యోద్యమానికి విరోధకశక్తులు విఘ్నం చేయడానికి ప్రయత్నిస్తే నాశనం అవుతుందా? కాని ప్రజాసాహిత్యానికి కొన్ని ఛాందసవాఙ్మయాలు అడ్డుతగిలేయి. కాని నిలబడలేక ప్రవాహరూపమైన ఈ కావ్యోద్యమానికి మూర్ధాన్నిచ్చేయి.

ఈ భావకవిత్వం ప్రధానంగా కావ్యజగత్తు సాక్షించేందుకు హేతువును విచారిస్తే "భావలోని ందిన్యభారసాభోగము కవిముఖసాధ్యమయ్యె" అనే పద్యాల భావం గుర్తుకొస్తుంది. ప్రాతివస్తువును త్యజించి పద్యాలు కొంగ్రొత్త పోకడలలో భావమాధుర్యం కలిగేటట్లు రాయడం ఒకటీ, పురాతనకవుల శృంగారరసాన్ని విసర్జించి, అక్షరానందసిద్ధినే పద్యాలు వాంఛించడం రెండూ, పూర్వుల మిశ్రసంభూతాలైన కావ్యేతివృత్తాల్ని దూరంగా ఉంచి, కమిలి, ప్రఫుల్లిన వస్తుచయాల్ని, మందుకొండల్ని, పైరగాలుల్ని, యౌవనాశావిపంచికల్ని, ప్రజాసన్నిహితకష్టనిరూపణాత్మకవస్తు సంతతుల్ని వర్ణించి, భావప్రాధాన్యంగా ఉండడం మాదిరా— ఈ రెండరైన లక్షణాల్ని మనస్సునందు నిగూఢపరచి వర్ణించడం భావకవిత్వానికి ప్రధానలక్షణంగా తోస్తున్నది. ముందుకు స్వేచ్ఛగా పోయే కవులు, యతిప్రాసఛందోనియమాదుల్ని ఉల్లంఘించి, లలితలలితపదబంధాలతో, ఉన్నతమయిన భావసౌభాగ్యంతో విశేషంగా పాఠకులకు హృదయంగమంగా ఉండడం దీని లక్షణమే. ఆవేశం అధికం అయినప్పుడు, విడిగా పోయిన పదాల్ని సేకరించి కుక్కడం చేసి, ఆకలి చల్లార్చుకోడం యీ భావకవిత్వప్రధానలక్షణాల్లో ఏకం.

"కాలధర్మానుగతమై జగత్ప్రవృత్తి, మాతృవపుము వాఙ్మయమును మారు నిజము" అనే రాయప్రోలు భావాన్ని ప్రధానంగా తీసికొని కవికుమారులు యథేచ్ఛగా కావ్యసారస్వతాన్ని కాలానుసారంగా మార్చి ఒకవిధమైన మధురజగత్తులో ముంచేసేరు. నేటి యీ భావకవిత్వం దిగ్గజాలుగా పరిగణింపబడే కావ్యస్రష్టల కావ్యాల్లో ఉపయోగింపబడి పలుకుబడిని సంపాదించుకొంది. అనూహ్యమైన తిరుగుబాటు ఈ ఉద్యమాన్ని అణచడానికి పునరుపచీయమానప్రయత్నం చేసినా ఫలితాన్ని పొందలేకపోయింది. ప్రధానంగా ఆంధ్రప్రశస్తికరాలైన కవిత్వ వీధియుగంలో బయల్దేరి విప్లవానికి దారితీసేయి.

చూడండి—

"మామిడికొమ్మమీద కల
  మంత్రపరాయణులైన కోకిల
స్వామికి మ్రొక్కి యీ యభిన
  వస్వరకల్పన కుద్యమించితిన్;
కోమలగోస్తనీరుచుల
  కున్ కదళీఫలపాకసిద్ధికిన్
లేములు దీర్చు మాతెనుగు
  లేత ముద్దుల్ వెలార్చు వేడుకన్"

అని రాయప్రోలుఆశయం. "మాధుర్య మంతయిం శైదరు సంభోగసుఖము; నే విరోగమాధుర్యలీలావిపాకమనుభవింప నల్లాడెదను" అని తన యీనాటి భావాన్ని వెల్లడిచేసికొన్నారు.

అఖండభారతదేశం రణక్షేత్రం అయిన అనంతరకాలంలో శంఖుకత్తులన్నీ విజృంభిస్తే తదను సరణాలై యిట్టి భావవిప్లవం కలిగి కవిత్వా లారంభ మైనాయి. ఎక్కడ వీక్షించినా విషాదచ్ఛాయలే కనిపిస్తూ ఉంటే "ఏన్వగా నేన్వగాలేక......ఏడ్చి నైతు ఎలుంగెత్తి ఏడ్చినైతు" అని దేవులపల్లివా రన లసివచ్చింది. ఇంకా కొందఱు కవులు "చండభుజా విలాసముల శాత్రవు తేజము లార్చి, సద్యశోమండల చంద్రికానిజసము న్నతదిగంతరులైన వీరమార్తాండుల విక్రమోజ్జ్వలకథానికగీతిక లాలపించుచున్, సందువు సీయరే కవికుమారులు" అని వాపోయేరు. విశ్వనాథం వారు, వేదులవారు ఇట్టి భావస్ఫోరకాలైన పద్య రత్నాల్ని వ్రాసి కవిలోకాని కందించేరు. చూడండి, వేదులవారు—

"పూవు వీడినగాని పుట్టదు ఫలము;
ఫలము రాలక జనింపదు నవాంకురము;
దగ్ధమై కవితాభస్మరాశి !
సుప్తివీడిన యుషస్సునకు పునాది—"

అని ప్రాతను విడిచి నూతనకవితను స్వీకరించ మని ప్రబోధచేస్తున్నారు. 'ప్రాతదన్నది రొల్ల పైకి తోలేమని చెప్పి, సెమరువేయడం (పూర్వభావాన్ని) నసత్వపద్ధతని హెచ్చరిస్తున్నారు. భారతనవ్యభావ కవుల నిదురమైకమ్ము వదిలిన దని, జయశంఖారావము కలుగజేస్తున్నారని వేదులవారి ప్రబోధ. తరతరాల బంధనాల్ని కవిత్వసరస్వతి వదలించికొందట. భావ ప్రధాన మయిన ఆయనధారాశుద్ధి ఆకర్షణీయం గాను, సుందరపేశలంగాను ఉంటుంది.

"స్రోతోభృతులాడు కాలోర్మియులు
దొంతర గ్రమ్మి తమాలపాదప
వ్యాపితమైన గోకుల వ
నాంతరమంతయు శ్యామికాంజన
స్నాపితమయ్యె, నీ యడుగు
జాడలు గానగరావు నాకు గో
గోపకులన్ విగన్విడిచి
గోపకిశోరక యెందు బోతివో !"

ఇట్లే ఆయనపద్యాలు సర్వాలూ వీణానాదం లాగ మనోమోదాన్ని కలుగజేస్తాయి. ఆయన రచన విస్తరమార్గానికి దివ్యకాగడా.

తరువాత భావకవిత్వంలోనే క్రొత్తపోకడలు కొంత కాలానికి కనబడసాగినై. కొన్ని ఛందో గతుల్ని అవలంబించి రచింపబడ్డాయేమో అని యనుమానం.

"దీపంపు సెమ్మెపై దేదీప్యమానమై
పసిడిపచ్చని వెలుగు పకపకా నవ్వినది.
క్రీనీడపాయలో కవ్వమని కే కొకటి
వినిపించి తుదిశ్రుతుల విరమించి పోయినది.
పొదచాటునీడలో పులుగొకటి బుగ్గిలో
పొరలినది భయముతో ఫులుంగొకటి యూర్చినది."

ఇట్లే విషాదవాతావరణాన్ని సృష్టించి అపూర్వ చైతన్యాన్ని కలిగించే పోకడలూ భావకవిత్వంలో అణగియున్నాయి.

"పగతురు తెగ్గు సీమ కెగ
బ్రాకుచునుండగ గాంచి సిగ్గు బొ
గ్గగ నభిమాన మింత సర
కుంగొనకీ త్రుటి జీవితంబుపై
దగులన చావె వచ్చిన యు
దారగుణాఢ్యుల మిమ్ము గాంచి యే
నగుదునొ? యేడ్తునో? తెరవు
గానక ప్రాణము లజ్జగించుటో"

అని వీరరసావేశపరవశులైన కవిమార్తాండులూ భావకవిత్వాన్ని ప్రోత్సహించేరు.

"చిన్నవన్నెలు గల పువ్వు లెన్నియున్న
నిన్ను ప్రేమింతు మనసార చిన్నిపువ్వ
నీ నిరాడంబరవిరక్తపక్షశంక
జీవితంబును సలపడ జేసికొనగ—"

అని ప్రకృతిమనోహరతకు లౌల్యం చెంది ఆల పించిన కవిశేఖరులూ భావకవిత్వంలో యిమిడి ఉన్నారు. ఈ విధాల్ననుసరించే కాకుండా ఛందో బంధాల్ని త్రెంచి స్వైరవిహారం చేసి, దేనికి అను

సరించకుండా చెప్పే ప్రణేతలూ ఉన్నారు. ఆకాశపు బుట్టల్లా రంగు రంగుల నింపే హృదయంగమాలైన పద్యాలూ, గేయాలూ, గీతాలూ, కథానికలూ ఇంకా అనేకాలుగా ఉన్నాయి. వారికి ప్రమాణం తప్పదయితే. తనలోని భావాన్ని కర్తృకర్మక్రియా సౌభాగ్యంలేని అఘోమయవాక్యంలో వెల్లడిచేసే రచయితలూ యీ భావకవిత్వం పేరుతోనే ఉన్నారు.

భావకవిపట్టికలో అగ్రస్థానాన్ని పొందినవారు రాయప్రోలు, కృష్ణశాస్త్రి, వేదుల, శ్రీశ్రీ, జాషువ ప్రభృతులు. ఇంకా యీ కాలాన్ని విప్లవవంతంగా చేయడానికి విమర్శకులూ, భావకవులూ కొందరు మిగిలేఉన్నారు.

తరువాత భావవిప్లవం కొంత శాంతిస్తే 'అధివాస్తవికత' అనే పేరుతో తిరుగుబాటుకవిత్వం ఆరంభమైంది. యథార్థవస్తుస్థితిమాత్రం వర్ణించడం దీని స్థూల లక్షణం. దీన్ని పాశ్చాత్యభాషాసంప్రదాయాన్ననుసరించి ఆంధ్రకవిత్వంలోకి బలవంతంగా తీసుకొచ్చినవాడు శ్రీశ్రీ. తన రచనల్ని అమోఘంగాను, గంగాప్రవాహసదృశంగాను సాగించి, ప్రాణిలోకంలో, కావ్యజగత్తులో అపూర్వచైతన్యం కలుగజేసి ముగ్ధుల్ని చేసేడు. యువకరక్తం ఉత్సాహవంతంగా, వెల్లువగా ఉంటే ఎట్టి కవిత్వాలైనా జనించొచ్చు. శ్రీశ్రీ తన అధివాస్తవికతను సూచించే గేయాల్ని అనేకంగాను, విభిన్నాలుగాను, చక్కని గుంఫనగాను, భావపటిమాస్ఫోరకంగాను వ్రాసేడు గాని జనసామాన్యానికి అందుబాటులో లేనందువల్ల ఆ రచనలు యింపు నింపేయి కావు. ఎలాగంటే—

"మింగి తిమింగిలంగిలత
　　మిగ్రసుహోంతరమీనమేవ. పా
రంగతులైన బొంగరము
　　లార రొదజెంగిన దెబ్బడీ పరి
వ్యంగము పాడు సెంకుశ వి
　　పంచికి కంచికి దూరమెంత వ
డ్రంగులు రంగులా గులక
　　రాళ్ళగు మా గుడిలోని లింగముల్."

ఇత్యాదిపద్యాల్లోని భావాలగ్రాహ్యాలుగా ఉండడంవల్ల అధివాస్తవికకవిత్వవిప్లవానికి దెబ్బతగిలింది. ఈ కాలంలోనే డాడాయిజం, సూపరిగో, మొదలైన విప్లవబీజాలు తెలుగుకవిత్వపు పంటభూమిలో వెదజల్లబడ్డాయి. అంతంలో యీ కవిత్వ పద్ధతులు సమూలంగా నాశనం చేయబడ్డాయిగాని స్వేచ్ఛాపథం అలవాటైంది.

పూర్వం చెప్పిన కవితాచర్చల్లో తేలిన సారాంశం భావకవిత్వం అనే దాన్ని లోన ఇముడ్చికొని 'అభ్యుదయ' కవిత్వం అనే ఆఖ్యతో ప్రపంచంలోకి చల్లగా జారింది మరో జాతీయకవిత. పురాతనాధునాతనవైరుధ్యాల్ని సామరస్యం పొందించి అభ్యుదయత్వం చూపించిం దీ అభ్యుదయకవిత. ప్రపంచంలో ప్రతిబోధ్యమైన యీ కవిత సమాజాన్ని, సారస్వతాన్ని, శిల్పాన్ని, చిత్రాన్ని, కళని, విభిన్నతరగతులుగా నున్న ప్రతిజాతీయతనీ మేలుకొల్పి, వానిలో అభ్యుదయత్వం కల్పించగలిగింది. నవ్యసాహిత్యంనుండి విడివడి, ముఖ్యంగా భాషావాదుల్ని, విమర్శకోత్తంసుల్ని దగ్గరగా చేకూర్చికొని, అభ్యుదయత్వం పొందింది. విశాలాశయంతో సర్వతోముఖంగా యథేచ్ఛావిహారాన్ని సల్పి, లోకాన్ని తనలో లీనం చేసుకొంది. అనగా ప్రపంచంలో జరిగిన ప్రతి అలజడీ, ప్రతి విప్లవం అవశ్యంగా ఈ అభ్యుదయకవిత్వంలో ప్రతిబింబితం అవకతప్పదు అని. ప్రపంచం బానిసత్వంలోని దుర్భరక్షామపిశాచదంష్ట్రికల్లో నలిగి బాధపడుతూంటే, రాజకీయంగా ప్రజాబాహుళ్యం చైతన్యవంతంగా పరిణమిస్తూంటే, కార్మిక కర్షకజీవితపరిణామం నిత్యసమస్యగా మార్పు పొందుతూంటే, అన్నివిధాలా ప్రపంచంలో అభ్యుదయత్వం కన్పిస్తూ ఉంటే సారస్వతంలోమాత్రం నవ్యత్వం, అభ్యుదయత్వం రాకుండా ఎలా ఉంటుంది? పూర్వసారస్వతంకంటే యీ నాటి నవ్యసాహిత్యం అభ్యుదయపరిణామద్యోతకమై నేటి కాలాన్ని అనుసరించింది. వివిధదేశాల వాఙ్మయసాజాత్యంవల్ల, వివిధసంఘనిర్మాణాలవల్ల సాహిత్యం చెలరేగి, భావకవిత్వంగాను, అధివాస్తవికతగాను, నవ్యసాహిత్యంగాను పరిణతి చెంది అంతా

నీకి అభ్యుదయంగా నిలిచింది. ఆంధ్రత్వాభిమానం, ఆంధ్రజాతీయాశయాలు, ఆంధ్రసంస్కరణాభిలాషలు, ఆంధ్రనవీనభావాలు ఆంధ్రజాతిచరిత్రను సువర్ణచరిత్రగా మార్చి లోకంలో ఏకైకమహోన్నతస్థానసిద్ధిని సాధించగలిగేయి.

అభ్యుదయవాఙ్మయం యావదాంధ్రదేశ సమస్యల్ని చిత్రించి సారస్వతసంఘంలో ఒక వింతస్థానం ఆక్రమించుకొంది. నేటికాలానికి ప్రప్రథమంగా బయలుదేరిన యీ సారస్వతవిప్లవం కవికుమారుల్ని ప్రోత్సాహవంతుల్ని చేసింది. కాని, ఇతఃపూర్వంలోనే స్వేచ్ఛాపథం అలవడ్డంవల్ల దురహంకారులైన జాతీయగీతాలాపంథమై కావ్యం తలకుని, నిర్మాణాన్ని సంకుచితం చేసింది. కొందరు కావ్యనిర్మాతలలో అసహనత్వ విష బీజాలు నాటబడ్డాయి. నిసర్గవిప్లవాత్మకం అభ్యుదయతత్వం కాబట్టి నిరోధకశక్తుల్ని అతిక్రమించగలుగుతుం దనే ఆశయం ఉంది. స్థానాస్థానవిచారణ పరిణామబద్ధమైన వాఙ్మయానికి తగదు. కాబట్టి అభ్యుదయకవిత్వం సర్వసంఘశక్తుల్నీ సమీకరిస్తుం దనే నా ఆశయం.

ఏ మార్గమైనా లోకాని కుపకరించేదై ఉండాలి. ఏ విప్లవం అయినా సమాజాన్ని అభ్యుదయతలోకి గొంపోవాలి. ఏ సారస్వతం అయినా నిత్యనూతనంగా ఉండాలి. కాని తనకు కూడా అజ్ఞాతాలైన రచనల్ని సాగించడం ధర్మవిరుద్ధం. మాండలీకపదాల్నీ, సంకేతార్థచిహ్నితపదప్రయోగాదుల్నీ, ఆంగ్లేయపదానుసరణాల్నీ ప్రయోగించి విప్లవాత్మకమైన సాహితీకట్టుబాట్లని సడలించడం నీతివిరుద్ధం అని ముగిస్తాను.



ఒక్క రోజు

[కథానిక]

శ్రీమతి అచంట శారదాదేవి



అప్పుడే తెల్లవారుతోంది!

కిటికీలోనుంచి ఒక్క వెలుగుకిరణం శాంత ముఖంమీద పడింది;—శాంతకు మెలకువ వచ్చింది.

అయినా, పూర్తిగా నిద్దురబద్ధకం వదలలేదు;

నిద్రకళ్లతో కిటికీలోనుంచి బయటకు చూసింది.

నిద్దురకళ్ళతోనే మందారపువ్వులు పలుకరించినాయి.

ఒక్కక్షణం ఆమె హృదయం అటువైపు ప్రశాంతంలో లీనమయింది...

* * *

ఉన్నట్లుండి మిన్ను విరిగి మీదపడినట్లు ఏక రణగొణధ్వని!

దొడ్డిపై నుంచి 'కావు కావు' మంటూ కాకుల సమూహం;

వీధిపై నుంచి 'బొంయ్' మంటూ కార్ల సమూహం;

బావిదగ్గర పంచమశ్రుతిలో పనిమనిషి;

వాకిలి దగ్గర మధ్యమ శ్రుతిలో కూరల మనిషి;

—అందరూ రకరకాల గొంతుకలతో 'ఇంక ప్రపంచంలో శాంతి లే' దని బృందగానం మొదలు పెట్టినారు.

ఆ గోలకు ఎవరికైనా మెలకువ వస్తుంది.

శాంతకు మెలకువతోపాటు ఆమెను నిత్య జీవితంలో బాధిస్తున్న సమస్యలన్నీ ఒక్కపెట్టున ఆవరించాయి.

ఎప్పుడూ రాత్రి, ఎప్పుడూ నిద్ర అయితేనే బాగుంటుందేమో! అప్పుడు తీరని సమస్య లేమీ వుండవు;

ఆశ, నిరాశ, అసంతృప్తి—వీటిబాధ ఏమీ వుండదు.

కాని రాత్రిఅంతా తెలవకోసం, పగలంతా రాత్రికోసం కనిపెట్టుకుని వుండటమే జీవితం.

అయినా ఇవ్వాళ?—

ప్రతిరోజూ ఏదో మార్పు వస్తుందని వట్టిభ్రమ.

అన్నిరోజుల్లాగే ఈ రోజూ గడచిపోతుంది.

అంతే!—

* * *

మామూలుగానే మేడ దిగి వచ్చింది శాంత.

మామూలుగానే రమణమ్మ కూరలు బేరం చేస్తోంది.

'బెండకాయలు అరణాల కిస్తావా?'

'అదేంటండి! వీశ ముప్పావలా అమ్ము తూంటేను!'

'ఈ కబుర్లకేంలే! అరణాల కిస్తే ఇయ్యి, అర వీశ'

'అబ్బే—ఇదేం బేరమండి! అన్నీ మండి పోతూంటే!'

అంతే.—విసుగొచ్చి తను కలుగజేసుకుని తీర్పు చెప్పేదాకా ఆ వాదన అట్లా సాగుతూనే వుంటుంది. రోజూ ఈ ఘోష లేకుండా వుండేటందుకు కూరలకు ఎంత ధర ఇచ్చినా ఇవ్వవచ్చు.

* * *

త్వరగా స్నానంచేసి తల దువ్వుకుంది.

ఇవ్వాళ రాణీ, తనూ కలిసి మల్లెతోటలోకి వెళ్లాలనుకున్నారు.

తెల్లవారేసరికి పువ్వులన్నీ విచ్చివుంటాయి.

ప్రొద్దుటిపూట తోట ఎంత బాగుంటుందో!

ఆ పువ్వుల వాసన తల్చుకుంటేనే ఆమెకు వింత మత్తు కలిగింది.

ఏనాడు ఆమెహృదయం మల్లెపూలతో స్నేహం చేసుకుందో కాని, మల్లెపూలను చూచినప్పుడల్లా ఆమెహృదయం వుప్పొంగిపోతుంది...

తోటలోనికి వెళితే...

అమ్మయ్య!...

ఒక్క గంటసేపైనా ఈ కలవరాన్నంతా మరచిపోయి విశ్రాంతిగా వుండవచ్చు...

* * *

బాబు వచ్చాడు.

'అమ్మా, తలనొప్పిగా వున్నదే...'

నుదుటిమీద చెయ్యివేసి చూసింది కాంత. మసలిపోతూంది.

'పడుకో బాబూ! జ్వరం వచ్చినట్లుంది!!'

బాబును పడుకోబెట్టి డాక్టరుకు కబురు చేసింది.

'అమ్మా! ఎక్కడికీ వెళ్ళకు!—ఇక్కడే వుంటావు కాదూ?'

'ఎక్కడికీ పోను బాబూ! ఇక్కడే వుంటాను!'

అక్కడే కుర్చీలో చతికిలబడింది.

ఈ జ్వరం అనుకోకుండా ఈవేళే రావాలా?

ఏమో! ఇది కాకపోతే ఇంకేదైనా అడ్డు వచ్చి వుండవచ్చు.

ఎంత ప్రయత్నించినా ఈ బంధనలోనుంచి తప్పించుకోలేదు. పాపం! రాణి తనకోసం ఎదురు చూస్తూ వుంటుందేమో?...డాక్టరు వచ్చి చూసి మందిచ్చివెళ్ళేడు.

ప్రమాదమైన జ్వరమేమీ కాదు. సాయంత్రానికి తగ్గిపోవచ్చు.

బాబు నిద్రపోయాడు.

కాని ఈపాటికి రాణి వెళ్ళిపోయివుంటుంది.

* * *

రమణమ్మ వచ్చింది:

'ప్రక్కఇంటివాళ్లు మళ్ళీ నిన్నరాత్రి మన చెట్టు అరటాకులన్నీ కోసుకున్నారు!'

'పోనీలే, వారింటికి రాత్రి మళ్ళీ చుట్టాలొచ్చారేమో'

'మళ్ళీ ప్రొద్దున్న ఎంగిలాకులన్నీ మన దొడ్లోనే పడేశారమ్మా'

రమణమ్మ ఉద్రేకం ఆగడంలేదు.

'పోనీలే. పనిమనిషిని ఎత్తమను'

'ఎప్పుడూ ఇంతే. మీరు వూరుకునేకొద్దీ వాళ్లు ఇంకా చేస్తారు.'

ఊరుకోక ఏం చెయ్యాలి! వాళ్లతో పోట్లాడాలా? అది తనకు ఈ జన్మలో సాధ్యమయ్యే పని కాదు.

రమణమ్మ తన ఉద్దేశ్యం చెప్పేసింది.

'ఏమైనా సరే నమ్మా. ఇవ్వాళ మీరు అడిగితే అడగండి. లేకపోతే నేను పోరు చేసుకోక తప్పదు.'

కాంత అదిరిపడింది.

రమణమ్మ అనుకున్నది మార్చడం ఎవరికీ చాత కాదు. ఆవిడ ఈ తీర్మానానికి ఫలితం ఏమిటో కాంతకు బాగా తెలుసు. ఇటు రమణమ్మ ఒక్క నోరు చేసుకుంటే అటు వారు పదినోర్లు చేసుకోవడం, ఈ గొడవ భరించలేక ప్లీడరుగారు తనమీద విరుచుకు పడడం.

ఇది మామూలే.

'రమణమ్మా!'

ఊహుఁ! ఆవిడ అప్పుడే దొడ్లో యుద్ధం ప్రకటించింది. ఇంక ఎంత అరచినా ఆవిడకు వినిపించదు. చెవిటివానిముందు శంఖం ఊదినట్లే.

వీధిపై నుంచి ప్లీడరుగారి కేకలు వినబడుతున్నాయి.

'ఏమి టాగోల? ఇల్లా, చేపలబజారా!'

—ఇదీ వరస.

ఈ గొడవలోనుంచి తప్పించుకొని ఎక్కడికైనా పోవాలనుకుంది. కాని వంటయింటికీ, కచ్చేరి సావిడికీ మధ్య వున్నది ఒక్కటే గదికాబట్టి అక్కడే ఆగిపోవలసివచ్చింది.

* * *

తుఫాను అణిగింది.

పరధ్యానంగా ఏదో పుస్తకం చేతితో పట్టుకుంది.

తనకు తెలియకుండానే పేజీలు త్రిప్పుతున్నది.

కాని ఏమీ అర్థమయ్యేట్లు లేదు.

'నా రేజరు బ్లేడు చూశావా?'

ఉలికిపడింది.

ఎప్పుడూ ఇంట్లో ఏమూల చూసినా రేజరు బ్లేడులే వుంటాయి. కాని ప్లీడరుగారికి కావలసినప్పుడు మాత్రం ఒక్కటీ కనబడదు! రోజూ చూస్తున్నా ఈ విచిత్రం కాంతకు వింతగానే వుంటుంది.

'నా కెందుకండీ మీ బ్లేడు? ఏమన్నా కూరలు తరుక్కుంటానా?' అని మెల్లిగా అనుకున్నది. ప్లీడరుగారు బీరువాలోని పుస్తకాలన్నీ తీసి ఒక్కొక్కటే క్రింద గిరవాటువెయ్యడం మొదలుపెట్టేరు.

'అచ్చే! పుస్తకాల బీరువాలో ఎందుకుంటుందండీ!'

'నీ కెందుకు? నీవు వెతక్కపోగా పైగా—'

మాట్లాడకుండా వెళ్ళిపోయింది... తను బ్లేడ్ వెతుక్కువచ్చేసరికి ప్లీడరుగారు బీరువా ఖాళీచేశారు. బ్లేడ్ చేత్తో పుచ్చుకుని అద్దంముందుకు వెళ్లారు.

అమ్మయ్య!

మళ్ళీ పుస్తకం తీసుకోబోయింది.

'నా జేబురుమాలు చూశావా?'

చూడలేదు. కాని ఇప్పుడు చూడాలి. ఎక్కడ వున్నదని?

ప్లీడరుగారు సణుక్కుంటున్నారు.

'నెలకు రెండుడజన్లు కొనుక్కుంటాను. సమయానికి ఒక్కటయినా—'

అలమారలోని ఇస్త్రీబట్టలు, బుట్టలోని మాసిన బట్టలు, అన్నీ బయటికి వచ్చినతర్వాత—జేబురుమాలు ప్లీడరుగారి జేబులోనే దొరికింది!

'నా చెప్పు లేవీ?'

చెప్పులు బహుశా మేడమీద పడకగదిలో దొరకవచ్చు. రోజూ అవి అక్కడికి ఎలా వెళుతాయో మాత్రం ఎవ్వరూ చెప్పలేరు.

ప్లీడరుగారు మొదలుపెట్టేరు.

'ఎవరూ నా సంగతి కనుక్కునేవాళ్లే లేరు! కొంచెం ఇవన్నీ చూడకూడదూ, పుస్తకం చేతితో పట్టుకొని నిద్రపోకపోతే?'

ఇది మామూలుపాఠమే. ఇదంతా కాంతకు కంఠతా వచ్చును.

రోజురోజూ జాగ్రత్తగా వుండాలని అనుకుంటుంది.

రోజురోజూ మరిచిపోతూ వుంటుంది...

వీధి తలుపు ఫెడేలుమని చప్పుడయింది.

ఇల్లంతా అరణ్యంలాగ వున్నది. చుట్టూ ఇస్త్రీ బట్టలు, మాసిన బట్టలు, పుస్తకాలు, న్యూస్ పేపర్లు—మధ్యన చతికిలబడింది. అవన్నీ తన్ను చూసి నవ్వుతున్నట్లు వుంది. తనకూ నవ్వువచ్చింది. ఏదో కోర్టు అనీ, ఆఫీసనీ వుండబట్టి సరిపోయింది. కాని, ఈ మగవాళ్ళు ఇగనైనా నాలుగు గంటలూ ఇంట్లోనే వుండేటట్లయితే!...

నవ్వుకుంటూ లేచి ఇల్లంతా సర్దుకుంది.

వెళ్లి, బాబువగ్గర కూర్చుంది.

ఎండ మాడిపోతున్నది. తోటలో చెట్లన్నీ ఈ యెండను తట్టుకోలేక, తప్పించుకు పోలేక, వాడిన ముఖాలతో ఆయాసపడుతున్నాయి. చివరకు అలసిపోయి ఈ యెండలో ప్రాణాలు నిలుపుకోలేమని నిరాశతో తలలు వాల్చుకున్నాయి.

అప్పటికి సూర్యుడు దయదల్చి చల్లబడ్డాడు.

* * *

మధ్యాహ్నంనుంచి రమణమ్మగారి గొంతు వాగుతూనేవుంది.

'కొళాయిగొట్టం విరిగిపోయింది. నీళ్లన్నీ ఇల్లంతా నిండిపోతున్నాయి'

'వంటఇల్లు చెరువులాగ వున్నది. ఒక్కసారి వచ్చి చూడమ్మా!'

'స్టోరురూము తలుపు బిగుసుకుపోయింది. ఎంత తోసినా రావటంలేదు...'

'పాలన్నీ పిల్లి తాగిపోయింది. ప్లీడరుగారికి కాఫీలేదు!'

'బాబుకు జావ కావాలి. గోధుమరవ లేదు!'

'నిన్నటినుంచి చిన్న వెండిగిన్నె కనపడటం లేదమ్మా—ఏమైపోయిందో కాని'

చిన్నచిన్న విషయాలను పెద్దపెద్ద సమస్యలుగా తయారుచెయ్యడం ఒక్క రమణమ్మకే చాతనవును.

అయినా ఈ చిన్న విషయాలే ఎంత బాధ—ఎంత ఇబ్బంది—కలిగిస్తాయి!

సాయంత్రం మబ్బుగా వుంటే, వర్షం కురుస్తుందేమో ననుకుంది. కాని మబ్బులన్నీ విడిపోయి వెన్నెల వచ్చింది.

డాబామీద నక్షత్రాలకేసి చూస్తూ పడుకుంది.

తెల్లవార్లూ అల్లాగే చందమామనూ, నక్షత్రాలనూ చూస్తూ గడపగలదు.

రోజూ చూస్తూవున్నప్పటికీ వీటి ఆకర్షణ తగ్గదు.

అబ్బా! ఈ వెన్నెల ఎంత హాయిగా వుంది!

నీలి పట్టుచీరమీద జరీపువ్వుల్లాగ ఈ నక్షత్రాలెంత బాగున్నాయి?

'ఇక్కడున్నావా!' ప్లీడరుగారి గొంతు.

'బాబుకు జ్వరం తగ్గింది కాదూ?'

'ఆ! చెమట్లు పోస్తున్నాయి. నిద్రపోతున్నాడు'

ఏమీ తోచక ఆకాశంకేసి చూస్తూ కూర్చున్నారు—కాసేపు.

'చూడు, ప్రొద్దున్న అనవసరంగా విసుక్కున్నా'...

శాంత చిరునవ్వు నవ్వింది.

—తెల్లవారే వరకూ ప్లీడరుగారు పరమశాంతమూర్తి!

'ఎందుకు నవ్వుతావు?...చూడు! రేపటినుంచి ఒక్కమాటైనా అంటే ఒట్టు.'

రేపటినుంచి!

'రేపు!' శాంతహృదయం ఒక్కసారిగా ఉత్సాహంతో ఉప్పొంగింది. తెల్లవారుతుంది. రేపు వస్తుంది. ఇవ్వాళ చెయ్యలేని పనులెన్నో రేపు చెయ్యవచ్చు. రేపు మల్లెతోటకు వెళ్ళవచ్చు. రేపు వీణ వాయించుకోవచ్చు. మరచిపోయిన పాటలన్నీ మళ్ళీ జ్ఞాపకం చేసుకోవచ్చు. ఈ ఆశతో ఆమెహృదయం తృప్తిపొందింది.

నిన్న......ఇవ్వాళ......రేపు...

వీటిలో నిజంగా ఏమీ తేడా లేదు.

అయినా 'ఈవాళ' గడచిపోయిందని నిట్టూర్పు; 'రేపు' వస్తుందని ఆశ.

కాని ఈ రాత్రి, ఈ చల్లదనం, ఈ ఆశే లేకపోతే!

ప్రాణపూజ

(ఏకాంక రూపిక)

✽

– శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి –

ఆముఖము

అడరు పగలవేల? ఆరని వగ లేల?
నిండుహృదుల విషపు కుండ లేల?
ఎదిరి ప్రేమ గెలిచి హృదయ మిచ్చినవేళ
స్వర్గసీమ భువికి వ్రాలకున్న?

౧ దృశ్యం

[బింబిసారపుత్రుడు అజాతశత్రువు రాజ్యకాలం. రాజధాని పాటలీపుత్రంలో ఒక ప్రాతఃకాలం. అజాతశత్రుమహారాజా నిండుకొలువు. పురోహితుడు రామేశ్వరభట్టూ, మహామంత్రి ధర్మగుప్తుడూ చెరి ఒక పక్కా కూర్చున్నారు. సామంతులూ, దండనాథులూ, ఇత్యాదిపరివారం ...]

రాజు — మహామంత్రీ, మన క్రతుయత్నాలు......

ధర్మ—అన్నీ సిద్ధమైనాయి ప్రభూ! నదీతీరంలో విశాలపర్ణశాలలు ... హోమమంటపాలు...ఋత్విజుల లెక్కల ప్రకారం ...సర్వం సిద్ధం చేయించాను.

రామే — వేదధర్మ ప్రతిష్ఠాపకులై ప్రభువులు మహాక్రతువు తలపెట్టడమూ... అందులో లోపమూనా? హ హ్హ హ్హ...... 'శ్రీధర్మరాజులుంగారి రాజసూయ మయ్యా ఇది' అనాలి ప్రజ లందరూ.

రాజు—(పొంగే సంతోషంతో) ఇదంతా గురుదేవుల అనుగ్రహం. శ్రీ వేదమూర్తులు రామేశ్వరభట్టారకులు యజ్ఞనిర్వాహకులై...వ్యవహరిస్తూండగా జేగీయమానంగా యజ్ఞం ప్రవర్తిల్లడం అబ్బురమా?

రామే — ఇందులో, నా ప్రకర్ష కంటే ... చిత్తగించారూ, మహామంత్రులు ధర్మగుప్తులవారి కార్యదీక్ష. సహస్రాక్షులతో పనిచేస్తున్న దనడం ఎక్కువ నిజం. యావన్మంది ఋత్విక్కులూ ఇదివరకే వచ్చి సిద్ధంగా ఉన్నారు. యూపస్తంభాలు...యజ్ఞపశువులు..అవిగో..ప్రభువుల యజ్ఞసంకల్పానికి ఎదురు చూస్తున్నాయి.

(పైమాట పూర్తికాకుండా కొంచెం దూరాన బౌద్ధభిక్షుల కంఠాలనుంచి ఈ గీతం వినపడుతుంది. పాట సన్నంగా, జాలిగా ప్రారంభమై స్పష్టగతిలోకి వస్తుంది)

(దూరంగా బౌద్ధభిక్షువులు)

గీతం

శోణితపు ఝురు లేల శోకసాగర మేల
సుగత దేవుని కరుణ జగమెల్ల విరియంగ॥ శో॥

(పాటబాక్ గ్రౌండ్ మ్యూజిక్ గా సాగుతూ ఉంటుంది)

రామే—(ఆత్రంగా...దెబ్బతిన్నట్టు) మహారాజా ... ఏమహావృక్షాన్ని నరకినా...దాని బీజాలుమాత్రం...

రాజు — (వింతగా ... చెవి ఒగ్గి) ఉండండి ... ఎక్కడి దీ పాట? (సన్నని పాట మళ్లా స్పష్టమవుతుంది)

కసితోడ నెనరేగు విసపుజీవన మేల ?
కుసుమహృదిలో...అనలవసతి
పొసగనిదోయి !॥ శో॥

రామే — (కోపంతో వణకిపోతూ) ధిక్కారం... రాజశాసనధిక్కారం...అజాతశత్రుమహారాజపాలిత భూమిలోనే ...అనుశాసనతిరస్కారమా? ఏమిటా...వైపరీత్యం...

రాజు — (నెమ్మదిగా పొంగే కోపంతో) మహామంత్రీ, వింటున్నావా?

ధర్మ — (ఆందోళనగా) చిత్తం ... చిత్తం.

రాజు— రాజశాసనక్రూరసర్పంతో ఎవరికయ్యా ఈ క్రీడాసక్తి? వేదధర్మప్రతిష్ఠితభూమిలో ఈ నాస్తికకీటకాలకు(గొంతు హెచ్చు)మళ్లా ప్రవేశం ఎట్లా కలిగింది?

(పాట ఆగకుండా మళ్లా వినపడుతుంది)

ధర్మదేవుని పాదతలము చేరువ త్రోవ
దుఃఖమయజీవితము తొలగించుకొనిపోవ॥శో॥

రాజు — (కోపంతో కదలిపోతూ) మహామంత్రీ!...కర్తవ్యం బోధపడలేదా?

ధర్మ —(అలజడిగా) మహాప్రభూ! అరుగో దండనాయకుని ఒక్క చురుకు చూపుతో, నలుగురు రాజభటులు ... పాట వినవచ్చే దిక్కుకు పరుగు పెడుతున్నారు. క్షణంలో అపరాధులు ప్రభువుఎదుట ఉంటారు.

రాజు—మం...చి...ది.

(త్రుటి నిశ్శబ్దం...దండనాథుడు రుధిరమిత్రుడు ...ఇద్దరు బౌద్ధభిక్షులను ఎదుట నిలుపుతాడు. భిక్షులు నిశ్చింతగా...శాంతంగా రాజువైపు చూస్తున్నారు.)

ధర్మ — మహారాజా! ఇరుగో దండనాథుడు తీసుకువచ్చిన అపరాధులు బౌద్ధభిక్షుకులు...

రాజు —(అసహ్యంగా) ముండితశిరస్కులూ, కాషాయధారులూ, వేదనిందకులూ మళ్లా నేటికి నా భూమిలో ప్రవేశించారా? సరే ... రుధిరమిత్రా — ఎక్కడ పట్టుబడ్డారు...వీరు?

రుధిర—ప్రభూ! మన పడమటిగవనుకు దగ్గరగా ఉన్న చైత్యంముందు ధూళి దులిపి ... నీరు చల్లి బుద్ధదేవుని—అఁఅఁ... (నాలిక కరుచుకుంటాడు)

రాజు—భయం లేదు. పూర్వం అలవాటు. తర్వాత?...

రుధిర— (తేరుకొని)...పాదాల వద్ద పువ్వులుంచి పాడుతున్నారు. పట్టుకున్నాము.

రాజు—(గంభీరంగా)గురుదేవా!...

రామే—చిత్తం ... వారి ఉదంతం తెలిసికోవలసి ఉంది. (భిక్షుకులతో) ఏమయ్యా, ఈదేశంలో బౌద్ధధర్మప్రచారం గాని, బుద్ధార్చనగాని, తుదకు గౌతమనామ స్మరణంకూడా నిషిద్ధమని తెలియదా?

౧. భిక్షుకుడు—మాది దక్షిణాపథం. శ్రీ శాక్యముని పుట్టిన పవిత్రభూముల్ని చూచి కన్నులనూ, చైత్యములను తాకి శరీరములనూ పరమపవిత్రములు చేసుకొందా మని అనేకశ్రమలకు లోనై ఈ దూర దేశానికి వచ్చాము.

౨. భిక్షుకుడు—గౌతమదేవుని పాద ధూళికి ఎక్కువపాత్రమైన ఈదివ్యభూమిలో బింబిసారచక్రవర్తి ప్రగాఢభక్తి, అద్భుతా రాధనా పేరుపడ్డ ఆయనరాజ్యంలో తథా గతప్రభువుతలపే అపచారమా ? ఏమి దారుణమయ్యా ఇది?

రామే — (ఈసడింపుగా) వేద భూయిష్ఠమైన పవిత్రఆర్యావర్తాన్ని నిర్వీ ర్యమూ, కర్మహీనమూ చేసి, నపుంసక మతాన్ని స్థాపించిన నాస్తికబ్రువుని పేరు ఈ అజాతశత్రుపాలితభూమిలో ఉచ్చరిస్తే ప్రాణాలు దక్కవని ఇప్పటికైనా తెలుసు కోండి...

రాజు — సరే ... ఈ భిక్షుకులు వైదేశికులు గనుక ప్రస్తుతం వీరిని మన దేశపు సరిహద్దులు దాటించి విడవండి. మరల మన దేశంలో ఎక్కడ కనపడినా మరణ దండనం తప్ప దని చెప్పండి.

రుధిర—చిత్తం. (భిక్షులతో)...రండి ...(గమనం)

రాజు—మహామంత్రీ ! ఈసారి పల్లె పల్లెలా, దేశమంతటా ఇట్లా స్పష్టంగా చాటించు: 'విదేశస్థులైనా, స్వదేశస్థులైనా, ఈ దేశంలో ఎక్కడనైనా స్త్రీలుగాని, పురుషులుగాని బౌద్ధప్రచారంగాని,బుద్ధార్చన గాని జరిగించితే తక్షణం ఎట్టి విచారణమూ లేని మరణదండనం విధించబడుతుంది. ఇది శాశ్వత రాజశాసనం.'

ధర్మ — చిత్తం ... మహారాజా.

౨ దృశ్యం

[అజాతశత్రురాజాంతః పురం. సాయం సమయం. అంతఃపురపరిచారిక శ్రీమతి, యువతి. ఒక కఠోర దీక్షలో ఉన్నట్టు కనపడుతుంది. అత్యుత్సాహంగా పాడుతూ...గబగబ రాజమాత సునందాదేవి ప్రాసాదం లోకి వస్తుంది.]

శ్రీమతి—

గీతం

నేడే నేడే...ఈనాడే......
మహాప్రభువు జన్మదినోత్సవము ॥నే॥
శాక్యమునీంద్రుని జయంతియై
విశాఖపూర్ణిమ వెలిగింది...
దిశల దిశల దుర్దశ ముంచెత్తే
హింసాతమస్సు లెగసినవి —
మునిగిసినవి॥ నే॥

రాజమాత — హుష్ ! ఆగు. శ్రీమతీ! ఏమిటీ? ఈ ఉత్సాహంలో ఒడలు తెలియడంలేదు నీకు...ఆ పాట లేమిటి? ఈ వేష మేమిటి ? తెల్లని వస్త్రాలతో స్వచ్ఛ శరీరంతో అప్పుడే సరస్సులో వికసించిన శ్వేతపద్మంలా,కైలాసంవైపు ఎగిరే హంసలా ఉన్నావు. అదేమి టాచేతిలో ... బంగరు పళ్లెరంనిండా ఆ జ్యోతు లేమిటి ? అన్ని వందల మల్లెపువ్వు లెందుకోసం ? ఏమి టీ ప్రయత్నం? ఎక్కడి కీ ప్రయాణం?

శ్రీమతి — (అలజడిగా) అమ్మా, పిలుపు వచ్చింది...పిలుపు. శాంతగంభీరమైన ఆ విశ్వగురువుమధురకంఠం మీాకు వినపడ

లేదా? ఉదయంనుంచి నా చెవుల్లో ఒక పేరొద ... నా పాదాలు నిలవకుండా ఏవైపు నకో లాగుకొని పోతున్నాయి.

ఈ రోజున శ్రీ బింబిసారప్రభువు తిరిగి వచ్చి రాజ్యం ఏలుతున్నారేమో అన్నంత స్వేచ్ఛగా ఉంది నాకు. ఈవేళ శ్రీబుద్ధజయంతి...తల్లీ!

రాజమాత—ఓహో ... ఔను ... (పెద్ద నిశ్వాసం విడిచిన చప్పుడు) పిచ్చిపిల్లా! ఊరుకో, ఏం లాభం? గత స్మృతులు తవ్వి బాధపెట్టకు...బాధపడకు...ఇప్పుడు రాజ్యమెవరిదో, కాలమేదో జ్ఞాపకం ఉందా? ఈనాడు గట్టిగా గౌతమనామస్మరణం చేస్తివా తల ఎగిరిపోతుంది—

ఆహా...కాలం ఎంత తలక్రిందులైందీ! ...ప్రాణేశ్వరులు జీవించిఉన్న కాలంలో—ఈ దినాన పాటలీపుత్రం ఎంత ఉత్సాహతరంగితంగా, పూజోత్సవబహుళంగా పొంగిపోయేదీ...ఇప్పుడు శ్రీఘనదేవుని పేరు పెదవిదాటి వినపడిందా — మరణదండనం. రెండూ విస్పష్టంగా నాకళ్లకు కనబడుతున్నాయి. విధివిలసితం!...

శ్రీమతి—తల్లీ! రాత్రి నాకు వింత కల...హఠాత్తుగా మహారాజసభాభవనంలో ఉన్నాను. సభాభవనమంతా చీకటి — చాలా భయం వేసింది. క్రమంగా ఒకవైపు, సూర్యోదయానికి ముందు ఆకాశం భగ్గున వెలిగినట్టు ఒక కాంతిపుంజం బయలుదేరింది. చూడలేక కళ్లు మూసుకుని తెరిచి చూచాను. ధర్మాసనంమీద శ్రీ బింబిసార ప్రభువు!...నా ఒడలు ఝల్లుమంది. మళ్లా ఎన్నాళ్లకు మా ప్రభువు...వెక్కి వెక్కి ఏడ్వబోయాను. గొంతు పెగలలేదు. ప్రభువు ముఖంలో ముత్తెము చిరునవ్వు లేదు. గంభీరముద్ర...

రాజమాత — (గద్గదికతో) ధన్యురాలవు...శ్రీమతీ...నీస్వచ్ఛప్రభుభక్తికి ఫలితంగా శ్రీవారి దర్శనం నీకు లభించింది. తరువాత?

శ్రీమతి — ప్రభువు నాల్గువైపులా కలయజూచి ఎవరినో పిలిచారు. ఎవ్వరూ మారు పలుకలేదు. నవ్వుకున్నారు. ఆ నవ్వులో ఒక విషాదపునీడ ఆడింది.

వెదకినట్లు నన్ను చూచి చిరునవ్వుతో ఏదో అన్నారు. అంతే ... మరుక్షణంలో అక్కడ సింహాసనమూ లేదు, ప్రభువూ లేరు. ఒక నిర్మలజలసరోవరం. దాని మధ్య వేయిరేకుల పెద్ద తెలితామరపువ్వు. నడుమ కోటిచంద్రప్రకాశమూర్తి శ్రీ గౌతమప్రభువు. ప్రశాంతవిశాలనేత్రాలతో ధ్యానముద్ర విడచి నావైపు చూచారు. నన్నొక వెన్నెల ముంచింది. దానితో నేను నేను కాదు. నాలోని భయం, అసహాయత్వం, అబలాత్వం దిగజారిపోయి ఒక ఆవేశం, ఆనందం, ఆత్మశక్తి నన్నలముకొన్నాయి...తిరిగిచూస్తే అక్కడ సరస్సు లేదు. మన ఉద్యానవనంలో ప్రభువు స్త్రీల ఆరాధనకోసం కట్టించిన చలువరాతి బుద్ధాలయం దీనంగా నిలిచిఉంది.

కలహంస కైలాసానికిలా నా బ్రతుకు ఆ గౌతమాలయానికి ఎగిరిపోతున్నది. ఆపలేను తల్లీ!

రాజమాత— (జాలిగా) వెర్రితల్లీ! వద్దు, వద్దు. సాహసింపకు. నీ కోమల

జీవితాన్ని రాజశాసనాగ్నికి ఆహుతి చెయ్య డం. నేను సహించలేను. నీ పవిత్రజీవిత దీపశిఖను చేతులారా ఆర్పి ఈ అంతః పురాన్ని విచారమలినం చెయ్యకు. ఏం ప్రయోజనం? అమ్మాయీ! ఒక్కమాట విను. పూర్వం గౌతమప్రభువునూ, అహింసా మృతాన్నీ కన్న కాలదేవియే అజాతుణ్ణీ, వేదమతావేశాన్నీ ప్రసవించింది. ఆమె ప్రచండశక్తికి ఎదురు నిలిచి హతులయ్యేకన్న ఆమెప్రసన్నపరివర్తనానికి నిరీక్షించడం మంచిది కాదా?

శ్రీమతి — అమ్మా, మీమాట కాదనలేను. కాని...ఆ కాలశక్తియే నన్ను గూడా ప్రభుసేవకు గెంటుకొని పోతున్న దేమో...జీవితంలో ఇతరప్రయోజనాలు సాధించదలచినవారు కొన్నిటియెడల ఉపేక్ష వహించగలరేమోకాని ... నా జీవనలక్ష్య మంతా ఒక గౌతమదేవునిపైపే అయిన ప్పుడు నేను నిలిచి ఏమి సాధించినట్టు?... సెలవు...నన్ను...ఆశీర్వదించండి. (నడుస్తూ ఉంటుంది.)

రాజమాత—శ్రీమతీ!...నా మాట విను...సాహసం వద్దు. అయ్యో!... సాగి పోతున్నావా ... రాజాజ్ఞకు హృదయం లేదుసుమా!

శ్రీమతి— (దూరమైన మాటలు) అమ్మా ... మన్నించండి. ఇప్పటికే ఆలస్య మయింది. సంధ్యాసూర్య కిరణాలు ప్రాసాద శిఖరాలను తుదిసారి వెలిగించి మాయ మవు తున్నాయి. అదిగో...శివాలయంలో అటు రుద్రదేవుని సంధ్యాపూజల ఘంటాధ్వానం.. (గంటలచప్పుడు) ఇటు బుద్ధదేవుని మాన ప్రేమాహ్వానం..నడుమ...నేను...సెలవు... సెలవు.

పొదలపొదల పూవులు హర్షంతో
విచ్చి సేవకై వచ్చినవి —
ప్రమోదమేనులో పులకరింపులై
అసువులు పూజాకుసుమములో ॥నేడే॥
రా రమ్మా, ఇటు రా రమ్మా,
అంతఃపుర కాంతామతల్లులు -రారమ్మా,
శాక్యమునీంద్రుని జయంతి నేడు
చేరుడు శ్రీఘను సేవలకై ॥నేడే॥
(పాటతో నిష్క్రమణ)

(మహారాణి అమితాదేవి అంతిపురికి దారి తీస్తుంది)

అమితాదేవి—(అలంకరించుకొంటూ హడలిపడి) అమ్మయ్యో, శ్రీ...ఏమిటిది? ప్రాణం...ప్రాణం ... ఆశలేదా? ఈ దినం ఏమి టీ సాహసం? ... మనస్సు కుదురు తప్పిందా?

శ్రీమతి—(శాంతంగా,ఉత్సాహంగా) మహారాణీ! మనస్సు నిండుగా ఉంది. ఆనందంతో మాత్రం అవశనై పోతున్నాను. ఈవేళ శ్రీ బుద్ధజయంతి తల్లీ... వస్తారా!

అమితాదేవి—(భయంతో)ఆఁ, ఆఁ! ...గట్టిగా ... అనకు. ఎక్కడ ఉన్నావో మరచిపోకు.

శ్రీమతి — మరచిపోయిన అంతః పురానికి ఈ పవిత్రదినంమాట జ్ఞాపకం చెయ్యడానికి వచ్చాను తల్లీ.

అమితాదేవి— నీకు పిచ్చి. సందేహం లేదు. అయ్యో! రాజవైద్యులకు వర్తమానం వెడితే ఎంత బాగుండును.

ఎంత బుద్ధి! ఎంత వినయం! ఇంతలో ఇంత దారుణసాహసం ఎట్లా వచ్చింది? ఎవరినోటి నుంచి ఐనా ఈమాట మహారాజుచెవిని పడితే నీ ప్రాణమే కాదు, మా ప్రాణాలు కూడా దక్కవు...వెర్రిదానా!

శ్రీమతి—అమితాదేవీ! అన్నిరాజ శాసనాలకూ, కరుకుకత్తులకూ అతీతమైనది తల్లీ! బుద్ధదేవుని బోధామృతం...

అమితాదేవి—శ్రీ ... జాలి పడు తున్నాను. ఏమీ చెయ్యలేను. మంచి పిల్లవు. ఏదో చిత్తభ్రమలో ఉన్నావు. కఠినరాజ శాసనం. నలిగిపోతావు. మహాప్రమాదం.

శ్రీమతి — మహాప్రసాదం... వెళ్లి పోతున్నాను. మహారాణీ! (పాడుకుంటూ రాజపుత్రి...అరవిందాదేవి భవనంలోకి)

రావమ్మా, ఇటు రావమ్మా
ప్రాణసఖి...ఓ...రాజకుమారీ! రావమ్మా
ఉత్తమభువిలో సత్తైరు వానలు
ఆపిన దేవుని ఆరాధనకై ॥రా॥
నేడే నేడే ఈనాడే
శాక్యమునీంద్రుని జన్మోత్సవము—
ఈనాడే॥ నే॥

[అరవిందాదేవి ఈరెండలో...ఒక పుస్తకం చదువుకుంటూండగా]

శ్రీమతి — అమ్మా, అరవిందాదేవీ, శ్రీ బుద్ధజయంతి తల్లీ... ఈరోజు.

అరవిందాదేవి—(ఉలికిపడి...పుస్తకం కిందపడ్డ చప్పుడు) శ్రీ!...వద్దు ... వద్దు... ఆపే రెత్తకు...రాజశాసనమహారథానికి అడ్డంగా నిలవలేవు నా మాట విను. శాస నోల్లంఘనపు ఆఘాతానికి నువ్వు తొలి బలి కావడం నేను చూడలేను. శ్రీ...విను. నాకోసం... ఈసాహసం మాను.

శ్రీమతి — అమ్మా, మీ ప్రేమకు కృతజ్ఞురాలిని. అన్ని ప్రతికూలశక్తుల్నీ ఎది రించి తొక్కుకొనిపోయే బలం ఆ తథాగత ప్రభువు నాకు అనుగ్రహించారు. అదిగో దివ్యశంఖం వినపడుతూన్నది. సమయ మాసన్నమైంది...ప్రభుసేవకు. గాఢంగా బోధించే అంతర్వాణికి వ్యతిరేకం చెయ్య లేను...ఈ పువ్వులు...జ్యోతులూ — ధర్మ దేవుని సేవకు ఎంత తొందరపడుతున్నాయో చూచారా! వెడుతున్నాను తల్లీ...ఉత్తమ కార్యానికి...మీచెలిని ప్రోత్సహించండి... మీ రెవ్వరూ రాలేరు...నా విధి నెర వేర్చాను. మీరు అంతఃపురి సుకుమార స్త్రీలు...నాలో అబలాత్వం పోయింది. నే నేమీ కానేమో...ఒక్క బుద్ధదేవుని పాద పూజాకుసుమాన్ని తప్ప. ఈ ఆత్మార్పణమే పరిశుద్ధమైతే వేయి అనుయాయుల్ని సృష్టి స్తుంది.

అరవిందాదేవి — (ఆందోళనగా) శ్రీ... వెళ్లకు. వెళ్లకు...నిష్కారణంగా... ఉత్తరక్షణంలో...నువ్వు అనుభవించే నిశిత దండనం ఊహించలేకుండా ఉన్నాను. ఆఁ, వెళ్లిపోతున్నావా?... అప్పుడే రాజభవనమే దాటిపోయావా? ఆగు. నేనూ వస్తున్నాను. నీప్రాణం ఆపగలనేమో... ఉండుండు.

(తొందరగా అనుసరిస్తుంది.)

3 దృశ్యం

[అంతఃపురానికి దగ్గర ఉద్యానం. దాని మధ్య చలువరాతి బౌద్ధాలయం. ఎదుటి చెట్లగుబురులో ఇద్దరు రాజభటులు కత్తులతో కాపలా]

ఒకడు—వజ్రపాణీ! ఏమి టా పరధ్యానం...కత్తి సూటిగా పట్టుకో.

వజ్రపాణీ—(నవ్వి) దండపాణీ! నిన్న కాక మొన్న కన్ను తెరచిన నన్నాసివి నాకు చెబుతున్నావా? రాజుగారి గుండెలాగనే నాకత్తికీ మెత్తన లేదు. ఇరవైయేళ్లనుంచి రాజుగారి ఆజ్ఞల్లో పండిపోయిన కత్తి ఇది... కాని—

దండపాణి—కాని?...

వజ్రపాణీ—(ఆలోచనగా) ఈదినం వైశాఖం పున్నమిరా...ఊం.

దండపాణి—అయితే?

వజ్రపాణి — (విసుకుగా) ... ఎందుకులే...గాలికి చెవులుంటాయి ... దిక్కుమాలిన సేవకవృత్తి ... స్వతంత్రించి పెదవి కదపగూడదు.

దండపాణి — (కుతూహలంగా) చెబుదూ ... ఎవరున్నారుగనక ...

వజ్రపాణి — (నిట్టూర్పు) మునుపు పెద్దరాజుగారు బతికున్న రోజుల్లో ... ఈ పున్నమినాడు ఈ గుడిదగ్గర జరిగే ఉత్సవం చూడడానికి కన్నులు చాలేవి కావు. ఈ తోటంతా దీపాలతో, దీపాల్లాంటి అంతిపురి ఆడపిల్లలతో వెలిగిపోయేది. ఈ చేతుల్తో ఈ దేవుడి పూజకు చక్రవర్తివారికి ఎన్ని పూలదండలు కట్టి అందించేవాడనో. ఇప్పు డేముంది, ఆ చేతిలో కత్తి...అంతా శూన్యం ... ఆ గుడివేపు చూడు.

దండపాణి — (చూచి, అల్లజడిగా) అ దేమిటి...వజ్రపాణీ ! శూన్యం కాదు. కొంప మునిగిపోయింది. గుడినిండా దీపాలు... ఏదో పాట వినబడుతున్నది.

(దూరంనుంచి చల్లగా, జాలిగా)

గీతం

బుద్ధదేవా! ప్రేమమూర్తీ

పూతభారతసుగతీ!

దండపాణీ—పద...పద...కత్తి సవరించు. ఎవరో ప్రాణాలకు తెగించి పూజ చేస్తున్నారు. నిముసం ఆగితే ... మన ప్రాణాలు దక్కవు...ఊం, ముందుకు దూకు!

(భటుల నిష్క్రమణ)

(వెనక దూరంనుంచి...తక్కినపాట)

ఆరబోదు నీ కరుణాతేజము

హారతిస్తునా ప్రాణజ్యోతి...

(స్త్రీగొంతులో...కెవ్వున కేక...)

(నాలుగు సెకండ్లు నిశ్శబ్దం)

అరవిందాదేవి—(హఠాత్తుగా వచ్చి) అరే! బుద్ధమందిరం ... అప్పుడే దీపాలతో ధగధగ వెలిగిపోతోంది. అయ్యయ్యో! శ్రీమతీ ... సాహసించివేశావా ! ఔను. నీ దీక్షలో ప్రాణం ఒక తృణం ...

ని న్నీలోకంలో ఇంకొక్క క్షణం ఆపలేకపోయాను. మహాభారతచక్రవర్తి పుత్రిక ఒక పేదపరిచారికను కాపాడలేకపోయింది. రక్తం చవిచూచిన రాజముద్రిక ప్రేమతోపరిపాలించలేదు..వంతులుగా,అను

వైనప్పుడు ప్రజల రక్తం రాజూ, రాజురక్తం ప్రజలూ—ఇంతేనా......ఆర్షభూమినాగరిక నీతి? కోటి అనంతతృప్తహృదయాల ఏకైక ప్రతినిధివై బలిభూమికి నడచావా శ్రీమతీ!


ఓహోహో! ఆ వెలిగే ఏ పూజా జ్యోతిలో నీ ప్రాణం కలిసిపోయింది!

ఆఁ ఆఁ ...బుద్ధాలయపు చలువరాతి తెల్లని మెట్లన్నీ రక్తపంకిలం అయి దీపపు కాంతిలో ఎంత ఎరుపు కక్కుతున్నాయి! తెగిన మెడ చిమ్మనగ్రోవిలా వెచ్చని నెత్తురును ఇంకా చిమ్ముతూన్నది. మూతలు పడ్డ శ్రీమతికన్నులు...ఏ శాంత దివ్యలోకాలు చూస్తున్నారో ... జీవితమంతా ఒకే ఒక బోధనలో గడిపిన అహింసాగురువు ఎట్ట ఎదుటనే హింసాకరాళ రక్తపాతమా?

గీతం

లేదా—లేనే లేదా—లేదా
రక్తపాతములు వదలిన శాంతి—
లేదా—భారతభూమికి—లేదా
అహింసాగురువు లవతరింపరో
ఆశాగీతిక లనరో!
విశాలభారతి అశాంతి గడచి
వివేకోజ్జ్వలము కాదో, లేదా?

(పాట......సన్నంగా...కరుణంగా...ముగిసింది.)



సినిమాలు - నాటకాలు *

ప్రశ్న—కొన్నేళ్ళుగా సినిమా ప్రజల దృష్టిని వింతగా ఆకర్షిస్తోంది. సినిమాఅభివృద్ధివల్ల మన నాటకాలలోనూ, నాటకరచనలోనూ మార్పు లొచ్చాయా? సినిమా మన రంగస్థలాన్ని కళాప్రపంచంలోంచి నెట్టివేస్తుందేమో నని కొందరు భయపడుతున్నారు. ఆ మాట కెల్లావున్నా, నాటకరచన మార్పు చెందుతుందా?

భమిడిపాటి కామేశ్వరరావుగారు:—మార్పు చెందదు. సినీమాకళ కొంతవరకైనా యంత్రాత్మకం అయిపోయిందిగనక, నాటకకళకీ, దానికీ సాపత్యం తీసుకురావడంలో జాగ్రత్తగా ఉండాలి. మన రాగ నాటకాలు యాభైఅరవై ఏళ్ళల్లో చేసిపెట్టిన పనే మన టాకీలు అయిదారేళ్ళల్లో చేసిపారేశాయి. రెండింటి దినుసులూ, సాధనాలూ, లక్ష్యాలూ వేర్వేరు. దేని పని అది చేస్తే, ఒకదానివల్ల రెండోది అణగారిపోదు. వ్యక్తిత్వం నిలుపుకుంటూ ఒకదాన్లోంచి రెండోది ఏ కొన్నా ఒక కన్నా స్వీకరించినా ప్రత్యవాయం లేదు, తప్పులేదు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు:—సినీమా వచ్చాక మన రంగస్థలంలో స్ఫుటమైన మార్పేవచ్చింది. అయితే, వాటికిపూర్వం మన రంగస్థలం మంచి స్థితిలో లేదు. గొప్పగొప్ప ఇంగ్లీషుఫిల్ములు ఇటీవల మన దేశానికి ఆట్టే రావడంలేదు. అంచేత మనకు సినీమావల్ల మంచి ప్రయోజనాలు—కలుగవలసినన్ని కలగడంలేదు. మన సాంఘికఫిల్ములు చెప్పుకోతగ్గవి కావు. వాటివల్ల మన రంగస్థలానికి చెరుపేగాని, పుష్టి లేదు. సినీమాకీ, రూపకానికీ మార్గం వొక్కటి కానేకాదు. అవి రెండూ రెండు కళలు. అయితే, అవి మన దేశంలో ఒకదానివల్ల ఒకటికాక, దేనివల్ల అదే చెడుతున్నాయి కారణం మనలో సినీమా చూడతగ్గవారూ తక్కువే, రూపకం చూడతగ్గవారూ తక్కువే. కనక, సినీమావల్ల మన రంగస్థలం చెడుతుం దనేదాన్ని అరిష్టాలని మనం తాపత్రయపడవలసిన అగత్యం ఏమీ లేదు. మనం చెయ్యవలసినదల్లా రూపకాలు చూడతగ్గ ప్రియులను తయారుచేసుకోవడము. ప్రేక్షకుల యోగ్యత పెరిగితే రూపకాలు మంచివి వస్తాయి. నటులూ తగినవారు బయలుదేరుతారు. సినీమా సినీమాగానూ, రూపకాలు రూపకాలుగానూ విడిపోయి దేని కది బాగుపడతాయి. నిలిచివుంటాయి. ప్రయోజనకారులు కూడా అవుతాయి.

అవధానిగారు:—అసలు ఆంధ్రులకు రంగస్థలాలనేవి ఉంటేకదా, సినీమాలవల్ల దెబ్బ తినడము?

కామేశ్వరరావుగారు:—మన రంగస్థలాలు సినీమా రాకపూర్వమే పాడయిపోయాయి.

అవధానిగారు:—సినీమా వచ్చినతరవాత నాటకరచనాపద్ధతిలో మార్పువచ్చిందా?

సముద్రాల రాఘవాచార్యులుగారు:—తప్పకుండా వచ్చింది. ఇప్పటి రచయితలు ప్రతివిషయము సూటిగా చెప్పడము అలవాటుచేసుకుంటున్నారు. తరవాత ప్రతీభావమూ వ్యక్తమయ్యేటట్టు చేస్తున్నారు. అలాగే, పూర్వంలాగ కాకుండా ఎవళ్ళో వొక్కళ్ళు సూత్రధారులు వుండి సినీమాలలాగే నాటకాలుకూడా ప్రదర్శిస్తున్నారు.

నాగేంద్రరావుగారు:—ఇదంతా పేరుకు మాత్రమే కాని ఇంకొకందుకు కాదు. నిర్మాతలూ,

---

* ఆలిండియా రేడియో-మద్రాసు కేంద్రము వారు గడచిన విజయదశమినాడు నడిపిన నాటకరచయితల గోష్ఠి ఉపన్యాసాలలో మరిభాగము.

థియేటర్లే కాదు, సినీ టెక్నిక్ కూడా రంగస్థలంపైకి ప్రవేశిస్తోంది. పాటలలోనూ, స్వగతాలలోనూ ప్లేబేక్ ఉపయోగిస్తున్నారు.

కామేశ్వరరావుగారు :— కాని, మన సినీమాలు దేవుళ్ళవిషయములో తగిన పాత్రపోషణ చేయక ప్రజలకు అసహ్యత కలిగిస్తున్నాయి. ప్రజలు సినీమాలో దేవుళ్ళను చూచినతరవాత దేవునియందు ఉండే పవిత్ర భావము పోగొట్టుకొని, సినీమాలలో చూచిన పాత్రను మట్టుకు మనస్సులో ఉంచుకొంటున్నారు.

వార్లవారు :— ఉత్తమ నాటకాలున్నా, ఉత్తమనటులున్నా చాలదు. ఉత్తమ ప్రేక్షకులు కూడా అవసరం. "మతిలేని అమ్మకు గంజే పానకం" అని మనకు ఒక సామెతకూడా వుంది. మతిలేనివాళ్ళకు నచ్చేది మతిలేని నాటకమే. చెడ్డనాటకాన్ని చూడలేని స్థితికి మన ప్రేక్షకులు రావంతవరకు మనకు మంచి నాటకాలు రావడం కష్టం.

అవధానిగారు :— ఇంతకీ రంగస్థలము మంచిది ఉంటేకాని సినీమాలలాగ నాటకాల ప్రతిష్ఠ ఎక్కువ కాదు.

కామేశ్వరరావుగారు :— రంగస్థల మంటే ?

అవధానిగారు :— నాటికా ప్రదర్శనానికి ఒకవిధమయిన ప్రదర్శనస్థలం అవసరము. నాటిక ప్రదర్శించడానికి దానికి సంబంధించిన పరికరాలతో కూడిన రంగస్థలము అవసరము. తెలుగుదేశములో సినీమాలకున్నట్లుగానే నాటకాలకి థియేటరులు లేవు.

కామేశ్వరరావుగారు :— ఇప్పుడు రాసిన నాటకాలకి ఆడటానికి రంగస్థలాలే లేవంటారా ?

అవధానిగారు :— లేవు. సృష్టించాలి.

కామేశ్వరరావుగారు :— అసలు నటులు సరియైన వారుంటే కదా రంగస్థలము ?

అవధానిగారు :— బెంగాలులో శరత్‌చంద్ర చటర్జీ రాసిన 'పథేర దాబీ' కొన్ని వారాలతరబడి ఆడినది. దానికి నాటకఉత్కృష్టత మాత్రమేగాక, బెంగాలీ రంగస్థలంకూడా కొంత కారణం. మన తెలుగుదేశములో అటువంటి నాటకశాలలు లేకపోవడంమూలాన, నేడు మన దేశంలో ఏ సినీమాథియేటర్లలోనో, లేక ఏ ధాన్యపుమిల్లులలోనో నాటకాలు ఆడుతూ వుంటారు. అంతమాత్రముచేత అవి నాటకాలు కాజాలవు. తగిన పరికరములతో కూడిన రంగస్థలము లేనప్పుడు, తగిన నటులుండినా నాటికారచనయొక్క ప్రతిభను వారు ప్రదర్శనద్వారా ఎక్కువచేయలేరు. కాబట్టి నాటకముయొక్క ప్రతిష్ఠ ఎక్కువ కావాలంటే తెలుగుదేశములో రంగస్థలాలు సృష్టింపబడాలి !

కామేశ్వరరావుగారు :— ఉత్తమమైన నటులు, అంటే సాహిత్యమును బాగుగా సిద్ధింపచేయగలిగే వారు వచ్చినప్పుడే దానికి తగిన ప్రేక్షకులు తయారవుతారు.

రాఘవాచార్యులుగారు :— అన్ని నాటకాలు చూడడానికి అందరూ పనికిరారనా మీ అభిప్రాయం ?

కామేశ్వరరావుగారు :— సంగీతమందు అభిరుచి గలవారు, ఆ సంగీతముతో కూడిన నాటకమును చూడడానికి పనికివస్తారేకాని, యిటువంటి సాహిత్యనాటకాలు చూడడానికి పనికిరారు.

అవధానిగారు :— మంచి నటీనటవర్గమున్నప్పుడు అది అందరిని ఆకర్షిస్తుంది. మంచి నటుడు అంటే, తాను ఏమి చెప్పదలచుకున్నాడో దానిని బాగా అర్థము చేసుకొని, మాటలలో చెప్పి, అభినయములో చూపి సరిఅయిన అభిప్రాయాన్ని ప్రేక్షకులకు ఇవ్వగలిగేవాడు. ఇటువంటి పని ఒక్క చదువుకున్న వారికే చేతనవుతుంది అని మనము ఒప్పుకోవాలి.

రాఘవాచార్యులుగారు :— ఒక్క చదువుకొన్న వారుమాత్రమే నటనకు పనికివస్తారు, తక్కినవారు పనికిరారు అనుకోవడము పొరపాటు. పెద్ద చదువులు చదువుకోనివారిలో కూడా చాలా మంచి నటీనటులు ఉన్నారు.

రేడియో నాటకములు

రాజమన్నారుగారు :— నాటకరంగంలో కలిసి కృషిచేసిన కళాకారులూ దానికి విడిగా తోడ్పడ్డా సినీమాల

లాగే రేడియోకూడా ఉపకరిస్తోంది. రేడియో నాటకానికి ఏమైనా ప్రత్యేకత ఉందంటారా ? రచనా విషయంలో నాటకసాహిత్యంలో రేడియో నాటకాలకి ఎటువంటి స్థాన మంటుం దనుకుంటారు ?

సుబ్రహ్మణ్యశాస్త్రిగారు:—రేడియో నాటికకు ప్రత్యేకత ఉంది. ముందది చక్కని దృశ్యం కావాలి. తరవాత, క్రమంగా పరిణమించాలి. అంటే అచ్చంగా అది తెరదీసిన భాగవతం అన్నమాట. రచనలో దానికి కొత్తదారి అవలంబించాలి. రచయిత అలా చేసినా, నటులు దాన్ని పోషించగలవారై వుండాలి. అంటే, వారూ కొత్తదారి తొక్కాలి. రేడియోనిర్వాహకులున్నా కొత్తదారి తొక్కాలి. వివరాలు చెప్పాలంటే ఇక్కడ సాధ్యం కాదు. రేడియోనాటికకు కూడా రూపకసాహిత్యంలో మంచి స్థానమే ఉంది.

అవధానిగారు:—రచనవిషయంలో రేడియో నాటికకు ప్రత్యేకలక్షణాలు ఉన్నమాట వాస్తవమే. రేడియోనాటకం శబ్దప్రధానం. కథా, సంఘటనలు శబ్దంద్వారానే మనఃఫలకంలో దృశ్యాలను ముద్రించాలి. కథాగమనం పూర్తిగా శబ్దంలోనే నడవాలి. పాత్రచిత్రణ సంభాషణలలోనే సాగాలి. దేశం, కాలంకూడా శబ్దంలోనే సూచింపబడాలి. రంగ వాతావరణం కూడా శబ్దంలోనే సూచింపబడాలి. సినీమా నాటకంలోకంటే, స్టేజి నాటకంలోకంటేకూడా రేడియో నాటకంలో సంభాషణలు చాలా నేర్పుగా, రసవంతంగా నడవాలి. కారణం రేడియోనాటకానికి సంభాషణలు మినహా ఏమీ వేరే లేదు. రేడియో నాటికలో అభినయమంతా వాచికమే. ఇది రచయిత మనసులో పెట్టుకోవాలి. రేడియోనాటికలో ఉపయోగించే భాష అతిసులభగ్రాహ్యమై ఉండడం అవసరం. వినీవినగానే అర్థమై, మనసుకు పట్టి రసానుభూతిని కలిగించేట ట్టుండాలి. పాటలుకూడా యీ విధంగానే ఉండడం అవసరం. భావాలలో కూడా అన్వయిస్తాయి. ఉత్తమనాటకం రంగస్థలానికీ, రేడియోకీ కూడా సమానంగానే ఉంటుంది.

కామేశ్వరరావుగారు:—మామూలు నాటక ప్రయోగం గమనించడంలో రథానికి రెండు చక్రాలైతే, రేడియో నాటిక ప్రయోగంలో ఒక చక్రం ఉండదు. మళ్ళీ మాట్లాడితే చక్రమ్నర కూడా ఉండదని చెప్పవచ్చు. కాబట్టి ఫలితం సిద్ధింప చెయ్యడం అధమం రెట్టింపు కష్టం. నాటకరచన పట్టిగల్కి రేడియోలో ఇమడ్చడం బాధేగాని, తప్పదు. రేడియో రచనకి మరో ప్రయోజనం ఉండదు. సినిమా సంభాషణల భవిష్యం గురించి చెప్పడం అసాధ్యం. కాని, స్వతంత్ర రేడియో నాటకాలు (ఇవి దీర్ఘాలు అవడానికి ఎంత మాత్రమూ వీల్లేదు) ఉద్భవించడానికీ, అవి సాహిత్యంలో చేరడానికీ—మళ్ళీ టెలివిజన్ వచ్చేస్తే అభిప్రాయం మార్చుకోవాలేమోగాని, ఇప్పటిమట్టుకు ఆలోచిస్తే అవకాశం లేకపోలేదు.

నార్లవారు:—కొన్ని వేల సంవత్సరాల నుంచి నాటకరచన సాగుతున్నా, ఇప్పటికీ నాటక స్వరూపాన్ని గురించీ, ప్రయోజనాన్ని గురించీ, వాదోపవాదాలు తప్పడంలేదు. రేడియో నాటకం పుట్టి, పట్టుమని పాతికేళ్ళయినా కాలేదు. అంచేత అప్పుడే దీని లక్షణాలను గురించిగాని, సాహిత్యంలో దీని స్థానాన్ని గురించిగాని చెప్పడం కష్టమే. కాని స్క్రీన్ ప్లే మాదిరిగా రేడియో నాటకం గూడా సంఘంలో ఏవో కొన్ని వర్గాలని కాకుండా (ఆడవారిని మగవారిని, చిన్నవారిని పెద్దవారిని, చదువుకున్న వారిని చదువుకోని వారిని, సంస్కారం కలవారిని, అది శూన్యమైన వారిని) దాదాపు అందరినీ అలరించేదై వుండాలి. దీన్ని ఇంగ్లీషులో చెప్పాలంటే, 'క్రాస్ సెక్షన్ ఆఫ్ సొసైటీ' అది అలరించాలి. పైగా, సినీమా అనగానే, నాటకం అనగానే వాటిని చూడ్డానికి కొన్ని వందల మంది గుమిగూడతారు. ఇంతమంది ఒకచోట గుమిగూడగానే, జనసమూహానికి వర్తించే మనస్తత్వం (మాస్ సైకాలజీ) ద్యోతక తుంది. రేడియో నాటకాన్ని సర్వసాధారణంగా ఒక కుటుంబంలోనివారు తప్ప వినరు. అంచేత ఇక్కడ మాస్ సైకాలజీ పనిచెయ్యదు. వెయ్యి మందికి చెప్పినప్పుడు నవ్వు పుట్టించే హాస్యం ఇద్దరు ముగ్గురికి చెప్పినప్పుడు నవ్వు పుట్టించకపోవడం కద్దు. దాన్ని రేడియో నాటకకర్త మరచిపోగూడదు. తాను ప్రతి కుటుంబం మధ్యకు ఆ కుటుంబంలో ఒకరివలె వెళుతున్నానని

గూడా అతను మరిచిపోకూడదు. మామూలు నాటకం దృశ్యం కావడం, రేడియో నాటకం శ్రవ్యం కావడమే కాకుండా, ఈ రెండింటికీ అసలు ప్రవృత్తిలోనే ('ఎప్రోచ్‌లోనే' అన్నదానికి సరియైన మాట దొరకడం లేదు. 'ప్రవృత్తిలోనే' అని అంటున్నాను) ఈ భేదం వున్నది. ఉపయోగించుకోగల ప్రజ్ఞ వుంటే, రేడియో నాటకం మహాశక్తివంతమైంది. స్థలంలో, సమయంలో, వస్తువులో వైవిధ్యం ఎంత తక్కువైతే నాటకానికి అంత బిగి రావడం కద్దు. రేడియో నాటకానికైనా వస్తువులో ఏకత్వం—(యూనిటీ ఆఫ్ థీమ్) అవసరమేగాని, స్థలం, సమయం అంత పట్టింపు కాదు. దానికి ముల్లోకాలూ, నాలుగు యుగాలూ రంగం కావచ్చు. ఈ విషయంలో సినిమాకున్న, నాటకానికి లేని సౌలభ్యం దానికున్నది. రేడియో శ్రోతకు రంగస్థలం అతని మనస్సే. అంచేత అతని భావనకు వీలైనంత అధికంగా ఉద్దీపన కలిగించి, అతను చూడని వస్తువులను, స్థలాలను, సన్నివేశాలను అతని కళ్ళకు కట్టించగలిగేదే ఉత్తమమైన రేడియో నాటకం. భావోద్దీపనశక్తి కవిత్వానికి అధికంగావున కాబోలు కవులే రేడియో నాటకకర్తలుగా ఎక్కువగా రాణించడం సంభవిస్తున్నది. ఇందుకు ఒక సాక్ష్యం అమెరికాలో 'ది ఫాల్ ఆఫ్ ది సిటీ', 'ఎర్ రెయిడ్' మొదలైనవానికి పీఠికలు వ్రాసిన ఆర్చిబాల్డ్ మెక్లాలిష్.

ఎటువంటి నాటకాలు కావాలి ?

రాజమన్నారుగారు :—యెస్. చాలా చక్కగా చెప్పారు. ఇంత కొత్తనీరు వచ్చాక తెలుగు నాటక రచనలో కొత్తకొత్తపద్ధతులు వెలుస్తాయని ఆశింపవచ్చు అనుకుంటాను. అయితే—కళాదృష్టితో అయితేనేమి, సాంఘికజీవన పురోభివృద్ధి కయితేనేమి ఇకముందు ఎటువంటి నాటకాలవసర మంటారు? ఆ నాటకాలలో సంగీత మెంతవరకు అవసరమంటుంది? పురాణగాథలు ఇంకా కావాలా? కథావస్తువు ఎటువంటిదై ఉండాలి?

సుబ్రహ్మణ్యశాస్త్రిగారు:—ముందుముందు దేనికి, వెంకవెంకేమిటి? రూపకం అనిపించుకోదగ్గవే మనకి కావాలి. రూపకం కేవలమూ చదువుకోడానికి కాదు, ఆడడానికి. అనేకసందర్భములలో ఆటకి అవకాశం వుండదు. కనక. చదువుకోవడానికిన్నీ, ఇదే కావ్యలలో, దృశ్యాలలో ఉండే విశిష్టత. కేవలమూ చదువుకోటానికి పనికివచ్చేది రూపకం కానేకాదు. ఇక సంగీతం విషయం: సంగీతం—అంటే రేడియో నిర్వాహకులు నాటకాలాడించేటప్పు డుపయోగిస్తున్న ఆర్కెస్ట్రాలు అని నే ననుకుంటున్నాను—పనికిరాదు. రూపకం ఏ విధంగా ఉపయోగించే దయినా అంగంలో సంగీతం వుండకూడదు. అసలు రచయిత పాటలే కాదు, రూపకంలో పద్యాలు కూడా చెప్పకూడదు. పౌరాణికాలిప్పుడు మనకి పనికివస్తాయా అంటే, ఏంకథ పనికి రావూ? చారిత్రకాలవంటివే అవీని. కాదంటే చరిత్రకి పూర్వపు చరిత్ర లివి. వాటిలో ఘట్టాలు ఏరుకోవడం లోనూ, వాటిని నిర్వహించడంలోనూ వుంది విశేషం. పురాణాలలో ప్రజల నిత్య జీవనానికి దగ్గరగా ఉండే ఘట్టాలనేకాలున్నాయి. ఏ కొద్దిభాగమో మినహాయిస్తే మన భారతం అంతా అలాంటిదే. దాన్లో ప్రజలకు సహజాలైన ఆశయాలు మప్పేవే చాలా ఉన్నాయి.

అవధానిగారు :—"స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం, న్యాయేన మార్గేణ మహీం మహీశాః; గోకర్షకేభ్యః శుభమస్తు నిత్యం, లోకాస్సమస్తా స్సుఖినో భవంతు." అనే యీ నూతన భరతవాక్యంలోని ఆశయాలు గల నాటకాలే మనకు ముందుముందు అవసరం. భారతీయదృక్పథంలో ప్రధానమైంది ప్రజలశ్రేయస్సు. ప్రజల కష్టసుఖాలే, ఇబ్బందులే, సమస్యలే నాటకానికి కథావస్తువులు కావాలి. ప్రజల విజ్ఞానానికి తోడ్పడే ప్రతి అంశమూ కూడా నాటక కథావస్తువుగా పనికివస్తుంది. వాస్తవికతే మనకూ కావలసింది. కాని పచ్చి వాస్తవికత మట్టుకు కాదు. వాస్తవికత ఆదర్శవాదానికి దారితీయ్యాలి. మామూలు మనుష్యులను అతిమానవులుగా, ఋషులుగా చెయ్యడమే ఆశయంగా గలవై ఉండాలి నాటకాలు. మన సంస్కృతికీ అదే ప్రయోజనం. నాటకాలు కేవలం వినోదసాధనాలనుకోవడం నాగరికతకే దెబ్బ. నాటకాలను పాటకచేరీలకిందికి మార్చి కథాసన్నివేశాన్ని, నాటకసందేశాన్ని మూలకు త్రోసి, రంగస్థలంమీద చిందులు

లోకేశ్ నటకులను చూస్తున్నారు. వారు కేవలం కళనే కాదు, దేశం నాగరికతనీ గాయపరుస్తున్నారు. నాటకానికి పాట లనవసర మని నా అభిప్రాయం కాదు. సంగీతం, నాట్యం గల కవిత్వనాటకం మన జన్మహక్కు. మన సొత్తు. భరతనాట్యం ప్రపంచానికే ఆదర్శం. నాటకాన్ని ఎన్నోవిధాల రచించవచ్చును. మనకు కేవల వచననాటకాలెంత అవసరమో కేవల సంగీతనాటకాలూ, నృత్య నాటకాలూ కూడా అంతే అవసరమే. కథావస్తువులతో నాటకాలను రచించడం సులభమైన పని కాదు. అది జయప్రదంగా నెరవేరిస్తే మహత్తరమైన ఆశయాలను బోధించవచ్చు. ప్రపంచంలో మహానాటక రచయితలే ఇది సాధించారు. పురాణ కథలను తమ ఆశయాల కనువుగా ఉపయోగించుకున్నారు. బెర్నార్డ్ షా రచనలో ఉత్తమోత్తమ నాటకాలు 'Androcles and the Lion', 'Man & Superman' అన్న నాటకాలు కాదా. ఆ రెండింటిలోనూ కూడా పురాణ పురుషులను షా ఎల్లా వినియోగించుకున్నాడో చూడండి. ఈసప్సు నీతికథల్లోనిది కాదా ఏండ్రోక్లీస్ అండ్ ది లైన్. షా ఆ కథనే ఎంత బాగా వర్ణించాడు! 'ఎలక-సూర్యుడు' కథనే హరీన్ చటోపాధ్యాయ కూడా చక్కని నాటకంగా రాశాడు. కథావస్తువు ఏదైతే నేం? ఆదర్శంలో, రచనావిధానంలోనే ఉంటుంది కవిప్రతిభ.

నాగేంద్రరావుగారు:—నాటకాలు గీతాప్రధానంగానూ, నాట్య ప్రధానంగానూ, అభినయప్రధానంగానూ, రసం ప్రధానంగానూ (రేడియో నాటికలు) ప్రత్యేకంగా రకరకాలుగా ఉండవచ్చు. అన్నింటిలోనూ అన్ని కళలూ ఉచితరీతి సహకరించనూ వచ్చు. చిక్కెక్కడంటే, అసందర్భంగా సంకరం చెయ్యటం. సంకరం ఎప్పుడూ దుర్బలహేతువు. దానితో నాటకప్రభావం చస్తుంది. నాట్యరంగం రసకేళీలల ప్రదర్శనం. అక్కడికి పురాణజీవితాలేమిటి, ప్రస్తుత జీవితాలేమిటి, జీవితాల్లోని మధురఘట్టాల నన్నిటినీ ఆవహించి ప్రవర్తింపజేస ఆ సన్నిహితత్వాన్ని మనం అనుభవిస్తాం.

రాఘవాచార్యులుగారు:—నాటకం విజ్ఞానబోధకమైన వినోదం అంటున్నారు. లోకజీవనాన్ని ప్రతిఫలింపజేస్తూ ఉత్తమలక్ష్యాల్ని చూపించేదిగ ఉండాలనికూడా అంటున్నారు. నాటకానికి ఒక్కటే లక్షణంగా కనిపిస్తోంది. కాలానికి తగిన ఆట ఆడడం. ప్రాతరోజుల్లో ప్రభువులకూ, ప్రజలకూ రంజకంగా ఉండే కథను తీసుకుని ఆనాటి అభిరుచులు జోడించి, రచించి ప్రదర్శించారు. వాటిల్లో ఏదో రకంగా ఆనాటి చరిత్ర, జీవనం విలక్షితమౌతూనే ఉంది. అట్లాగే యీ రోజుల్లో కూడా మన జీవనాలను ప్రతిఫలింపజేస్తూ భావిని సుసంపన్నం చేయగల లక్ష్యాల్ని చూపిస్తూ వుండాలి నాటకాలు. కథావస్తువు ఏమిటి, నాయకుడెవరు—ఆ ప్రశ్నలతో పనిలేదు. రాజకీయమైనా, నైతికమైనా వాస్తవికతకు దూరంకాని భావాలు రేకెత్తిస్తూ ఉదాత్తసహోత్సాహనకు తోడుపడేదిగా ఉండాలి. ప్రదర్శనయోగ్యం కానివి నాటకాలుగా వ్రాయటంకంటె నవలలుగానే వ్రాయటం మేలు. కేవలం గాయకుల ప్రతిభమీదనే ఆధారపడే ప్రదర్శనం నాటకమెలా అవుతుంది? అది పాటకచేరీ. అంతేగాక, అసందర్భసంగీతం రసభంగానికే తోడుపడుతుంది.

నార్లవారు:—తన కాలానికి సంబంధించిన సమస్యలపై దృష్టిని సారింపజేయడమే నాటకకర్తధర్మం గానీ, వాటికి పరిష్కారమార్గాలను చూపించటం కాదు. "నా పని ప్రశ్న లడగడమే గాని, ప్రత్యుత్తరాలను చెప్పడం కాదు." అని ఇబ్సెన్ అన్నాడు. నిజానికి ఏ సమస్యకూ "రెడీమేడ్" పరిష్కారం వుండదు.

కామేశ్వరరావుగారు:—ముందే కాదు, ఏకాలంలోనూ కూడా, హృదయభావంలో ఉండి ప్రయోగసమయంలో ఎదురుగుండా కూర్చున్న జానపదుల్ని కూడా, రాగం అనే లంచం పొయ్యవలసిన అవసరం లేకుండా ఆకర్షించే నాటకాలు అనవసరం. మళ్లీ, ఒకసారిగాని రెండుసార్లుగాని జనాకర్షణ చేసిన ప్రతీ ఆటా నాటకమో, నాటికో అయిపోతుందని నే ననుకోను. కాలపరీక్షకి నిల్చి, కథాచమత్కృతిలో, పాత్రసజీవత్వమో, సారస్యవైభవమో, సంఘటనాపాటవమో, సంభాషణావైచిత్ర్యమో, వీటి కలయికలో మొదలైన శాశ్వతలక్షణాలు గలదై నాటక మనో, నాటిక అనో, ప్రదర్శనం అనో, ఆట అనో పేరు అదే అర్జించుకుంటుంది. కేవలం చదువుకోడానికే రచన చెయ్యబడ్డ నాటకాలకి

మరో పేరు ఉండాలి. ప్రేక్షకుల్లోంచి వన్సుమోర్లు పొందగల రాగనాటకప్రయోగాల రంజకత్వం ఎంత రూఢిఅయినా, వాటిని కేవలరాగాల మేజువాణీలు అనాలి! పాటల నాటకాలూ తత్తుల్యమే! నాటక ప్రయోగంలో నటుడు గానం ఎంత తక్కువగా ఆచరించినా మేలే, అది ఆ గానకర్తయొక్క స్వత్వాన్ని సాధిస్తుందేకాని, నటుడు ఉద్దేశించిన అన్యత్వారోపణకి తోడ్పడకపోవడమే కాదు, ప్రతిబంధకంకూడా నని పాట నేర్చిన ఆంధ్రనటులే ఒప్పుకున్నారు. ఇక, పురాణాలలోంచి కథలు తీసుకొచ్చి చేసిన నాటకరచనలు తెలుగులో బోలెడు! పూర్వపు 'బొబ్బిలియుద్ధము', ఇటీవలి 'పల్నాటిచరిత్ర' మినహాయిస్తే తక్కినవన్నీ పురాణాలే! దేవుళ్ళు చాలా చౌక అయారు. కొందరు దేవుళ్లకి నాటకాల్లో తిరగడంనించి గౌరవాలు పోయాయి. ఇప్పుడుకూడా, మానవులు చాలక, దేవుళ్ళను తీసుకొచ్చికోరాలంటే, పూర్వులు సూచించి ఉన్న సాధనాలు అవలంబించడం మంచిది. అంతకంటే, వాళ్లని క్షమించి, మరోపని చూసుకుంటారని వొదిలేసినా, వాళ్లు బతికిపోతారు.

లక్ష్మీకాంత కవిగారు:—మనకు చక్కని సాంఘిక నాటకాలు అవసరం. కాని వివాహాలు, విడాకులతో కూడిన ఇతివృత్తాలు ఇంక చాలించడం మేలు. వాస్తవికత్వం చిత్రించటంలో ఉత్తమాదర్శాలకు భంగం రానీయకూడదు. కేవలం ప్రకృతిని అనుకరించడం ప్రతిబింబించడముతోనే తృప్తిపడక, భౌతిక అతీతమైన కావ్యదృష్టితో ఒక్కొక్కప్పుడు ప్రకృతిని అధిగమించడమున్ను సంస్కారము గల కవికి సాధ్యము కావలెను. అప్పుడే కళలో సాత్విక సౌందర్యం పరిపూర్తవుతుంది. పౌరుషాన్ని చంపే మెట్టవేదాంతాన్ని కట్టిపెట్టి ప్రజలను కర్మవీరులుగా చిత్రించే రచనలు కావాలి. విధి కర్మానుభవమూ, దైవనిర్ణయము అని సరిపుచ్చుకునే అలసత్వం ఆదర్శప్రాయం కాదు. పురాణనాటకం ప్రతీదీ ఆదర్శప్రధానమైనదే. అంతేకాక, ఆ కాలమునాటి సాంఘిక వ్యవస్థను చిత్రించేదే. కాలానుసరణంగా ధర్మాలూ, ఆచారాలూ మారవచ్చును. కాని సత్యమనేది శాశ్వతం. సాత్వికసౌందర్యంతో కూడినదే కళ. నేటి ప్రజాజీవితాలను బట్టి పురాణగాథలను చూడక, కళాదృష్టితో వాటిలోని సత్యాన్ని చూచి ఆనందించడము మేలు.

అవధానిగారు:—నాగరికతలో దేశం ముందంజ వెయ్యాలంటే నాటకానికి మించిన సాధనం లేదు. అది ఉద్రేకతః ప్రతిమనిషికీ అవసరం. ఆట, పాట ప్రతిమనిషికీ అవసరమే. ప్రతిమనిషీ నటుడే. మనుషులలోని జీవశక్తి అంతా వృద్ధి అవుతుంది. సినిమా అందరూ చూచి ఆనందించే కళ. నాటకం అందరూ నటించి ఆనందించే సజీవకళ. సంస్కృతిలో పరిణతి పొందిన దేశంలో వీధి కొక నాటకశాల మాత్రమే కాదు, ఇంటింటా ఒక నాటకరంగస్థలం ఉంటుంది. నేటి కిది ఒక స్వప్నంమాత్రమే. కాని 'నేటి స్వప్నాలు రేపటి యథార్థాలు' గా మారడం మనం చూస్తూనే ఉన్నాము.

రాజమన్నారుగారు:—ఈ పాతికముప్ఫైఏళ్లల్లో తెనుగునాటకరచనలో మార్పులు కలిగిన మాట యథార్థం. నార్లవా రన్నట్లు ఎన్నతగిన గొప్పమార్పులు, ఉత్తమమైన నాటకాలు రాలేదేమోగాని అసలు మార్పే లేదనలేము. ముప్ఫైఏళ్లకి పూర్వం నార్లవారి నాటికల్లాంటివి మన కెక్కడివి? మార్పులు కథావస్తువులో, భావాలలో, రీతిలో. సినిమా అభివృద్ధి అవడంవల్ల నాటకరచన క్షీణించిన దని అందరూ ఏకీభవించారు. రెండూ వికసించడానికి ఏ అభ్యంతరమూ లేదు. సినిమావల్ల నాటకరచనలో కొన్ని మార్పులు వచ్చిన వచ్చును—సంభాషణలు కొంత సహజంగా వ్రాయడం, వాస్తవికత—ఇలాంటివి. రేడియోనాటికలక్షణాలు అందరూ ఒకేవిధంగా వర్ణించారు. రేడియోనాటకానికి శబ్దమే ప్రధానం. దృశ్యపరికరాలుండవు. ఈ కారణంవల్ల భావనాశక్తికి ఎక్కువ అవకాశం ఉండదు; గానానికికూడా. సాహిత్యంలో వీటికి ఎందుకు స్థానం ఉండదు? గొప్ప నాటకరచనకు తగిన పరిస్థితులు మనదేశంలో ఇంకా లేవు. మొదట ప్రేక్షకుల్లో విజ్ఞానం, అభ్యుదయచింత వ్యాపించాలి. ప్రేక్షకులకు తగినట్లే నాటకాలుండవు అనడంలో సత్యం లేకపోలేదు. రెండవది: నాటకాల్ని తయారుచేసి ప్రదర్శించడానికి బుద్ధిమంతులైన సూత్రధారుల్లు కావాలి. మూడవది: కవిసృష్టి నాశనంచేసుకొని అభినయించే కౌశల్యంలేని నటులు ఎంత గొప్ప నాటకాన్నయినా ధ్వంసం చేయగలరు. వీటన్నిటికన్నా ప్రతిభావంతులైన రచయితలు కావాలి. ప్రతిభ నవనవోన్మేషశాలిని. భూతవర్తమానయుగాల కన్న భవిష్యత్తు గొప్పగా కనబడుతున్నది నాకు.



అనుకృతి కావ్యధర్మమా?

— శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి —

లౌకిక జగత్తును అనుకరించుటయే కావ్యము యొక్క విశిష్టధర్మ మను వాద మొకటి కలదు. నాట్యవేదములో భరతముని—

"నానాభావోపసంపన్నం
నానావస్థాంతరాత్మకమ్
లోకవృత్తానుకరణం
నాట్య మేత న్మయా కృతమ్"

"సప్తద్వీపానుకరణం
నాట్య మేత ద్భవిష్యతి"

"యేనానుకరణం నాట్య
మేత త్తద్య న్మయా కృతమ్"

(౧-౧౧౨,౧౧౯,౧౨౦)

అనుచో జగదనుకృతి, లోకవృత్తానుకృతి నాట్యమున, అనగా కావ్యమున ఉన్నదనినాడు. గ్రీసుదేశీయుడైన అరిస్టాటిల్ (Aristotle) కూడ 'కవిత అనగా ప్రకృతిని అనుకరించుట (Mimesis)' అనినాడు. ప్రకృతిలో ఉన్న భావరూపములను యథాతథముగా కావ్యజగత్తులో చిత్రించుటయే కవియొక్క ముఖ్యకర్తవ్య మని, మాతృకను సమగ్రముగా అనుకరించుటలోనే మనశ్శాంతి కలుగు నని వీరి భావము. ఈ వాద మయుక్తికము.

౧. ఇంతవరకు బాహ్యజగత్తులో ప్రతీయమానమగుదానిని అనేకవిధముగా ఛాయాచిత్రము (Photograph) వలె మానవు డనుకరించిన, లౌకికప్రపంచము కావ్యమున మరల చిత్రింపబడుచున్నది. ఇది అనవసరమగు పునరుక్తి (Unnecessary Reduplication). వస్తుజాలము బాహ్యజగములోనే మనకు పరిచితమై అనుభూయమానమగుచుండుటచే కవి చేయు కృషి అనవసర ప్రయాసమాత్రమే అగును.

౨. తాను సరిగా చిత్రించుచుంటినా, లేదా అని కవి విమర్శించుకొనుటచే ఈ అనుకృతి మాతృకకు ప్రతీకగాగాని, ప్రతినిధిగాగాని ఉండలేకపోవుచున్నది. కవితాప్రతీతికి, అభివ్యక్తికి ఉపయుక్తములగు సాధనములు బాహ్యజగత్తులో పరిమితములై కన్పించుచున్నవి. కాగా, కవితలో వాస్తవికజగత్తున కాభాసమాత్రమే గోచరమగును. ఇదికూడ సకలేంద్రియములకు ప్రవృత్తినీయలేదు. జగత్తులో అన్ని ఇంద్రియములు వ్యాపృతములై అనుభూతి నొందుచున్నవి. కాని కావ్యమున చక్షుశ్శ్రవణేంద్రియములు మాత్రమే ఉపయుక్తములు కాగలవు. కావున అనుకృతి యగు కవిత ప్రకృతికన్న సంస్కారశూన్య మగుచున్నది.

3. కేవలానుకృతి యగు వితథ్యకావ్యము. పరచేష్టానుకృతియే హాస్యలక్షణము. అనుకృతివిశిష్టమైన కవిత, ఛాయాచిత్రతుల్యమైన కవిత, చక్షుశ్శ్రవణములకుమాత్రమే ప్రతీతి నీయగల కవిత కేవలము

హాస్యతుల్యము. కావున కవిత అనుకృతి గాదు అని అభినవగుప్తుడు, హెగెల్ (Hegel) సిద్ధాంతీకరించినారు[1].

౪. కొన్ని స్థలములలో అనుకృతి వాస్తవిక విషయముగానే భాసించుచున్నది. పిపాసార్తునకు మరుమరీచిక జలమువలెనే భాసించి ప్రవృత్తి నొసగుచున్నది. చీకటిలో రజ్జువును చూచి సర్పమను ప్రతీతిని పొందు భయకంపావేగాదులను మానవుడు పొందుచున్నాడు. శాకుంతలములో శకుంతలాచిత్రమును మృగతృష్ణికగా దుష్యంతుడు పరిగణించినను, తర్వాత చిత్రమునే సత్యముగా భావించి, చిత్రగత భ్రమరమును పారద్రోల యత్నించినాడు:

"రాజా—

అక్లిష్టబాలతరుపల్లవలోభనీయం
పీతం మయా సదయమేవ రతోత్సవేషు,
బింబాధరం స్పృశసి చేద్భ్రమర, ప్రియాయా
స్త్వాం కారయామి కమలోదరబంధనస్థమ్"

శకుంతల పెదవిని తుమ్మెద స్పృశించినచో పద్మగర్భమునందే దానిని బంధించగలడట!

"విదూషకః—......(ఆత్మగతం) ఏష తావ దున్మత్తః. అహమ ప్యేతస్య సంగే నేదృశవర్ణ ఇవ సంవృత్తః. (ప్రకాశం) భోః, చిత్రం ఖల్వేతత్!"

రాజు పిచ్చివాడైనాడని, అతని సహవాసదోషముచే తానుకూడ చిత్రమును చిత్రముగా పరిగణించలేకపోయినట్లు విదూషకుడు మనసులో తెలిసికొని, చివరకు తన చెలికానికిది చిత్రమని జ్ఞప్తి చేసినాడు.

"రాజా—

దర్శనసుఖ మనుభవతః
సాక్షాదివ తన్మయేన హృదయేన,
స్మృతికారిణా త్వయా మే
పునరపి చిత్రీకృతా కాంతా"

తన్మయమైన హృదయముతో చిత్రగతయగు శకుంతల సాక్షాత్తుగా శకుంతలవలె కన్పించుటచే చిత్రమునందే పశ్చాత్తప్తుడగు దుష్యంతునకు పరితృప్తికరమైన ప్రేయసీదర్శనసుఖము లభించినది. కాని విదూషకుడు విస్మృతిశీలుడగు రాజునకు జ్ఞప్తిచేయుటచే మరల శకుంతల చిత్రీకృతయైనది.

ఈ సన్నివేశములలో చిత్రము వాస్తవిక చేతన విషయమువలె కన్పడుచున్నది. ఉన్మత్తుడగు పురూరవునకు ఊర్వశిఅనుకృతి వనస్థలిలో కన్పించినది. దీనిని Deceptive Imitation అన్నాడు హెగెల్. కాని ఈ విధముగా కావ్యజగత్తు బాహ్యలోకముతో స్పర్ధను వహించలేదు. తపనుని అనుకృతియగు ఖద్యోతము సూర్యునకన్న శోభాన్వితము కాలేదు. కావుననే మాతృకను జలపూర్ణమైన నదికి, చిత్రమును మృగతృష్ణికకు దుష్యంతుడు పోల్చినాడు (౬-౧౬). కాంతివిసంవాదమైనది చిత్రమనినా డగ్నిమిత్రుడు (౨-౨). చిత్రము సత్యమూర్తికి దోహదము కాలేదని పురూరవుడు రచించినాడు (౨). అనగా అనుకృతిలో ఆనందము కలుగునని ఒకవేళ అంగీకరించినచో ఈ ఆనందము విషయనిష్ఠము, విషయజన్యము కాలేదు.

దుష్యంతునకు చిత్రగతశకుంతలను చూచినపుడు కలిగిన ఆనందము చిత్రమువలన ఉద్భూతము కాలేదు. చిత్రము కేవలము నిమిత్తకారణము. భావనద్వారా బయలుదేరిన చిత్తవృత్తి బాహ్యరూపమును ధరించి, బాహ్యముగా ప్రతీయమానమైనది. ఆంతరంగిక మనఃప్రవృత్తి బాహ్యముగా చిత్రపరిచ్ఛిన్నముగా భాసించుటచే ఆనందము కలిగినది. అనగా ఈ యానందము స్వాత్మస్ఫూర్తి నాశ్రయించుకొని, బాహ్యముగా భాసించినదే కాని వేరుకాదు. కావున సత్యస్ఫోరకమగు అనుకృతిలో కలుగు ఆనందము ఆత్మవృత్త్యధీనము. ఇది విజ్ఞానవాదములో వలె బాహ్యముగా భాసించునదే కాని, దీనికి లౌకికజగత్తులో కారణము లేదు; ఇది వస్తుసత్తాకశూన్యము.

౫. కాగా, అనుకృతిలో చిత్రకారుడు కన్పరచు వైదగ్ధ్యము, అనగా హస్తవిన్యాసమే ఆనందకారి...

1. Hegel: Aesthetik ; అభినవగుప్తః అభినవభారతీ.

కావలెను. ఈ ఆనందము మాతృకను, చిత్రమునకు గల సామాన్యావస్థను అనుసరించియే ఉండును. పదేపదిగా విహగ రావముల ననుకరించు మానవకంఠస్వనము ప్రథమమున ఆనంద మొసగినను, పోనుపోను విసిగించక మానదు. సహజములగు భావములు, సన్నివేశములు మాత్రమే మన కానంద మీయగలవు. పికశ్రుతి సర్వదా మనోజ్ఞమే. కాని తదనుకృతి జుగుప్సావహ మగుచున్నది. జుగుప్స అనౌచిత్యదర్శనచే అనుభూతమగునది. కాగా అనుకృతిలో అనౌచిత్య మున్నది. రసభంగమునకు అనౌచిత్యమును మించిన కారణము లే దనినాడు ఆనందవర్ధనుడు.

౨. అనుకృతిని కావ్యప్రయోజనముగా గ్రహించినచో వస్తుతంత్రమగు సౌందర్యము (Objective Beauty) మాయ మగుచున్నది. ఏ విషయమును అనుకరించవలెనో యోజించక, సరిగా అనుకరింపగల్గితి నా, లేదా అని కవి యోజించును. కనుకనే సౌందర్యము పరస్త మగుచున్నది. సౌందర్యత్యాగికి కవితాభావన గాని, తత్త్వదర్శనగాని లేవు. యోగ్యవస్తుసంపాదనకై బుద్ధిని ప్రసరింపక, ఇంద్రజాలశక్తితుల్యమగు హస్తవిన్యాసమునకు బుద్ధిని ఉపయోగించిన, ఆదర్శవంతమగు కవితామాత్రము పరిత్యక్త మగును. కాగా స్వమనఃప్రవృత్తికి అధీనమైన అభిరుచియే (Subjective taste) కవితాస్వాదనలో పరమావధిగా స్వీకృతము కావలెను. వ్యక్తిభేదముచే మనఃప్రవృత్తులు భిన్నములగుటచే కవితాస్వాదన, కవితాభావన కూడ వ్యక్త్యవచ్ఛిన్నదోషోపహితము లగుచున్నవి.

౨

౧. చైత్యాలయాది కట్టడములను (Architecture), కవితను అనుకృతి అన వీలు లేదు. శిల్ప, గాన, నృత్యములలో వర్ణన ప్రధానముగా నున్నది. కవితలోను, కట్టడములలోను వర్ణనమాత్రమే గల దనరాదు. శిల్పమున, చిత్రమున వర్ణన ప్రధానముగా నున్నది. భావలావణ్యయోజనముకూడ చిత్రమున విశిష్టాంగమైనను వర్ణకాభంగము లేనిది చిత్రము రాదు. అనగా చిత్రకారుడు ఒక సన్నివేశమును దర్శించి, దానిని తనకు తోచిన విధమున, తను భావించిన విధమున చిత్రించును. కాని ఇది కేవలము వర్ణనతో కూడినది కాదు. భావ (Matter), లావణ్య (Form) యోజనలేనిది చిత్రము లేనే లేదు. కనుక చిత్రమున వర్ణన భావాశ్రితమై యుండును.

౨. ఇక నృత్తగీతములను పరిశీలించినకూడ వర్ణన లలితకళలలో ప్రధానము కాదని తేలగలదు. తాలలయాత్మకమైన నృత్తము భావాభివ్యంజక మగుటచే రసచర్వణోపయోగి యగుచున్నది. నృత్తమున ప్రయుజ్యమానము లగు అభినయాదులు లౌకికవిలక్షణములు. గీతముకూడ లౌకికవిలక్షణమే. కాగా శిల్ప మొకటి వర్ణననే ప్రధానముగా స్వీకరించిన దనవచ్చును. కాని ఇచటకూడ శిల్పిచే భావింపబడిన భావాభివ్యక్తియే కలదుకాని, కేవలము బాహ్యవిషయతుల్యతమాత్రము కాదు.

3. లలితకళ లన్నిటిలోను వర్ణన కలదు. కాని ఈ వర్ణన రూపనిష్పాదన కుపకారి. భావనిష్పాదన వర్ణన నాశ్రయించక అతీంద్రియతత్త్వముపై నాధారపడి యున్నది. అనగా కవిత తత్త్వదర్శనముపైన, వర్ణనపైన ఆధారపడి యున్నది. కవి తత్త్వమును దర్శించి, అనుభవించును. ఆ అపరిచ్ఛిన్నతత్త్వమును, ఆ అలౌకిక అతీంద్రియభావమును సేంద్రియముగా కవి ప్రదర్శించును. కావుననే—

"దర్శనా ద్వర్ణనా చ్చాథ
లోకే దృష్టా కవిశ్రుతిః"

అనినాడు తౌతభట్టు. తత్త్వాన్వేషి దర్శనమే అపేక్షించుటచే ఋషిశబ్దవాచ్యు డగుచున్నాడు. తత్త్వదర్శనను వర్ణనతో అవినాభావముగా మేళవింపగలిగినవాడు కవిశబ్దవాచ్యు డగుచున్నాడు. అనగా కవితలో హస్తవిన్యాసవైదగ్ధ్యము, అనుకృతి అనునవి విశిష్టములు కావు.

౪. జగద్రూపము లలితకళకు పునాదివంటిది. తత్తత్కళలలోని భావములు తత్తద్విశిష్టరూపపరిచ్ఛిన్నములై అభివ్యంజితము లగుచున్నవి కనుక కళాభివ్యక్తికి ప్రకృతి సాధన మగుచున్నది. కవి సాధకుడు. తత్త్వము

సాధ్యము. తావన్మాత్రమున దృశ్యమానమగు లౌకిక జగత్తు యథాతథముగా కళావిశ్వమునకు ప్రమాణము కాదు. బాహ్యజగద్రూపభానమును బాహ్యముగా అను కరించుట లలితకళల పరమావధికూడ కాదు 2.

౫. బాహ్యజగత్తు రూపము నర్పింపగా, కావ్య జగత్తు భావము నొసగును. అనగా భావము బాహ్య జగత్తుద్వారా అభివ్యక్తమగును. భావరూపములను వేరు పరచలేము. వానికి అనన్యత్వ మున్నది. కావున అపరి చ్ఛిన్నము, సమగ్రము, సంపూర్ణము, స్వతఃసిద్ధము, స్వతఃప్రమాణము నైనది కావ్యజగత్తు. పరిచ్ఛిన్నము, అసమగ్రము, పరతఃసిద్ధము, పరతఃప్రామాణికము నైనది బాహ్యజగత్తు. భావనావిశిష్టమైన కావ్యవిశ్వము వ్యావ హారికలోకమునకు మూలము. అనగా కావ్యవిశ్వమునకు, భౌతికజగత్తునకు అనన్యత్వ మున్నది. అనన్యత్వమనగా ఏకత్వముకాదు, భేదరాహిత్య మనివాడు భామతీ కారుడు.

౬. కావ్యజగత్తు లౌకికజగత్తునకు ప్రతిబింబము కావచ్చును; లేక ఛాయాచిత్రమువలె లౌకికప్రపంచము కావ్యమున చిత్రింపబడవచ్చును; కానిచో నీ రెంటికిని తుల్యరూప ముండవచ్చును. ప్రతిబింబకల్పమైన లౌకిక జగత్తుతో అనన్యాత్మక మగుటచే కవి చేయు కృషి వ్యర్థమే యగును. చిత్రమువలె కవి ప్రదర్శించిన కావ్య జగము చైతన్యరహితమై, కూటాత్మక మగును. తుల్య దేహివలె నుండు కావ్యజగమున సాదృశ్యము రసప్రతీ తికి విఘ్నకారి కాదు 3. అనగా కావ్యజగము లౌకిక ప్రపంచమునకు విరుద్ధము కాదు. వైరుధ్యము ప్రతిపాదిత మైన కావ్యమున ప్రయోజనమే లే దనవలసివచ్చును. పైగా పరిదృశ్యమానజగత్తునకు బహిర్భూతమైన కవి తలో భావనగాని, తత్త్వాన్వేషణగాని ఉండవు. లౌకిక జగము బుద్ధ్యహంకారనిర్మితమై, వ్యక్త్యాశ్రితమైనది ఈ ప్రవృత్తికి మానవభావనయే కారకము. కాగా భావన తాత్త్వికజగద్రూపభానమునకు కారకము. అట్టి భావన కావ్య మలౌకికమైన ఉండలేదు.

౭. కాగా కావ్యలౌకికజగములకు సాదృశ్య మంగీకృతము కావలెను. సాదృశ్యప్రతీతిలో వైరూ ప్యముగూడ కలదు. అనగా భిన్నవస్తువులకు సాదృశ్యము కలదు; కాని అభిన్నవస్తువున లేదు. ఈ వైరూప్యము దేశకాలప్రమాతృనిష్ఠము. అభినవగుప్తు డనినట్లు—

"దేశకాలప్రమాతృభేదానియంత్రితో రసః"

కావ్యాత్మయగు రసము దేశకాలాద్యతీతము. అనగా పరిచ్ఛిన్నమైనది బాహ్యజగత్తు. కావ్యజగత్తు అపరిచ్ఛిన్నమైనది. కాగా కావ్యజగమునకు త్రైకా లికాబాధ్యత్వ ముండక తప్పదు.

౮. త్రికాలములయందును సత్యమైనది చైతన్య మనబడు ఆత్మయే. ఆత్మచే అనుస్యూతమైనది బాహ్య జగత్తు. అనగా ఆత్మయే దేశకాలపరిచ్ఛిన్నతను పొంది రూపరహితమయ్యును రూపముతో భాసించుటయే లౌకికజగము. ఇదేవిధముగా చైతన్యము కావ్యమున సేంద్రియముగా భాసించును. రసాస్వాదనలో సహి తము కేవలానుభూతి లేదు. విభావాదిసంవలితమైన రసాస్వాదమే కావ్యమున నుండుటచే, ఇది సంసర్గావ గాహి యగు సవికల్పకజ్ఞానము. ఈ జ్ఞానమే అనావృత మైన చైతన్యము. రసము ధ్వననాత్మకమై ఏతదావరణ భంగ మొనర్పగల శక్తిని కలిగియున్నది.

౯. చైతన్యము సర్వత్ర అనుభూయమాన మగు చున్నది. కాని జాగ్రదవస్థలో ఇదం చైతన్య మిత్యాద్యా కారకమైన అనుభూతి కలిగినచే సత్య మనుభూయ మాన మగును. ఏతదనుభూతి కావ్యమున కలుగుటచే కావ్యమున చైతన్యాభివ్యక్తి కలుగుచున్నది. అనగా అతీంద్రియమగు చైతన్యము, ఆత్మ కావ్యమున ప్రతీయ మానమై బుద్ధీంద్రియముల కేకత్రానుసంధానము కూర్చు చున్నది.

---

2. Hegel కు భావానువాదము.

3. ధ్వన్యాలోకము: నాల్గవ ఉద్యోతాంత మందలి కావ్యముల సంవాద నాశ్రయించుకొనిన దీ భావము.

4. అభినవభారతి, 292 వ పేజీ.

3

౧. భరతముని నాట్యధర్మి అని, లోకధర్మి అని రెండువిధములుగా ధర్మిని స్వీకరించుచు కావ్యజగత్తును, లౌకికజగత్తును విశిష్టధర్మైక్యాంశమున సాదృశ్యమును ప్రతిపాదించినాడు. లౌకికధర్మజనితములై, తదాశ్రితములైనవి అభినయములు. కావున లోకనాట్యధర్మములను చెప్పినాడు భరతుడు. స్వభావభావోపగతము, స్వాభావికము, కృత్రిమము కానిది, వికారము పొందనిది, లోకవార్తాక్రియోపేతము, అంగలీలావివర్జితము, స్వాభావికమైన అభినయముతో కూడుకొనినది, నానాస్త్రీపురుషాశ్రయము నైనది లోకధర్మి.

అతిసత్త్వ క్రియోపేతము, అతిసత్త్వాతిభాషితము, లీలాంగహారాభినయము, నాట్యలక్షణలక్షితము, స్వరాలంకారసంయుక్తము నైనది నాట్యధర్మి. అనగా నాట్యలోకధర్ములకు విషయసంపద సమానమే. కాని మాత్రబద్ధమై, అభినయాత్మకమై, సత్త్వగుణోపేతమై ఉండునది నాట్యధర్మి. కాగా నాట్యమున లోకస్వభావము పరిష్కరింపబడుటయేగాక, కేవలము సత్త్వగుణాత్మకముగా ప్రదర్శింపబడుచున్నది.

లోకప్రసిద్ధవిషయము కాని, వస్తువుకాని వృత్తిమంతమై, సాభిలాషముగా నాట్యమున ప్రయోగింపబడినది నాట్యధర్మి. సమీపమున పాత్రలున్నను, ఒకరు పల్కినది మరొకరు వినజాలకపోయినను (అనగా స్వగతభాషితము), అనుక్తము వినబడినను అది నాట్యధర్మిగా పరిగణింపబడును. శైలయానవిమానములు, చర్మవర్మాయుధధ్వజములు నాట్యమున విశిష్టముగా, విచిత్రముగా ప్రదర్శితములగును. లలితమైన అంగవిన్యాసములచేతను, ఉత్క్షిప్తపదక్రమములచేతను నర్తింపబడునది, భావింపబడునది నాట్యధర్మి. సుఖదుఃఖక్రియాత్మకమైన లోకస్వభావము అంగాభినయసంయుక్తము కాగా నాట్యధర్మి యగుచున్నది.

రంగపీఠగతము, నానావిధిసమాశ్రితము నగు కక్ష్యావిభాగము నాట్యధర్మిలోనిది. నాట్యధర్మిని వదలి నాటకము ప్రయుజ్యమానము కారాదు. సహజమైన భావము అంగాలంకారచేష్టలద్వారా అభినయార్థజమైనది నాట్యధర్మికి. స్వభావసిద్ధమైనది లోకధర్మి. తద్వికృతి నాట్యధర్మి. మరణబంధాదులు నాట్యమున ప్రదర్శనయోగ్యములు కావు. అవి కేవలము సూచింపబడవచ్చును. అనగా రజస్తమోగుణములు నాట్యమున విడబడినను సత్త్వమే దర్శనయోగ్యము.

౨. నానాభావసంపన్నము, నానాక్రియాత్మకము నైన బాహ్యజగత్తుకు సత్త్వగుణానుసార్యతముగ ఏకత్వానోక్యాశ్రయత్వవైశిష్ట్యమును కూర్చునది కావ్యజగత్తు. అనగా బుద్ధీంద్రియవ్యాప్తిమైన లోకము కావ్యమున భావనాశ్రితమగుచు పూర్ణతను, శుద్ధతను పొంది లౌకికజగదుత్పాదకహేతువగుచున్నది.

౩. నాట్యధర్మివిశిష్టమైన దగుటచే కావ్యజగత్తు దేశకాలాద్యతీతము. కావుననే—

“తత్ర నాట్యం నామ లౌకికపదార్థ వ్యతిరిక్తం, తదనుకార ప్రతిబింబాలేఖ్యసాదృశ్యారోపాధ్యవసాయోత్ప్రేక్షాస్వప్న మాయేంద్రజాలాదివిలక్షణం, తద్గ్రాహకస్య సమ్యగ్జ్ఞానభ్రాంతిసంశయానవధారణానధ్యవసాయవిజ్ఞానభిన్నవృత్తాంతాస్వాదనరూపసంవేద్యం వస్తు రసస్వభావ మితి వక్ష్యామః”

అని నాట్యవేదవివృతిలో అభినవగుప్తుడనినాడు. లౌకికపదార్థములకన్న భిన్నమైనది నాట్యము. లౌకికజగత్తుకు కావ్యజగత్తు అనుకృతి కాదు; ప్రతిబింబము కాదు; చిత్రీకరణకూడ కాదు. ఆరోపాధ్యవసాయసంబంధముకూడ లేదు. కావ్యజగ ముత్ప్రేక్షితము కాదు. స్వప్నతుల్యమైన అసత్యము కాదు. కావ్యవిశ్వము మాయకాదు; ఇంద్రజాలము కూడ కాదు. సమ్యగ్జ్ఞానాకారమై, విజ్ఞానస్వరూపమై, జ్ఞానాస్వాదనద్వారా సంవేదనసంవేద్యమైన రసప్రాణకమైనది కావ్యజగత్తు. కాగా నాట్యధర్మిద్వారా దేశకాలప్రమాతృభేదానియంత్రితమైన జగత్తు కావ్యమున ప్రతీయమాన మగుచున్నది. కావుననే సర్వ

5. నాట్యశాస్త్రం 14. 69.82

6. నాట్యశాస్త్రం 23. 198

7. అభినవభారతి, పేజీ 3

శాస్త్రార్థసంపన్నము, సర్వశిల్పప్రవర్తకము నైన నాట్యము8 ముల్లోకములకు భావానుకీర్తనమై9 విలసిల్లున దనివాడు భరతుడు.

" న తద్ జ్ఞానం న తచ్ఛిల్పం,
న సా విద్యా న సా కలా,
నాఽసౌ యోగో న తత్కర్మ
నాట్యేఽస్మిన్ యన్న దృశ్యతే " (౧-౧౧౬)

అనగా లౌకికజగత్తుకు కావ్యజగమే మూలము. భావనావ్యాపారప్రధానమైన కావ్యశిల్పము బహిర్దృశ్యమాననానాత్వ భిన్నత్వముల యేకత్వానన్యత్వముల నాపాదించగలుగుచున్నది. కావ్యజగమును ప్రవేశించి పారిసుద్ధ్యము నందని దేదియు లౌకిక జగమున నుండదనుటలో బాహ్యజగత్తుకూడ భావనావిశిష్టమైనపుడే వ్యవహారయోగ్యమని తేలుచున్నది.10 కావ్యజగమున లేని జ్ఞానము కాని, శిల్పము కాని, ప్రవృత్తి కాని లౌకికజగమున లేనే లేవు. అనగా యాస్కుడనినట్లు కవి సాక్షాత్కృతధర్ముడు"11

8. నాట్యశాస్త్రం 1. 15

9. నాట్యశాస్త్రం 1. 107

10. cf Bosanquet: Meeting of Extremes P. 46.

11. నిరుక్తం 1. 20



కాలము - కాలకాలము

శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి

ఎందఱో మహానుభావులు జగత్తత్త్వము పరామర్శించి యెన్నో మతము లావిష్కరించి యున్నారు. వాటి మార్గములు వేఱయినా, ఆ సిద్ధాంతములు వేఱుపడినా, అవి యన్నియు మొట్టమొదట వేదమును పురస్కరించుకొని బయలుదేఱినవే యని యంగీకరింపకతప్పదు. వేదప్రామాణ్యము నంగీకరించినా, అంగీకరింపకపోయినా, తాత్త్వికదృష్టితో తుదకు గమ్యస్థాన మొక్కటియే యని ప్రాచీనవేదాంతు లన్నారు. అట్టివారిలో మంత్రద్రష్టలు కొందఱు సూర్యప్రశంసాపూర్వకముగా కాలమును, తత్ప్రేరకమైన కాలమును పరామర్శించి నిర్ణయించిన విధ మించుక పరిశీలింతము.

పృథివ్యంతరిక్షద్యుస్థానదేవతలలో అగ్నీంద్రసూర్యులు ప్రధాను లని కొన్ని ఋక్కులు ప్రతిపాదించినా, సూర్యుఁ డొక్కఁడే ప్రధానదేవత; అతఁడే కార్యసృష్టిలో నింద్రాదిబహుదేవతారూపముల గణింపఁబడుచున్నాఁ డనియే యందలి ముఖ్యభావము. "ఏకైవ మహా నాత్మా దేవతా స సూర్య ఆచక్షతే" ఇత్యాది శ్రుతులనుబట్టి దివ్యతేజోమయుఁడైన పరమేశ్వరుఁ డాదిత్యరూపమున వెలయుచున్నాఁ డనియు, సూర్యుఁడు పరమాత్మకంటె వేఱు కాఁడు గావున నతనికి సర్వాత్మకత్వము సిద్ధ మనియు సౌరతత్త్వజ్ఞుల సిద్ధాంతము.

ఈ బ్రహ్మాండమునం దీధూమమండలమువంటి ధూమమండలములు వే లున్నవి. మనకు కనవచ్చు సూర్యునివంటి సూర్యులును కోట్లకొలఁదిగ నున్నారు. వారిలో పంచకర్ణప్రాణత్రాతాదులు గుర్తించినవా రెనమండుగురు. ఆ సూర్యులలో మనకు గోచరించు సూర్యుఁ డారోగనామకుఁడు. భ్రాజపటరపతంగులు మేరు(ఉత్తర ధ్రువము) మార్గమునకు క్రిందుగాను, స్వర్ణరజ్యోతిష్మ ద్విభాసులు దానికి మీఁదుగాను తత్తత్ప్రదేశములందు కదలక యుండి ఖగోళభూగోళములను ప్రకాశింపఁజేయుచున్నారు. ఈ యాఱుగురును మిక్కిలి దూరస్థులగుటచే మనకు గోచరింపకున్నారు. ఈ పేర్కొన్న సూర్యు లేడుగురును తమంతట తాము ప్రకాశించువారు కారు. వీరిని ప్రకాశింపఁజేయుచున్న ప్రధానసూర్యుఁడు కశ్యపుఁడు. అతఁ డెన్నఁడును మేరువును విడువక యందే యుండి, ఆరోగాదులకు తన దివ్యజ్యోతిస్సు నందించుచు నిరంతరము జగమంతయు నిరీక్షించుచున్నాఁడు. ఈ కశ్యపుని యీ స్థితికి సోమనామకమైన పరమేశ్వరసంకల్పప్రభావము మూలకారణము. ఇందుకు శ్రుతి ప్రమాణము.

"తే అస్మై సర్వే కశ్యపా జ్జ్యోతి ర్లభంతే,
తాన్ సోమః కశ్యపా దధి నిర్ధమతి".

దీనినిబట్టి సృష్టిస్థితిలయకారుఁడైన యీశ్వరుని సంకల్పమున జగత్ప్రవృత్తినివృత్తులను జరుపుచున్న సూర్యుఁ డతనికంటె వేఱు కాఁడు కావున సూర్యునికి సర్వాత్మకత్వము సిద్ధమని వారి పరమసిద్ధాంతము. ఆ తత్త్వజ్ఞులు వివిధప్రమాణములనుబట్టి పరిశోధించి చరాచరభూతజాతము ననుగ్రహించునది సూర్యరశ్మి యని నిరూపించిన విధమం దిది యేకాంశమైన కాలస్వరూపము.

ఒక బీజ మంకురించుట, చెంద లేర్పడుట, పెరిగి పెద్దదై పూచి కాచి ఫలించుట—ఇత్యాద్యవస్థలను పట్టినట్టి వ్యవధులు కాలవిశేషములని నిర్ణయించి, ఆ కాలము నిమేషముహూర్తదివసపక్షమాససంవత్సరాది విభాగాత్మకమని గణించి, ఆ సంవత్సరములను శతము, సహస్రము, అయుతము ఇత్యాదిగా పరార్ధమువఱకు లెక్కించి, తుదకు కాలము ద్విపరార్ధ మని సిద్ధాంతీకరించి యున్నారు. ఇదంతా లౌకికవ్యవహారమున కేర్పఱచుకొన్న కాలపరిమాణము. ఇది యనుభవసిద్ధమైనను, అపరిమేయమైన కాలము పరిమాణసాధ్యము కాదనుటయే నిజము.

లౌకికమైన సంవత్సరాత్మకకాలమునకంటె ప్రధికమును, దానికి మూలమును, నిత్యమును, నిరవయవమునైన కాలము పారమార్థికము. అదే 'అధిసత్త్వ' మనఁబడు కాలము. పరమాత్మరూపమైన యీ యధిసత్త్వమే 'కాలకాల' మని 'జ్ఞః కాలకాలః' అను శ్రుతివాక్యా ణించుచున్నది. దీనిబట్టి సర్వజ్ఞము, చైతన్యాత్మకమునైన కాలకాలము పరమాత్మరూప మని విశద మగుచున్నది. అది జ్ఞానదృష్టికితప్ప వేఱుగా గోచరింపరానిది, ఇంతయని గణింపరానిది, ఇట్టిదని నిరూపింపరానిది.

కాలకాలము సకలజగదధిష్ఠానము; సర్వాంతర్యామి. మహాభూతప్రేరకము, సర్వజగత్పరిపూర్ణము, సర్వప్రపంచవినాశకము. అదే పరమేశ్వరుఁ డన్న భావ మేనాఁడో విజ్ఞాతలు వెలయింపఁ జేసిరి. ఆ భావముతోనే కాలనాథుఁడు, కాలప్రియానాథుఁడు, మహాకాలుఁడు, కాలేశ్వరుఁడు మొదలగు సంజ్ఞలతో భరతఖండము నలుగడల నీశ్వరు నారాధించుచున్నారు. ఎంతటి లౌకికప్రజ్ఞాధురీణులైనను దానిని కనుగొనలేరు, అతిక్రమింపలేరు, అడ్డగింపలేరు. అది త్రికాలాబాధ్యము. అనఁగా లౌకికవ్యవహారములోని భూతభవిష్యద్వర్తమానములు దానిదరి చేరవు. లోకములోని సకలపదార్థప్రవృత్తినివృత్తులు దాని యధీనములు. "కాలస్సర్వస్య కారణ" మ్మను సూక్తిభావ మిదే. వాడుకలో దైవము దైవ మనఁబడున దదే దాని శక్తి యజ్ఞేయము; దాని తంత్ర మవ్యాకృతము, అప్రతిహతము. సృష్టిలో లయమును, లయములో సృష్టిని పోషించు దాని లీల మానవబుద్ధి కతీతము. ప్రపంచప్రవృత్తి పొసఁగుటకును, మాఱుటకును, తాఱుమాఱగుటకును హేతుభూతమైన పంచమహాభూతములు తదధీనము లైయుండ చిద్రూపమైన దాని లీల కడ్డమేమి? మహాయోగుల జ్ఞాననేత్రము గాక దానిని చూడఁగలిగినది వేఱేమి? కాలకాలము పరమేశ్వరాత్మకము. పరమేశ్వరుఁడు కాలకాలాత్ముఁడు. లౌకికమైన కాలమునకు మూలము కాలకాలము.



కృష్ణ  కాళి

[కథానిక]

శ్రీ లీలా మజుందార్

ఆనాడు సాయంకాలం కుండపోతంగా వర్షం కురుస్తోంది. నిర్జనంగా ఉన్న ఆ రస్తామీద వాన నీరు సెలయేరుగా ప్రవహిస్తోంది. ఆకాశమంతా కారు మబ్బులు క్రమ్మినవి. రోడ్డు ప్రక్కనున్న నిద్రగన్నేరు కొమ్మలనుండి వర్షపునీరు జలతారుతీగలవలె క్రిందకు జారుతోంది. ఆ చెట్లను దాటి ఇంకా దూరంలో ఆ పాతబడిన భస్మవర్ణపు భవనం కన్పిస్తూ ఉంటుంది.

ఆ యింటికి ముందు ధనురాకారంగా ఉన్న గోడకమానులమీద సువాసనలు వెదజల్లుతున్న పూల తీగెలు అల్లిబిల్లిగా అల్లుకొనియున్నవి. శిథిలములైన గోడల వెంట రావిచెట్టుకొమ్మలు ఆలింగనం చేసుకొన్నట్లుగా విస్తరించి ఉన్నవి. బావురుమని తెరచుకొనియున్న ద్వారములకుగాని, కిటికీలకుగాని తలుపులు లేవు. ఆ యింట్లో జనసంచారం ఉన్నట్లే కన్పించడం లేదు. అయితేనేమి ? ఆ యిల్లు తలదాచుకొనుటకు తగిన తావుగానే కన్పించింది. ఈ గాలివానలో చిక్కుకొని ఒంటరిగా పోవుచున్న స్త్రీ తనకు ఆమాత్రపు నిలువనీడ లభించునని అనుకోకూడా లేదు.

ఈ భవనంలోని చలువరాతి మెట్లు వెనుకటి కాలంలో నడచినవారి కాళ్ళక్రింద చాలావరకు అరిగి పోయినవి. ఈ యింటి ఆవరణలో చలువరాతి స్త్రీ విగ్రహములను ఇదివరకెవ్వరో వరుసలుగా అమర్చి కొంత శృంగారం చేసిరి. రావిచెట్టుఆకులు గాలికి గలగలలాడుచు సొంపైన పేరు ఒకటి జపిస్తున్నట్లుగా ఉంది. కాని అవి ఉచ్చరించెడి మనోహరమైన ఆ పేరు ఏమిటో ఎరుకపడుటలేదు.

ఆ చెట్టునిండా ఉన్న పచ్చని ఆకుల గుత్తుల మీద వర్షబిందువులు పడుతూఉంటే, నేను చూస్తూ ఉన్నాను. తలుపులేని ఆ విశాలమైన హాలులో ధూళి ధూసరితమైన బొమ్మల దీపపుసెమ్మె ఊగులాడుచు చేసే నీరవనిక్వణమును చూచి, అగోచరదివ్యమూర్తులు ఏవైనా ప్రత్యక్షమై జవాబు ఇచ్చునేమో అని అత్యంత ఆతురతతో ఎదురుచూస్తూ ఉన్నాను. కాని, అనేక పుష్కరాలనుంచీ జనసంచారచిహ్నములు లేని ఆ ధూళిరాసులనుండి వినిపించిన కంఠస్వరం ఏమీ లేదు.

వసారాగోడలకు అంటిపెట్టుకొని బాగా పుష్పించిన ఆకాశమల్లి చెట్టు ఒకటి ఉన్నది. ఇంత పరిమళభరితమైన యీ ఆకాశమల్లి వెలసిన యీ భవనమును విడిచి యీ యింటివా రెట్లు వెళ్ళిపోయిరా యని ఆశ్చర్యచకితుడనైతిని. వసారాలో పిట్టగోడవలె అడ్డముగా నున్న, సగము విరిగిన యినుపకమ్మిపై నా చేతిని ఆనించి నిలబడియుండగా అకస్మాత్తుగా సొగసైన రెండు కరకమలములు నా చేతికి చెంతనే వింతగా కన్పించెను. ఆ సొగసైన రెండుచేతుల వేళ్లు గులాబీరంగు లీనుచుండెను. ఒక వేలిపై కెంపుల ఉంగరం ఒకటి మెరుస్తూ ఉన్నది.

ఆశ్చర్యచకితుడ నైతిని. నా కంటికెదురైనది స్త్రీ రూప దివ్యలీలా సాక్షాత్కారము కాదనియు,

సజీవమైన మానవమూర్తియే యనియు గ్రహించితిని. ఆమె ఒగర్చుచు వేవేగముగా శ్వాస విడుచుచున్నప్పుడు విడివడి వ్రేలాడుచున్న ఆమె కురులల్లాడుచుండెను. ఆమెకండ్లు కొంచెము తెల్లబారియుండెను. కాని వేగు చుక్కవలె తళతళలాడు చుండెను. వంచిన విల్లువలె తీర్చిన కనుబొమ్మల క్రిందనున్న నల్లని గ్రుడ్లకు అంచు వలె నున్న రెప్పలమీదికి-వెంట్రుకలు నల్లని కాటుక రంగుతో మెంపెసలారుచుండెను. ఆమెముఖము సొగసుగా, సొంపుగా నవ్వులొలుకుచున్నది. నాజూకైన ఆమెశరీరవైఖరి చూస్తే పాతికేండ్ల మనిషివలె నున్నది. లేతపచ్చనిరంగు చీర కట్టుకొనియున్నది. ముంజేతులకు బంగారు గాజులు, కంఠమందు కమ్మని వాసనలు వెద జల్లెడి చామంతి పూలదండ మనోహరముగా శోభించు చున్నవి.

"నా పేరు కృష్ణకాళి అంటారు. నా పేరు మీకు సొంపుగా ఉన్నదా?" అని ఆమె నన్ను అడిగింది.

"నీ పేరు అందంగా ఉంది. నీవుకూడా అందంగానే ఉన్నావు" అని నేను అన్నాను.

ఆ మాటకు ఆమెకళ్లల్లో సంతోషం తొంగి చూచింది.

"నాతల వెంట్రుకలు ఎలా వంకరలు తిరిగినవో చూడండి; అవి నా మోకాళ్ల వరకు వ్రేలాడుచున్నవి. నాకంటె సొగసైనవారెవరైనా యీ ప్రాంతంలో ఉన్నారా? నా ఒంటి చాయ చూడండి. అంత పచ్చ బంగారమూ కాదు; కందగడ్డవలె ఎరుపూ కాదు." అని ఆమె అక్కడనే నిలవబడి నాతో అన్నది.

ఆమె తన మృదువైన చేతులు రెండూ విరిసిన తామరపూవులవలె పైకెత్తి "అరచేతులను పద్మములతో ఎందుకు పోలుస్తారో చూడండి. నా చేతి గోళ్ళు చూడండి-పండు దానిమ్మగింజలవలె మెరుస్తున్నాయి" అన్నది.

ఆ మాటలు ఆమె పల్కినదేకాని, నా జవాబు కొరకు ఆమె ఎదురుచూచలేదు. తన ధోరణిలో తాను సంభాషించుచునే యున్నది.

"చంద్రుని చక్కదనమును జ్ఞప్తికి తేగల ముఖము గలవారి నింకెవరినైనను మీరు చూచినారా? నిజంగా చెప్పండి" అన్నది.

నేను ఉన్నది ఉన్నట్లుగా నిజం చెప్పాను. "లేదు. ముమ్మాటికీ లేదు. ఇంతటి సౌందర్యరాశిని నా జీవితంలో ఎన్నడూ చూడలేదు" అన్నాను.

"ఈ జీవితంలో మాత్రమే చూడలేదంటారా?" అని ఆమె నిట్టూర్పు విడిచింది. "ఊర్వశి కనుబొమలు విల్లువలె యింత వంపుగా నా కనుబొమలవలె ఉన్న వంటారా? రంభకైన నవ్వుపువ్వులవలె నా ముక్కు తీరు ఉన్నదంటారా? నేను తిలోత్తమకు సాటి అంద కత్తెనని మొగవాళ్ళు మెచ్చుకున్నారు. అందమైన వస్తువుల పొందికవల్ల నేను సృష్టి చేయబడ్డాను. అప రంజి, ముత్యాలు, వజ్రాలు, పరిమళపుష్పాలు, సూర్య కాంతి, ఆకాశంలోని నీలవర్ణం—అన్నింటినీ చేర్చి సృష్టించిన సౌందర్యం నాది. నిజంగా చెప్పండి. ఇంకో జన్మలోనైనా నాసరే, నాకంటే అందమైనదానిని మీరు చూడగలవని అనుకుంటారా?" అని అడిగింది. ఆమెకంఠస్వరంతో నా ఒళ్ళు పులకరించింది. ఆమె అడిగిన దానికి జవాబుగా యిలా అన్నాను: "సర్వాంగ సుందరమైన మనోహరరూపము ప్రతియుగములోను కన్పిస్తుందా? శతకోటి జన్మాలలో ఒక్కసారియైనను అటువంటి అందాలరాణిని చూడడంవల్ల జీవితం ధన్య మైనట్లే—నిత్యమైన బ్రహ్మానందపదవి లభించినట్లే."

నా మాటలకామె ఆనందపరవశురాలైంది. తన చేతులలో నన్ను కౌగిలించుకొన్నది. పట్టువలె మృదువైన ఆమెకురులు నా కంటికి అద్దుకొనినట్లయి నది. ఆమె మెడలోని పూలహారమునందొక పువ్వును నలిగి రెక్కలు ఊడి నేలపై బడెను.

ఎందుచేతనోగాని, ఆమెముఖము అంతలో చింతాక్రాంత మయ్యెను. సూర్యుడస్తమించిన కొంత సేపటికి సంజకెంజాయలు అలముకొనినట్లయ్యెను. ఇంతకుపూర్వం ఆమెకంటిలో తళుకుమని మెరసిన వింతకాంతి యిప్పుడు లేదు. గుండెబరువుతో మాట లాడుచున్నట్లుగా కంఠస్వరము మారినది.

"కాని, ఒక్కటే ఒక్క లోటు ఉన్నది. భగవంతు డిచ్చిన సౌందర్య మేదో నాకు ఉన్నది. కాని ఆ భగవంతుడు నాకు హృదయ మనేది యివ్వ లేదు. హృదయము నిచ్చుటకు బదులుగా నన్నని రాతిగుండు నక్కడ పొందుపరచినాడు. కావలెనంటే ఇక్కడ చూడు. నా గుండెమీద చెయ్యిపెట్టి చూడు. ఆ గుండె కొట్టుకొనడంగాని నీకు ఏమైనా విన్పించుచున్న దేమో చెప్పు" అన్నది.

కంపించి కంపించి కలవరింతగా పలుకుచున్న ఆమెమాటలను వినేసరికి, నిజంగా ఆమెరొమ్ముమీద చేయివేసి చూడగా ఆమెకు గుండెకాయ కొట్టుకొను చున్నట్లుగా నాకు కన్పించనేలేదు.

ఆమె నన్నుచూచి, "రాతిగుండు కొట్టుకొనునా? రాతికి ప్రేమరస ముండునా ! నేను చిన్న పిల్లనై యుండినప్పుడు కూడ ముద్దు కొక పిల్లికూననైనను నా ఒడిలో కూర్చుండబెట్టుకోలేదు. చిన్న పిట్టనైనను చేతబట్టి మక్కువపడి దాని రెక్కలపై మునివ్రేళ్లతో దువ్వియుండలేదు. నాకు ప్రేమఅనేది ఎవ్వరిమీదనూ ఇంతవరకూ లేదు. నా తండ్రిమీద, నా తల్లిమీదకూడా నాకు ప్రేమ అనేది లేదు." అన్నది.

బహుశః నా ముఖమైఖరిలో ఏదోమార్పు కన్పించింది. అందువలన ఆమె తత్తరపాటుతో నా చెయ్యి పట్టుకొని, "కాదు-కాదు. నీవు దురభిప్రాయపడవద్దు. నేను వాళ్ళని ప్రేమించలేదనే సంగతి వారి కెన్నడూ తెలియదు. వారికి ఒక్కగా నొక్క బిడ్డనైన నాకు హృదయ మనేది లేదని వారు స్వప్నంలోకూడా అనుకో లేదు. వారి యెడల నేను భక్తితాత్పర్యములతో, వినయ విధేయతలతోనే ఉండేదాన్ని" అన్నది.

కొంచెం సేపు ఆమె నిశ్శబ్దంగా నిలవబడి తిరిగి యిలా ప్రారంభించింది:

"నా పినతండ్రి కూతురైన మేఘమాలను శంకర దేవుకు యిచ్చి వివాహం చేయ నిశ్చయించారు. అతడు ఇదివరకు కొకసారి నన్ను చూచినాడు. ఆమెను పెండ్లిచేసికొనుటకు నిరాకరించాడు. సంబంధం నిశ్చయించుకొని పెద్దలందరూ ఆశీర్వాదం చేయవలసిన రోజు వచ్చింది. ప్రధానం చేసి తాంబూలాలు పుచ్చుకోవలసిన రోజున అతడు ఆ పిల్లను "పెండ్లి చేసుకోను" అన్నాడు. అటువంటిది ఎక్కడయినా జరుగునని అనుకుంటావా? తనకు ప్రధానం జరుగుతుం దని మేఘమాల ఎదురుచూస్తోంది. తన నలుపు రంగు దేహాన్ని కప్పిపుచ్చుకుంటూ, నొసట మంచి గంధం అలముకొని చక్కని బనారసు సిల్కుచీర సింగారించి ఎదురుచూస్తోంది. కాని, ఏం లాభం ? ప్రధానం జరుగనే లేదు."

ఆమె ఆ మాటలు అనగానే నాకు ఆశ్చర్యం కలిగి, "అయితే, నీవు అతనిని పెండ్లిచేసుకున్నావా ఏమిటి ?" అన్నాను.

కృష్ణకాళి నావంక తేరిచూచి "అత డేమంత చక్కనివాడు? అతనికి ఉన్న గొప్ప సుగుణా లేమిటి? అత డేమైనా భాగ్యవంతుడా ? ఆస్తిపరుడా ? అతడు అటుపిమ్మట సన్యసించి ఎక్కడికో వెళ్లిపోయినాడు; ఎక్కడికి వెళ్ళిపోయినాడో నాకు గుర్తులేదు" అన్నది.

"అయితే, మేఘమాల ?" అని నేను అడిగాను.

"మేఘమాల సంగతి ఏముంది ! ఆమె ఎప్పుడో గతించినది" అని చెప్పి ఆమె కొంచెము ఆగి తిరిగి యిలా అంది:

"రారాజులంతటివాళ్ళు నన్ను వరించడానికి వచ్చారు. ఎర్రసిల్కు చీరనే సదా ధరించి వాళ్ళ నందరినీ నేను తిరస్కరించాను. కొందరు పరదేశాల పాలైనారు. కొందరు ఆత్మహత్యలు చేసుకొన్నారు. కొందరు మతదీక్షులు గైకొన్నారు. వారిలో ఎవరో కొద్దిమందిమాత్రము రోషంచేత సామాన్యమైన పిల్లలను పెళ్ళిచేసుకున్నారు. నన్ను వరించినవా ళ్ళందరూ పట్టుపీతాంబరాలు, మేలైన ముత్యాలసరాలు వజ్రాల హారాలు నాకు కానుకలుగా తెచ్చియిచ్చారు. దీపక్ అనే ఒక కుర్రవాడుమాత్రము తాను పేదవాడగుటచేత నాకు పువ్వులు తెచ్చి సమర్పించాడు. ప్రతిరోజూ ఆ కుర్రవాడు నాకడ్డకు వచ్చి, "ఏమీ లేనివాడను నేను. నీకు నేను ఏ మివ్వగలను !" అని అంటూ ఉండే వాడు. అదంతా చూడగాచూడగా నాకు చీకాకు పుట్టింది. "నాకోసం నీవు మంచిముత్యాలు, ఆభరణాలు దొంగిలించి తీసుకొని రాలేకపోతే, నామీద

ప్రేమ ఉన్నదనే బడాయిమాటలు నాతో చెప్పవద్దు" అన్నాను. చివరకు ఆ కుర్రవాడు నిజంగా ఆప్రకారం గానే దొంగతనం చేశాడు. అతనిని పట్టుకొని జెయిలులో పెట్టినారు."

ఇదంతా చెప్పుతూఉంటే నేను మౌనంగా వింటూఉన్నాను. అప్పుడు కృష్ణకాళి మెల్లిగా నా చెయ్యిపట్టుకొని ఊపి, "నా మనస్సులో ఉన్న సొద అంతా నేను చాలాకాలంవరకు ఎవరికీ చెప్పుకోలేదు. నేటికి మీరు కన్పించారు. మళ్ళీ నా మనస్సు హాయిగా ఉంది. మీరు కూర్చోండి. ఎక్కడ కూర్చుంటారు? ఇక్కడ నక్షి చెక్కిన కుర్చీలు ఉండేవి. అటువంటి చక్కని మా కుర్చీలన్నీ ఏమైనవో నాకు తెలియడం లేదు" అని కృష్ణకాళి ముగించింది.

"కృష్ణకాళీ, నీవు ఆందోళన పడవద్దు. నాకు ఇక్కడ సుఖంగానే ఉంది. ఇప్పుడు మనమిద్దరమూ చేరినాముగనుక, నీవు చెప్పదలచిన దేమిటో నాకు చెప్పు" అని ఆమెను కోరితిని.

"అయితే వినండి" అని చెప్పింది: "మాళవిక అనే అమ్మాయి నాకు ప్రియమైన స్నేహితురాలు. నాకోసం ఆమెభర్త ఆమెను విడిచిపెట్టినాడు. కాని అతనిని నేను స్వీకరించలేను. నేను ముచ్చులమారిదానినని మాళవిక మొదట్లో నన్నుగూర్చి అన్నది. కాని ఆమె భర్తను నేను తిరస్కరించి పంపివేసినప్పుడు నేను చాలా క్రూరురాలనని ఆమె అన్నది. అనేక యుగాలనుంచీన్నీ నావంటి అందకత్తెలు సుఖంగా ఉన్న అనేకసంసారములను దగ్ధము చేశారు. నా తలిదండ్రులు ఎంత దుఃఖించారో నాకు తెలుసు. కాని వారు చిరకాలము యీ దుఃఖమును అనుభవించలేదు. మన పెద్దలందరూ ఏ కాలప్రవాహములో లీనమైనారో వారుకూడా అందులోనే లీనమై అంతర్ధానమైనారు. నేనుమాత్రం అపారఐశ్వర్యంతోను, పుష్పించిన సౌందర్యంతోను మిగిలియున్నాను చిట్టచివరకు యిన్నేళ్ళయినతర్వాత నా జీవితచైతన్యమునకు సూర్యరశ్మి సోకింది. నా యౌవనవనంలో పక్షులు కిలకిలమన్నాయి. అంకురములు మొగ్గతొడిగి పుష్పించాయి. నా అంతరంగరహస్యగృహాంతరములోనికి అమితాభుడు ప్రవేశించాడు. ఒక్కక్షణంలో నా హృదయస్థానంలో ఉన్న శిల కరిగి జలమైపోయింది.

అతనిని నేను పెళ్లి చేసుకున్నాను. ఏడే రోజులు అతనితో నేను దేవేంద్రభోగం అనుభవించాను. ఎనిమిదో రోజున నేను నిద్రలేచి చూచేసరికి అమితాభుడు కన్పించలేదు. నా నగలు, ఆభరణాలు, వజ్ర వైడూర్యములు తీసికొని అతడు పారిపోయినాడు. బంగారంతో నిండిన నాపెట్టె, నా ఖజానా అంతా నాకు యీ జీవితంలో లేకుండా అదృశ్యమై పోయినవి. అప్పుడు నా హృదయం దహించుకొనిపోయి తపించి ఏడ్చింది. అప్పుడు మేఘమాలను, శంకరదేవును, దీపక్ ను, మాళవికను తలుచుకొని విలపించాను."

అని కృష్ణకాళి ముగించి పైమేడమీద కొంచెం పగిలియున్న ఒక ధనురాకారద్వారమును వేలుపెట్టి చూపించింది.

"అక్కడి నుండి నేను క్రిందకు పడితిని. ఆకాశవల్లిపూలు కుప్పలుతిప్పలుగా పడియున్నచోట-ఇక్కడ క్రింద పడితిని. నా శరీరసౌందర్య మింకను వాడిపోలేదని నీ నోటితో అంటే వింటాను. నాకంటే అందకత్తె ఈలోకంలో ఉండదని నీవు అంటే చాలు. నీవు యీ జన్మలోగాని, యింకో జన్మలోగాని ఇంతటి సౌందర్యమును నేలమీద గాని, నీటిమీద గాని, ఆకాశంలో గాని ఏ యుగంలోనైనా చూచియుంటావా? చెప్పు; నిజంగా చెప్పు" అని ఆమె ఒక్క నిట్టూర్పు విడిచింది. తుపానుగాలి వీచినట్లుగా నిట్టూర్పు విడిచింది.

నాకు అప్పుడు ఆవేశంగా వచ్చిన ఆవేదనలో, "ఓ కృష్ణకాళీ! కృష్ణకాళీ! నీ వెవరు ? నీ వెక్కడున్నావు ?" అని అరచాను.

అప్పటికి వర్షం వెలిసింది. మేఘాలు విడిపోయినాయి. అస్తమిస్తున్న సూర్యుని కాంతిపుంజములు దొడ్డి ఆవరణలోనికి చొచ్చుకొని వచ్చాయి. ఆ సువర్ణభాను దీప్తిలో ఇక నాకు కృష్ణకాళి కన్పించలేదు.

చెట్లకొమ్మల సందులనుండి వీచుచున్న గాలి మాత్రము నా చెవిలో గుసగుసలాడుచు "నేలమీదగాని, నీటిలోగాని, ఆకాశంలోగాని ఇటు వంటిసౌందర్యరాశి ఎక్కడవున్నదో నాకు చెప్పు" అని మెల్లిగా ధ్వనిస్తోంది.



మలబారులో మహాప్రసిద్ధుడై, యశఃకాయుడైన మహాకవి కుమారఆశాన్
సిద్ధహస్తులైన శ్రీ దేవీప్రసాదరాయ చౌదరిగారు (ప్రక్కన నిలుచున్నవారు) కాలికట్టులోని ఆశాన్ స్మారకసమితివారికై తయారుచేసిన రూపప్రతిమ.

బంతిపూలు

మించు నునుమంచుతుంపరల్ మిగుల సోకి
రేకు రేకున బరువు భరించుచుండి
పరిమళము ప్రీలు సంక్రాంతిబంతిపూలు
చెందు గ్రుచ్ఛద మన్న, గాసి జనియించు.
ఇంటనింటను వాకింట నంటియున్న
మురువుగొబ్బిళ్లలో బరాబరులు తీరి
పేడపురువులు మునరి సేవించుచుండ
బంతిపువ్వు రాచవాని కేమంత సుఖము!
పైని కాషాయవర్ణవిభ్రమము వలువ
లోన సౌరభలేశము లేని రజము
పెంపు; విగ్రహపుష్టి నైవేద్యనష్టి
యెందు కీ బంతిపూల యానంద మిపుడు ?
ద్వారతోరణమాలలుగా రచించి
గృహగృహమునందు దిద్ది తీరిచిరి మిమ్ము
గంధ ముండెను, లేకుండెఁగాక, మీది
రాజ్యమై వెల్గు నేఁడు సంక్రమణవేళ.
పొడవుమెడ సాచుకొని బంతిపూవు నన్ను
వెక్కిరించునె ! సంక్రాంతివిభవవేళ
నా కిది మహామహోత్సవశ్రీకటాక్ష
సంక్రమణపుణ్యరమణీయసమయము కదె ?
పౌషపర్వము లెన్నొ రావచ్చు ముందు;
ఇంక రాఁబోవు మహమున నేని నీకు
వలపుఁబన రేకు రేకున వెలయుఁగాత !
దెసదెసల భక్తి నిన్నుఁ గీర్తింత్రుగాత !

శ్రీ మధునాపంతుల
సత్యనారాయణశాస్త్రి

క్రీ. శ. 1607లో విజయనగరము

పాదిరీ రూబినో వ్రాసిన వృత్తాంతము

•

— శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ —

క్రైస్తవమతమును మన హిందూదేశమున వ్యాపింపజేయుటకు వచ్చిన మొదటి మతబోధకులు (మిషనరీలు) జెసూట్ ఫాదిరీలు (జెసూట్‌ఫాదర్సు) ఇందువలననే ఏ క్రైస్తవమతసంప్రదాయమునకు చెందిన మతాచార్యులకైనను మన భాషలో పాదిరీ (ఫాదరు పదము తద్భవము) అనియు, క్రైస్తవుల ఆలయము(చర్చికి) నకు పాదిరిగుడి అనియు పేర్లు కలిగినవి. హిందూదేశమునకు వచ్చిన జెసూట్‌పాదిరీలు పదునారవ శతాబ్దిలోను, పదునేడవ శతాబ్దిప్రారంభకాలమునను వేరువేరు ప్రాంతముల స్థిరపడి ఇక్కడి భాషలు నేర్చుకొని తమ సంఘీయుల ఉపయోగము నిమిత్తము ఆభాషలకు వ్యాకరణములను, నిఘంటువులను వ్రాసి ప్రజలలో మతప్రచారము కావించుచు వచ్చిరి. దక్షిణహిందూదేశమున వారి ప్రధానస్థలము మధుర. పాదిరి 'డి నోబిలి' యును, పాదిరి 'బెషి' యును తమిళభాషకు వ్యాకరణాదికములు వ్రాసినంతవరకు ఈ పాదిరీలు తమిళగ్రంథములను జదివి వాటిలోని విషయమును గ్రహింపలేకపోయిరి. మధుర 'మిషను'లోని పాదిరీలు యూరోపులోని తమ యధికారుల యాదేశము ననుసరించి, ఇక్కడి ప్రజలనుగురించి, వారి రాజులనుగురించి, వారి సాంఘికమతాచారములను గురించి తాము చూచిన, వినిన, తమకు దెలిసిన విషయములను వ్రాసి పంపుచుండెడివారు. వీటికి 'మధురమిషనువారి వృత్తాంతములు' (Records of the Madura Mission) అని పేరు. ఇప్పుడు ప్రకటిత మగుచున్నది అట్టి వృత్తాంతములలో ఒకటి; పాదిరి రూబినో వ్రాసినది.

పాదిరి జాన్ అంటోనియో రూబినో సిరోము 'ఫిషరీకోస్టు'కు 'రెక్టరు' గా నియమితుడై తూత్తుకుడిలో కొంతకాలముండెను. ఇండియామిషనుతో అతనికి ౧౬౩౮ వరకు సంబంధము గలదు. అటుతరువాత ఈ మతాచార్యుడు జపాను వెళ్ళి నాగసాకి పట్టణమున ౧౬౪౩-వ సంవత్సరములో మరినలుగురు సహవాసులతో తన మతముకొఱకు తన ప్రాణము లర్పించెను. రూబినో విద్వాంసుడు, మతాచారపరుడు, శీలసంపన్నుడు.

నే నీనడుమ ఒకానొక విషయమునుగుఱించి పరిశోధించు సందర్భమున తిరుచనాపల్లి సెంట్‌జోసెఫ్‌కాలేజి పత్రిక ప్రాతసంచికలను తిరుగవేయుట తటస్థించినది. అపత్రిక ౧౯౧౯-వ సంవత్సరపు జూలై సంచికలో ఈ వృత్తాంతము ప్రకటితమై యుండుట చూచి సంతోషపడితిని. స్వర్గీయ శ్రీ పి. టి. శ్రీనివాసఅయ్యంగారి ప్రోత్సాహమున ఆంగ్లములోని కిది పరివర్తితమై ప్రకటింపబడిన దట. పాదిరి రూబినోనుగురించి పైని తెలిపిన విషయములు అపత్రికలోని 'పీఠిక' నుంచి గ్రైకొన్నవి.

పాదిరి రూబినోప్రస్తావము పాదిరి హెరాస్ విరచితమైన 'విజయనగరఆరవీటివంశచరిత్రము'నగూడ గలదు. పాదిరి రూబినో క్రీ శ ౧౬౦౬లో విజయనగరాస్థానమునకు వచ్చెను. ఈ మతాచార్యుడు గొప్ప గణితశాస్త్రవేత్త యట; గొప్ప వేదాంతి; గొప్ప మతబోధకుడు. ౧౬౦౭ ప్రారంభములో చంద్రగిరికి వచ్చి అచ్చటనే నివసించుచు వచ్చెను. ౧౬౦౬ లో వెంకటపతిరాయలు తన రాజధానిని వేలూరికి మార్చినపుడు రూబినో రాయల దర్శనము చేయుట కక్కడికి వెళ్ళి తెలుగ పేర్లతో నున్న ప్రపంచపటమును Map of the world) రాయలకు కానుకగా నిచ్చెను. ఆ సందర్భమున వెంకటపతిరాయలు రూబినోతో గణితశాస్త్రరహస్యములను గుఱించి చర్చించెనట. రూబినో ఆ సందర్భముననే రాయలకు జ్యోతిశ్శాస్త్రగ్రంథము నొకటి సమర్పించెనట. ౧౬౦౮ లో వెంకటపతిరాయలు సెంట్‌థోమును (పోర్చుగీసులవలన) ముట్టడించినపుడు పంధిషరతులు మాటలాడుటకు రాయలయొద్దకు వచ్చుచుండిన

రాయబారులలో పాదిరి రూబినో ఒకడట. పాదిరి రూబినో వేలూరునుంచి ౧౦-వ సెప్టెంబరు ౧౬౦౮ లోను, సెంట్ థోమునుంచి ౨౫-వ నవంబరు ౧౬౧౦ లోను వ్రాసిన రెండుత్తరములను (పోర్చుగీసుభాషలోవివి) గూడ ఫాదరు హెరాస్ గారు తమ గ్రంథము అనుబంధములలో ప్రకటించియున్నారు. పై నుడివిన విషయములన్నియు వారి గ్రంథమునుండి తీసినవే.

తెలుగు దేశచరిత్ర కీ వృత్తాంతము అమూల్యమైనదని, ముఖ్యమయినదని యెంచి దానిని తెనిగించి యిందు ప్రకటించుచున్నాను. ఈ వృత్తాంతమున అళియరామరాయలవరకు రూబినో వ్రాసిన విషయములు సరిగ లేవు; విశ్వసనీయములు కావు. అయినను వృత్తాంతము సమగ్రముగ నుండుటకై యున్నయట్లు ప్రకటించుట ఉచితమని ఆ మొదటిభాగమునుకూడ ప్రకటించితిని. సదాశివరాయల కార్యకర్తయు, ప్రధాని దండనాయకుడును అయిన రామరాయల యొద్దనుంచి రూబినో చెప్పిన విషయము లమూల్యమయినవని నా యభిప్రాయము. వీనిలోని సత్యాసత్యత్వములను ఇతరసాక్ష్యము నాధారమున స్థాపింపవలసియుండును.

ఈవృత్తాంతములోని Idalcan (ఇదల్ కాన్) ఆదిల్‌షా (విజాపురపు సుల్తాను) గను Isamaluco (ఇసమలుకో) నిజాంషా (అహ్మదునగరపు సుల్తాను) గను, Cotameluco (కొతమెలుకో) కుతుబ్‌షా (గోల్కొండ సుల్తాను) గను, Treodam (త్రియోదం) దుర్యోధనునిగను, Arlinda (అర్లింద) అమృతరాయనిగను శ్రీ శ్రీనివాసఅయ్యంగారే గుర్తించిరి.

మ. సో. శర్మ]

విజయనగరరాజ్యములోని విబుధులు ప్రపంచమున నాలుగుయుగము లుండెనని చెప్పుదురు. మొదటిది క్రేదె యుగము (కృతయుగము). దీని పరిమితి ౧౭,౨౮,౦౦౦ సంవత్సరములు. ఆకాలమున భగవంతుడు మనుష్యులతో మాటాడుచు వచ్చినట్లు చెప్పుదురు.

రెండవది త్రేదె యుగము (త్రేతాయుగము). దీని పరిమితి ౧౨,౯౬,౦౦౦ సంవత్సరములు. ఆ కాలమున సత్యము, దానము, ధర్మగుణములు మనుష్యులలో హెచ్చుగా నుండెను. ఆకాలములోనే వారి రాముడు, సిమితు (సీత) ఉండిరి. సింహళమునకు వెళ్ళి రాముడు తన భార్య నపహరించిన సింహళరాజు మూరు భుజములు, చేతులు గల సుప్రసిద్ధరాక్షసుడు రావణుని జంపెను. రాముని పెరుమాళ్ల గూడ అందురు. విజయము పొంది తిరిగివచ్చుచు పెరుమాళ్ళు రామనోస్సర్ (రామేశ్వరము) కడ్డ తన దేవునికి వందనపూర్వకముగా ఒక దేవళమును గట్టించెను.

మూడవది దువపరె (ద్వాపర) యుగము. దీని పరిమాణము ౮,౬౪,౦౦౦ సంవత్సరములు. ఏకాద్ది మందితో రహస్యముగా తప్ప భగవంతు డాకాలములో ప్రత్యక్షమగుట లేదని వా రందురు. ఈ యుగముననే ప్రపంచమునకు పెరుమాళ్ళు కృష్ణరూపమున గాన్పించెనట. తన సోదరుల సాయముతోను, పెరుమాళ్ల సాయముతోను త్రియోదం (దుర్యోధనుని) పూర్తిగా నాశముచేసిన ధమపుత్రం (ధర్మజుడు) ఈ యుగములోనే యుండెనట.

నాలుగవదానిని వారు కలియుగ మందురు; అనగా ఈ వర్తమానకాలము: అసత్య, అధర్మములతో గూడినది. దీని పరిమాణము ౪,౩౨,౦౦౦ సంవత్సరములు. కడచిన క్రీ. శ. ౧౫౨౦ వ యేడు ఈకలియుగ మారంభమైన తరువాత ౪౬౨౦-వ సంవత్సరమట.

ఈ కలియుగములో మొదట పరిపాలించిన మహారాజు జెనమస్సిక్ (జనమేజయుడు). రెండవ వాడు పరర్తిదమరాయలు[1]; మూడవవాడు సుంద్రోగ రాయలు[2]; నాలుగవ రాజు బికరమకుడు (విక్రమార్కుడు). వారు చెప్పు కథల ననుసరించి ఈ రాజు రెండువేల సంవత్సరములు జీవించెనట. అయిదవ యతడు బోజయరాయలు (భోజరాజు). ఇతని తరువాత మలబారు వారిలో ప్రసిద్ధులైన చేరక్ (చేర), చోళక్ (చోళ), పాండిక్ (పాండ్య) అను ముగ్గురు రాజులు రాజ్యము నంతను మూడు విభాగములు చేసి పాలించిరి. చెరక్ (చేరరాజు) ఇదల్ కాన్ (ఆదిల్‌షా - విజాపురపు

1. Parartidamarayalu—ఇతనిని గుర్తిపట్టుటకు వీలులేదు.

2. Sundregarayulu —ఇతడు చంద్రగుప్తుడేమో తెలియదు.

సుల్తాను), ఇసములుకొ (హుసేన్ నిజాంషా—అహ్మదు నగరపు సుల్తాను), విరిది (బరీదుషా) ల కోశముతో కలుపుకొని బెంగాలురాజ్యపు సీమాంధి నున్న కాశీ వాకు గల కెనరా దేశమున కంతకును, జామురిన్ దేశమునకును ప్రభువు. చోళేన్ (చోళ రాజు) నెగపటం (నాగపట్టణము) నుంచి బెంగాల్ (బంగాళము) వరకు గల సముద్రతీర దేశమున కంతకును రాజు. పాండ్యన్ (పాండ్య రాజు) కొచ్చిను మొదలు కన్యాకుమారి అగ్రమువరకును గల ప్రదేశమునకు గల ప్రభువు. ఈ ముగ్గురు రాజులును చాల ధర్మపరాయణులనియు, సిద్ధులనియు, లోకములోని అసూయ, అధర్మముల ప్రాబల్యమువలన వారు జనులకు గానరారనియు, ముందు రాగల పాపములను, అవకరములను వ్రాసిపెట్టియుండుటకు తాళవృక్షమును జూపి పోయిరనియు దేశీయులు చెప్పుదురు. వ్రాత ఈవిధముననే ఆరంభమైన దట.

ఈ ముగ్గురు రాజుల తరవాత వచ్చినవాడు జెంబురాయలు 3 (జంబుకేశ్వరరాయలు ?). ఇతని తరువాత క్సలినంజనక్సజన్ 4 (?) ఇతని యనంతరము కదికలక్సొలెన్ 5. ఇతని కాలముననే ఉత్తమ వర్ణములు విశ్వకర్మకులమువారినుండి విడిపోయె నని చెప్పుదురు. అతని తరువాత ఇతరులు మరికొందరు పాలించిరి. చివరికి ఈ రాజ్యమున కంతకు దోదబరుదరమ్ 6 (? ప్రతాపరుద్రుడు) ప్రభువయ్యెను. ఇతని యనంతరమున నబినచక్రబత్ (? నవీనచక్రవర్తి) రాజ్యము చేసెను. ఇతని మరణానంతరము అరియురాయలు (హరిహర రాయలు) సింహాసన మెక్కెను. ఈ రాజు తరువాత రాజ్యము చేసినవాడు పరపుదేవరాయలు (ప్రౌఢదేవ రాయలు). ఇతని యనంతరము వచ్చిన వారసుడు నరసింగరాయలు. ఈతని కాలముననో, లేక అంతకు కొంచెము ముందో పోర్చుగీసువారు హిందూదేశమునకు వచ్చిరి. ఈ రాజు ననుసరించియే ఈ రాజ్యమునకు 'నరసింగరాజ్య'మని 7 పేరు వచ్చినది. పైన చెప్పిన ప్రభువునకు తరువాత రాజ్యమునకు వచ్చినవాడు వీర నరసింగరాయలు. ఇతడు ఇరువదియొక్క సంవత్సరములు పాలించెను 8. ఇతని యనంతరము క్రిసనరాయలు (కృష్ణరాయలు) మరల నన్ని సంవత్సరములే (ఇరువదియొక్క యేండ్లు) రాజ్య మేలెను. ఇతడు మరణించిన వెనుక అఛ్లిందరాయలు (? అచ్యుతరాయలు) సింహాసనమెక్కి పండ్రెండు సంవత్సరములు రాజ్యము చేసెను 10.

ఈ రాజుతరువాత న్యాయ్యముగా హక్కు ప్రకారము సింహాసన మెక్కవలసినవాడు సదాశివ రాయలు; కాని అతడు చాల చిన్నవా డగుటచేత అతనిని వెనుకకు నెట్టి అతని మామ 11 రామరాజే రాజ్యము చేసెను.

ఈ రామరాజు చాల శౌర్యపరాక్రమములు కలవాడు. ఇతడు తన పొరుగున నున్న మూరుల (తురకల) అందరి రాజ్యములను జయించెను. ఇతడు వెళ్ళి ఇసములుకొ (నిజాంషా) రాజధానియగు అద్దె నగరము (అహ్మదునగరము)ను నాశము చేసి తన సామ్రాజ్యమును బెంగాలులోని పలెపెట్టో 12 అను చోటువఱకు వ్యాపింపజేసెను. ఎల్లప్పుడు నితని సేనలో నాలుగు వేల యేనుగులును, ఇరువది వేల గుఱ్ఱములును, అరువది లక్షల పదాతులు నుండువారు. ఇటువంటి సేనతో మూరు (తురక) రాయల రాజ్యములను,

---

3. Gemburayalu.

4. Xalinanjanaxagan—ఇతనిని గుర్తింప గాలేదు.

5. Cadicalaxolen—ఇతనిని గుర్తింపగాలేదు.

6. Duodabarudaram.

7 Kingdom of Narsinga.

8. సాళువగుంప నరసింహరాయల చివరి శాసన కాలము క్రీ. శ. ౧౪౯౦ (Further Sources, Vol. I, p 146 ; కృష్ణరాయలు పట్టాభిషిక్తుడయిన వత్సరము క్రీ. శ. ౧౫౦౯-౧౦ (Ibid, p. 188).

9. అచ్యుతరాయలు క్రీ. శ. ౧౫౨౯ (Ibid, p. 23?) లో సింహాసన మెక్కెను.

10. అచ్యుతరాయల మృతి క్రీ. శ. ౧౫౪౨ (Ibid, p. 238).

11. ఇక్కడ ఇంగ్లీషుమాట uncle. సదాశివ రాయలకు రామరాయలు మామ కాడు. సదాశివ రాయలు కృష్ణదేవరాయల సవతి తల్లి కొడుకు రంగ రాయల తనయుడు. రామరాయలు కృష్ణరాయల అల్లుడు. అందువలన రామరాయలు సదాశివరాయలకు బావమఱదివరుస యగును.

12. దీనిని గుర్తింప గాలేదు.

నగరములను తీసికొని అతడన్నిటిని పూర్తిగా నాశనము చేసెనని చెప్పుదురు.

ఇది యంతయు ఇసములుకొ (నిజాంషా)కు అమితమైన కష్టము కలిగించెను. ఈ యవమానమును పోగొట్టుకొని పగ తీర్చుకొనుటకు నిశ్చయించి తన యిరువురు కూతుండ్రను ఇదల్ కాఁ (అదిల్ షా), కొతమలుకొ (కుతుబ్ షా) లను నిద్దఱు మూరురాజులకు నిచ్చి పెండ్లి కావించి వారి సహాకారమును సంపాదించెను. ఈ మువ్వురు తురక ప్రభువులు కలిసి తమ సైన్యముల నన్నిటిని గలియజేర్చి బిస్నగర్ (విజయనగరము) మీదికి దాడివెళ్ళిరి.

ఇప్పుడు ఈ రాజ్యమును పాలించుచున్న రాజు తండ్రి తిరుమలరాజు రామరాజు సోదరుడు. ముగ్గురు సుల్తానులు కలిసి విజయనగరముమీద కత్తి కట్టి చాల గొప్ప పరాక్రమముగల సేన కూర్చుకొని వచ్చుట అతడు కనిపెట్టి, తన యన్న రామరాజుదగ్గరికి వెళ్ళి, రాష్ట్రమున కంతకును అపాయము సంఘటింపకే యుంటకంటె ఆ మువ్వురు సుల్తానులతోను సంధిచేసుకొనుట శ్రేయస్కరమని చెప్పెను. అందుమీదట రామరాజు ఉగ్రుడై అతడు తన సోదరుడు కానియెడల అట్టి సలహా నొసగినందుకు అతని నాలుక పట్టి పీకించివేసియుండు నని సమాధాన మొసగె నట. రాజాధిరాజు తన సామంతులకు వశంవదు డనుట సాధ్యమా?

మువ్వురు మూరులు (సుల్తానులు) నది దాటిరి. రాజుతోను, అతని యిరువురు సోదరులతోను పోరాడుటకు వారు సంసిద్ధులైరి. ఇసములుకో (నిజాం షా) రామరాజుతోను, ఇదల్ కాఁ (అదిల్ షా) తిరుమల రాజుతోను, కుతమలుకో (కుతుబ్ షా) వెంకటతురాజు (వెంకటపతిరాజు) తోను తలపడిరి [13]. వెంకటపతిరాజు బల మెక్కువగా నుండుటచేత పోరాడలేక కుతమలుకో (కుతుబ్ షా) అకస్మాత్తుగా వెనుకకు మరలెను. తిరుమల రాజు ఎదుర్కొని పోరాడినప్పటికి నిలువ లేక ఇదల్ కాఁ (అదిల్ షా) కూడ వెన్నుచూపెను. కాని, ఇసములకో (నిజాంషా) తన మిత్రులిద్దరు సుల్తానులును తన్నొంటివానిని జేసి విడిచిపెట్టి పోవుట చూచి, చావుకు సిద్ధపడి, దృఢనిశ్చయముతో తన సైన్యములను దీసికొని రామరాజుతో పోరాడెను. ఉభయపక్షములవారును సమాన శౌర్య పరాక్రమములతో పోరాడిరి. ఈ విధమున చివరి కొక దేమనగ రామరాజునకు పాదువురవు జరిగెను. రామరాజు గుర్రముమీదనుంచి క్రింద బడి పోయెను. వెంటనే అతనిని చెఱబట్టిరి. అంతటితో సైన్యమంతయు చెల్లాచెదరుగ పారిపోవుట యారంభించెను. కొద్దిగంటల కాలములో ఆ సేన శత్రువుల కత్తి కెరయైనది. మూరురాజులు (సుల్తానులు) రాజ్యములోని అనేకనగరములకును, దేశములకును, అందు ముఖ్యముగా రామరాజురాజధానియైన విజయనగరమున కధిపతులైరి. విజయనగరము చుట్టుకొలత పదునేను మైళ్లు; దాని వ్యాసము ఆరు మైళ్ళు. అంతటి మహానగరము సంపూర్ణముగ విధ్వంసమైనది. ఒకప్పుడు పెనుకు రాజధానియైన నగరమువలెనే ఇప్పుడు విజయనగరము పెద్దపులుల గుహ యైనది. ఈ విధముగా సామ్రాజ్యము చాల క్షీణించిపోయినది.

రామరాజుతరువాత అతని సోదరుడు తిరుమలరాజు సింహాసన మెక్కెను. అతడు యుద్ధరంగమున నుంచి గాయపడి తప్పించుకొని వచ్చెను [14]; ఇప్పటి రాజుగారి తండ్రి. అతడు రాజబిరుదముతో మాత్రము పదుమూడు నెలలును, మహారాజబిరుదముతో పదునొకండు మాసములును మొత్తము రెండుసంవత్సరములు [15] పరిపాలించెను. తిరుమలరాయలు చనిపోయిన తరువాత అతని కొడుకు సిరంగరాయలు (శ్రీరంగ

---

13. ఈ యుద్ధము కృష్ణాతీరమున రాక్షసతంగడి యొద్ద క్రీ. శ. ౧౫౬౫ లో జరిగినది. ఇదియే తల్లికోట యుద్ధమని ప్రఖ్యాతమయినది. విజయనగరముమీది కెత్తివచ్చిన సుల్తానులు ముగ్గురు: హుసేన్ నిజాంషా, అలీ ఆదిల్ షా, ఇబ్రాహీం కుతుబ్షాలు.

14. యుద్ధములో ఇతని కన్నొకటి పోయినది.

"అన్నాతి గూడ హరుడవు
నన్నాతిం గూడకున్న నసురగురుండౌ
నన్నా! తిరుమలరాయా!
కన్నొక్కటి లేదుగాని కంతుడ వౌరా!"

అన్న చాటు వీతనిని సంబోధించుచు చెప్పినదే.

15. తిరుమలరాయలు పెనుగొండలో క్రీ. శ. ౧౫౭౦ లో పట్టాభిషిక్తు డయ్యెను (Further Sources, Vol. I, p 298). కొండకేటి కైఫియతులోని శాలివాహన శకము ౧౪౯౪ ఆంగిరస, వైశాఖ శు. ౧౩ (క్రీ శ. ౧౫౭౨ ఏప్రిల్ ౨౫) నాటి ఒక శాసనము ననుసరించి తిరుమలరాయల పరిపాలన మా వత్సరముననే ముగిసినది (Ibid.)

రాయలు) సింహాసన మెక్కి పదునాలుగేండ్లు 16 రాజ్య మేలెను. అతని యనంతరము అతని తమ్ముడు వేంకటపతిరాయలు రాజ్యమునకు వచ్చెను17. ఇతడే యిప్పటి రాజు. ఇతని కిప్పుడు అరువదియైదేండ్లవయస్సు. ఇది యతడు రాజ్యమునకు వచ్చి ఇరువదిరెండవ సంవత్సరము.

వెంకటపతిరాయలు కట్టు, బొట్టు, జుట్టు మొదలైన వేషమునకు సంబంధించిన అన్ని విషయముల లోను చాల శ్రద్ధ తీసికొనును. అతడు పొడుగరి; చక్కని అంగసౌష్ఠవము గలవాడు; ఎర్రగ నుండును; అతని రాజ్యమంతటిలోను మిక్కిలి చక్కని వాడు; చాల పౌరుషశాలి; ఒడ్డుపొడుగులు గల రూపసి. అతడు చాల వివేకవంతుడు; గంభీరుడు. సంభాషించునప్పుడు అతడు తూచి మాటాడును; మితభాషి. అతడు తన భాషలలో గొప్ప పరిజ్ఞానము కలవాడు...17a అన్న అతనికి చాల అభిమానము. ఇందువల్ల సాధారణముగా ప్రతి దినమును అతడు చాలగంటలు మత కథలు చదువుననో, ఆ సందర్భమున చర్చించుననో బ్రాహ్మణులతో గడపుచుండును. అతడు చాల గొప్ప యోధుడు కూడను. యుద్ధరంగమున అప్రతిమాన శౌర్యశాలి. చాల మర్యాదస్థుడు; అందరి యెడల దయగలవాడు. నైతికముగా దోషులను దండించుటలో నుండవలసిన న్యాయము, కాఠిన్యము అతనియొద్ద లేవు. ఈ కారణముచేత జనుల కతడన్న భయము లేదు; వారతని యెడల దమ యిచ్చ వచ్చినట్లు ప్రవర్తింతురు. అతడు క్రైస్తవమత గురువులగు పాదిరీలతోను, పోర్చుగీసువారితోను స్నేహముగా నుండును. అతనికి చిత్రలేఖన మన్న అపరిమితమైన ప్రీతి. 18 అతడు అందమైన వర్ణచిత్రమును లిఖించుచున్నప్పుడు ప్రక్క నొక క్రైస్తవమతాచార్యుని పెట్టికొని వినోదించుట అతని కలవాటు. సాధారణముగా అట్టి పాదిరి బర్తాలోమ్యూ ఫాంటెబోన్యా. ఇతడు కోటలోనే నివసించువాడు. తనకు ప్రీతిపాత్రములైన చిత్రపటములను గురించి వివరించుచు పాదిరీలు చెప్పు మన పవిత్రమతబోధలు వినుట యనిన వెంకటపతిరాయలకు చాల ఇష్టము.

దేశాచారము ననుసరించి వెంకటపతిరాయలకు చాలమంది భార్యలు కలరు; కాని మధుర, జింజి, తంజావూరు నాయకుల కున్నంత ఎక్కువమంది లేరు. ఆ నాయకుల కొక్కొక్కరికి మూడువందలు, నాలుగు వందల మందివరకు నున్నారు భార్యలు. కాని ఈరాజు ఆరు తడవలు వివాహముచేసికొనెను. ఈ యాగురు రాణులలోను ఒకతె కాలధర్మము నొందినది; మిగిలిన యైదుగురును సజీవులై యున్నారు. నిజము చెప్పవలె నన్న ఈ యైదుగురిలో రాణి ఒక్కతే. ఈ రాజునకు పుత్రసంతానము లేదు; ఒక్కతెయే కూతురు. ఆమెకూడ చనిపోయినది.

ఇతనితరువాత రాజ్యమునకు వచ్చుటకు హక్కు తన దన్న తన దని యతని అన్నదమ్ముల బిడ్డలు నలుగురు19 వివదించుచున్నారు. వీరిలో ప్రప్రథముడు తిరుమలరాజు. అతని కిప్పటికి నలువదివత్సరములు గలవు. న్యాయ్యముగా రాజ్యమునకు రావలసినవాడితడు; రాజ్యములోని రాజకుమారు లందరిలో ప్రథమ గణ్యుడు. విజయనగరమునకు నూటయిరువది మైళ్ళ దూరమున నున్న సిరంగపటము (శ్రీరంగపట్టణము) ఇతని రాజధాని మహారాజు వెంకటపతిరాయలకు అతని పొడ కిట్టదు; ఏలయన, ఇరువదియైదేండ్లకు

---

16. మొదటి శ్రీరంగరాయలు పదునాలుగేండ్లు రాజ్యమేలి పార్థివలో (క్రీ. శ. ౧౫౮౫-౮౬) చనిపోయె నని 'విజయనగరసామ్రాజ్య' మను వృత్తాంతము చెప్పుచున్నది. (Ibid p. 301)

17. పార్థివ (క్రీ. శ. ౧౫౮౫-౮౬) సంవత్సరములో వేంకటపతిరాయలు విజయనగరరాజ్యమున కభిషిక్తుడయ్యెనని 'విజయనగరసామ్రాజ్యము' తెలుపుచున్నది (Ibid, p 310)

17a. మాతృకలో ఇక్కడ ఒకమాట పోయినది.


18. 'వేంకటపతిరాయలు : చిత్రలేఖనము' అని పాదిరి హెరాస్ గారు అరవీటివంశచరిత్రములో ప్రత్యేకమొక ప్రకరణము వ్రాసినారు. రూబినో ఒకరికి వ్రాసిన యుత్తరములో వెంకటపతిరాయలు రంగులు కొనమని రెండువందల బంగారు నాణెములు (వరహాలు) ఇచ్చినట్లు వ్రాయుచున్నాడు (అరవీటివంశచరిత్ర, పుట ౪౯౫)

(19-వ ఫుట్‌నోటు ప్రక్కపుట చూచునది.)

పూర్వము20 మహారాజు మధురనాయకునిమీదికి దండెత్తి వెళ్ళినపుడు అతడు తన్ను హతమార్చుటకే వచ్చుచుండె నని భయపడి నాయకరాజుతో సంధి చేసికొని శత్రుపక్షమున జేరెను. ఇందువలన రాజు యుద్ధసంరంభము మాపి వెనుకకు మరలి రావలసివచ్చెను. అప్పటి నుండి రాజు కత దన్న కిట్టకు; రాజు తనయనంతరము అతనిని విజయనగరాధిపతిగ నియమించవలెనియు, అతని నప్పటికి నింక తన సముఖమునకే పిలువనంప డనియు అనుచున్నారు.

రాజు కెదురొడ్డి తన్ను రక్షించినందుకు మధురనాయకప్రభువు రాజకుమారునికి (తిరుమలరాయలకు) ప్రతిసంవత్సరమును, ఇప్పటికిని కూడ, బంగారురూపమున

19. రంగరాయలు



(* రూబినో వృత్తాంతములో వచ్చినవారు. అంకెలు విజయనగరము నేలిన ఆరవీటివంశపు రాజులను తెలుపును.)

20. శ్రీరంగరాయల ప్రతినిధిగా వెంకటపతిరాయలు చంద్రగిరి రాజ్యమును పాలించుచుండిన కాలమున ఈ విషయము జరిగినది. అప్పుడు మధురను పరిపాలించుచుండిన యతడు కృష్ణప్పనాయకుని తనయుడు వీరప్పనాయకుడు. ఇతడు రాజ్యమునకు వచ్చిన పిదప దాదాపు పదిసంవత్సరములవరకు, అనగా క్రీ. శ. ౧౫౮౬-౧౬౧౪ వరకు విజయనగరాధీశ్వరుల కణుకువగనే యుండెను; కాని అప్రాంతమున ఇతనికిని, చంద్రగిరిరాజ్యాధిపతియగు వెంకటపతిరాయలకును యుద్ధము సంభవించెను. వీరప్పనాయకుడు విజయనగరాధీశ్వరులకు కప్పము చెల్లింపకపోవుటయే ఈ యుద్ధమునకు కారణమై యుండునని పాదిరి హెరాస్ గారు చెప్పుచున్నారు. ఈ మధురదండయాత్రలో వెంకటపతిరాయలు సర్వసైన్యాధిపతి, ఇతని సేనానులలో బసవరాజొకడు. ఇతడు రాక్షస-తంగడియుద్ధములో పోరాడినవాడట. తంజావూరు అచ్యుతప్పనాయకుడు కూడ వెంకటపతిరాయల ననుసరించెను. ఆరవీటివంశచరిత్రము ననుసరించి మధురసైన్యములను నడిపించుకొనివచ్చినవాడు తిరుమలరాయలు. శ్రీవల్లభ, వరతుంగరామపాండ్యుల పుదుక్కోట తామ్రశాసనమున అతడు వీరప్పనాయకుని కుడిభుజమని వర్ణితుడయ్యెను. ఇతడు తన శత్రువులతో జేసిన యుద్ధములలో ఏనుపఫిరంగు లుపయోగించి, వాటిలో సీసపుగుండ్లు పెట్టి కాల్పించెనట. ఇతడు వల్లప్రాకారయుద్ధమున బసవరాజును నిహతుని గావించి వెంకటపతిరాయల సైన్యముల నోడించె నని పూర్వోక్తశాసనము తెలుపుచున్నది. వెంకటపతిరాయల సైన్య మోడిపోయిన దనుట కట్టుకథ యని ఫాదరు హెరాసుగారి అభిప్రాయము (ఆరవీటి వంశచరిత్ర, పుట ౨౨౬). మన రూబినో వృత్తాంతము వెంకటపతిరాయలు యుద్ధసంరంభము మాపి వెనుకకు మరలివచ్చినట్లు తెలుపుచున్నది.

౫,౦౦౦ ల స్కూడి[21] చెల్లించుచున్నాడు. ఇతర సామంతు లతనికి ౨౦,౦౦౦ ల స్కూడి కప్పము చెల్లించెదరు. ఇదంతియుగాక యతనికి భూములమీదను, గ్రామములమీదను ౩,౦౦,౦౦౦ ల స్కూడి ఆదాయము వచ్చును. అతని సైన్యమున పదివేలమంది పదాతు లున్నారు; వంద యేనుగు లున్నవి; వేయి గుర్రపుదళ మున్నది. ఇతనికంటె చిన్నవాడు చిక్కరాయలని ఇతని కొక తమ్ము డున్నాడు. కాని ఈదేశములోని ధర్మశాస్త్రముల ననుసరించి అతనికి సింహాసన మెక్కుట కర్హత లేదు; ఏలన, అతడు వివాహముచేసికొన్న పెండ్లిభార్య మృతినొందినది. (పట్టపు రాణి పోయినవానికి సింహాసనార్హత లేదు) ఇతడుకాక సింహాసనమున కాసించు నింకొక ముగ్గురు రాజకుమారు లున్నారు. మహారాజమరణానంతరము పెద్ద తిరుగుబాటు (rebellion), రాజకీయకల్లోలము సంభవించు ననియు, వీరిలో ఎవరు బలవంతులని తేలునో వారు రాజ్యము పాలింతు రనియు ననుకొనుచున్నారు. ప్రాయికముగా రాజ్యము విభాగములై చీలిపోవచ్చును.

పూర్వకాలములో జీవితమున కావశ్యకములైన సకలపదార్థములతో సంభరితమైన దుస్సాధములగు పర్వతదుర్గములు ఈ రాజులక్రింద అఱువదినాలుగుండెడివట. కాని ఈనాడా గిరిదుర్గములలో దాదాపుగ అన్నియు మూరుల (సుల్తానుల) క్రింద నున్నవి; మహారాజునకు పదునారు దుర్గములుమాత్రమే మిగిలినవి.

ఇవికాక ఈ రాజ్యములో బాగుగా నిర్మించిన గొప్ప దుర్గములు మరి పండ్రెండున్నవి. ఇట్టి కోటలలో చాలయుత్తమమైనది వెల్లూరు. దీని నెంత చతురముగాను, ఎంత యందముగాను నిర్మించినా రనగా, యూరోపులోని కోటలను జూచినవారుకూడ ఇంతకంటె గొప్ప కోటను తాము ఇంతవరకు చూడలే దని అంగీకరింతురు.

ఈ రాజ్యమంతటిలోను మహారాజున కుండు భూములమీద వచ్చు నాదాయము బంగారు నాణెముల రూపమున ఎనుబదిలక్షలు. మనలో డ్యూక్సు ఉన్నట్లే ఈ రాజుక్రింద సామంతులుగా ముగ్గురు నాయకు లున్నారు; వారు మధుర, తంజావూరు, జింజి నాయకులు. మహారాజుకు ప్రతిసంవత్సరమును వారు కప్పము క్రింద ఆరులక్షల స్కూడి చెల్లించెదరు. వీరిలో మొదటి (మధుర) నాయకుని ఆదాయము ఇరువదినాలుగు లక్షల స్కూడి. రెండవ వానికి (తంజావూరు నాయకునికి) బంగారు రూపమున పది లక్షల స్కూడి వచ్చును. మూడవవానికి (జింజినాయకునికి) అయిదు లక్షలు.

ఈ ముగ్గురు నాయకులు దాదాపుగ సర్వస్వతంత్రులు; యుద్ధము సంభవించినప్పుడు మహారాజు ననుసరించి వెళ్ళవలె నను నిర్బంధముకాని, నియమముకాని లేదు. ఆ విధమైన బాధ్యతను తప్పించుకొనుటకే వీరు మహారాజునకు పైని చెప్పిన కప్పము కట్టుదురు. రెండు సంవత్సరముల క్రిందట ఈ వెల్లూరు దుర్గము[22] ఒక నాయకుని వశమున నుండెను. అతడు మహారాజునకు కప్పము కట్టుటకు తిరస్కరింపగా మహారాజు దండెత్తి వెళ్లి యాదుర్గమును ముట్టడించెను. ఆ ముట్టడి కాగలేక యా నాయకుడు మహారాజునకు లోబడిపోయి, అతనికి బంగారము వెలను ఇరువది లక్షల కిమ్మతుచేయు రత్నములను బహుమతిగా నిచ్చెనట. మధురనాయకుని సైన్యములో లక్షకాల్బలము, మూడువందల యేనుగులు, నాలుగువేల గుర్రపుదళము నున్నవి. తంజావూరు నాయకుడు పదునారు వేల కాల్బలమునకు, రెండువేల గుర్రపుదళమునకు, నూటయేబది యేనుగులకు అధిపతి. జింజినాయకుని సైన్యమున పదివేలమంది బంట్లు ఉన్నారు; నూటయేబది యేనుగు లున్నవి; వేయి గుర్రపుదళ మున్నది.

మహారాజుక్రింద సేనానులు ఇరువదిమంది క్షత్రియులు, ఇరువదినలుగురు నాయకులు ఉన్నారు; ఇంకొక డెబ్బదినలుగురు మన్నెసేనానులు (Captains of the Forests). రాజ్యములో ఈ సేనానుల కందరికిని నగరములు, భూములు ఉన్నవి. వీరు రాజునకు కప్పము చెల్లింపరు. కాని మహారాజు యుద్ధమున కరిగినప్పుడెల్ల వీరు తమ దండుతో బయలుదేరి ఆయన ననుసరించి వెళ్లవలెను. ఇందుచేతనే మహారాజు అంతటి

---

21. స్కూడి అన్నది స్కూడో పదమునకు బహువచనరూపము. స్కూడో (Scudo) భిన్న భిన్న మూల్యములు గల ఇటలీదేశపు వెండినాణెము. సామాన్యముగ దీని విలువ నాలుగు షిల్లింగులు. స్కూడి (Scudi) యను నాణెములు (వెండివికాని, ప్రాయికముగ బంగారువివి కాని కావచ్చును).

22. ఈ వేలూరుదుర్గాధిపతి చినబొమ్మనాయకుని కుమారుడు లింగమనాయకుడు. కప్పముకట్ట నిరాకరించి యితడే వెంకటపతిరాయలమీద తిరుగబాటు చేసినవాడు.

బలవంతు డయినప్పటికి అతని ధనమును, ఆస్తియు అంత కొద్దిగ నున్నది. మహారాజు తన రాజ్యములోని అన్ని నగరములను, భూములను తన సేనానుల వశము చేసెను.

ఈ సేనాను లందరిలో చాల ముఖ్యుడును, అందరికంటె వివేకచతురుడును, చాల శౌర్యసాహసములు కలవాడును మహారాజుమామగారు ఓబరాజు. ఇతనికి అయిదు లక్షుల క్కడి ఆదాయము. ఇతని యొద్ద నూట యిరువది యేనుగులు, అయిదువందల గుఱ్ఱపు దళము, ఇరువదివేల కాల్బలముతో గూడిన సేన యున్నది. మహారాజేమి తలపెట్టినను అన్ని విషయములలోను ఇతడు మహారాజునకు కుడిభుజము. మహారాజునకు ఎడమభుజము దళవాయి. దళవాయి అన్నది అతని యుద్యోగము పేరు. అతనికి బంగారములో మూడు లక్షుల క్కడి ఆదాయము. ఇతని సేనలో నూట యేబది యేనుగులున్నవి; అయిదు వందల గుఱ్ఱము లున్నవి; పదివేలమంది బంట్లున్నారు.

ఈ సంవత్సర మే, ౧౮౦౩ లో, మంచి నడి వయసులో దళవాయి 23 చనిపోయినాడు. అప్పటి కతని వయస్సు నలువది సంవత్సరములు. అతని భాగ్యమంతయు ధనమును, రత్నములును. అతనికి ఏబది మంది భార్యలు. మృతినొందిన తమ భర్తశరీరముతో ఒక్కరు మిగులకుండ వారందరును చితిమీద నెక్కి బ్రతికి యుండగనే దహనమైరి. చూచుట కది మహాభయంకరమైన దృశ్యము. వారిలో కొంత రింకను ముక్కుపచ్చలారని చిన్నపిల్లలు; వారు చుట్టు నిలబడి తమపై భ్రకారదృష్టులతో చూచుచున్న గుంపులో జొరబడి చితికి దూరముగా పారిపోయిరి; కాని చనిపోయిన ఆ దళవాయి సేవకులు వారిని పట్టుకొని బలవంతముగ దీసికొని వచ్చి భగభగమండెడు మంటలోనికి త్రోసి వేసిరి.

మహారాజు ప్రతిసంవత్సరము దానధర్మములకు జాల వ్యయము నొనర్చును. బ్రాహ్మణులకును, దేవాలయములకును వ్యయమగునది బంగారులో ఇరువదియైదు లక్షలు. ఈ మొత్తములో మహారాజు తాను సొంతముగా వ్యయముచేయునది, అతని సామంతులలో కొందరు ఖర్చుపెట్టునది కలిసియున్నది.

---

23. ఈత డెవ్వరైనదియు సరిగా తెలియవచ్చుట లేదు.

ప్రతి సంవత్సరమును మహారాజు వాద్యకారులకు (Musicians), గాయకులకు (Singers), జంత్రవాద్య ప్రవీణులకు (Players on instruments,) కత్తిసాము చేయువారికిని (Fencers), మల్లులకు (Wrestlers), ఇంక నితరులకు నిచ్చు సొమ్ము దాదాపు రెండులక్షల క్కడి యుండును. అత డొక్క మల్లులకిచ్చునదే ఇరువది వేలు. రాచలోగిళ్లలో బనిచేయు నతని సేవకులకు కొందరికిని, అతని పరిచారకులకును ఏబది వే లిచ్చును. అతని సోదరతనయు లిరువురికి ప్రతి వత్సరమును ఒక్కొక్కరికి పండ్రెండు వేల క్కడి యిచ్చును. అతడు తన సోదరి భర్తయగు 'అల్లం డోబరాజు' కు పండ్రెండు వేల క్కడి యిచ్చును. ప్రధాన రాజకుమారుని సోదరుడు చిక్కరాజులకు కూడ అంతే మొత్త మిచ్చును. ఇతర బంధువులకును, అతని సైనికులలో కొందరికిని తక్కువగ నిచ్చును. మొత్తము మీద నతడు ఎవరి హోదాకు తగినట్లు వారికి ఎంతో కొంత యిచ్చును.

మహాలక్ష్మిపండుగల ఉత్సవములు

ప్రతిసంవత్సరము సెప్టెంబరు నెలలో అమావాస్యదగ్గరినుంచి (మహాలక్ష్మిపండుగల-దశరా) ఉత్సవములు జరుగును. మహారాజు రాజ్యమునకు వచ్చిన దీ పండుగదినములలోనే. ఈ పండుగదినములలో జరుగు నుత్సవములలో మహారాజు నలువది వేలక్కడి వ్యయము చేయును. ఈ యుత్సవములు ఎనిమిది దినములు జరుగును. ఈ యుత్సవములలో ప్రతిదినమును, మహారాజు మెడలోను, భుజములమీదను, వ్రేళ్లకును, పాదములకును అమూల్యమయిన రత్నహారములను ఇతరాభరణములను ధరించి సర్వాభరణభూషితుడై సామూహ్నమున విజయంచేసి, ఈ యుత్సవవినోదములను జూచుటకు అతనికి ప్రత్యేకము నియమితమైన స్థలమున గూర్చుండును. ఈ యుత్సవ వినోదములు చూచుటకు మహారాజు తప్పక మొదటి యైదు దినములును వచ్చును. ఈ యైదురోజుల యుత్సవములును ఒక్కొక్క దినమున ఒక్కొక్కరి పేర నిర్దిష్టము లగును. మొదటి దినపు ఉత్సవములు మహారాజు పేర జరుగును; రెండవ దినపు ఉత్సవములు మహారాజు మామగారు ఓబరాజు పేర నడచును; మూడవ రోజు ఉత్సవము దళవాయిది. నాలు గయిదవ రోజుల యుత్సవములు వరుసగా జింకి

తంజావూరు నాయకులవి. ఆ యుత్సవ భూమిని వీరిలో ఎవరికి వారికే చాల ఎత్తైన పటకుటీరము లున్నవి. అత్యంతసుందరముగ నలంకరించిన రథము లున్నవి. ఏ దినమున ఎవరి యుత్సవమైన వారు తమ రథము నెక్కి మహారాజసముఖమునకు వత్తురు; వచ్చి నాట్యము మేళములలోని వేశ్యల యాటపాటలు, వివిధ విధములైన, విచిత్రమైన గారడీలు, మల్ల యుద్ధము, కత్తిసాము, హాస్యము మొదలైన అనేక కళలలో, విద్య లలో (తా మిచ్చిన ప్రోత్సాహమున) నూతనముగ గని పెట్టబడిన కల్పనావిశేషములను ప్రదర్శింపింతురు ఈ యుత్సవములకు దాదాపు ఏబది వేలమంది బ్రాహ్మ ణులు సమావేశ మగుదురు. వీరిలో ఒక్కొక్కరికి మహా రాజు గారికి చిరాయువు గలుగుటకై రాణి వస్త్ర దానము, ఇతరదానధర్మములు చేయును.

తమ రాచనగళ్లలోని వారందరి ఆహార వస్త్ర ముల నిమిత్తము మహారాజునకు, రాణికి నగ వ్యయము లక్షసుక్కడి. ఒక్కొక్క రాణికి పదివేల సుక్కడి ఆదాయము వచ్చును; కాని మహారాజుకు ప్రేమ పాత్రమైన రాణి మిగిలిన రాణులకంటె భాగ్యవంతు రాలు. ప్రతి సంవత్సరమును నాయకు లామెకు పదివేల సుక్కడి యిచ్చెదరు. మహారాజును, ఈ రాణియు దినమునకు రెండు తడవలు దుస్తులు మార్చెదరు. ఒక మారు ధరించిన యుడుపులను వారు రెండవమారు ధరిం పరు—ఆ ధరించిన అత్యంతామూల్యమైన యుడు పైననే తప్ప. మహారాజు సేవకులు ఎల్లప్పుడును అతడు తీసివేసిన దుస్తులను తమ కిమ్మని యర్థింతురు. ఎల్లప్పుడు మహారాజు తీసివేసిన తన యుడుపు లిప్పు డొకరికి, ఇంకొక మా రింకొకరికి ఇట్లిచ్చుచుండును.



ప్రస్తుత విద్యావిధానము - - ఒక పర్యాలోచన - -

శ్రీ నిర్వికల్పానందస్వామి

ప్రస్తుతం భారతదేశంలో నైతే నేమి, పాశ్చాత్య భూభాగాల్లో నైతే నేమి, లేక అమెరికాలో నైతే నేమి—ఉన్న విద్యావిధానం అణుమాత్రమూ ప్రశంసనీయం కాదనే విషయాన్ని నిరాకరించే ధైర్యం చాలా కొద్దిమందికే ఉంటుంది. మానవేతిహాసంలో, ఇప్పుడు మనకు తటస్థమవుతున్న క్లిష్టపరిస్థితులు పూర్వ మెప్పుడూ తారసిల్లి ఉండవు. ప్రపంచం ఎంత అల్లకల్లోలంగా ఉండాలో, అంత అల్లకల్లోలంగా ఉంది. మన సాంఘికసంస్థలన్నీ తుత్తునియలై పోతున్నాయి. అంతర్యుద్ధాల్లోనూ, ఆర్థికసంకటాల్లోనూ, జాతీయ దురహంకారంతోనూ దేశాలు తల్లడిల్లుతున్నాయి. సంసారాలకు సంసారాలు కూలిపోతున్నాయి. తరతరాలుగా మానవుడు మథించి అనుసంధానించిన ఆధ్యాత్మికనైతికవిషయాలకు గౌరవం పోతోంది.

ఈ విషాదస్థితికి చాలామట్టుకు మన స్కూళ్ళు కారణం. ఇంతో అంతో చాకచక్యంతో కొన్ని సూత్రాల్ని బట్టీ పట్టించటం, మరికొన్ని సంగతుల్ని వల్లింపజేయటంతోనే వాటి పని ముగుస్తోంది. నిజమైన విద్య చాలా కొద్దిమందికే అంటుతోంది. 'స్వభావం యొక్క పరిపూర్ణవికాసమే విద్య' అనేదాన్ని కొలతబద్దగా తీసుకుంటే, ఎంతమందికి ఈ పరిపూర్ణత కలిగిందో చెప్పటం చాలా కష్టం. పాఠశాలలు తమ ఆదర్శాన్ని నిర్వహించలేకపోతున్నాయి. పిల్లలందరూ కూడా పరస్పరసందేహానికి ఆకరమైన వాతావరణంలో పెరుగుతున్నారు. ఎటు తిరిగినా భయమే. జీవికానిర్వహణమే ఒక పోటీగా నిలిచింది. జీవితాన్ని నియమబద్ధ మొనర్చే సూత్రాలు కాని, జీవితంలో ముఖ్యంగా తారసిల్లే సమస్యలకు అర్థం కాని దొరకటం లేదు.

గడచిన నలభైసంవత్సరాలూ లెక్కలోకి తీసుకొంటే మనం మన స్కూళ్లను 'అప్ టు డేట్'గా చెయ్యాలని చేసిన ప్రయత్నాలకు మితిలేదు. ఎంత సౌష్ఠవంగా ఉండాలో, ఎంత శాస్త్రీయంగా ఉండాలో అంతా చేశాం. సైన్సు తెలియజెప్పిన నూతనయంత్రసాధనాల్లో కొన్నీ మనం వదిలిపెట్టలేదు. రోజురోజుకూ దూరంగా విరుసుకుపోతున్న ఆర్థిక సాంఘికవ్యవస్థల్లో మన కుఱ్ఱవాళ్లు అమాంతంగా ఎల్లా దూరిపోగలరో, దానికి తగినన్ని శిక్షణు ఈ స్కూళ్లు కల్పిస్తున్నాయి. అంతే కాకుండా, పాశ్చాత్యదేశాలు ఈ విద్యను అందరూ కొంత వయస్సువరకూ నిర్బంధంగా నేర్వాలి అని కట్టుదిట్టం చేశాయి. ఉన్నత విద్యనుకూడా చాలామట్టుకు ఉచితంగానే బోధిస్తున్నాయి. కనుక ఈ విధానం కరుడుకట్టుకుపోయి, ఉన్నంతమట్టుకూ వృత్తివిద్యలకే అనుకూలించేదిలా తయారైంది.

ఐతేమట్టుకు ఇక్కడా అక్కడా ప్రాథమిక విద్యను కొంచెం సంస్కరించే ప్రయత్నం జరక్కపోలేదు. కొన్నేళ్లు విద్యాశాఖలో పనిచెయ్యటంవల్ల తమకు తట్టిన విషయాల్ని కొందరు ఉపాధ్యాయులు ఒక శాస్త్రంగా తయారుచేశారు. కాని ఈ శాస్త్రాన్ని ఆచరణలో పెట్టటంవల్ల ఉపాధ్యాయులూ, తల్లిదండ్రులూ అనుకున్నంత ఫలం లభించలేదు. దానికి కారణం కొందరనుకొన్నట్లు సక్రమాచరణ లేకపోవటం కాదు. ఇవి కేవలం పైపూతలు అవడంవల్లే లభించలేదు. అడుగంటా ఎవరూ చొచ్చి చూడలేదు.

ప్రస్తుతం మనం జీవిస్తున్న పద్ధతి ఏమిటి? స్కూలు మన జీవితాన్ని ప్రతిబింబించటం వాస్తవమైన పక్షంలో—బాహ్య పరిస్థితులూ, ఆచారాలూ, మతవిశ్వాసాలూ, ఆర్థిక రాజకీయ పరిస్థితులూ కలిసి స్కూలుమీద తమ ప్రభావాన్ని చూపి దాని ఆదర్శాన్నీ, ప్రవృత్తినీ నిరూపిస్తాయనే విషయం కూడా నిస్సందేహమే. స్కూలుకూ, సంఘానికీ అవిరతమైన క్రియాప్రతిక్రియలు ఉన్నాయి. ఇది వ్యక్తిజీవితం

లాంటిదే. వ్యక్తియొక్క బహిరంగ జీవితానికీ, అంతరంగిక జీవితానికీ ఉన్న లంకె లాంటిదే స్కూలుకూ సంఘానికీ ఉన్న సంబంధం. వర్తమాన యుగం ముఖ్యంగా యంత్రమయం. యంత్రాలు మన జీవితాన్ని కేవలం ప్రభావితం చెయ్యటమే కాకుండా, ఆమూలాగ్రంగా మార్చేశాయి. మన గార్హస్థ్య సాంఘిక జీవితాలకూ, యంత్రాలకూ ఏర్పడిన సంబంధం అపరిమితం. ఈ యుగంలో మన జీవితం ఎంతో వేగంతోనూ, ఉద్రేకంతోనూ, పోటీ చేయగల శక్తులతోనూ నిండి ఉంది. ఉత్తమోత్తమాలైన భావసరళిని ఏర్పరచుకోవటానికి గాని, ఏకాగ్రతకు గాని, ధ్యానానికి గాని మనకు ఏమాత్రమూ అవకాశం చిక్కటం లేదు. నిత్య విమర్శపూర్ణమైన బహిరావరణలోనే మన కాలక్షేపం. ఇంద్రియోద్రేకాన్ని ప్రేరేపించే ఆమోదప్రమోదాలే మనము ఆహ్వానిస్తున్నాము. వీటి కదన్యంతో మన మనస్సు నిండిపోతోంది. ధనసంపద ఉన్నా, ఆధ్యాత్మికసంపద అరర్ధాపట్టే తీసిచూస్తే హాళ్ళకి హాళ్ళయే తేలుతుంది. ఏకాంతంగా ఉండాలి అంటే మనకు అమితమైన భయం. ప్రశాంతీ, ఏకాంతవాసమూ మనకు సరిపడనివి. దీనికి కారణం మనలోపల అంతా శూన్యంగా ఉండటమే. బయటనుంచి కృత్రిమమైన ఉద్రేకాన్ని సృష్టించి, ఈ శూన్యాన్ని పూరించటానికే మనం ప్రయత్నం చేస్తున్నాం. ఇది జనయుగం. మనకు అద్భుతమైన యాంత్రిక పరిజ్ఞానం ఉంది. ఇంకా ఎన్నో విద్యలు తెలుసు. కాని తెలియంది మన్నిగురించే. ఆధ్యాత్మిక సంపదయొక్క మూల్యమే మన లక్ష్యంలో లేదు. హృదయానికీ, మనస్సుకూ ఐక్యత లేదు. మన అంతర ప్రకృతిలో వీటికి నిరంతరఘర్షణ జరుగుతోంది. వీటికి సామరస్యం లభించటం లేదు. బుద్ధీ, భావాలకూకూడా లంకె కుదరటం లేదు. వ్యక్తి జీవితాన్ని కాని, సమష్టి జీవితాన్ని కాని బాధిస్తూ కలవరపరుస్తున్న చెడుగే ఇది. ఈ సమస్యను పరిష్కరించే విధానాన్ని మన స్కూళ్లు ఏ మాత్రమూ బోధించటం లేదు. మనలో ఉన్న ఈ గందరగోళాన్నే మనము బయటపెడుతున్నాం. దీని ఫలితంగా కొట్లాటలూ, అమితమైన గొడవలూ, వినాశకరాలైన యుద్ధాలూ వస్తున్నాయి. మనవ్య ప్రకృతిని గురించిన అగాధమైన జ్ఞానమూ, జీవితానికి సంబంధించిన ఒక నిర్దిష్టదర్శనమూ ఉంటేగాని, మన చర్యలెట్లా ఉండాల్సిందీ మనం తేల్చుకోలేం. ప్రపంచంలో ఉన్న ఏ రాజ్యాంగవ్యవస్థా జీవితాన్ని ఆదర్శమయం చెయ్యగల తత్త్వాన్ని గాని, ఈ తత్త్వాన్ని అందుకుంటానికి తగిన ప్రణాళికను గాని ఉద్బోధించటం లేదు. సమగ్రంగా జీవితాన్నంతా పర్యవేక్షించే శక్తి ఏ వ్యవస్థలోనూ లేదు. పరమార్థవిషయంలోనూ ఇంతగానే ఉంది.

ఎంతో ఘనులనుకోనబడే విద్యాప్రబోధకుల ఆదర్శాలుకూడా చాలా పరిమితంగా ఉన్నాయి. వాటిని అంతటితో సరిపుచ్చుకుంటే చాలా మంచి వనే చెప్పవచ్చును. కాని వ్యాపకంగా తీసుకొంటే వాటికి ఏమాత్రమూ విలువలేదు. కారణం ఏమంటే: అసలైన సమస్య జోలికి ఇవి ఏమాత్రమూ పోవటం లేదు. జీవితాన్ని ఐక్యతాబద్ధంగానూ, సౌందర్యయుతంగానూ, ఆధ్యాత్మికవ్యక్తిత్వాన్ని పరిపూర్ణంగా వికసింపచేసేదిగానూ చెయ్యలేకపోవటమే. మనిషిని మంచి పౌరుడుగా చెయ్యటమే స్కూళ్ళ ఉద్దేశ్యం అని, అంతటితో ఆగిపోలేం. లేక జీవితాన్ని జయప్రదంగా నిర్వహింపచెయ్యటమే అన్నా చాలదు. 'మంచి పౌరుడు', 'జయప్రదమైన జీవితం' అనేవాటికి మానదండం ఏమిటో ముందర తేల్చుకొంటేనే గాని తేలుపడదు. సార్వభౌమమైన ఒక మానాన్ని పరిశీలించుకోవాలంటే, ముఖ్యంగా పాశ్చాత్యదేశాల్లో చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. వాళ్ళకు సంప్రదాయంగాని, సరియైన ధర్మమూలం గాని, ఆధ్యాత్మికాదర్శం గాని లేదు. సాంఘికవ్యవస్థ ఎప్పుడూ విపర్యయాన్నే పొందుతూ ఉంది.

అమెరికాలో ఉన్న విద్యావిధానం కేవలం వ్యావహారికం. 'ఎడ్యుకేషనల్ పాలసీ కమిటీ' (విద్యావిధాన నిర్ణయ కమిటీ) వారే బహిరంగంగా ఒప్పుకొన్న దేమిటంటే: "ప్రస్తుతం అమెరికాలో అమలులో ఉన్న విద్యావిధానంయొక్క ఆదర్శం నడుస్తూన్న యాంత్రిక ప్రజారాజ్యంలో ఉన్న సాంఘిక వ్యవస్థకు సరిపోయేటట్టుగా వ్యక్తిని మలచటమే. సాంఘిక దృష్టిలో వ్యక్తిజీవితాన్ని సక్రమంగా నడుపుకోపోతే చాలు. ఈ సక్రమపద్ధతి అనేదానికి అర్థం సంఘమున్నూ, వ్యక్తియున్నూ ఏర్పరచుకొన్న విలువల్నిబట్టి ఏర్పడుతూ ఉంటుంది. అప్పటికప్పుడు సంఘంలో ఉన్న విలువల్ని బట్టి విద్యయొక్క ఆదర్శం కూడా నిర్వచింపబడుతుంది. ఈ చింతాధారను అనుసరించి మనుష్యుడు జీవితమనే మహాతరంగసంచయంలో ఒక తునక; ప్రయోజనాన్ని అనుసరించీ, సాధికను బట్టీ అతడు ఎంత చక్కగా సర్దుకోపోగలడో, అంత

చక్కగా సర్దుకుపోతూ ఉంటాడు. నైతికనియమాలు తాత్కాలిక ప్రయోజనసిద్ధికి ఏర్పడ్డ సాధారణాంశాలే అని ఒప్పుకుంటే, వాటికి సనాతనత్వంగాని, విలువ గాని ఉండదు. ఒక విద్యార్థి స్కూల్లో అనుశాసనాచరణకు తావులేదని గ్రహించినా, ఈ ఆవరణలోంచి బయటకువచ్చి ఇంతకన్నా పెద్దదైన సంఘంలో ప్రవేశించినప్పుడు, బహుశః, ఈ ఉద్దేశాన్ని మార్చుకొంటాడు."

ప్రాయికంగా అమెరికాలో ఉన్న స్కూళ్ళన్నీ కూడా విద్యార్థుల్ని — ఉభయలింగాలవార్ని — సాంఘికంగా జయాన్ని పొందేటట్టు చెయ్యగలుగుతున్నాయి. ఈ జయాన్ని నిర్వచించేది ఖ్యాతిప్రమాణమే. ఈ విద్యకు ఆదర్శం యాంత్రికయుగ ప్రాబల్యమే. కనుక ఈ స్కూళ్ళను ఒక విధంగా ఫ్యాక్టరీ లనీన్నీ, ఉపాధ్యాయుల్ని యంత్రవిద్యావైదుష్యం కలిగిన కూలీ లనీన్నీ, విద్యాబోధనను ముడిపదార్థాల్ని సరుకులుగా మార్చటం అనీన్నీ, విద్యార్థుల్ని తయారైన సరుకులనీన్నీ అనకోవచ్చు. సంఘంలో సవ్యంగా ఉండటం అంటే ఆర్థిక రాజకీయ మతవిషయాల్లో దేశంలో ఒక నిపుణమైన పాత్రను నిర్వహించటమే. దీనికర్థం: అందరితో చక్కగా కలిసిమెలిసి ఉండగలిగి, మృదుభాషిత్వాన్ని కల్గి, పదుగురితోనూ మంచిగా ఉండి, ఎక్కువమంది ఆమోదించే భావాల్నీ, అభిప్రాయాల్నీ, ఆదర్శాల్నీ జనరంజకంగా చెప్పగలగటమే. కనుక, మన సంసారగతి విషమచక్రపర్యవసిత మవుతోంది. యాంత్రిక జడస్వభావమైన మన సంఘం స్కూళ్ళరూపాన్ని తీర్చి దిద్దుతోంది; ఈ స్కూళ్ళు మళ్ళీ తమవంతు వచ్చినప్పుడు ఇల్లాంటి సంఘంలో ఇముడగల బాలబాలికల్ని సృష్టిస్తున్నాయి. ఈ సంఘానికి చాకచక్యంతోనేగాని చరిత్రతో పనిలేదు. యాంత్రికజ్ఞానమే అవసరంగాని గవేషణాపూర్ణమైన మనస్సుతో నిమిత్తం లేదు. ధనైశ్వర్యాలే మనుష్యుని మహత్త్వానికి పరిమాపకాలు.

స్పర్ధాయుతమైన ఈ వర్తమానప్రపంచం మన్ని సర్వనాశాభిముఖంగానే తీసుకొని వెడుతోంది. ఇందులో శాంతిగాని, న్యాయంగాని, ఒక క్రమం గాని, ఆర్తులకు ధార్మికసంరక్షణగాని లభించటం లేదు. కనుక, దీన్ని మార్చకతప్పదు. ఈ మార్పు హఠాత్తుగా హింసాత్మకమార్గాన్ని అవలంబించి వచ్చినా రావొచ్చు. కాని ఈ రీతి విధ్వంసాత్మక మవటంవల్ల ఉపద్రవపూరితమైన పునర్నిర్మాణదశను అధిగమించాల్సి ఉంటుంది. లేక, నిదానంగా క్రమవికాసరూపేణా సముచితమైన విద్యాప్రభావంవల్లా, సునిశితమైన వివేకంవల్లా లభించవచ్చు. ఇప్పుడు విద్యావ్యాప్తికి కేవలం గృహ-విద్యాలయ-దేవాలయాలే కాకుండా, పత్రికలూ, రేడియోలూ, సినిమాలూ కూడా తోడ్పడుతున్నాయి. ఈ చివరిమూడూ కూడా జనసామాన్యం యొక్క భావాల్నీ, ఆదర్శాల్నీ ఎంతగానో నిర్మిస్తున్నాయి. శుభాశుభశక్తిసమన్వితాలైన వీటిని ఎంతగానో సంస్కరించాలన్న విషయం మనకు అవగతమే. మనకు విదేశీరేడియో ప్రోగ్రాముల్లో లభించేది ఉద్రేకాన్ని కలిగించే హాస్యకథలూ, పరాక్రమ చంక్రమణాలే! మూర్ఖోత్తరగతికి చెందిన వారపత్రికలూ మాసపత్రికలూ విరివిగా ప్రచురించేది పాఠకుల లైంగిక జీవితాన్నీ, పశుజీవితాన్నీ ప్రేరేపించేవిగానే ఉంటాయి. అత్యతిక్రమంగానూ, సమూలంగా అవినీతినే ప్రేరేపించే 'హాలీవుడ్' ఫిలిములను తలచుకొంటే నైతికంగానూ, మానసికంగానూ, భావనలోనూ మనం ఎంతగా దిగజారిపోయామా అని విచారించాల్సొస్తుంది. ఇవి ఇల్లా ఉంటానికి కారణం వీటి ఆదర్శం విద్యాబోధనకాక, ధనార్జన అవటమే. ఇది మళ్ళీ ఇంకో విషమవ్యాసఘట్టం. చాలామంది ఆర్టిస్టులూ, రచయితలూ ఇల్లా అంటారు: "ఆదర్శానికి వ్యతిరిక్తంగా మనస్సు మేము అమ్ముకొంటున్నమాట నిజమే కాని, ప్రజాసామాన్యం కోరేదో అదే మేము వారికి సమకూరుస్తున్నాం; మేము ఇంతకు మించి ఉత్తమాదర్శాన్ని పోషించబూనుకుంటే మాకు అభినందనంగాని, విజయంగాని లభింపవు." విషాదకరమైన ఈ పరిస్థితి వాస్తవమే. కనుక పత్రికలూ, రేడియోలూ, సినిమాలూ విద్యకు బదులు వినాశాన్నే చేకూరుస్తున్నాయి అని తేలుతోంది. అంతేకాక ఇవి జనసామాన్యంయొక్క మనస్సునూ, భావాల్నీ అరికట్టున్నాయి. ఈ జనసామాన్యంయొక్క జీవితమే అపారమైన వస్తూత్పత్తివల్లా, అద్భుతమైన ప్రచారంవల్లా అరికట్టబడి ఉంది. ఇది గమ్మత్తుగా అక్షరాభ్యాసం నుంచే ఆరంభమవుతున్నాయి. అమెరికాలో 'కామిక్కు' లనబడే చిన్నపుస్తకాలు శిశువులకోసం కోట్లలుగా ముద్రింపబడుతున్నాయి. అనంతంగా చెలామణీ అవుతున్న ఈ పుస్తకాల్లో పాఠభేదా లున్నా, అన్నిటికీ మూలసూత్రం అజ్ఞానమే. ఇది శిశుపాఠ్యాలుగా నిర్దేశింపబడినప్పటికీ, తాతయ్యలూ, తాతమ్మలూ కూడా వీటిని చదివి ఆనందిస్తూంటారు. తీరికే ఉంటానికి వీల్లేదు; కుటుంబం అంతానూ. ఈ కథాపఠనం బాహ్యంగా నిర్దోషమయంగానే తోచినా, అపార

మైన కీడును కలుగజేస్తోంది. కల్పితమైన ఒక పురుషుడి యొక్క, లేక పశువు యొక్క సాహసాలే ఈ గ్రంథాలకు కథావస్తువులు. మనము మెచ్చుకోవాల్సింది వాని చాకచక్యాన్ని, వాని శరీరబలాన్ని. ఈ కథ లెంత పేలవంగా ఉంటాయంటే: వీటిని అర్థంచేసు కొంటానికి మన మనస్సుకుగాని, భావనకుగాని ఏమాత్రమైన శ్రమ ఉండదు. కథానాయకు డెప్పుడూ తన చాకచక్యం వల్లనో, లేక శరీరబలంవల్లనో జయాన్ని సాధిస్తూనే ఉంటాడు. అతనిలో న్యాయంగాని, ధర్మ పరాయణతగాని ఉండవు. శక్తికే జయం. ఈ పుస్త కాలు వరిసహస్రంగా గల అమెరికన్ కుటుంబాల్లో ఎంతగా అంతశ్శూన్యతను కల్పిస్తున్నాయో గమనిస్తే హృదయం చితికిపోతుంది. ఇల్లాంటి శూన్యాన్నే జర్మనీ [illegible] ఆవరించింది. ఇల్లాంటి కథానాయకుడే ఆ శూన్యత్వాన్ని నింపాడు. జనసామాన్యంయొక్క అజ్ఞానం అతన్ని నాయకుడుగానూ, ఆదర్శంగానూ చేసి, సర్వనియంతృత్వాన్ని అర్పించింది. ఫలితం సర్వ నాశనం.

ఈ క్లిష్టపరిస్థితుల్లో ప్రపంచంలో 'చర్చి' కూడా తన ప్రాబల్యాన్ని, నాయకత్వాన్ని, గౌరవాన్నీ పోగొట్టుకొంది. వస్తుతః వీటికి స్వాతంత్ర్యం శూన్యం. ఐహికవిషయాల్లో వీటికి సంబంధం ఉంది. సహజంగా ఇవి ఛాందసంలోనే ఉండి, హేతుసిద్ధాలైన మార్గాలను అంగీకరింపవు. ఈ కారణాలవల్లే వీటికి ప్రాబల్యం తగ్గిందని మనం ఊహించవచ్చు. కుటుంబం అనేది పూర్వం ఒక సంస్థగా ఉండేది. ఇప్పుడది [illegible]యై పోతోంది. పిల్లలకూ, తల్లిదండ్రులకూ కలయిక లేదు. వీరి భావాలేమిటో వారికి అర్థంకావు. ఇద్దరి మధ్యా పొందిక లేదు. యుక్తవయస్సు రాగానే తండ్రులు వీరిని పాఠశాలలకు అప్పగించి ఊరుకొంటున్నారు.

కనుక, అభ్యుదయాన్ని పొందబోయే తరాల వారిని సంస్కరించటానికీ, తద్వారా ఇతోధికమైన సంఘాన్ని నిర్మించటానికీన్నీ విద్యాసంస్థలే-స్కూళ్లే- ఉపకరిస్తాయని మా విశ్వాసం. కాని, పూర్వప్రదర్శిత ప్రకారం ఈ స్కూళ్ళు యాంత్రిక-జడసమాజం యొక్క నిర్మాణాలు. ఇవి ఎట్టివిగాక పరస్పర సహకారంమీదా, స్వార్థజనకమూ శక్తిబలమూ కాక సమగ్రజీవితం యొక్క ఐక్యాన్ని అనుసంధానించే సమాజనిర్మితికి ఎట్లు తోడ్పడతాయి? అదీన్నీ కాక, ఏ ఇంద్రజాలవిద్యనో ఆశ్రయించి ఇప్పుడు ఉన్న విద్యావిధానాన్ని వెంటనే మనం మార్చలేముకూడా. 'మనం' అంటే: విద్య అంటే త్రికరణశుద్ధిగా అపేక్ష కలిగి, ప్రస్తుతవిద్యావిధానంలో ఉన్న లోపాల్ని గమనించి వీటిని సవరించాలనే పట్టుదల గలవాళ్లని. విద్యా విధానం ఎల్లా ఉండాల్సిందీ మనం చక్కగా ఊహించుకొని, ఈ విధానాన్ని అమలులో పెట్టేటందుకుగాను ప్రథమంగా కొన్ని స్కూళ్లను ఏర్పరిచి, మనం అనుకున్నది ఎంత వరకు అనుకూలిస్తుందో చూడాలి. భయోద్వేగరహితంగా, 'ప్రమాదో ధీమతామపి' అనే సూక్తిని జ్ఞప్తియందు ఉంచుకొని, మనం చేసే పొరపాట్లు మనకు ఉపకారకరాలుగానే ఉండి మార్గప్రదర్శకాలు అవుతాయి అని నిర్ణయించుకొని ఉపక్రమించాలి. ఎప్పటికప్పుడు మనం ఈ విధానాన్ని ఉత్తమోత్తమమార్గాల్లో నడిచేటట్లు మార్పులను కలిగించటానికీ, ఈ విధానం పాతపుంతల్లోనే పడి, ఇరుక్కో పోకుండా ఉండటానికి ప్రయత్నించాలి. వాటిని మనం చెయ్యబోయే మార్పులు, నీళ్లగా పలచబడిపోకుండా విధానం ఒక హద్దులో ఉండేటట్లు చూసుకోవాలి.

ఈ విధానం కొన్ని ముఖ్యసూత్రాల్ని అవలంబించి ఉండాలి. విద్య అనేది కేవలం ఛాత్రుల బుద్ధినీ, ఇచ్ఛాశక్తినీ నిర్మింపజేసేదే కాకుండా, వారి ప్రకృతి సంతటినీ ఐక్యతాసంబద్ధంగా చేసేదిగా ఉండాలి. ఇది కేవలం ఘటనల్ని, తారీఖుల్ని బట్టీపట్టిస్తూ, సూత్రాల్ని, ఫార్ములాల్ని బోధిస్తూ ఉండకుండా, విద్యార్థిని కేవలం అనుమోదించి ఒట్టిపెట్టడమే కాకుండా యథార్థంగా గ్రహించే పరిస్థితుల్లో ఉండేటట్లు చెయ్యాలి. ప్రాచ్యవిజ్ఞానం మనకు ఈ విషయంలో ముఖ్యంగా తోడ్పడగలదు. ఇండియా చైనాలలో పూర్వం పరోక్షజ్ఞానం అపరోక్షానుభూతికి దారి తియ్యకపోతే, ఇక ఆ విద్య వ్యర్థంగా భావింపబడేది. అపరోక్షంగా ఉన్న ఈ మన ఆత్మ చిద్రూపమైన మహాజీవితప్రవాహంలో ఒక అంశం. దృశ్యప్రపంచం యొక్క అయథార్థత వారి కప్పుడే తెల్సు—ఈనాడు ఇది సైన్సు ఒప్పుకుంటున్న విషయం. ప్రపంచం అనేది మనఃకల్పితమే. తర్కప్రచోదితమైన మనస్సు ఈ దృశ్యజగత్తును జడమయంగా గ్రహించి, దాన్ని పరిశీలించటానికి ఉపయోగిస్తుంది కాని, సత్యాన్ని గ్రహింపజెయ్యలేదు. ఇంతకన్న ఇంకా ఉన్నతమైన స్తరానికి చెందిన మనస్సు ఒకటి ఉంది అనీన్నీ, అదే మన భావనలోనూ, హృదయగుహలోనూ వ్యక్తమవుతూ ఉంటుందన్న విషయం కూడా వారికి తెల్సు. చివరకు


మైన ప్రేమే చరమమైన జ్ఞానాన్ని కలిగిస్తుంది. ఈ ప్రేమ లేకపోతే మనము దేన్నీ గ్రహించలేము. ప్రకృతిశాస్త్రవేత్తలు కూడా చివరకు తమ శాస్త్రం పట్ల తమకుగల ఈ ప్రేమవల్లనే మహోత్కృష్టమైన విషయాల్ని గ్రహించగలుగుతున్నారు. ఈ ప్రేమే వారి మనస్సులకు జ్ఞానాన్నీ, ఉత్సాహాన్నీ ప్రసాదిస్తోంది. భావోద్రేకపూరితమైన ప్రేమకాక, చిరంతమైన ప్రేమ మన మనస్స్వభావాన్ని సంస్కరించి, దీనికి క్రొత్త కాంతుల్ని ఇచ్చి, మాయావరణాన్ని ఛేదించి, మనకు తత్త్వాన్ని చూపగలదు. ఈ పరమ సత్యాన్ని మనం విప్పి చెప్పలేని సమయం బాల్యమే. అద్భుతరసాన్ని ఆస్వాదించే శక్తి బాల్యంలోనే ఎక్కువగా ఉంటుంది. ఇది ప్రదీప్తంగా ఉండేటట్లు చూడటం మనవంతు. దీనివల్లే మనకు ప్రపంచంలో ఉండే అనంతసౌందర్యం గోచరిస్తుంది. అంతే కాకుండా వారి మనస్సు శ్రద్ధాభావంతో నిండిఉండేటట్లు చూడాలి. ప్రస్తుత విద్యావిధానంలో ఇది మందుకైనా కనపడదు. ఈ శ్రద్ధాగుణమే లేకపోతే జీవితమంటే ఏమిటో బోధపడదు. బాలబాలికలు శుష్క కాష్ఠాలుగా ఉండిపోక, జీవితాన్ని స్వతస్సిద్ధమైన విషయంగా పరిగ్రహించే ప్రమాదంనుండి మనం వార్ని తప్పించాలి. పరమాణువులనూ, పరమమహత్తునూ సందర్శిస్తూ వారి భావం ఉద్వేగకల్లోలితమై, మనస్సు సృష్టిరహస్యాలవైపు పరిగెత్తి 'నేనెవరు? నా జీవితం ఏమిటి?' అనే ప్రశ్నలు వారిలో బయలుదేరాలి. అప్పటినుంచే యథార్థవిద్యోపదేశం ప్రారంభం అవుతుంది.

ఇంకో విషయం: విద్యాబోధన ఉద్యోగం కాదు, ప్రవచనం అనే విషయాన్ని మనం విస్మరించకూడదు. భారతీయాదర్శం దీన్నే ప్రబోధిస్తోంది. భారతీయులకు విద్యాదాత ఉద్యోగానికి కుదిరిన ఉపాధ్యాయుడు కాదు, గురువే. ఈ విషయం మన విద్యాసంస్కరణకు చాలా తోడ్పడుతుంది. గురువు ఛాత్రునికి ద్వితీయపిత. ఆయన ఛాత్రహృదయాన్ని తీర్చిదిద్దే కళాకర్త. ఆ హృదయంలో ఉన్న మంచి సంతతినీ బయటికి తీసుకొనివచ్చి, కళంకాన్ని నిర్మూలించే మాంత్రికుడు. ఈ గురువుకుండే శిష్యుల సంఖ్య — ఈ ఉపాధ్యాయునికి ఉండే ఛాత్రుల సంఖ్య — పరిమితంగానే ఉండాలి. ఏమంటే వాళ్ళను ఆయన బాగా గ్రహించి, నిరంతరం దృష్టిలో ఉంచుకోవాలి. ఆయనకు ఆర్థికంగా ఏవీ లోటుగాని, బాధలుగాని ఉండకూడదు. తన కర్తవ్యాన్ని నిర్వర్తించటానికి సంపూర్ణమైన స్వాతంత్ర్యం ఉండాలి. ఉపాధ్యాయుడే స్కూలుకు ప్రాణమన్నీ, బోధనాసూత్రాలు గౌణాలన్నీ మనం గ్రహించాలి. కనుక, ప్రధానవిషయం మనం గురువును ఎన్నిక చేసుకోవాలి. ఆయా జాతుల్లో, ఆయా అవాంతరాల్లో కేవలం ఇందుకోసమే జన్మించినవారు మనకు బహుళంగానే దొరుకుతారు. కాని మనం వారికి తగిన సహాయం చేస్తూ, తగిన ఉత్సాహాన్ని కలిగించాలి. ఇది కనక మనం నిర్వహిస్తే వారు యావజ్జీవమూ విద్యాబోధనచేస్తారు. ఉపాధ్యాయులపట్ల సంఘానికి సామాన్యంగా ఉన్న నిరాదరణ తొలిగితేకాని, మంచి స్కూలు తయారుకాదు. ఇప్పుడు సర్వసర్వత్రా వారికి లభించేవి అల్పజీతాలు; వారికి గౌరవం లేదు, తగిన సంరక్షణలు లేవు. జనులందరూ గురువుయొక్క ముఖ్యతను గ్రహించి, అతనికి సమాజంలో సర్వోత్తమమైన స్థానాన్ని కల్పించాలి. నైతికంగానూ, ఆర్థికంగానూ ఏ విధమైన లాభాన్నీ పొందలేక, ఏరం విశిక్షణాచాతుర్యం గల పెద్దలు చాలామంది ఇతర వృత్తుల్ని ఆశ్రయిస్తున్నారు. వారికి సరియైన వసతుల్ని కలిగిస్తే, వాళ్ళు మళ్ళా బోధనోద్యోగంలోకి తిరిగి, స్కూళ్ళను చైతన్యవంతాలుగా చేసి, జగద్ధితానికి తోడ్పడగలుగుతారు.

విద్యాసంస్కరణను గురించిన సమస్యలు ఇంకా చాలా ఉన్నాయి. వాటినన్నిటినీ వేరువేరుగా దీక్షతో పరిశీలించాలి. ప్రమేయజటిలాలైన ఆ విషయాలన్నిటినీ చర్చించటానికి ఇక్కడ తావు లేదు. ఈ వ్యాసం యొక్క ప్రయోజనం పరిమితం. సంస్కారపరులైన విద్యావంతుల దృష్టిని ఈ సమస్యకు ఉన్ముఖం కావించి, కొన్ని మూలసూత్రాల్ని చర్చించి, విద్య యొక్క ఆదర్శాన్ని నిరూపించటమే.*

* హై ఫెర్రాండో అను అమెరికన్ వ్యాసకర్త ననుసరించి.





— శ్రీ మావిండిపూడి వెంకటరంగయ్య —

జర్మనీతో చేసుకొనవలసిన సంధిషరతులను నిర్ణయించుటకై లండనులో సమావేశమైన నాలుగు అగ్రరాజ్యముల విదేశాంగమంత్రుల సభ భగ్నమగుట, ఫ్రాన్సుదేశములో కమ్యూనిస్టుపక్షమువారు లేవదీయ నెంచిన అంతర్యుద్ధమును ప్రభుత్వమువారు అణచుట, ఇటలీలో కూడ అట్టి ప్రయత్నమును ప్రభుత్వమువారు విఫలము చేయుట, అమెరికావారు యూరపుదేశములకు చేయ నెంచిన ఆర్థికసహాయమును కాంగ్రెసుశాసనసభ ఆమోదించుట, దీనికి జవాబుగ రషియావారు కొన్ని క్రొత్త ఆర్థికమార్పులను చేయుట, పాలెస్టయిన్ చైనాలలో అంతర్యుద్ధములు తీవ్రమగుట, ఇండోనేషియాలో డచ్చివారు సామ్రాజ్యాధికారకాంక్షచే క్రొత్త పన్నాగములను కొన్నిటిని పన్నుట—ఇవన్నియు డిసెంబరు నెలలో గమనించదగిన ప్రధానవిషయములు.

లండను సమావేశము

జర్మనీతో యుద్ధము ముగిసి ఇప్పటికి రెండు సంవత్సరములు దాటినది. కాని, ఆ దేశముపై ఎట్టి సంధిషరతులను విధించవలెనో నిర్ణయించుటకై ఏర్పరచబడిన రషియా, అమెరికా, ఇంగ్లండు, ఫ్రాన్సుదేశముల విదేశాంగమంత్రుల సభ నవంబరు ఆఖరువారములో లండనుపట్టణమున సమావేశమై మూడువారములు అనేకవాదోపవాదములుగావించి ఎట్టి నిర్ణయమునకు రాలేక వాయిదా వేయబడెను. తిరిగి ఈసభ ఎప్పుడు సమావేశము కావలసినదియు మంత్రులు సూచించలేదు. అందుచేత ఇది మరియొకపర్యాయము సమావేశము కానేరజాలదని చెప్పవచ్చును. నాలుగు అగ్రరాజ్యములవారు కలిసి, జర్మనీయొక్క భవిష్యత్తును నిర్ణయించు అవకాశము ఇంతటితో తప్పిపోయెను. రషియాకును, అమెరికా, ఇంగ్లండు, ఫ్రాన్సులకును మధ్య రెండుసంవత్సరములుగ ఏర్పడుచుండిన అభిప్రాయభేదమును రాజీమూలముగ సర్దుబాటు చేయుట సాధ్యముకాని పని అని ఇప్పుడు స్పష్టమయ్యెను. ఇకమీదట రషియావారి త్రోవ రషియావారిది. తక్కిన వారి త్రోవ వారిది. ఈ రెండును కలియుట అనునది జరుగజాలదని చెప్పుటలో అతిశయోక్తి ఉండదు. రషియావారు, అమెరికావారు కలిసి, మిత్రభావముతో ప్రవర్తించ గలిగినయెడల ప్రపంచక్షేమమున్ను ఎంతో అధికముగ అభివృద్ధిఅగుటకు అవకాశ ముండెడిది. లండను సమావేశము భగ్నమగుటచేత ఆ అవకాశము తప్పిపోవుటయేగాక, ఆ రెండుదేశములమధ్య ఇదివరకు బీజరూపముగ నుండిన పరస్పరద్వేషము ఇప్పుడు మహావృక్షమైన దనియు, కొద్దికాలములో యుద్ధరూపమగు ఫలముతో కూడుకొన్నదిగ అగుననియు చెప్పవచ్చును.

—వాదోపవాదములు

ఈ సభలో ఏర్పడ్డ అభిప్రాయభేదములనుగురించి వివరించుట అంత లాభకరము గాదు. అమెరికావారు, ఇంగ్లీషువారు రషియావారిపై దోషారోపణ చేయుటకును, రషియావారు వారిద్దరిపై అనేకవిధముగ దోషారోపణ గావించుటకును సమావేశమును ఉపయోగించుకొనిరే గాని పరస్పరసహనభావముతో మెలగరైరి. ఏ విషయములనుగురించి ముందు ఆలోచించవలెనో, వేటిని

గురించి తర్వాత ఆలోచించవలెనో నిర్ణయించుటకై వారు అనేకదినములు వాదోపవాదములు గావించుకొని, ఎట్టి నిర్ణయమునకు రాలేకపోయిరి. సంధిషరతులను నిర్ణయించు అధికారము అగ్రరాజ్యములు నాలుగింటికి మాత్రమే ఉండవలెనని రష్యావారి వాదము; అట్లు గాక జర్మనీతో యుద్ధము గావించినట్టియు, యుద్ధము ప్రకటించినట్టియు రాజ్యములన్నియు ఇట్టి నిర్ణయములో పాల్గొనవలెనని అమెరికావారి వాదము. ఇందు విషయమైకూడ ఎట్టి రాజీ కుదురలేదు. జర్మనీవారు రష్యావారికి ఇయ్యవలసిన నష్టపరిహార విషయమై ప్రారంభమైన వాదము విపరీతరూపము ధరించుటచేత సభ నిరుపయోగమని నలుగురు మంత్రులును అభిప్రాయపడి సమావేశమును ముగించి ఎవరి ఇండ్లకు వారు వెళ్ళిపోయిరి.

జర్మనీలో ఏటేట తయారగు వస్తుసముదాయమునుండి వేయికోట్ల డాలర్ల విలువ గల పదార్థములను నష్టపరిహారముక్రింద రష్యావారికి ఇయ్యవలెనని రష్యావారు వాదించిరి. ఇందుకు అమెరికావారు, ఇంగ్లీషువారు, ఫ్రెంచివారు సమ్మతింపరైరి. హిట్లరు మూలమున రష్యామాత్రమే నష్టపడలేదనియు, ఫ్రాన్సు బెల్జియం హాలెండు మొదలైన పశ్చిమయూరపుదేశములకూడ నష్టపడిన వనియు, వారికికూడ నష్టపరిహారముక్రింద ఏటేట కొంత ద్రవ్యమును జర్మనీవారు ఇచ్చుకొనవలసియుండు ననియు, అట్టి సందర్భములో వారు రష్యావారికి కోటిమిలియన్ల డాలర్లు ఇచ్చుట సాధ్యముకానిపని యనియు అమెరికావారు వాదించిరి. ఇదిగాక గతరెండుసంవత్సరములలో రష్యావారు జర్మనీనుండి ఎంతో ద్రవ్యమును పట్టుకొనిపోయిరనియు, ఆమొత్తము తేలినగాని ఇకమీదట వారికి చెందవలసిన నష్టపరిహారద్రవ్యపు మొత్తమును నిర్ణయించుటకు వీలులేదనియు అమెరికావారు చెప్పిరి. కాని ఆమొత్తమును తేల్చుటకు రష్యావా రంగీకరించలేదు. ఈలాటి అభిప్రాయభేదము లెన్నియో బయలు దేరుటచేత నష్టపరిహారసమస్య పరిష్కారముకాకపోయెను. మరి సభవలన ప్రయోజనము లేదని మంత్రులు నలుగురు వెళ్ళిపోయిరి.

—ఫలితములు

దీని పర్యవసాన మెట్లుండునో ఆలోచించుట అవసరము. యూరపుసంగ్రామమునకు (?) జర్మనీదేశము [illegible] జను లున్నారు. కష్టపడి పనిచేయగల నేర్పరులు. ఆ దేశమందు తయారగుచుండిన ఉక్కు, ఇనుము, యంత్రసామగ్రి, బొగ్గు, రసాయనపదార్థములు, ఎరువులు — వీటిమూలమున ఇతరదేశముల సౌభాగ్యము అభివృద్ధిగాంచుచుండెను. యుద్ధకాలమందును, యుద్ధము ముగిసినతర్వాత ఈ రెండుసంవత్సరములలోను జర్మనుపరిశ్రమలు బొగ్గుగనులు చక్కగ పనిచేయనికారణమున పశ్చిమయూరపులోని ఫ్రాన్సు మొదలైన దేశములు అనేకచిక్కులపాలు కావలసివచ్చినది. గనుక జర్మన్ పరిశ్రమలు పునరుద్ధరణమగుటయు, నేర్పరులగు జర్మనులు యథాపూర్వముగ పరిశ్రమలను నడిపి విరివిగా సరకులను తయారుచేయుటయు యూరపుయొక్క ఆర్థికనిర్మాణమునకు అత్యవసరము. కాని ఫ్రెంచి ఇంగ్లీషు మొదలైనవారికి ఒక భయము కలదు. జర్మనుపరిశ్రమలు మామూలుప్రకారము పని చేయుటకు ఆరంభించినయెడల జర్మనులు పూర్వము వలె యుద్ధసామగ్రులను తయారుచేసి, మరియొకపర్యాయము వారి అధికారమును ఇతరదేశములపై స్థాపించుటకు ప్రపంచయుద్ధము నొకదానిని లేవదీసెదరను అనుమానము వీరికి కలదు. ఇట్టి విపత్తు సంభవించకుండ జర్మన్ పరిశ్రమలను నడుపుటకు సాధనమేమైన ఉన్నదా? ఇండియాదేశమును అనేక సంవత్సరముల కాలము తమ ఆధీనమం దుంచుకొనినట్లు జర్మనీ దేశమును కూడ తమ యొక్కయు, తమ మిత్రులగు అమెరికా ఫ్రెంచివారి యొక్కయు పరిపాలనలో నుంచుటయే ఈ సాధనమని ఇంగ్లీషువారి యొక్కయు, వారి మిత్రుల యొక్కయు అభిప్రాయము. కాని జర్మనీ దేశమంతయు వీరి పరిపాలనలోనికి వచ్చుటకు వీలులేదు. తూర్పు భాగమునంతను రష్యావారు స్వాధీనము చేసుకొనియున్నారు. గనుక లండన్ సమావేశము భగ్నమగుట చేత జర్మనీ రెండు రాజ్యములుగ చీలిపోయి, ఒకటి రష్యావారి పాలనయందును, ఇంకొకటి ఇంగ్లీషు, అమెరికా, ఫ్రెంచివారి పాలనయందును ఉండిపోవుట తప్పనిసరి అయ్యెను. భరతఖండము ఇండియా, పాకిస్థానము అని రెండు రాజ్యములుగ విభాగమైనట్లే జర్మనీకూడ విభాగమయ్యెను. ఒక దేశము రెండు రాజ్యములుగ విభాగమగుటచేత ఎట్టి చిక్కులు కలుగునో అనుభవము వలన మనకు తెలిసియేయున్నది. మన దేశము విభాగమగుటకు మన పక్షములో చేరిన మహామ్మదీయులు అనుకూలముగ నుండిరి. కాని జర్మనీ విభాగమును జర్మనులలో ఎవరు కూడ అంగీకరించుటలేదు. ఇది ప్రపంచ యుద్ధమందు వారిని ఓడించిన మిత్రమండలివారి నిర్బంధముచే ఏర్ప

పెట్టెను. గనుక దీనిని ఏలాగైన ప్రతిఘటించి రద్దు చేయుటకు జర్మనులు ప్రయత్నింతు రనుటలో ఆశ్చర్యము లేదు. మూడవ ప్రపంచ యుద్ధమునకు ఇదికూడ ఒక బీజము.

కాని ఇది సులభముగా సాగునట్టిది కాదు. ఇది జరుగుటకు కొంత కాలము కూడ పట్టును. ఈ మధ్య కాలమున తూర్పు జర్మనీలో రష్యావారును, ఇతర భాగములలో తక్కిన మిత్రమండలివారును వారివారి ప్రాబల్యమును స్థిరపరచుకొని, యుద్ధ సామగ్రులను తయారుచేయు పరిశ్రమాగారములను స్థాపించి, యుద్ధ పరికరములను తయారుచేయ ప్రయత్నించెదరు. రష్యావారు, అమెరికావారు వారివారి పరస్పర ద్వేషమును సాధించుకొనుటలో ఒకర్మనులు జర్మను పరిశ్రమలు ప్రధాన సాధనము లగును. ఇండియా సహాయమున ఇదివరకు బ్రిటిషు వారు వారి సామ్రాజ్యమును వృద్ధి చేసుకొనుటకును, నిలబెట్టుకొనుటకును ప్రయత్నించినట్లే జర్మనీ సహాయమున వారి వారి అధికారములను నిలబెట్టుకొనుటకు అగ్రరాజ్యములు ప్రయత్నించగలవు. అగ్రరాజ్యముల మధ్య ఏర్పడిన విభేదములు జర్మనీ దేశపు విభజనకు దారితీసిన వనియు, తద్వారా యూరోపుఖండముకూడ రెండుభాగములుగ విభాజితమయ్యె ననియు మనము గ్రహించవలెను. లండనుసమావేశము భగ్నమగుటమూలమున ఏర్పడిన పరిస్థితుల కిదియే ప్రధానలక్షణము.

ఫ్రాన్సు : కార్మికుల సమ్మె

ఇట్టి పరిస్థితులు ఏర్పడిన వని సూచించుటకో అన్నట్లు ఫ్రాన్సుదేశమున నవంబరు ఆఖరుభాగమునను, డిసెంబరు మొదటి రెండువారములలోను ప్రభుత్వముపై కమ్యూనిస్టుపక్షమువారు తిరుగుబాటు చేసిరి. కమ్యూనిస్టుపక్షమువారు రష్యావారియొక్క అనుచరు లనియు, వారి కార్యకలాపమునకంతకు రష్యాప్రభుత్వము వారి ప్రవర్తన ప్రధానమగు ఆధారమనియు అందరు అంగీకరించినవిషయమే. ఫ్రాన్సుదేశపు కేంద్రశాసన సభలో కమ్యూనిస్టుపక్షమువారు ప్రాబల్యము వహించి నను మంత్రివర్గమున వారికి స్థానము లభించలేదు. వారికి విరోధముగ నుండు పక్షములవా రనేకులు కలిసి మిశ్రమంత్రివర్గమును ఏర్పాటుచేసుకొని దేశమును పాలించుచున్నారు. ఇది కమ్యూనిస్టులకు ఎంత మాత్రము రుచించలేదు. ఈ మిశ్రమంత్రివర్గమును అధికారమునుండి తొలగించి, తమ అధికారమును దేశమున స్థాపించుటకు వా రొక గొప్ప కార్మికసమ్మెను లేవదీసిరి. కార్మికులు ఇతర దేశములలో కష్టపడుచుండు నట్లు ఫ్రాన్సుదేశములోకూడ కష్టపడుచున్నారు. ఆహారాదిపదార్థముల ధరలు విపరీతముగ పెరుగుటయు, వేతనములు దానికి తగినట్లు వృద్ధికాకపోవుటయు దీనికి కారణము. కార్మికసంఘములలో అధికారము కమ్యూనిస్టుపక్షమువారి చేతులలో నున్నందున వారు ఒక గొప్ప సమ్మెను లేవదీయగలిగిరి. రైళ్ళు, పోస్టు, టెలిగ్రాఫు, టెలిఫోను, ఎలెక్ట్రిసిటీ, గనులు మొదలైన పరిశ్రమలలో పనిచేయు సుమారు ఇరవైలక్షల కార్మికులు సమ్మెలో చేరిరి. ఆర్థిక జీవితమంతయు స్తంభించెను. దీనితోపాటు ప్రభుత్వోద్యోగులలో సుమారు ౧౨ లక్షలుకూడ సమ్మెచేసిరి. రెండుపట్టణము లనుకూడ కమ్యూనిస్టుపక్షమువారు స్వాధీనపరచుకొనిరి. ఈసమ్మెను ఎదుర్కొనుటకై ప్రత్యేక అధికారములను మంత్రివర్గమువారు శాసనసభనుండి కోరుచు కొన్ని బిల్లులు ప్రవేశపెట్టిరి. కమ్యూనిస్టుసభ్యులు వాటిని ఖండించుచు, కాలయాపన చేయ సిద్ధపడిరి. తుదకు వారిని కాదని, శాసనసభ ఆ బిల్లును ఆమోదించెను. ఇదిగాక రిజర్వులోనున్న ౮౦,౦౦౦ సైనికులను మంత్రివర్గమువారు సన్నాహపరచి, సమ్మెదారులపై ఉపయోగించుటకు తీర్మానించిరి. ఈ చర్య లన్నిటి ఫలితముగా కార్మికులు సమ్మెను చాలించి, మూడు వారము లైనపిమ్మట వారివారి పనులలో యథాప్రకారము ప్రవేశించిరి. ఎట్లో ప్రమాదమునుండి దేశమును రక్షించగలిగితి మని మంత్రివర్గమువారు సంతోషించిరి. కమ్యూనిస్టులు లేవదీసిన విప్లవము, అంతర్యుద్ధము సమసి పోయెను. కాని వీరికి కలిగిన ఈ పరాజయము రష్యా వారి పరాజయమనియే భావించవలసియున్నది.

ఈ సమ్మెకు ఫలితముగ దేశములోని కార్మికులలో రెండుచీలికలు ఏర్పడెను. కమ్యూనిస్టునాయకత్వమును అంగీకరించని కార్మికులు సుమారు పదిలక్షలు కార్మికసంఘమునుండి విడిపోయి ప్రత్యేక కార్మిక సంఘము నొకదానిని ఏర్పరచుకొనిరి. పాత సంఘము వారు రష్యాపట్ల మైత్రిని వహించియుండగ, క్రొత్త సంఘమువారు విరోధమును వహించియున్నారు. రష్యా ప్రభుత్వమువారు ఫ్రెంచిప్రభుత్వమువారితో కొన్ని విషయములందు ఇదివరకు కుదిరిన సంబంధమును వదలుకొనిరి. మొత్తముమీద విదేశాంగవిషయములలో ఈ రెండు దేశములు వేర్వేరుమార్గముల ననుసరించుటకు నిశ్చయించుకొనినవని చెప్పవచ్చును.

ఇటలీ

ఫ్రాన్సులో సమ్మెలు జరుగుచుండిన కాలమున ఇటలీలో కూడ సమ్మెలు ప్రారంభమయ్యెను. కొన్ని రోజులలో అవి ఉత్తరమందేగాక మధ్యభాగమందును, దక్షిణభాగమందుకూడ వ్యాపించెను. వాటిమూలమున పరిశ్రమలు, రవాణా సౌకర్యములు, వర్తక వ్యాపారములు—అన్నియు నిలబడిపోవునట్లుండెను. కాని కొద్ది రోజులలో ఆ ప్రమాదములు తప్పెను. కార్మికులు సమ్మెనుండి విరమించుకొనిరి. కమ్యూనిస్టుపక్షమువారి కుట్రలు అంతరించెను.

ఇంతమాత్రముచేత యూరపుఖండమందు శాంతి పరిస్థితులు ఏర్పడినట్లు ఊహించుట కవకాశము లేదు. ఆ ఖండమంతయు కుములుచుండు కుంపటివలె నున్నది. ఏ నిమిషమందు మంటలు బయల్పడునో చెప్పజాలము. కార్మికవర్గమువారి ఆర్థికస్థితి మిక్కిలి దుర్భరముగ నున్నది. ధనికులయెడ వారు విరోధభావమును వహించియున్నారు. వారిలో కొందరు కమ్యూనిష్టు సిద్ధాంతము ననుసరించినవారు. మరికొందరు సోషలిస్టు సిద్ధాంతము ననుసరించినవారు. ఈ రెంటికి మధ్య పోరాటము తప్పదు. రషియావారు కమ్యూనిస్టుసిద్ధాంతమును బలపరచి, దానిని అనుసరించువారికి సహాయముచేయ నిశ్చయించియున్నారు. దానిని ఎదుర్కొనుటకు అమెరికావారు కొంత ప్రయత్నము చేయుచున్నారుకాని రషియావారికి కమ్యూనిజమందున్నటువంటి భక్తి అమెరికావారికి సోషలిజమందు లేదు. వారు సాహుకారీ విధానమే ఉత్తమవిధానమని విశ్వసించువారు. సోషలిజమునకు వారు చేయవలసిన సహాయము రషియావారు కమ్యూనిస్టులకు చేయ నిశ్చయించుకొనినంతటిది కాదు.

అమెరికా సహాయము

అయినను కమ్యూనిజమును వ్యాపింపజేయకుండుటకై సంవత్సరముక్రిందట ప్రెసిడెంటు ట్రూమన్ తలపెట్టినట్టియు, అతని ప్రధానమంత్రియగు మార్షలు విపులపరచినట్టియు ప్రణాళికను కాంగ్రెసుసభ ఈనెలలో కొంతవరకు ఆమోదించెను. దీనిమూలమున వెంటనే ఫ్రాన్సు, ఇటలీ మొదలైన కొన్ని యూరపు దేశములకు సుమారు యాభైకోట్ల డాలర్ల విలువగల సరుకులను అమెరికానుండి పంపుట జరుగును. ఇది తాత్కాలిక సహాయము. యూరపులోని కార్మికుల బాధ కొంతవరకు తగ్గగలదు. ఇదిగాక దీర్ఘకాల సహాయమునుగురించియు, దానిమూలమున యూరపు పశ్చిమభాగములోని దేశములన్నిటియందును ఆర్థికపునర్నిర్మాణము ఏవిధముగ జరుగవలెనో ఆలోచించుటకును కాంగ్రెసువారు నిశ్చయము చేసుకొనిరి. వానిని గురించి సంప్రతింపులు ప్రారంభమయ్యెను.

రషియా-ఆర్థిక మార్పులు

రాజకీయఆందోళనము మూలముననేగాక ఆర్థికముగకూడ తాము యూరపుదేశములకు సహాయము చేయగల స్థితిలో నున్నట్లు ఋజువుచేయుటకో అన్నట్లు రషియావారు కొన్ని వారములక్రిందట వారి చెలామణిలో కొన్ని మార్పులను గావించి, ఇదివరకు అమలులోనుంచిన రేషన్ విధానమును కొంత రద్దుచేసిరి. ప్రజలు ఆహారపదార్థములను ఇష్టమువచ్చినట్లు కొనుటకు అవకాశమేర్పడెను. ఆహారపదార్థములు, కొన్ని ముడిపదార్థములు, కలప మొదలగువాటియొక్క ధరలు తగ్గెను. రషియా నుండి విదేశముల కెగుమతి కాదగిన పదార్థము లివియే. అమెరికాలో ధరలు విపరీతముగ పెరిగియున్నవి. విదేశములనుండి వస్తువులను కొనదలచువారికి అమెరికాలో కొనుటకంటె రషియాలో కొనుగోలు చేయుట లాభకరమను నమ్మకము కలుగుటకు కొంతవరకు రషియా ప్రభుత్వమువారు వారి చెలామణియందు ఇట్టి మార్పులను గావించిరి. అమెరికాలోని ధరలు పెరుగకుండ శాసనములను గావించవలెనని ఇటీవల ట్రూమన్ కాంగ్రెసును కోరుటకు ఇది యొక కారణము. రాజకీయముగను, ఆర్థికముగను ఈ రెండు దేశముల వారి మధ్య పోటీ దినదినాభివృద్ధి గాంచుచున్నది.

పాలెస్టయిన్

ఈ పోటీ ఫలితము పాలెస్టయిన్ విషయమునను, చైనావిషయమునను కొంతవరకు స్పష్టమయ్యెను. పాలెస్టయినును విభజన చేయవలెనని ఐక్యరాజ్య సమితివారు గావించినతీర్మానమును ప్రతిఘటించుటకు అరబ్బీరాజ్యములు నిశ్చయించుకొన్నట్లు చదువరులకు తెలిసియున్నది. దీనికి కావలసిన సన్నాహములను ఆ ప్రభుత్వములవారు చేయుచున్నారు. పాలెస్టయినులో అరబ్బీలకును, యూదులకును యుద్ధము ప్రారంభమయ్యెను. అయినను ఇది ఇంకను తీవ్రరూపము ధరించలేదు. మరి అయిదారు మాసములు బ్రిటిష్‌వారి అధి

కారము, వారి సైన్యములు ఆ దేశమం దుండును. ఆగస్టున గాని వారచటనుండి పూర్తిగా వెళ్ళిపోజాలరు. ఈమధ్యకాలమున వారు అరబ్బీపక్షమును బలపరచుటకు ప్రయత్నింతురు. భరతఖండములో లీగుపక్షమును బలపరచి పాకిస్థానమును నిర్మించినట్లే వారు పాలెస్టయినులో అరబ్బీలను బలిష్ఠులుగ చేయుదురు. బ్రిటిషు సైనికులు, సైనికోద్యోగులు అరబ్బీ సైన్యములలో చేరి, వాటిని నడుపుటకు సంసిద్ధులుగ నున్నారు. కాని ఐక్యరాజ్య సమితియొక్క తీర్మానము ననుసరించి, పాలెస్టయిను విభజన జరిగినయెడల ఆ సమితి తరఫు సైన్యములును, వాటితోపాటు రషియా సైనిక దళములను ఆ దేశములోనికి రావలసియుండును. రషియా దళములు వచ్చుట బ్రిటిషు వారికిగాని, అమెరికావారికిగాని, అరబ్బీలకుగాని అంత యిష్టము లేదు. గనుక అది జరుగకుండుటకు వారు పన్నాగములను పన్నుచున్నారు. తప్పక యుద్ధము చేసెదమని ప్రకటించుచుండిన అరబ్బీ రాజ్యములవారు ఇటీవల సమావేశమై పాలెస్టయిను సమస్యను భద్రతాసంఘమువారు పునః ఆలోచించవలసినట్లుగా కోరియున్నారు. ఈ విషయమును ఆలోచించుటకుగాని, దీనినిగురించి నిర్ణయించుటకుగాని ఐక్యరాజ్యసమితికి అధికారమే లేదని ఇదివరకు వాదించుచుండిన అరబ్బీరాజ్యములవారు ఇట్టి పునరాలోచనను కోరుటలో అంతరార్థము లేకపోలేదు. దేశవిభజన జరుగవలెనని ఐక్యరాజ్యసమితివారు గావించిన తీర్మానము అమలులోకి రాకుండ చేయుటయే ఈయుద్దేశము.

కాని ఎప్పటికైనను పాలెస్టయినువిషయమున అంతర్యుద్ధము తప్పదనియు, అట్టి యుద్ధము ప్రారంభమైనయెడల అది క్రమక్రమముగ మధ్యప్రాంతదేశములన్నిటియందు వ్యాపించుననియు, దానిమూలమున తమ చమురుగనులకు ప్రమాదము సంభవించుటయేగాక అచ్చటి రాజ్యాంగవ్యవహారములలో పాల్గొనుటకు రషియావారికి అవకాశము సైతము కలుగుననియు అమెరికావారు ఊహించి తమ బలమును మరింత హెచ్చు చేసుకొనుటకై కొద్దిరోజులక్రిందట పర్షియాదేశముతో ఒక సైనికసంధిని గావించుకొనిరి. దాని ఫలితముగ పర్షియా సైన్యములను తర్ఫీదుచేయుటకు అమెరికా వారికి అవకాశమేర్పడెను. రషియా మొదలగు విదేశములలోనివా రెవ్వరుకూడ ఇందుకై వినియోగించుట జరుగదు. కొంతవరకు పర్షియాలో అమెరికావారి ప్రాబల్యము స్థిరపడుటకు ఈసంధి ఉపయోగపడుచున్నది.

చైనా

కమ్యూనిస్టుసిద్ధాంతము ననుసరించు రషియా వారికిని, సాహుకారీవిధానము ననుసరించు అమెరికా వారికిని చైనాదేశముకూడ ఒక యుద్ధరంగమయ్యెనని చదువరులు ఎరిగియున్నారు. ఈదేశములో గత ౨౦ సంవత్సరములుగ కమ్యూనిస్టులకును, ప్రభుత్వమువారికిని యుద్ధము జరుగుచున్నది. ఇప్పుడు ఈయుద్ధము అతి తీవ్రదశలోనికి వచ్చియున్నది. సమస్తసౌభాగ్యములతో కూడుకొన్న మంచూరియారాష్ట్రములో ముప్పాతిక మూడువంతులను కమ్యూనిస్టులు స్వాధీనపరచుకొనిరి. దాని ప్రధానపట్టణమగు "ముక్డెన్"నకు సమీపమున వారి సైన్యములు సన్నాహమై ఆ పట్టణమునుకూడ వశపరచుకొన ప్రయత్నములు చేయుచున్నవి. ఇందులో వారికి జయము కలిగినయెడల చైనాను నిరంకుశముగ నేలుచుండు చియాంగ్ కై షేకునకు గొప్పదెబ్బ తగిలినట్లే భావించవలెను. కాని అట్టి నష్టము అతనికి కలుగుట అమెరికావారికి ఇష్టములేదు. కమ్యూనిస్టుల విజృంభణము రషియావారి ప్రాబల్యవ్యాప్తికి దారితీయునని వారి భయము. అందుచేత అతనికికూడ సహాయము చేయుట అత్యవసరమని భావించి, కాంగ్రెసువారు కొన్నికోట్ల ద్రవ్యమును అందుకై వినియోగింప నిశ్చయించిరి. ముఖ్యముగ, చైనాయొక్క సముద్రతీరప్రదేశములను కమ్యూనిస్టులుగాని, రషియావారుగాని స్వాధీనపరచుకొనుట అమెరికావా రెంతమాత్రము ఇష్టపడరు. అట్టిది జరిగినయెడల జపానులో వారు స్థాపించుకొన్న అధికారమునకును, పసిఫిక్ మహాసముద్రరక్షణకై వారు నిర్మించుకొనుచుండు ఏర్పాటులకును ప్రమాదము సంభవించును. చియాంగ్ కై షేకు ప్రభుత్వము సౌమ్యమైనది కాదనియు, ప్రజల ఆర్థికసౌభాగ్యమును అతడు గమనించుట లేదనియు, అతని ప్రభుత్వకాలమున ఉద్యోగులలో లంచగొండితనము, అలసత్వము అత్యధికమయ్యెననియు అమెరికావా రెరుగుదురు. కాని కమ్యూనిస్టులపట్లను, రషియావారిపట్లను వారికి గల ద్వేషముచేత వారీలోపములను గమనించక అతనికి సహాయము చేయ నిశ్చయించుకొనియున్నారు.

గనుక ప్రపంచములోని అంతర్జాతీయరంగమున డిసెంబరులో జరిగిన చర్యలనుబట్టి అగ్రరాజ్యముల మధ్య ఇదివర కేర్పడిన విరోధము మరింత ప్రబలమయ్యెననియు, యూరపులోని పశ్చిమదేశములందు కార్మికుల ఆర్థికస్థితి దుర్భరమగుచుండుటచేత వెంట

వెంటనే కాకపోయినను కొద్దికాలములో కమ్యూనిస్టు యాజమాన్యమున మహావిప్లవము సంభవించు సూచన లున్నవనియు, మధ్యప్రాచ్యమందును, చైనాయందును అగ్రరాజ్యముల పరస్పరవిరోధము ప్రతిబింబితమగు చున్నదనియు స్పష్టమగుచున్నది. శాంతి, భద్రత, జన సామాన్యముయొక్క సౌఖ్యము రోజురోజునకు దూర మగుచున్నవి.

భరతఖండము

రష్యా అమెరికాలమధ్య ఏర్పడిన మనస్పర్ధల వంటివే గతనాలుగుమాసములనుండి ఇండియా పాకిస్థానులమధ్య ఏర్పడియున్నవని చెప్పవచ్చును. ఇవి పోయినగాని రెండు రాజ్యములు ప్రజాసామాన్యము యొక్క సౌభాగ్యమునకై పాటుబడుటకు వీలుండదు. ఆంగ్లేయుల అధికారమును తొలగించి, మనము స్వరాజ్యమును సంపాదించుకొన్నందుకు వాంఛనీయమైన ఫలితము ఈసౌభాగ్యముగాని, రెండురాజ్యములు ఒకదానిపై ఇంకొకటి పగను సాధించుకొనుట కాదు. కాని ఈ సామాన్యసూత్రమును పాకిస్థాన్ అధికారులు అనుసరించుట కిష్టపడకుండుట మిక్కిలి విచారించదగిన విషయము.

ఇండియా-పాకిస్థాన్ సంబంధములు

ఇండియా ప్రభుత్వమువారు ఇందునిమిత్తమై ఇటీవల ఎంతో పాటుపడిరి. తాము ఔదార్యము చూపినయెడల పాకిస్థాన్ ప్రభుత్వమువారు వారి సంకుచితరాజ్యాంగవిధానమును మాని సౌహార్దముతో ప్రవర్తింతురని తలచి ఇండియాప్రభుత్వమువారు వివాదగ్రస్తములగు విషయము లన్నిటిలో పాకిస్తానుకు ఎక్కువ లాభము కలుగునట్టి రాజీకి డిసెంబరు సంప్రతింపులలో అంగీకరించిరి. ఈ సంప్రతింపులు కొంత కాలమునుండి జరుగుచుండినను ఉభయపార్టీలకు రాజీ కుదురజాలదనియు, మధ్యవర్తుల పరిష్కార మవసర మగు ననియు అందరు అభిప్రాయపడియుండిరి. కాని మధ్యవర్తుల జోక్యము అక్కరలేకుండ వీ రీవిషయముల నన్నిటిని పరిష్కరించుకొన్నట్లు సర్దారు పటేల్ గారు కేంద్రశాసనసభలో తెలిపిరి. ఆగస్టు ౧౫ తేదీనాటికి నిలువలో నున్న ౪౦౦ కోట్లరూపాయలలో పాకిస్థాన్ వంతు ౭౫ కోట్లనియు, మొత్తపు అప్పులో దాని బాధ్యత నూటికి ౧౭.౫ అనియు, సైనిక పరికరములలోను, రైల్వేలలోను, సైనికపరికరములను తయారుచేయు కర్మాగారములలోను, స్టర్లింగు నిలువలలోను దానికి ఎక్కువ వంతు లభించుటకును ఇండియాప్రభుత్వము వారు అంగీకరించిరి. వారీ విధముగ చూపిన ఔదార్యము మూలమున పాకిస్థాన్ ప్రభుత్వమువారు ఇండియాపట్ల ఇదివరకు చూపుచుండిన విరోధభావమును మరచి, సుహృద్భావముతో ప్రవర్తింతు రను ఆశయే వారిని ఈ ఔదార్యమునకు పురికొల్పెను.

పాకిస్థాన్ కలిగించు చిక్కులు

కాని ఇండియా ప్రభుత్వమునకు పాకిస్థాన్ ఆశాభంగమునే కలిగించినది. ఇదంతయు ఔదార్యఫలితము కాదనియు, పాకిస్థానమును చూచి బెదరిపోయి దాని నెదుర్కొనుటకు సామర్థ్యము లేని కారణముననే పటేల్ ప్రభృతులు ఇండియాకు నష్టకరమైన ఆర్థిక షరతులను అంగీకరించిరని పాకిస్థాన్ ప్రభుత్వము వారు భావించి ఇదివరకు వారు పెట్టుచుండిన చిక్కులను మరింత వృద్ధిచేయుచున్నారు. చిక్కులు వృద్ధియగుచున్న వనుటకు వాయవ్యసరిహద్దు విషయమై పాకిస్థాన్ ప్రభుత్వమువా రనుసరించుచుండు రాజ్యాంగనీతియు, కాశ్మీరము విషయములో వారు ఎట్టి రాజీకి రాకుండుటయు ప్రధాన నిదర్శనములు.

భరతఖండపు వాయవ్యసరిహద్దులలో కొండజాతులవారును, యుద్ధముచేయుటయు, దోపిడియు ముఖ్యవృత్తులుగ ననుసరించు మహమ్మదీయులును లక్షల కొలదిగ నున్నారు. వీరి మూలమున ఇండియాకు ప్రమాదము కలుగకుండుటకై బ్రిటిషువారు రెండు సాధనముల నుపయోగించుచుండిరి. సరిహద్దులలో అక్కడక్కడ కొన్ని దుర్గముల కట్టి వాటిలో కొంత సైన్యముంచుట మొదటి సాధనము. కొండజాతుల నాయకులకు ఏటేట లక్షలకొలది ద్రవ్యము నిచ్చుట రెండవ సాధనము. వీటి ప్రయోగముచేత వారి మూలమున ఇండియాకు విస్తారప్రమాదము లేకుండెను.

కొండజాతులను రెచ్చగొట్టుట

దేశవిభజన జరిగిన తర్వాత ఈ సరిహద్దంతయు పాకిస్థాన్ సరిహద్దయ్యెను. ఇదివరకు బ్రిటిషువా రుపయోగించుచుండిన సాధనముల రెంటిని ఉపయోగించి కొండజాతుల మూలమున భరతఖండమునకు ప్రమాదము లేకుండచేయు బాధ్యత పాకిస్థానముపై బడెను. కాని ఆ బాధ్యతను వహించుటకు కొంతవరకు ఇష్టము

జేసెట్టెను. గనుక దీనిని ఏలాగైన ప్రతిఘటించి రద్దు చేయుటకు జర్మనులు ప్రయత్నింతు రనుటలో ఆశ్చర్యము లేదు. మూడవ ప్రపంచ యుద్ధమునకు ఇదికూడ ఒక బీజము.

కాని ఇది సులభముగా సాగునట్టిది కాదు. ఇది జరుగుటకు కొంత కాలము కూడ పట్టును. ఈ మధ్య కాలమున తూర్పు జర్మనీలో రష్యావారును, ఇతర భాగములలో తక్కిన మిత్రమండలివారును వారివారి ప్రాబల్యమును స్థిరపరచుకొని, యుద్ధ సామగ్రులను తయారుచేయు పరిశ్రమాగారములను స్థాపించి, యుద్ధ పరికరములను తయారుచేయ ప్రయత్నించెదరు. రష్యావారు, అమెరికావారు వారివారి పరస్పర క్షేమమును సాధించుకొనుటలో జర్మనులు జర్మను పరిశ్రమలు ప్రధాన సాధనము లగును. ఇండియా సహాయమున ఇదివరకు బ్రిటిషు వారు వారి సామ్రాజ్యమును వృద్ధి చేసుకొనుటకును, నిలబెట్టు కొనుటకును ప్రయత్నించి నట్లే జర్మనీ సహాయమున వారి వారి అధికారములను నిలబెట్టుకొనుటకు అగ్రరాజ్యములు ప్రయత్నించగలవు. అగ్రరాజ్యముల మధ్య ఏర్పడిన విభేదములు జర్మనీ దేశపు విభజనకు దారితీసిన వనియు, తద్వారా యూరోపుఖండముకూడ రెండుభాగములుగ విభాజితమయ్యె ననియు మనము గ్రహించవలెను. లండనుసమావేశము భగ్నమగుటమూలమున ఏర్పడిన పరిస్థితుల కిదియే ప్రధానలక్షణము.

ఫ్రాన్సు : కార్మికుల సమ్మె

ఇట్టి పరిస్థితులు ఏర్పడిన వని సూచించుటకో అన్నట్లు ఫ్రాన్సు దేశమున నవంబరు ఆఖరుభాగమునను, డిసెంబరు మొదటి రెండువారములలోను ప్రభుత్వముపై కమ్యూనిస్టుపక్షమువారు తిరుగుబాటు చేసిరి. కమ్యూనిస్టుపక్షము వారు రష్యాయొక్క అనుచరు లనియు, వారి కార్యకలాపమున కంతకు రష్యాప్రభుత్వము వారి ప్రవర్తన ప్రధానముగు ఆధారమనియు అందరు అంగీకరించినవిషయమే. ఫ్రాన్సుదేశపు కేంద్రశాసన సభలో కమ్యూనిస్టుపక్షమువారు ప్రాబల్యము వహించి నను మంత్రివర్గమున వారికి స్థానము లభించలేదు. వారికి విరోధముగ నుండు పక్షములవారందరు కలిసి మిశ్రమంత్రివర్గమును ఏర్పాటుచేసుకొని దేశమును పాలించుచున్నారు. ఇది కమ్యూనిస్టులకు ఎంత మాత్రము రుచించలేదు. ఈ మిశ్రమంత్రివర్గమును అధికారమునుండి తొలగించి, తమ అధికారమును దేశమున స్థాపించుటకు వారొక గొప్ప కార్మికసమ్మెను లేవదీసిరి. కార్మికులు ఇతర దేశములలో కష్టపడుచుండు నట్లు ఫ్రాన్సుదేశములోకూడ కష్టపడుచున్నారు. ఆహారాదిపదార్థముల ధరలు విపరీతముగ పెరుగుటయు, జీతములు దానికి తగినట్లు వృద్ధికాకపోవుటయు దీనికి కారణము. కార్మికసంఘములలో అధికారము కమ్యూనిస్టుపక్షమువారి చేతులలో నున్నందున వారు ఒక గొప్ప సమ్మెను లేవదీయగలిగిరి. రైళ్ళు, పోస్టు, టెలిగ్రాఫు, టెలిఫోను, ఎలెక్ట్రిసిటీ, గనులు మొదలైన పరిశ్రమలలో పనిచేయు సుమారు ఇరవైలక్షల కార్మికులు సమ్మెలో చేరిరి. ఆర్థికజీవితమంతయు స్తంభించెను. దీనితోపాటు ప్రభుత్వోద్యోగులలో సుమారు ౧౨ లక్షలుకూడ సమ్మెచేసిరి. రెండుపట్టణము లనుకూడ కమ్యూనిస్టుపక్షమువారు స్వాధీనపరచుకొనిరి. ఈసమ్మెను ఎదుర్కొనుటకై ప్రత్యేక అధికారములను మంత్రివర్గమువారు శాసనసభనుండి కోరుచు కొన్ని బిల్లులు ప్రవేశపెట్టిరి. కమ్యూనిస్టుసభ్యులు వాటిని ఖండించుచు, కాలయాపన చేయ సిద్ధపడిరి. తుదకు వారిని కాదని, శాసనసభ ఆ బిల్లులను ఆమోదించెను. ఇదిగాక రిజర్వులోనున్న ౮౦,౦౦౦ సైనికులను మంత్రివర్గమువారు సన్నాహపరచి, సమ్మెకారులపై ఉపయోగించుటకు తీర్మానించిరి. ఈ చర్య లన్నిటి ఫలితముగా కార్మికులు సమ్మెను చాలించి, మూడు వారము లైనపిమ్మట వారివారి పనులలో యథాప్రకారము ప్రవేశించిరి. ఎట్లో ప్రమాదమునుండి దేశమును రక్షింపగలిగితి మని మంత్రివర్గమువారు సంతోషించిరి. కమ్యూనిస్టులు లేవదీసిన విప్లవము, అంతర్యుద్ధము సమసి పోయెను. కాని వీరికి కలిగిన ఈ పరాజయము రష్యా వారి పరాజయమనియే భావించవలసియున్నది.

ఈ సమ్మెకు ఫలితముగ దేశములోని కార్మికు లలో రెండుచీలికలు ఏర్పడెను. కమ్యూనిస్టునాయకత్వ మును అంగీకరించని కార్మికులు సుమారు పదిలక్షలు కార్మికసంఘమునుండి విడిపోయి ప్రత్యేక కార్మిక సంఘము నొకదానిని ఏర్పరచుకొనిరి. పాత సంఘము వారు రష్యాపట్ల మైత్రిని వహించియుండగ, క్రొత్త సంఘమువారు విరోధమును వహించియున్నారు. రష్యా ప్రభుత్వమువారు ఫ్రెంచిప్రభుత్వమువారితో కొన్నివిషయములందు ఇదివర కుండిన సంబంధమును వదలుకొనిరి. మొత్తముమీద విదేశాంగవిషయములలో ఈ రెండు దేశములు వేర్వేరుమార్గముల ననుసరించు టకు నిశ్చయించుకొనినవని చెప్పవచ్చును.

ఇటలీ

ఫ్రాన్సులో సమ్మెలు జరుగుచుండిన కాలమున ఇటలీలో కూడ సమ్మెలు ప్రారంభమయ్యెను. కొన్ని రోజులలో అవి ఉత్తరమందేగాక మధ్యభాగమందును, దక్షిణభాగమందు కూడ వ్యాపించెను. వాటిమూలమున పరిశ్రమలు, రవాణా సౌకర్యములు, వర్తక వ్యాపారములు—అన్నియు నిలబడిపోవునట్లుండెను. కాని కొద్ది రోజులలో ఆ ప్రమాదములు తప్పెను. కార్మికులు సమ్మెనుండి విరమించుకొనిరి. కమ్యూనిస్టుపక్షమువారి కుట్రలు అంతరించెను.

ఇంతమాత్రముచేత యూరపుఖండమందు శాంతి పరిస్థితులు ఏర్పడినట్లు ఊహించుట కవకాశము లేదు. ఆ ఖండమంతయు కుములుచుండు కుంపటివలె నున్నది. ఏ నిమిషమందు మంటలు బయల్పడునో చెప్పజాలము. కార్మికవర్గమువారి ఆర్థికస్థితి మిక్కిలి దుర్భరముగ నున్నది. ధనికులయెడ వారు విరోధభావమును వహించియున్నారు. వారిలో కొందరు కమ్యూనిస్టు సిద్ధాంతము ననుసరించినవారు. మరికొందరు సోషలిస్టు సిద్ధాంతము ననుసరించినవారు. ఈ రెంటికి మధ్య పోరాటము తప్పదు. రషియావారు కమ్యూనిస్టుసిద్ధాంతమును బలపరచి, దానిని అనుసరించువారికి సహాయముచేయ నిశ్చయించియున్నారు. దానిని ఎదుర్కొనుటకు అమెరికావారు కొంత ప్రయత్నము చేయుచున్నారుకాని రషియావారికి కమ్యూనిజమందున్నటువంటి భక్తి అమెరికావారికి సోషలిజమందు లేదు. వారు సామ్రాజ్య కారీ విధానమే ఉత్తమవిధానమని విశ్వసించువారు. సోషలిజమునకు వారు చేయవలసిన సహాయము రషియా వారు కమ్యూనిస్టులకు చేయ నిశ్చయించుకొనినంతటిది కాదు.

అమెరికా సహాయము

అయినను కమ్యూనిజమును వ్యాపింపజేయకుండుటకై సంవత్సరముక్రిందట ప్రెసిడెంటు ట్రూమన్ తలపెట్టినట్టియు, అతని ప్రధానమంత్రియగు మార్షలు విపులపరచినట్టియు ప్రణాళికను కాంగ్రెసుసభ ఈనెలలో కొంతవరకు ఆమోదించెను. దీనిమూలమున వెంటనే ఫ్రాన్సు, ఇటలీ మొదలైన కొన్ని యూరపు దేశములకు సుమారు యాభైకోట్ల డాలర్ల విలువ గల సరుకులను అమెరికానుండి పంపుట జరుగును. ఇది తాత్కాలిక సహాయము. యూరపులోని కార్మికుల బాధ కొంతవరకు తగ్గగలదు. ఇదిగాక దీర్ఘకాల సహాయమునుగురించియు, దానిమూలమున యూరపు పశ్చిమ భాగములోని దేశములన్నిటియందును ఆర్థికపునర్నిర్మాణము ఏవిధముగ జరుగవలెనో ఆలోచించుటకును కాంగ్రెసువారు నిశ్చయము చేసుకొనిరి. వానిని గురించి సంప్రతింపులు ప్రారంభమయ్యెను.

రషియా-ఆర్థిక మార్పులు

రాజకీయఆందోళనము మూలముననేగాక ఆర్థికముగగూడ తాము యూరపుదేశములకు సహాయము చేయగల స్థితిలో నున్నట్లు ఋజువుచేయుటకో అన్నట్లు రషియావారు కొన్ని వారములక్రిందట వారి చెలామణీలో కొన్ని మార్పులను గావించి, ఇదివరకు అమలులోనుంచిన రేషన్ విధానమును కొంత రద్దుచేసిరి. ప్రజలు ఆహారపదార్థములను ఇష్టమువచ్చినట్లు కొనుటకు అవకాశమేర్పడెను. ఆహారపదార్థములు, కొన్ని ముడిపదార్థములు, కలప మొదలగువాటియొక్క ధరలు తగ్గెను. రషియా నుండి విదేశములకు ఎగుమతి కాదగిన పదార్థము లివియే. అమెరికాలో ధరలు విపరీతముగ పెరిగియున్నవి. విదేశములనుండి వస్తువులను కొనదలచువారికి అమెరికాలో కొనుటకంటె రషియాలో కొనుగోలు చేయుట లాభకరమను నమ్మకము కలుగుటకు కొంతవరకు రషియా ప్రభుత్వమువారు వారి చెలామణీయందు ఇట్టి మార్పులను గావించిరి. అమెరికాలోని ధరలు పెరుగకుండ శాసనములను గావించవలెనని ఇటీవల ట్రూమన్ కాంగ్రెసును కోరుటకు ఇది యొక కారణము. రాజకీయముగను, ఆర్థికముగను ఈ రెండు దేశముల వారి మధ్య పోటీ దినదినాభివృద్ధి గాంచుచున్నది.

పాలెస్టయిన్

ఈ పోటీ ఫలితము పాలెస్టయిన్ విషయమునను, చైనావిషయమునను కొంతవరకు స్పష్టమయ్యెను. పాలెస్టయినును విభజన చేయవలెనని ఐక్యరాజ్య సమితివారు గావించినతీర్మానమును ప్రతిఘటించుటకు అరబ్బీ రాజ్యములు నిశ్చయించుకొన్నట్లు చదువరులకు తెలిసియున్నది. దీనికి కావలసిన సన్నాహములను ఆ ప్రభుత్వములవారు చేయుచున్నారు. పాలెస్టయినులో అరబ్బీలకును, యూదులకును యుద్ధము ప్రారంభమయ్యెను. అయినను ఇది ఇంకను తీవ్రరూపము ధరించలేదు. మరి ఆయిదారు మాసములు బ్రిటిష్‌వారి అధి

కారము, వారి సైన్యములు ఆ దేశమం దుండును. ౧౯౪౮ ఆగష్టున గాని వా రచటనుండి పూర్తిగ వెళ్ళిపోజాలరు. ఈమధ్యకాలమున వారు అరబ్బీపక్షమును బలపరచుటకు ప్రయత్నింతురు. భరతఖండములో లీగుపక్షమును బలపరచి పాకిస్థానమును నిర్మించినట్లే వారు పాలెస్టయినులో అరబ్బీలను బలిష్ఠులుగ చేయుదురు. బ్రిటిష్ సైనికులు, సైనికోద్యోగులు అరబ్బీసైన్యములలో చేరి, వాటిని నడుపుటకు సంసిద్ధులుగ నున్నారు. కాని ఐక్యరాజ్య సమితియొక్క తీర్మానము ననుసరించి, పాలెస్టయిను విభజన జరిగినయెడల ఆ సమితి తరఫు సైన్యములను, వాటితోపాటు రషియా సైనిక దళములను ఆ దేశములోనికి రావలసియుండును. రషియా దళములు వచ్చుట బ్రిటిషు వారికిగాని, అమెరికావారికిగాని, అరబ్బీలకుగాని అంత యిష్టము లేదు. గనుక అది జరుగకుండుటకు వారుపన్నాగములను పన్నుచున్నారు. తప్పక యుద్ధము చేసెదమని ప్రకటించుచుండిన అరబ్బీ రాజ్యములవారు ఇటీవలసమావేశమై పాలెస్టయిన్ సమస్యను భద్రతాసంఘమువారు పునః ఆలోచించవలసినట్లుగా కోరియున్నారు. ఈ విషయమును ఆలోచించుటకుగాని, దీనినిగురించి నిర్ణయించుటకుగాని ఐక్యరాజ్య సమితికి అధికారమే లేదని ఇదివరకు వాదించుచుండిన అరబ్బీరాజ్యములవారు ఇట్టి పునరాలోచనను కోరుటలో అంతరార్థము లేకపోలేదు. దేశవిభజన జరుగవలెనని ఐక్యరాజ్యసమితివారు గావించిన తీర్మానము అమలులోకి రాకుండ చేయుటయే ఈయుద్దేశము.

కాని ఎప్పటికైనను పాలెస్టయినువిషయమున అంతర్యుద్ధము తప్పదనియు, అట్టి యుద్ధము ప్రారంభమైనయెడల అది క్రమక్రమముగ మధ్యప్రాంతదేశములన్నిటియందు వ్యాపించుననియు, దానిమూలమున తమ చమురుగనులకు ప్రమాదము సంభవించుటయేగాక అచ్చటి రాజ్యాంగవ్యవహారములలో పాల్గొనుటకు రషియావారికి అవకాశము సైతముకలుగుననియు అమెరికావారు ఊహించి తమ బలమును మరింత హెచ్చుచేసుకొనుటకై కొద్దిరోజులక్రిందట పర్షియా దేశముతో ఒక సైనికసంధిని గావించుకొనిరి. దాని ఫలితముగ పర్షియా సైన్యములను తర్ఫీదుచేయుటకు అమెరికా వారికి అవకాశ మేర్పడెను. రషియా మొదలగు విదేశములలోనివా రెవ్వరుకూడ ఇందుకై వినియోగించుట జరుగదు. కొంతవరకు పర్షియాలో అమెరికావారి ప్రాబల్యము స్థిరపడుటకు ఈసంధి ఉపయోగపడుచున్నది.

చైనా

కమ్యూనిస్టుసిద్ధాంతము ననుసరించు రషియా వారికిని, సాహుకారీవిధానము ననుసరించు అమెరికా వారికిని చైనాదేశముకూడ ఒక యుద్ధరంగమయ్యెనని చదువరులు ఎరిగియున్నారు. ఈ దేశములో గత ౨౦ సంవత్సరములుగ కమ్యూనిస్టులకును, ప్రభుత్వమువారికిని యుద్ధము జరుగుచున్నది. ఇప్పుడు ఈయుద్ధము అతి తీవ్రదశలోనికి వచ్చియున్నది. సమస్తసౌభాగ్యములతో కూడుకొన్న మంచూరియారాష్ట్రములో ముప్పాతిక మూడువంతులను కమ్యూనిస్టులు స్వాధీనపరచుకొనిరి. దాని ప్రధానపట్టణమగు "ముక్డెను"నకు సమీపమున వారి సైన్యములు సన్నాహమై ఆ పట్టణమునుకూడ వశపరచుకొన ప్రయత్నములు చేయుచున్నవి. ఇందులో వారికి జయము కలిగినయెడల చైనాను నిరంకుశముగ నేలుచుండు చియాంగ్ కై షేకునకు గొప్పదెబ్బ తగిలినట్లే భావించవలెను. కాని అట్టి నష్టము అతనికి కలుగుట అమెరికావారికి ఇష్టములేదు. కమ్యూనిస్టుల విజృంభణము రషియావారి ప్రాబల్యవ్యాప్తికి దారితీయునని వారి భయము. అందుచేత అతనికికూడ సహాయము చేయుట అత్యవసరమని భావించి, కాంగ్రెసువారు కొన్నికోట్ల ద్రవ్యమును అందుకై వినియోగింప నిశ్చయించిరి. ముఖ్యముగ, చైనాయొక్క సముద్రతీరప్రదేశములను కమ్యూనిస్టులుగాని, రషియావారుగాని స్వాధీనపరచుకొనుట అమెరికావా రెంతమాత్రము ఇష్టపడరు. అట్టిది జరిగినయెడల జపానులో వారు స్థాపించుకొన్న అధికారమునకును, పసిఫిక్ మహాసముద్రరక్షణకై వారు నిర్మించుకొనుచుండు ఏర్పాటులకును ప్రమాదము సంభవిల్లును. చియాంగ్ కై షేకు ప్రభుత్వము సౌమ్యమైనది కాదనియు, ప్రజల ఆర్థికసౌభాగ్యమును అతడు గమనించుట లేదనియు, అతని ప్రభుత్వకాలమున ఉద్యోగులలో లంచగొండితనము, అలసత్వము అత్యధికమయ్యెననియు అమెరికావా రెరుగుదురు. కాని కమ్యూనిస్టుల పట్లను, రషియావారిపట్లను వారికి గల ద్వేషముచేత వారిలోపములను గమనించక అతనికి సహాయముచేయ నిశ్చయించుకొనియున్నారు.

గనుక ప్రపంచములోని అంతర్జాతీయరంగమున డిసెంబరులో జరిగిన చర్యలనుబట్టి అగ్రరాజ్యముల మధ్య ఇదివర కేర్పడిన విరోధము మరింత ప్రబలమయ్యెననియు, యూరపులోని పశ్చిమదేశములందు కార్మికుల ఆర్థికస్థితి దుర్భరమగుచుండుటచేత వెంట

వెంటనే కాకపోయినను కొద్దికాలములో కమ్యూనిస్టు యోజనమాన్యమున మహావిప్లవము సంభవించు సూచనలున్నవనియు, మధ్యప్రాచ్యమందును, చైనాయందును అగ్రరాజ్యముల పరస్పరవిరోధము ప్రతిబింబితమగుచున్నదనియు స్పష్టమగుచున్నది. శాంతి, భద్రత, జనసామాన్యముయొక్క సౌఖ్యము రోజురోజునకు దూరమగుచున్నవి.

భరతఖండము

రష్యా అమెరికాలమధ్య ఏర్పడిన మనస్పర్థల వంటివే గతనాలుగుమాసములనుండి ఇండియా పాకిస్తానులమధ్య ఏర్పడియున్నవని చెప్పవచ్చును. ఇవి పోయినగాని రెండు రాజ్యములు ప్రజాసామాన్యము యొక్క సౌభాగ్యమునకై పాటుబడుటకు వీలుండదు. ఆంగ్లేయుల అధికారమును తొలగించి, మనము స్వరాజ్యమును సంపాదించుకొన్నందుకు వాంఛనీయమైన ఫలితము ఈసౌభాగ్యముగాని, రెండురాజ్యములు ఒకదానిపై ఇంకొకటి పగను సాధించుకొనుట కాదు. కాని ఈ సామాన్యసూత్రమును పాకిస్థాన్ అధికారులు అనుసరించుట కిష్టపడకుండుట మిక్కిలి విచారించదగిన విషయము.

ఇండియా-పాకిస్థాన్ సంబంధములు

ఇండియా ప్రభుత్వమువారు ఇందునిమిత్తమై ఇటీవల ఎంతో పాటుపడిరి. తాము ఔదార్యము చూపినయెడల పాకిస్థాన్ ప్రభుత్వమువారు వారి సంకుచితరాజ్యాంగవిధానమును మాని సౌహార్దముతో ప్రవర్తింతురని తలచి ఇండియాప్రభుత్వమువారు వివాదగ్రస్తములగు విషయము లన్నిటిలో పాకిస్తానునకు ఎక్కువ లాభము కలుగునట్టి రాజీకి డిసెంబరు సంప్రతింపులలో అంగీకరించిరి. ఈ సంప్రతింపులు కొంతకాలమునుండి జరుగుచుండినను ఉభయపార్టీలకు రాజీ కుదురజాలదనియు, మధ్యవర్తుల పరిష్కార మవసరమగు ననియు అందరు అభిప్రాయపడియుండిరి. కాని మధ్యవర్తుల జోక్యము అక్కరలేకుండ వివాదవిషయముల నన్నిటిని పరిష్కరించుకొన్నట్లు సర్దారు పటేల్ గారు కేంద్రశాసనసభలో తెలిపిరి. ఆగస్టు ౧౫ తేదీనాటికి నిలువలో నున్న ౪౦౦ కోట్లరూపాయలలో పాకిస్థాన్ వంతు ౭౫ కోట్లనియు, మొత్తపు అప్పులో దాని బాధ్యత నూటికి ౧౭.౫ అనియు, సైనికపరికరములలోను, రైల్వేలలోను, సైనికపరికరములను తయారుచేయు కర్మాగారములలోను, స్టర్లింగు నిలువలలోను దానికి ఎక్కువ వంతు లభించుటకును ఇండియాప్రభుత్వమువారు అంగీకరించిరి. వారీవిధముగ చూపిన ఔదార్యము మూలమున పాకిస్థాన్ ప్రభుత్వమువారు ఇండియాపట్ల ఇదివరకు చూపుచుండిన విరోధభావమును మరచి, సుహృద్భావముతో ప్రవర్తింతు రను ఆశయే వారిని ఈ ఔదార్యమునకు పురికొల్పెను.

పాకిస్థాన్ కలిగించు చిక్కులు

కాని ఇండియా ప్రభుత్వమునకు పాకిస్థాన్ ఆశాభంగమునే కలిగించినది. ఇదంతయు ఔదార్యఫలితము కాదనియు, పాకిస్థానమును చూచి బెదరిపోయి దాని నెదుర్కొనుటకు సామర్థ్యము లేని కారణము ననే పటేల్ ప్రభృతులు ఇండియాకు నష్టకరమైన ఆర్థిక షరతులను అంగీకరించిరని పాకిస్థాన్ ప్రభుత్వమువారు భావించి ఇదివరకు వారు పెట్టుచుండిన చిక్కులను మరింత వృద్ధిచేయుచున్నారు. చిక్కులు వృద్ధియగుచున్న వనుటకు వాయవ్యపరిహద్దు విషయమై పాకిస్థాన్ ప్రభుత్వమువా రనుసరించుచుండు రాజ్యాంగనీతియు, కాశ్మీరువిషయములో వారు ఎట్టి రాజీకి రాకుండుటయు ప్రధాన నిదర్శనములు.

భరతఖండపు వాయవ్యపరిహద్దులలో కొండజాతులవారును, యుద్ధముచేయుటయు, దోపిడియు ముఖ్యవృత్తులుగ ననుసరించు మహమ్మదీయులను లక్షల కొలదిగ నున్నారు. వీరి మూలమున ఇండియాకు ప్రమాదము కలుగకుండుటకై బ్రిటిషువారు రెండు సాధనముల నుపయోగించుచుండిరి. పరిహద్దులలో అక్కడక్కడ కొన్ని దుర్గములను కట్టి వాటిలో కొంత సైన్యముంచుట మొదటి సాధనము. కొండజాతుల నాయకులకు ఏటేట లక్షలకొలది ద్రవ్యము నిచ్చుట రెండవ సాధనము. వీటి ప్రయోగముచేత వారి మూలమున ఇండియాకు విస్తారప్రమాదము లేకుండెను.

కొండజాతులను రెచ్చగొట్టుట

దేశవిభజన జరిగిన తర్వాత ఈ పరిహద్దంతయు పాకిస్థాన్ పరిహద్దయ్యెను. ఇదివరకు బ్రిటిషువా రుపయోగించుచుండిన సాధనముల రెంటిని ఉపయోగించి కొండజాతుల మూలమున భరతఖండమునకు ప్రమాదము లేకుండచేయు బాధ్యత పాకిస్థానముపై పడెను. కాని ఆ బాధ్యతను వహించుటకు కొంతవరకు ఇష్టము

లేకపోవుట చేతను, కొంతవరకు సమర్థత లేకపోవుట చేతను దానిని పాకిస్థాన్ పూర్తిగ ఆక్రమించు కొనుచున్నది. దుర్గములలో నుండు పాకిస్థాన్ సైన్యములలో అనేకములను డిసెంబరులో ఉపసంహరించినది. పాకిస్థాన్ యొక్క ఆర్థికపరిస్థితులు చక్కగ లేవనియు, ప్రభుత్వమువారికి పన్నుల మూలమున వచ్చుచుండు ఆదాయము ఖర్చులకు తగినట్లుగ లేదనియు కొండ జాతినాయకుల కింవరకు బ్రిటీషువా రిచ్చుచుండిన ద్రవ్యమును ఇప్పుడు మానివేయుచున్నారు. ఈ రెండు కారణములచేత సరిహద్దులోని కొండజాతులవారు నిరాటంకముగ ఇండియాలోకి ప్రవేశించుట సులభసాధ్యముగు చున్నది.

కాని, ఇందుమూలమున నష్టపడువారు వాయవ్య సరిహద్దురాష్ట్రమునందును, పశ్చిమపంజాబు నందును ఉండు పాకిస్థాన్ ప్రజలే కదా! దీనిమూలమున ఇండియాకు కలుగగల చిక్కు ఎట్టిది అని చదువరులకు సందేహము కలుగవచ్చును. దానిని తీర్చవలసియున్నది.

పాకిస్థాన్ ప్రభుత్వమువారు, కొండజాతులవారు లాభము సంపాదించుటకు మరొక ఉపాయమును సూచించిరి. పాకిస్థాన్ మిాదుగను, పాకిస్థాన్ ప్రభుత్వమువారి రహస్యసహాయమునను వారు కాశ్మీరమును, ఇండియాలోని ఇతరరాష్ట్రములను ప్రవేశించి, ఇష్టానుసారము ప్రజలను దోచుకొనటయే ఈ ఉపాయము. కాశ్మీరముపై దాడి చేయుచుండు అల్లరిమూకలో అధికభాగము సరిహద్దులోని కొండజాతివారే. అట్టివారిని అణచుటకు బదులు, వారికి ప్రోత్సాహము కలిగించి, మరింత ఎక్కువగ కాశ్మీరములోనికిని, క్రమక్రమముగ తూర్పుపంజాబు మొదలగు ఇండియారాష్ట్రములలోనికిని ప్రవేశించునట్లు చేయుటయే పాకిస్థాన్ ప్రభుత్వమువారి పన్నాగము. పాకిస్థాన్ మూలమున మనకు కలుగుచుండు చిక్కులు అధికమయ్యె ననియు, మన ప్రభుత్వమువారు చూపిన ఔదార్యము నిష్ఫలమయ్యె ననియు స్పష్టమగుటకు వేరే రుజువు అవసరము లేదు.

కాశ్మీర యుద్ధము

పాకిస్థాన్ ఇండియాలకు మధ్య నుండిన వివాదగ్రస్తములగు ఆర్థికసమస్యలన్నియు రాజీమూలముగ పరిష్కారమగుట శుభసూచకమని సర్దార్ పటేల్ కేంద్ర శాసనసభలో ప్రకటించుచు, కొద్దిరోజులలో కాశ్మీర సమస్యకూడ ఇదే విధముగ పరిష్కారము కాగలదని ఆశించెను. కాని ఈ ఆశ నిరాశ అయ్యెను. ఇందువిషయమై మన ప్రధానమంత్రికిని, పాకిస్థాన్ ప్రధాన మంత్రికిని ఇటీవల జరిగిన సంప్రతింపులన్నియు నిష్ఫలము లయ్యెను. కాశ్మీరముపై పాకిస్థానసహాయముతో దాడిచేయుచుండు పితూరీదార్లను వెనుకకు మరలించుటకును, అట్టివా రికమిాదట ప్రవేశించకుండ ఉండునట్లు చేయుటకును పాకిస్థాన్ వెంటనే అంగీకరించి తగిన చర్య తీసుకొనవలె నని నెహ్రూ చేసిన సూచనను పాకిస్థాన్ ప్రధానమంత్రి పూర్తిగ నిరాకరించెను. ఈ పితూరీదార్ల మూలమున పాకిస్థానములో కాశ్మీరమును చేర్చుకొనుటకు జిన్నా నిశ్చయించియున్నా డనుటకు వేరు సాక్ష్యము కావలసినది లేదు. కాశ్మీరములో ఇప్పుడు జరుగుచుండు యుద్ధము పితూరీదారులకును, ఇండియాప్రభుత్వమునకును జరుగుచుండు యుద్ధము కాదనియు, అది నిజముగ పాకిస్థానమునకును, ఇండియాకును జరుగుచుండు యుద్ధమనియు, యుద్ధరంగమున పాకిస్థానమును ఓడించగలిగినగాని కాశ్మీరము మనకు దక్కదనియు మన ప్రభుత్వమువా రిప్పుడు బహిరంగముగ స్పష్టపరచుచున్నారు. షేకుఅబ్దుల్లాయొక్క అభిప్రాయముకూడ ఇట్టిదే.

ఇప్పుడు జరుగుచుండు కాశ్మీరయుద్ధము సామాన్యయుద్ధము కాదు. పాకిస్థాన్ ఇండియారాజ్యముల పరస్పరబలాబలములను శాశ్వతముగ నిర్ణయించగలదీ యుద్ధము. ఇందులో ఇండియా ఓడిపోయిన యెడల మనము కోల్పోవునది కాశ్మీరమునుమాత్రమే కాదు. మన స్వాతంత్ర్యమునంతను కోల్పోయిన వార మగుదుము. కాశ్మీరమును జయింపగల పాకిస్థాన్ సైన్యములు ఇండియానుమాత్రము జయింపలేని వగునా? ఈ ప్రాధాన్యమును గ్రహించియే "ఎన్ని సంవత్సరములు యుద్ధము చేయవలసి వచ్చినను పట్టుదలతో యుద్ధము చేసి, పితూరీదారు లొకడుకూడ కాశ్మీరములో లేకుండ చేయుటకు నిశ్చయించియున్నాను" అని ఇటీవల పండిత నెహ్రూ ప్రకటించెను. హైదరాబాదుసమస్య, ఇండియాలో అల్పసంఖ్యాకులగు మహమ్మదీయుల సమస్య—ఈసమస్యల పరిష్కారమునకు కాశ్మీరమును మనము రక్షింపగలవార మగుటయే ఆధారము. కాశ్మీరయుద్ధము ప్రమాదకరమైనయెడల హైదరాబాదునైఖరి తప్పక విషమించును. దీనిఫలము ననుసరించు మహమ్మదీయుల విరోధము ప్రజ్వరిల్లును.

ఆర్థికవిధానము : రేషనింగు

ఇండియాయొక్క భావి ఆర్థికవిధానస్వరూపము కొంతవరకు గతమాసములో స్పష్టమయ్యెను. రేషనింగు, కంట్రోలు మొదలగు విషయములను గురించి ఆహారమంత్రి డాక్టరు రాజేంద్రప్రసాదు చేసిన ఉపన్యాసములు, పారిశ్రామిక విధానమునుగురించి శ్యామప్రసాదముఖర్జీ, పండిత నెహ్రూ చేసిన ఉపన్యాసములు ఈ సందర్భములో గమనించతగియున్నవి. కంట్రోలు పద్ధతిని ఒకే పర్యాయముగా గాక క్రమక్రమముగ రద్దు చేయుటకు ప్రభుత్వమువారు నిర్ణయించిరి. దీనిమూలమున ఎక్కువ ప్రమాదము సంభవించినయెడల కంట్రోలు పద్ధతిని తిరిగి యథాప్రకారము ప్రవేశపెట్టుటకు వారు వెనుదీయజాలరనికూడ స్పష్టము చేయబడినది. ఈ పద్ధతిని రద్దుచేయుటకు కారణము దానిని చట్టానుసారముగ అమలులో నుంచలేకపోవుటయే. సమర్థులైనట్టియు, లంచములు పుచ్చుకొననట్టియు ఉద్యోగస్థులు లేకపోవుట, బ్లాకుమార్కెట్టువ్యాపారము చేయు వర్తకులను పట్టుకొని శిక్షింపలేకపోవుట — ఈ రెండు ప్రధానకారణములు. ఆహారపదార్థముల విషయములో మరికొన్ని కారణములనుకూడ వారు సూచించిరి. విదేశములనుండి వీటిని తెప్పించి, ప్రజలందరికి అందునట్లు చేయుటకు కోట్ల కొలది ద్రవ్యము ప్రభుత్వమువారు ఖర్చుపెట్టవలసి యున్నదనియు, దానికి కావలసిన ఆదాయము వారికి లేదనియు, దీనిమూలమున డాలర్ల కాటకము హెచ్చగుచున్నదనియు వారు సూచించిరి. కనుక కొంతవరకు కంట్రోలులు తగ్గిపోయెను. దాని ఫలిత మెట్లుండునో ఇప్పటికే తెలియుచున్నది. పంచదార ఖరీదు రెండింతలైనది. తక్కువ పదార్థముల ఖరీదులు కూడ పెరుగుట తప్పదు. కాని బ్లాకుమార్కెట్టు ఖరీదులంత ఎక్కువగ ఇవి పెరుగజాలవనియు, అందుచేత దీనిని గురించి మన మిప్పుడు విచారించవలసినది లేదనియు అనేకుల అభిప్రాయము.

అధికోత్పత్తియొక్క ప్రాధాన్యము

కాని ధరలు పెరుగుటకు, రేషనింగు కంట్రోళ్లు అవసరమగుటకు ప్రజలకు కావలసినంతటి వస్తుసముదాయము దేశములో ఉత్పత్తి కాకుండుటయే కారణము. యుద్ధకాలమున ప్రభుత్వమువారు వారి ఖర్చులకు విపరీతముగ నోట్లరూపమున సొమ్ము చెలామణిని వృద్ధిచేసిరి. అందుచేత రూపాయకు గల విలువ తగ్గుటయు, ధరలు పెరుగుటయు సంభవించెను. యుద్ధము ముగిసిన తర్వాత పదార్థోత్పత్తి ఎక్కువ అయియుండినయెడల కొంతవరకైనను ధరలు తగ్గియుండెడివి. కాని అట్లు జరుగలేదు. ఢిల్లీలో రెండువారములక్రింద సమావేశమైన పారిశ్రామికసభయందు ముచ్చటించుచు ఉక్కు, ఇనుము, బొగ్గు, సిమెంటు, బట్టలు మొదలగు వస్తువుల ఉత్పత్తి గత రెండు మూడు సంవత్సరముల మధ్య ఎంత తగ్గిపోయెనో, అందుకు కారణము లేవియో వారు సూచించిరి. అదేవిధముగ పండిత నెహ్రూ కలకత్తాలో వాణిజ్య సంఘ సమావేశమందు పలికిరి. కనుక వస్తువుల ఉత్పత్తిని వృద్ధిచేయుటకై ప్రజలందరు తీర్మానించుకొని పట్టుదలతో పనిచేయుటయే మన ఆర్థికచిక్కులన్నిటికి పరిహారసాధనము.

సమ్మెలు

ఉత్పత్తి అధికముగ కాకుండుటకు కారణములనేకము లున్నను వాటిలో ప్రధానమైనది కార్మికులు చేయు ఆందోళన, తత్ఫలితముగ సమ్మెలుఅని ఈ సమావేశములలో స్పష్టమయ్యెను. సమ్మెలమూలమున పరిశ్రమాగారములు వారములకొలది మాసములకొలది, పనిచేయక మూతబడిపోవుటచేత పదార్థోత్పత్తి తగ్గుచున్నది. ఇది సులభముగ అందరు గ్రహించగల అంశము. కూలీలు తక్కువ అనియు, సాహుకారులు స్వలాభపరులై కార్మికుల సౌఖ్యమును గమనింపకున్నా రనియు, సమ్మెల కిదియే కారణ మనియు, ఇది మారినగాని సమ్మెలు అంతరింపజాలవనియు కార్మికనాయకుల వాదము. రాజీమూలమున ఈ సమస్యను పరిష్కరించుట యుక్తము. సమ్మెలు అందరికిని నష్టదాయకములు.

అందుచేత మూడుసంవత్సరములకాలము సాహుకార్లకు కార్మికులకు మధ్య జరుగుచుండు యుద్ధమును చాలించుటకు ఇరుపక్షములవారును అంగీకరించవలసినదనియు, ఈ అంగీకారము ఉభయులకు లాభకరముగ నుండుటకు కావలసిన ఏర్పాటులను ప్రభుత్వమువారు చేయగలరనియు పారిశ్రామికుల సమావేశమందు ఒక తీర్మానము జరిగెను. దీనిని సాహుకార్ల ప్రతినిధులు, కార్మికుల ప్రతినిధులు, ప్రభుత్వప్రతినిధులు —మూడువర్గములవారును ఆమోదించిరి. క్రియలో దీని ననుసరించియే ఈ వర్గములవారందరు ప్రవర్తించుట మంచిది. అప్పుడుగాని మన ఆర్థిక తరచోపాయము వస్తూత్పత్తి అధికము కాజాలదు. మన ఆర్థికసమస్య

లలో ఉత్పత్తిసామర్థ్య ప్రస్తుతము ఎక్కువ ప్రాధాన్య మును వహించవలసియున్నది.

సోషలిజం : స్వేచ్ఛావిధానము

ఈ సమావేశములలో మంత్రులు కొందరు మరి యొక విషయమును గురించి ప్రభుత్వమువారనుసరించ దలచిన విధానమును గూడా స్పష్టపరచిరి. అధికోత్పత్తి జరుపుటకై దేశములోని పరిశ్రమలను సోషలిజం సిద్ధాంతము ననుసరించి ప్రభుత్వమువారే స్థాపించి నడుప వలెనా, లేక స్వేచ్ఛావిధానము ననుసరించి సాహుకార్లే నడుపవలెనా అను విషయము ఈ సమావేశము లలో చర్చకు వచ్చినది. కాంగ్రెసుయొక్క ఆశయము ప్రజాస్వామ్యముతో కూడిన సోషలిజం అని అధికార వర్గమువారు ఇటీవల ప్రకటించిరి. కాని దీనిని పూర్తిగ అమలులో నుంచుటకు అవకాశములు పరిస్థితులు ఇంకను ఏర్పడలేదనియు, కొంతకాలమువరకు సాహు కారీ విధానమునే అవలంబించవలసియుండు ననియు వారీ సభలలో తెలిపిరి. ఈ సందర్భములో ప్రభుత్వం వారు చేయవలసిన పని ఒకటి కలదు. సాహుకార్లు కార్మికులకు ఇయ్యవలసిన వేతనములను నిర్ణయించ వలెను. ఆదాయములపై ఎక్కువ పన్నులను విధించ వలెను. కాలానుసారముగ ధరలనుకూడ నిర్ణయించు టకు సిద్ధపడవలెను.

మద్రాసు రాష్ట్రము

డిసెంబరుమాసములో మద్రాసురాష్ట్రమున జరి గిన విషయములలో ప్రభుత్వోద్యోగస్థుల మూడు రోజుల సమ్మె ప్రాధాన్యము వహించియున్నది. సమ్మె చేసినవారు "నాన్ గెజెటెడ్" వర్గమునకు చెందినవారు. నెలకు రు. ౫౦, ౬౦ ల నుండి రు. ౩౦౦, ౩౫౦ వరకు సంపాదించుచుండువారు. తమకు లభించుచుండు జీత ములు తక్కువగ నున్నవనియు, ఈ కరవుకాలములో ఇంతటి స్వల్పజీతములతో కుటుంబములను పోషించు కొనుట సాధ్యము కాదనియు, వెంటనే కరవుభత్య మును ఎక్కువచేయవలెననియు, కొద్దికాలములో జీతములనుకూడ వృద్ధిచేయవలెననియు వారు ప్రభుత్వము వారిని కోరిరి. గతసంవత్సరముకూడ వారు ఇట్టి కోరి కలను కోరియుండిరి. వాటినిగురించి ప్రభుత్వమువారు ఆలోచించి ఏడెనిమిదిమాసములక్రిందట వారి జీతము లను కరవుభత్యములను కొంతవరకు వృద్ధిచేసిరి. కాని ఈ వృద్ధి వారికి తృప్తి కలిగించలేదు. అందుచేత వారు సమ్మెమూలముగ తమ అసంతృప్తిని వ్యక్తపరచ నిశ్చ యించి మూడు రోజులు సమ్మెచేసిరి. కాని ఇది జయ ప్రదముగ జరుగలేదు. సెక్రెటేరియట్ ఆఫీసులో పని చేయుచున్నవారు ఇందులో చేరలేదు. తక్కినవారి నుండి వీరిని మంత్రివర్గమువారు వేరుచేసిరి. ఇట్లు సమ్మెలో చేరినవారుకూడ వారి కోరికలు సిద్ధించు వరకు సమ్మెచేయక వారివారి ఉద్యోగములలో తిరిగి ప్రవేశించిరి. ఇందుచేత సమ్మె విఫలమయ్యెను.

ఉద్యోగస్థుల సమ్మె న్యాయమా ?

ఈ సందర్భములో మనము గమనించవలసిన విషయము లనేకము లున్నవి. పారిశ్రామికశాలలలో పనిచేయు కార్మికులవలె ప్రభుత్వముక్రింద పనిచేయు ఉద్యోగస్థులు సమ్మెచేయుట ధర్మమా అనునది వీటిలో ప్రధానమైనది. ఇతరదేశములలో ఉద్యోగస్థులు సంఘములుగ ఏర్పడి వారి కష్టసుఖములనుగురించి సాముదాయికముగ సంప్రతించుకొనుట కలదు. అట్టి సంఘములు చట్టవిరుద్ధములు కావని ఆదేశముల ప్రభు త్వములవా రొకప్పుడు అంగీకరించకపోయినను, ఇప్పుడు అంగీకరించియున్నారు. అదేవిధముగ మన రాష్ట్ర ములోకూడ ఉద్యోగస్థుల సంఘములు ఏర్పడినవి. కాని ఏదేశమందును వీరికి సమ్మెచేయు హక్కు లేదు. సమ్మెచేయుట చట్టవిరుద్ధము. వీరు సమ్మెచేయకూడ దని శాసించుటకు కారణము లనేకము లున్నవి. కార్మి కులకును, వీరికిని ఎట్టి సామ్యమును లేదు. పరిశ్రమల యజమానులు స్వలాభము నుద్దేశించి పనిచేయువారు. కాని ప్రభుత్వకార్యాలయములు అట్టివి కావు. లాభ మును సంపాదించుట ప్రభుత్వముయొక్క ఉద్దేశము కాదు. ప్రజల సౌకర్యములను వృద్ధిచేయుటయే వారి ఉద్దేశము. ఇట్టి సందర్భములో ఉద్యోగస్థులు సమ్మె చేయుట అధర్మము. (౨) ప్రభుత్వమువారు ప్రజలకై కల్పించు సదుపాయములు అంతరాయము లేక నడువ వలసినట్టివి. శాంతి, భద్రత, పోస్టు, టెలిగ్రాఫ్, ఎలెక్ట్రి సిటి, రైళ్లు-వీటికి ఎంతమాత్రము అంతరాయముకలిగినను సాంఘికజీవిత మంతయు స్తంభించిపోవును. ఇవి ఒక పూట ఆగినను ప్రజలకు కలుగు కష్టనష్టములకు మితిమేర లుండవు. పరిశ్రమాగారములద్వారా ప్రజలకు లభించు వస్తువులుబట్టలు, ఇనుపసామానులు మొదలైనవి— ఇట్టివి కావు. కొన్నిరోజుల పర్యంతము ఇవి లభించక పోయినను జీవితము దుర్భరము కాజాలదు. (౩) సాధా రణముగ ప్రభుత్వోద్యోగులకు మంచి జీతము లుండును.

ఉద్యోగము శాశ్వతము. అనేకరకములైన సెలవులు వారికి కలవు. వృద్ధాప్యమున వారికి పెన్షను లభించును. పరిశ్రమాగారములలో పనిచేయు కార్మికుల కిట్టి సదుపాయములు లేవు. వారి కిచ్చు వేతనములు స్వల్పములు; ఇష్టము వచ్చినప్పుడు వారిని ఉద్యోగమునుండి తొలగింతురు. వారికి సెలవులు చాల తక్కువ. పెన్షనులు ఉండవు. ఇట్టి పరిస్థితులలో ఉద్యోగస్థులు కార్మికులవలె సమ్మెచేయుట అధర్మము. (౪) ఇదిగాక ప్రజలు చెల్లించు పన్నులనుండి ఉద్యోగస్థులకు జీతములు లభించుచున్నవి. వారు ఎక్కువ జీతములను కోరిన యెడల, ప్రజలపై ఎక్కువ పన్నులను విధించవలసి వచ్చును. మన దేశములో సాధారణముగ రైతులు, కూలివాండ్రు, మధ్య తరగతివారు ఎక్కువగ పన్నులను ఇచ్చుకొనుచున్నారు. ఇప్పటికే పన్నుల భారము ఎక్కువగ నున్నది. ఉద్యోగస్థులకు జీతములు హెచ్చు చేయవలె నన్న, ఈ పన్నుల భారమును హెచ్చు చేయవలసియుండును. ఈలాటి కారణములచేత ఉద్యోగస్థులు సమ్మెలలోకి దిగుట అధర్మమని అనేకుల అభిప్రాయము.

కాని ఉద్యోగస్థుల స్థితిగతులు చక్కగ లేవని వారనుకొన్నప్పుడు వాటినిగురించి విచారణ చేయుటకును, అవి తృప్తికరముగ లేనప్పుడు వాటిని చక్కచేయుటకును సమ్మెలు గాక సాధనాంతరము ఏదైన ఉండవలెను. ఇతర దేశములలో అట్టి సాధనము లున్నవి. ఉద్యోగస్థులయొక్కయు, ప్రభుత్వమువారియొక్కయు ప్రతినిధులతో కూడిన మధ్యవర్తి సంఘములను ఆ దేశములలో ఏర్పరచియున్నారు. వీటిద్వారా ఉద్యోగస్థులు వారి ఇక్కట్టులను ప్రభుత్వము వారికి తెలుపుటకును, అవి నివారణ మగుటకు సాధనములు సంపాదించుటకును అవకాశ మున్నది. మన రాష్ట్రమందు ఇక మీదట ఇట్టి సమ్మెలు రాకుండ చేయుటకు ఇట్టి సంఘములను స్థాపించుటయే తగిన ఉపాయము. ప్రభుత్వము వారు వెంటనే ఈ పనికి పూనవలసియున్నది.



ముక్తాయింపు

[కథానిక]

శ్రీ పి. శ్రీనివాసరావు

ఆమెకళ్లల్లోంచి అశ్రువులు రాలుతూవున్నాయి ...కాదు...తీరని వ్యథతో ఆమె హృదయమే కరిగి ప్రవహిస్తున్నదేమో! ముసలితనంతో ముడతలు పడ్డ ఆమెచెక్కిళ్లమీదుగా కన్నీరు సరిగా జారలేక పోతున్నది...తన కళ్లయెదుటే, తన జీవితంలోనే, యీవిపత్తు రావడంకన్నా తనే చనిపోయినా బాగున్ను. ...తన రక్తమాంసాలు పంచుకుని పెరిగి, యీ వృద్ధాప్యంలో, గుండెలు చీల్చి...పోయాడు...తండ్రిని అనుసరించి పోయాడు...శీర్ణదశలో వున్న వృక్షం... ఆధారం లేకపోతే కూలిపోవలసిందేనా?

ప్రపంచం...ఆ వృద్ధురాలికి అతనే ప్రపంచం... అతను లేడు. ప్రపంచమూ లేదు. భగవంతుడుకూడా వోర్చలేకపోయాడు కాబోలు... తనని చూసి భగవంతుడికి కళ్లు కుట్టాలేం?...పిరికివాడి ప్రలాపం పిచ్చిమీదనేనా? అవును...దేవుడు పిరికివాడే అయి వుండాలి...యేమో! పిరికివాడో, ధైర్యశాలో అతడానికి భగవంతుడనేవాడు అసలున్నాడా అనే తన సందేహం. ఆమెజీవితంలో సూర్యుడస్తమించాడు. తనబ్రతుకు, ప్రపంచంబ్రతుకు,—సర్వాన్నీ చీకటి మింగేసింది. ఇక వెన్నెల కాయదు. పగలు రాదు. జీవితం యెలా కొనసాగించాలి? చివరకువరకు తను అనాథగా, యేకాకిగా, ప్రజల దాక్షిణ్యంమీద ఆధారపడి భారమైన జీవితాన్ని యీడ్చాలి. చని పోయాక తన శవానికి దహనసంస్కారం చేసేవాళ్లే వుండరు!

వొణికే చేతుల్లోని కొడుకుచిత్రంమీద కన్నీటి చుక్కలు వొక్కొక్కటిగా పడుతున్నాయి ప్రయాసతో... దుఃఖంతో గుండె యెండిపోయిందేమో!

ఛాయాచిత్రంలోంచి కొడుకు అమాయకంగా నవ్వుతున్నాడు... తల్లి పుత్రశోకం అతనికి తెలుస్తుందా? తల్లి పంచనైనా గాకుండా, యెక్కడో, మనుష్యులు— మానవత్వం వున్న మనుష్యులు—నివసించలేని ప్రదేశంలో, యమయాతన ననుభవించి ప్రాణాలు విడిచాడు. అతని ఆఖరిమాటలనైనా వినడానికి తల్లి నోచుకోలేదు. మృత్యువుగాదు అతన్ని పొట్టపెట్టుకున్నది- ప్రభుత్వం...ఒక్కగానొక్క కొడుకుమీదే ఆశలన్నీ కేంద్రీకరించిన ముసలితల్లిని దిక్కులేనిదాన్నిగా చేసిన ప్రభుత్వం...

"మధూ! చిట్టితండ్రీ! నువ్వులేని నా బతుకెందుకు? దేవుడు నన్నుకూడా త్వరగా మీ తండ్రీ కొడుకుల దగ్గరకు తీసుకురావాలని ప్రార్థిస్తున్నాను. నే నెవరికోసమని యింకా జీవించను? నిన్ను అకాల మరణం పాలుచేసిన ప్రభుత్వం, అందుకు బాధ్యులైన ప్రజలు, నన్నుకూడా అంత మొందించకూడదూ?... నవ్వుతున్నావా మధూ? ఇల్లంతా వెలిగే నీ నవ్వు నాకు కరువైంది నాయనా!"

సన్నగా యేడుస్తూ, కొడుకుఫోటోని హృదయానికి హత్తుకుని గొణుగుతున్నది...తన కొడుకుని మోసం చేసి, అధోగతి కల్పినవారందరూ యేరీ? అరచేతిలో స్వర్గం చూపించినవా రొక్కరూ ఆమె నోదార్చడానికి రారేం? ప్రపంచంలో యింత స్వార్థం, యింత ద్రోహం, వున్నదని ఆమె యీనాడే తెలుసుకోగలిగింది. మానవరూపదానవులుకూడా వున్నారని యిప్పుడే తెలుస్తోంది ఆ నిరాధారప్రాణికి...

మధుతండ్రిఫోటోనిండా దుమ్ము కమ్ముకొని వుంది. నిండువిగ్రహంతో, ఠీవిగా చూస్తున్నాడు యీ అభాగ్యకి

రాలిని...కాని ఆ చూపుల్లో జాలి వుంది. జీవమాత్రం లేదు. అతను గోడమీద ఫోటోచట్రంలో బంధించబడి వున్నాడు. లేకుంటే వోదార్చేవాడేమో...

"మీరు యీ బాధ లేకుండా సుఖంగా వెళ్లిపోయారు. నాలాగా పుత్రవియోగం మీకు కలగలేదు. మనుజీవితం వెలుగుబాటలు తొక్కడం చూచి సంతోషించారు. వాడి జీవితంమీద చీకటి తెరలు కమ్మడం చూచి మథనపడే అవస్థ తప్పించుకున్నారు. తండ్రీ కొడుకులు అక్కడ కలుసుకున్నారు. మళ్లీ...నేనే మిగిలాను. ఇద్దరూ నన్ను నిస్సహాయురాలినిగా చేశా రెందుకూ?"

ఆమె మీమాంసలో పడింది...కొత్తలో, జీవితంలో పచ్చదనం మిలమిలలాడుతుంటే, అంతరం సర్వానికి అధినేతల మనుకుంటాం...వూహాచిత్రాలలో వూగిసలాడ్తాం...ఐతే...విజ్ఞానం పండుబారేకొద్దీ, ఆనందం మొన మొక్కపోతుంది...అనుభవం, ఆశలకు జరిగే రణంలో అనుకున్నవన్నీ అనుకోని పరిణామం పొందుతాయి...ఆదర్శాలకు, సిద్ధాంతాలకు పర్యవసానం యేమిటి? జీవితమంతా వాటికోసమే పోరాడినా సాఫల్యం లేనప్పుడు, వాటికోసం ప్రాకులాడడం వృథా కాదూ? జీవితం నడకనే మనం అనుసరించాలి గాని, మన నడకని జీవితం అనుసరించదు. అందుకు తన చరిత్రే వ్యాఖ్యానం.

అందరూ వెక్కిరించారు. కొక్కిరించారు. "యీ ప్రేమవివాహాలు చాలాకాలం ఉండవు లే." అనీ, "కొత్తమురిపెం తీరాక చిన్నతప్పులే కొండంతలై భేదాలకు దారితీస్తాయి" అనీ, నిరుత్సాహబాణాలు వదిలారు ఛాందసులు, ఆచారవంతులు.

అతనిలో వున్న చిత్రకళానైపుణ్యం ప్రజలను వెగ్రత్తించింది. అతని చేతిలో కుంచె వొక సమ్మోహనాస్త్రమే...చిత్రకళని అతను నవ్యపథాలలో నడిపించాడు. ప్రతిచిత్రంలో వొక నూతన జీవకళ వుట్టిపడేది. పాశ్చాత్యకళ, భారతీయ కళ—యీరెంటిలోని వుత్తమ లక్షణాలూ అతని చిత్రకళలో ప్రతిబింబించేవి. కళకూ, అతనికీ భేదం లేదు. జీవితాన్నే కళకు అంకితం యిచ్చాడు. ఆనాటి మైకేల్ ఏంజిలో చిత్రాలు, యీనాడు సుధీర్ ఖస్తగీర్, దావెర్ల, నందలాల్ బోస్ చిత్రాలూ అతని కిచ్చే ఆనంద, ఆవేశాలకు యెల్లలు లేవు. ఐనా వాళ్ళ ననుకరించడం అతని కిష్టంలేదు. చిత్రకారుడుగా తనూ వొక కొన్ని వుజ్వల ఆదర్శాలతో వ్యక్తిత్వం సంపాదించాలనే అతడి ఆశయం. చిత్రరచనలో సింబాలిజం, సర్రియలిజం, తత్వాలకు చెందిన పికాసో, సాల్వర్ డాలీ చిత్రాలను చూచినప్పుడు, మాటల్లో వారి ప్రసక్తి వచ్చినప్పుడు, ఉగ్రరూపం ధరించడం పరిపాటయింది...

"...ఏ కళైనాసరే మానవజీవితంలోని వెలుగు నీడల్ని ప్రతిబింబించాలి. మనలో వుండే లోటుపాట్లని చూపించి, సక్రమమార్గం ప్రబోధించడమే ముఖ్యమైనప్పుడు, కళలు అందరికీ అందుబాటులో వుండాలి గదా? అందరూ అర్థం చేసుకోవాలిగదా! ఎవరికీ అర్థంకాని, జుగుప్సకలిగించే చిత్రాలను మనం సహించరాదు. మానసికచంచలత్వం, హైన్యం, దౌర్బల్యం, నిబిడత్వాలు వీరి చిత్రాల్లో గోచరిస్తాయి. అందుకే అవి కారడవులు, చీకటిగుహలు. సంఘాన్ని యేమాత్రం ముందుకు నడిపించలేవు..." అదీ అతని వాదన...అతని సిద్ధాంతాలు యీ వాదనబట్టి మనం వూహించవచ్చు.

ఆమెను చూస్తే సంగీతమే సచేతనమై ఆ రూపం ధరించిందా అనిపిస్తుంది...ఆమె కంఠంలో అంతటి మాధుర్యం వున్నది. "రాల్గరగించు విమలగంధర్వ గానం" అనే అతిశయోక్తి అలంకారం వాడడం తగదుగాని, ఆ వర్ణనాభావం ఆవిడగానంలోని ఔన్నత్యాన్ని స్ఫురింపజేస్తోందంటే వొప్పుకోవచ్చు... సంగీతం అంటే సుఖంగా ఆలాపించేది, సుఖంగా వినేది గాబట్టి, సునాయాసంగా పాడే సంగీతం ఉత్కృష్టమైందని ఆమె అభిమతం..."సంగీతం పరమార్థం వినేవారికి ఆనందం కలిగించడమే...యే సంగీతమైనా సరే, వినేవారు ఆ కొన్నిక్షణాలు సర్వం మరిచి సంతృప్తిపొందారంటే, ఆ సంగీతం సఫలమైనట్టే...

అలాంటప్పుడు శ్రోతను శాస్త్రప్రకట్టు సర్కసుతో విసిగించడం దేనికి? పాండిత్యం ప్రదర్శించదలకున్నా— అంటే సరిగమల వల్లింపు—మొదటివారిని సాక్షీసంగీతంతో మైమరపించడమే ముఖ్యం. ఎందుకంటే వినే వాళ్ళల్లో నూటికి తొంభయిమంది పండితులు కారు— వాళ్ళు కోరేది సంగీతమాత్రమే అనిమరచిపోకూడదు..."

సంగీతాన్ని ఆమె యీవిధంగా నిర్వచించింది...ఆ నిర్వచనతో కొమ్ములు తిరిగినవాళ్ళతో యుద్ధం చేసి, విజయపతాక నెత్తింది. అందుకే ఆవిడని చూస్తే సంగీతయోధులకు కన్నెర్ర...

అతని చిత్రాలను చూచి...చూచి...తనివి తీరనివారున్నారు. అతను చిత్రించిన ఆకలిమంటలలో అలమటించే దీనుల జీవితచిత్రాలు, ఆ దృశ్యాలు చూచి కళ్ళనీళ్ళు పెట్టుకున్నవారెంత మందో! ప్రతిచిత్రానికీ యేదో వొక నూతనత్వం కల్పించాడు...కళ నూతనవిన్యాసాలతో చిందులాడి, ప్రజ ఘటించిన అంజలి నందుకుంది...అదేవిధంగానే ఆమె సంగీతంకూడా సర్వజనామోదం పొందింది. ప్రజలేగాక ప్రకృతికూడా ఆమె గానాన్ని మంత్రముగ్ధమై ఆలకించేది. ఆమె కళకు యేలాంటి వర్గభేదాలూ, కులభేదాలూ అవరోధం కల్పించలేకపోయాయి.

ఆమె సంగీతానికి అతను జోహారర్పించాడు. అతని చిత్రలేఖనాని కామె విధేయురాలైంది. ఒకరి జ్ఞానత్వానికి వొకరు తలవొగ్గారు. కళాహృదయాలు నిర్మలప్రేమతో స్పందించాయి...కులాలు వేరైనా కళ వొకటే అవడంవల్ల పరస్పరవాంఛ రానురాను బలపడింది.

"వాణీ! యింకా యెన్నాళ్ళు యీ దాగుడు మూతలు?..." అన్నాడు అతను.

"ఐతే వెనకముందులు చూడకుండా దూకుతావా గోపీ?..." అంది వాణి.

"వెనకచూపు మన కెందుకు? ముందుకే నడుద్దాం..." గోపీమాట.

"ముందుకే నడిచినా బాటలో అటంకా లున్నాయేమో చూసుకోవద్దూ?..." వాణి ప్రశ్న.

"బాటలో అటంకాల్ని లెక్కచేస్తే ముందుకు నడవడం కాదు..." గోపీ అన్నాడు.

"ఐతే యేం చేద్దామని?..." వాణి రెండో ప్రశ్న వేసింది.

"పెళ్ళి చేసుకుని, మన యిద్దరి కళల సేవ చేద్దాం..." గోపీ జవాబు.

"అలా జరగాలంటే, మన ఆర్థికస్థితికూడా పరిశీలించడం మంచిది..." వాణి సలహా.

"ఆ ప్రసక్తి మన కిప్పుడే యెందుకూ? కళవల్ల సంపాదించలేమూ?..." అడిగాడు గోపీ.

"సమాజనియమాలకు వ్యతిరేకంగా పెళ్ళిచేసుకున్న మనల్ని సమాజం ఆదరించదు. వాళ్ళ మాటలు పాటించలేదని బంధువులు సహాయం చేయరు..." వాణి విశదీకరించింది.

"ఏమీ జరగదు. నిర్భయంగా వుండు..." గోపీ వుత్తేజన.

"మన సంగతి గాదు నా సందేహం! మన సంతానంగతి యేం గావాలి? ఆర్థికంగా బలవంతు లేం చేసినా చెల్లుతుంది. సంస్కారాలు వాళ్ళవే. మన గ్గాను!..." వాణి వాదన.

"రేపటిసంగతి రేపే! ముందు అపాయ మున్నదని యిప్పటినుంచే భయపడ్డం యెందుకు వాణీ!..." గోపీ వుత్సాహంగా పలికాడు.

"మన పనులకు మన సంతానం బాధ్యత వహించడం అన్యాయం..." వాణి సమర్థించుకున్నది.

"వాణీ! అవన్నీ భ్రమలు...యిక మన పెళ్ళి ఆపడం నేను భరించను."

"గోపీ! నాకూ కష్టమే! దూరదృష్టి మంచిదన్నాను, అంతే...నువ్వు నిర్ణయించిన రోజునే పెళ్ళి చేసుకుందాం...సరా?"

స్నేహితులు, అభిమానులు, వారి వివాహాన్ని అభినందించారు...అది అపూర్వకళాసంగమం అని ప్రశంసించారు. "సంగీతమనీ, చిత్రలేఖనమనీ, కళ అనీ యేవో పిచ్చికేకలతో ఐన యీ పెళ్ళి, వీళ్ళ ప్రేమ యెన్నాళ్ళు నిలుస్తుందిలే!" అంటూ పెదిమలు విరిచారు ముదిమివచ్చిన సంఘ స్తంభాలు...

పెళ్ళయి యిరవై సంవత్సరాలు—మరో ఐదేళ్లు గడిచినై...యీ రోజు వాణి తన పంచప్రాణమైన కొడుకు మరణానికి విలపిస్తోంది...తన ఆదర్శవివాహ ఫలమైన మధు—తమిద్దరి ఆశలూ, ఆశయాలూ కేంద్రీకరించిన యేకైక పుత్రుడు—తన జీవితసర్వస్వమైన గోపీవియోగంతో దుఃఖిస్తున్న వాణిని వదలి యెక్కడో కటకటాలవెనక ప్రాణాలు విడిచాడు...చితికిన వాణి హృదయంమీద అది సమ్మెటపోటు గాదూ?


గోపీ, వాణీలు బంధువులకు దూరమైనా కళకు మాత్రం దూరం కాలేదు. వేరే కులాలవారైన వాళ్ళిద్దరి పెళ్ళి సహించని ఆచారపరాయణు లందరూ శాప నార్థాలు పెట్టారు. అవి వాళ్ళిద్దరికీ దీవన లయాయి, ఆ కళాజీవుల అన్యోన్యతకు భంగం యే మాత్రం రాలేదు...పగబట్టినవాళ్లు పొగలుగక్కుతూ వాళ్ళకు హానిచేయలేక పోయారు...ఆర్థికస్థితి బలంగా వున్నంత వరకు అది పీలుకాదు.

మధు పుట్టిన రోజున ఆ దంపతుల ఆనందం కట్టలుతెగి పారింది. కుమారుడి భావిగురించి యెన్నో మధురమైన కలలు గన్నారు. తమిద్దరి ఆశయాలూ కుమారుడిలో ప్రతిఫలిస్తాయనీ, తమిద్దరి కళలూ వాడిలో యేకమవుతాయనీ వూహాసౌధాలు నిర్మించారు...కాని మధు...పెద్దవాడయే కొద్దీ, ఆ రెండు కళలమీదా ప్రేమ చూపలేక పోయాడు. యెప్పుడన్నా గోపీ కొడుక్కి తన ఆదర్శాలు బోధపరచాలనే ప్రయత్నాలు విఫలమయేయి. "...వీళ్ళిద్దరికీ యిదో పిచ్చి! వీటిమూలాన దేశాన్ని యేం బాగుపరచ గలిగారు? పూర్వకాలం మనుష్యులు!" మధు నవ్వుకునేవాడు. గోపీ, వాణీలు నిరుత్సాహం చెందారు. కొడుకు పోకడలకు ఆశ్చర్యపడేవారు. "మధు యెందుకిలా తయారవుతున్నాడు? రాజకీయాలూ, విజ్ఞానం మీద వాడికి తగని మమకారం! వొట్టి కుర్రతనం!"......వాళ్ళు చూస్తుండగానే రోజురోజుకీ మధు రాజకీయాల్లోకి చొచ్చుకు వెళ్తున్నాడు. తలిదండ్రుల మందలింపులు పనిచేయలేక పోయాయి...

గోపీ ఆకస్మికంగా హృద్రోగంతో మంచంపట్టాడు; తగిన విశ్రాంతి లేకుండా నిరంతరం పనిచేయడమే కారణమేమో! "వాణీ! కొడుకు విషయంలో జాగ్రత్త...వాడి కోరికలకు ఆటంకపడకు...మన ఆదర్శాలకు వ్యతిరేకంగా వెళ్తాడని ప్రేమించడం మానవద్దు!" భార్యతో చివరి మాటలు..."నాయనా! నీ ఆశయాలకు యెవ్వరూ అడ్డురారు...నీ తల్లి భారం మాత్రం నీదే! నువ్వే వాణికి సర్వం। నీతల్లి సుఖమే నీ కర్తవ్యం!" మధుకి తండ్రి యిచ్చిన ఆఖరి సలహా అది.

తండ్రి చనిపోయిన కొన్ని రోజులకే మధు రాజకీయాల కారణంగా ప్రభుత్వకారాగారానికి అతిథి అయ్యాడు. తల్లిని వదిలివెళ్ళడం అతడికి కష్టమే ఐనా విధిలేదు. మూర్తీభవించిన శోకమే ఐంది వాణి......యెప్పుడో, నెలకొకటిగా వచ్చే వుత్తరాలు జైలు నుంచి...వాణి వాటిని ప్రాణప్రదంగా దాచుకున్నది...కొడుకు ఆరోగ్యం గురించి దారుణమైన వార్తలు వచ్చాయి...మధుని మళ్ళీ చూచివద్దా మనుకుంటుండగానే వచ్చింది ప్రళయం...మధు చనిపోయాడు...!

ఇదేనా పర్యవసానం? చరమసంధ్య పరిణామం యిదేనా? ఆ అభాగిని కళ్ళల్లోనుంచి అశ్రువులు రాలుతున్నాయి...కాదు...తీరని వ్యథతో ఆమె హృదయమే కరిగి ప్రవహిస్తున్నదేమో! ముసలితనంతో ముడతలుపడ్డ ఆమె చెక్కిళ్ళమీదుగా కన్నీరు ప్రయాసతో జారి, వాణికి చేతుల్లోని కొడుకు ఛాయాచిత్రం మీద పడ్తున్నది......మధు అమాయకంగా నవ్వుతున్నాడు...తీవిగా చూస్తున్నాడు గోడమీద చిత్రములో గోపీ...ఆ చూపుల్లో జాలి వుంది......జీవం లేదు...!



గోవర్ధన సుభాషితములు

(అన్యోక్తి గుచ్ఛము)

— శ్రీ పల్లె పూర్ణప్రజ్ఞాచార్యులు —

ఓయి సాలీఁడ! నీదు గుణోదయంబు
ప్రకట మొనరింతు వనచరనికటమందు
ఇదియె బహుమాన మీవింత యేమియనుచు
గర్భదళనంబునకు వారు గడఁగనైరి.

చెలియ! చూపఁబోకు కలహంసగతుల నీ
యూర మాను నీ యొయ్యారములను
గ్రామసీమ యిచటఁ గడకంటఁ జూచిన
దయ్య మనుచు మేను వ్రయ్యబాఁదు.

మూసికొని రేకు లనెడు తల్పులను రేయి
రేయి నిదురించుఁ దమ్ములు హాయిగాఁగ,
కలువపూవ్వరో! దీర్ఘ జాగరముతోడ
ఈ చపలలక్ష్మి రక్షింతు వెంతసేపు?

నీదు గుణము రూపు నీ లక్షణంబులు
నీదు వయసుఁ జూచి నే భ్రమింప
సారభేయి! కపిలజనయిత్రి ని కని
కంఠమందు గంటఁ గట్టినాఁడ.

యూథపతి! నీకు నిల్వఁగా నుచితమైన
పాదపం బొక్కఁడేనిఁ గన్పట్ట దిచట
గడపు టెట్లో నిదాఘదీర్ఘంబు దినముఁ
దుమ్ములిపాడ నీ కెట్లు దొరకు నీడ?

వర్తి! సుస్నేహవతి! కృష్ణవర్త్మ నట్టు
లంటుకొని దగ్ధవైతి వయ్యయ్యొ యతఁడు
మంచి సొగసరిగాని భోగించి విడిచి
నట్టివానిని మరలఁ జేముట్టఁ డెపుడు.

శర్కరాశబ్దసహితచేఁ జవిగొనంగ
వలదు కలకండ గా దిది గులకరాయి
పాంథుఁడా! ముప్పు నాల్క కల్పించెగాని
కలిగెడు జనాపహాసంబు ఘనము దీన.

తాల్తురు మహాశయులు మహత్తరులనేని
లఘువులు ధరింపలేరు స్వల్పంబునైన
అచలములనేని దాఁచు రత్నాకరుండు
దాఁచ వోక కప్పనేని నిదాఘనదులు.

చంద్రశేఖరా! త్రుళ్లకు శంకరుతలఁ
బడ మిడితి నంచు దీనికి ఫలము నీవు
అచిరకాలంబులోన నే యనుభవింతు
చండిపదరేణువులఁ దలనిండఁ దాల్చి.

గుమగుమల యాసవలచు భోగులకు మలయ
భూరుహవిశేష మిట లేకపోవుఁగాక
శ్రేయ మందంగ ధర్మపరాయణులకుఁ
బూజకన్వేష్య మశ్వత్థభూజ మొండె.

పదిలముగఁ దాల్తు తలపైఁ *గపర్దమేని
వీడ్చియేనియు నార్జింతు వింత †వెండి
అలుకడుపుకొన నెంత హైన్యంబు నీకు
ఎవఁ డెఱుంగును నీతత్త్వ మీశ్వరుండ!

శ్రోత్రపేయమె యౌదువు సుధవిధాన
హిమకరుని రేఖవలె దూరదృశ్య వంతె
క్రూరభుజగాళి ని న్నంటుకొనుటఁ జేసి
మొగలిరో! నీవు మా కింక ముట్టఁదగవు.

కుబుస మనియెడు మేలి దుకూల మేది?
ఫణిఫణామణు లను విభూషణము లేవి?
కాళియభుజంగుఁ డేగిన కారణమున
నమ్మి చేరంగఁ దగితి వీనాఁడు యమున!

* కపర్దము=జటాజూటము; గవ్వ.

† వెండి రుద్రరోదనమువలనఁ బుట్టెనని శ్రుతి: "సోఽరోదీద్యదరోదీత్తద్రుద్రస్య రుద్రత్వమ్."

గురులు చేర శిరమ్ము మ్రొగ్గుదు, లఘువులు
చేరఁ దలమెత్తెదవు, సముల్ చేర సమవు;
మేటి యుచితజ్ఞవేగాని లో టాకండ:
తులరో! తూఁచెదు గురివెందతోడఁ బైఁడి.

పొంచి భుజగీగణమ్ము భోగించి విడువఁ
బ్రొద్దునను వచ్చుచుందు నాయొద్ది కెటనో
రే దిరిగి, యపరాశఁ బూరింపఁ బొమ్ము
కర్థ మే మిటఁ బ్రత్యూషగంధవాహ!

పవనుఁడు పరిమళాశఁ జేపట్టు దానిఁ
బద్మినిం దవ్వుగా నీటఁ బరఁగు దాని
వలచె నించుకయు స్వాతంత్ర్యబలముఁ గనరె
పాప మే యాపదకుఁ బాలుపడునో తేఁటి?

మలినులగువారు చెలియ! నిర్మలుల నామ
ధేయమును నోటనైన రానీయ రెపుడు
కోవెలల నోట 'తుహి' యన్న కూఁత దప్ప
మంచిపలు కెవ్వ డెవ్వ రాలించినారు?



కలగూరగంప

పరమార్థం

(పిట్టకథ)

మండుటెండలో నిర్జనములైన ఎడారులు, అరణ్యప్రదేశాలు, కొండలు, గుట్టలు దాటుకుంటూ పయనమై సాగిపోతూన్నాడు మహావీరుడు అలెగ్జాండరు. ఎందుకు పోతూన్నాడో, ఎక్కడికి పోతూన్నాడో అతనికే తెలియదు.

పోగాపోగా ఒక సెలయేరు అతని మార్గాని కడ్డు వచ్చింది. ఆ సెలయేటినిండా నిర్మలమైన జలం నిండివుంది. ఇతరులతో తన కవసరం లే దన్నట్లు ఆ వాగు ఒడుదుడుకులు లేకుండా సాగిపోతూంది. ఆ సెలయేటి కిరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు దట్టమైన ఛాయలను వెదజల్లుతున్నాయి. అంతా నిశ్శబ్దవాతావరణం.

అయితే—రాజ్యకాంక్షతో నిండిన కఠిన హృదయం, దౌర్జన్యకృత్యాలకూ, అమానుషచర్యలకూ అలవాటుపడ్డ నిప్పుకణికల్లాంటి నేత్రాలు, ఆయుధాల చప్పుళ్లూ, గాయాల బాధ కల్లాడిపోయే సైనికుల వెర్రికేకలూ విని గింగురులుపోయిన చెవులు—ఇవి ధరించిన అలెగ్జాండరుకు నిశ్శబ్దప్రకృతిలో ఏమి రామణీయకం, ఏమి సొగసు కనిపిస్తుంది?

పలుకకుండా మరికొంతదూరం సాగిపోయాడు అలెగ్జాండరు.

కొంతదూరం పోయేసరికల్లా ఎక్కడలేని అలసట, గుండెదడ, దాహం అతన్ని పెనవేసుకున్నాయి.

గత్యంతరం లేక సెలయేటి ఒడ్డున నిలబడి ఒక్క నిట్టూర్పు విడిచాడు.

దోసిలినిండా జలం పుచ్చుకొని గుటగుట సేవించాడు అలెగ్జాండరు.

అబ్బ! ఎంత మధురంగా వున్న దీ జలం! ఒక్క నిముషంలో అలెగ్జాండరు కెక్కడ లేని బలమూ, స్థైర్యోత్సాహములూ సంక్రమించాయి.

"ఇటువంటి మధురజలం కలిగిన ఈ సెలయేటికి మంచి ఫలవంతప్రదేశములో పుట్టుకస్థాన ముండాలి" అనుకున్నాడు అలెగ్జాండరు.

ఆ సెలయేటి పుట్టుకస్థానం కనుక్కోవలె ననే కోర్కె జనించింది. లేచి సెలయేటి ఒడ్డునే నడుస్తూ పయనమయ్యాడు విజేత అలెగ్జాండరు.

పోగాపోగా స్వర్గలోకానికి ద్వారం కనిపించింది. తీరా దగ్గరికి పోయి చూస్తే తలుపులు లోపలనుండి తాళం వేయబడివున్నాయి. ఎలాగయినా లోపలి కెళ్లి రావా లని నిశ్చయించుకున్నాడు.

తలుపులను కాలితో తన్నాడు.

తలుపు తీయమని బిగ్గరగా అరిచాడు.

ఊహూఁ, జవాబు వస్తేగా?

ఇంకా పెద్దగా అరిచాడు. కోపము కొద్దీ తలుపును తన్నాడు.

"ఎవరది? లోపలికి రావడానికి వీల్లేదు. ఇది ప్రభువు వాసస్థానం" అని లోనుంచి జవాబు మెల్లగా వినిపించింది.

అలెగ్జాండరుకు ఒళ్ళు మండిపోయింది.

"నేనూ ప్రభువును. యావద్భూమండలానికీ ప్రభువును. విజేత అయిన అలెగ్జాండరును. నన్ను రానీవూ లోపలికి?" చీకాకుతో అరిచాడు.

"ఊఁహుఁ...రానీవడానికి వల్లకాదు. విశేషాలూ గిశేషాలూ మాకు తెలీదు. మాకు తెలిసిన విశేషాలల్లా యింద్రియనిగ్రహం కల వికేతలే! పుణ్యాత్ముల్ని తప్ప మరొక రిక్కడికి రావడానికి వీల్లేదు" అని మళ్ళీ లోనుంచి ప్రత్యుత్తరం.

లోపలికి పోవాలని అలెగ్జాండరు విశ్వప్రయత్నాలు చేశాడు. అయినా అతడు విఫలమనోరథుడయ్యాడు. ఆఖరుకు విసిగి వేసారి స్వర్గలోకాధిపతి నుద్దేశిస్తూ ప్రార్థనాపూర్వకంగా వేడుకున్నాడు:

"స్వామీ, యావత్తు భూమండలంలో పేరెన్నిక గాంచిన మహావీరుణ్ణి నేను. మీరు నన్ను లోపలికి రానీవడం లేదుగదా, చిహ్నంగా ఏదైనా ఒక వస్తువిచ్చారంటే నరమానవులు పోరానిచోట అడుగుపెట్టి తిరిగివచ్చితి నను కీర్తిని సంపాదించుకొని ప్రజల మన్ననలకు పాత్రుడనౌతాను".

స్వర్గాధిపతి అలెగ్జాండరుచేతిలో ఏదో చిన్న పొట్లం పడేసి "పిచ్చివాడా, ఇక వెళ్ళు" అన్నాడు.

సంతోషంతో గంతులేస్తూ అలెగ్జాండరు తన గుడారానికి దారితీశాడు. ఒక్క పరుగులో తన గుడారం కడ వ్రాలాడు.

కంపించే హస్తంతో మెల్లగా పొట్లం వూడతీశాడు. ఏముం దేమిటి!

కాలుగాలిన పిల్లిలాగా గంతులేశాడు అలెగ్జాండరు.

"ఇంతదూరం ప్రార్థేయపడితే నా కిచ్చిం దేమిటి! మానవుని కపాలంలో ఒక చిన్న భాగం... ఛీ...స్వర్గాధిపతిని తగలెయ్య!" అంటూ ఆయనపైన తిట్లవర్షం...

ఇంతలో, ఎవరో ఒక వేదాంతి అటువైపు పోతూ అలెగ్జాండరును చూచి జాలిగొని అతణ్ణి దగ్గరకు పిలిచి చెప్పాడు: "ఓ మహారాజా! ఈ బహుమతి చిన్న చూపుతో చూడబోకు. నీకంటి కిది పనికిమాలిన వస్తువుగా కనిపించినా నిజంలో దానికి కొన్ని అపూర్వమైన గుణా లున్నాయి. ఒక త్రాసు, కొంత బంగారు, వెండి తెప్పించావంటే దీనిలోని విశిష్టతను నీ కెరుకపరుస్తాను."

ఆశ్చర్యచకితు డయ్యాడు అలెగ్జాండరు. అన్ని వస్తువులూ సమకూర్చమని సేవకుల కాజ్ఞ యిచ్చాడు.

వేదాంతి అలెగ్జాండరుచేతిలోని బహుమతిని పుచ్చుకొని త్రాసులో ఒకవైపు వుంచాడు. రెండోవైపు - అలెగ్జాండరుసేవకులు వెండి, బంగారు ఆభరణములు, పాత్రలు వుంచారు.

ఆదేమి చిత్రమోగాని, కపాల ముండే గిన్నె కిందికి ఒరుగుతూంది; రెండోది పైకి లేస్తూంది.

ఇంకాయింకా వెండి బంగార్లు వుంచారు. ఊఁహుఁ...లాభంలేదు...బంగారు ఎక్కువ వేసేకొద్దీ రెండోపక్క కపాల ముండే గిన్నె కిందికి దిగిపోతూంది.

అంతా దిగ్భ్రమ చెందారు.

"ఇంత చిన్న ఎముకలపోగుకు సరితూగే వస్తువే లేదా?" అన్నాడు అలెగ్జాండరు.

"ఉందండీ, వుంది" అని జవాబిచ్చాడు వేదాంతి. అలెగ్జాండరు కంటిరెప్ప అర్పక అట్టే చూస్తూన్నాడు.

వేదాంతి కొద్దిగా మన్ను చేతబుచ్చుకొని ఆ కపాలపు ముక్కపైన పూసి మళ్లీ త్రాసులో వుంచాడు.

త్రాసులో పెట్టాడో లేదో, రెండోగిన్నె గబగబా కిందికి దిగింది; కపాల ముండే గిన్నె తేలిగ్గా పైకి లేచిపోయింది.

అలెగ్జాండరు నివ్వెరపోయాడు.

దీనిలోని పరమార్థ మేమిటని వేదాంతి నడిగాడు.

వేదాంతి యిలా చెప్పాడు:

"ఓ మహారాజా! ఈ కపాలపు ముక్క మానవుని కంటిలో ఒక భాగం. ఇది మన దృష్టిలో చిన్నదైనప్పటికీ దీని ఆశకుమటుకు అంత మన్నమాట లేదు. దీనికి ఎంత వున్నాసరే, ఇంకాయింకా కావాలని

ఎప్పుడూ ఆహ్వానిస్తూంటుంది. ఎంత బంగారమున్నా యిచ్చిండి-దీనికి తృప్తి లేదు. కాని దీన్ని తీసుకుపోయి భూమిలో పూడ్చి కాస్త మన్ను కప్పినారంటే దీని తృష్ణ అంతటితో నశిస్తుంది!"

(మూలం : ఒక "హీబ్రూ" కథ)

చెరుకుమ్యాడి రాధాకృష్ణమూర్తి.

విద్వత్సమ్మానము



డాక్టరు చిలుకూరి నారాయణరావుగారు

ఆంధ్రభాషా, వాఙ్మయసేవకై నిరంతరము అదే పనిగా శ్రమిస్తున్న శ్రీ చిలుకూరి నారాయణరావుగారికి, వారి ఆ సారస్వతసేవకు హర్షించుచు ఆంధ్రవిశ్వకళా పరిషత్తువారు మొన్న డిసెంబరులో జరిగిన స్నాతకోత్సవమునందు 'కళాప్రపూర్ణ' బిరుదమునిచ్చి సత్కరించినారు. సుప్రసిద్ధ ఆంధ్రవైయాకరణులైన వజ్ఝలచిన సీతారామశాస్త్రిగారికికూడ పరిషత్తువారు అదే సందర్భమున అదే బిరుదుతో సమ్మానించినారు.

పాదరక్షల ప్రభావం

కాలికి తొడుగుకొని కన్న తావులలో నడవడానికి పనికివచ్చే వస్తువే కదా అని తక్కువరకం వస్తువుగా తలచి, మారు మూలల్లో నుంచి, మానవులు చెప్పులకు చెప్పరానంత చిన్నతనం కలిగిస్తున్నారు. కాని, బాగా ఆలోచిస్తే చెప్పుకు కూడా గొప్పతనం కద్దని చెప్పితీరవలసివస్తుంది. కారణం? పాదరక్షలే కదా అని అశ్రద్ధ చేస్తామేగాని, అవే లేకుండా నడిస్తే, అరికాలిమట నెత్తికెక్కి, అంటువ్యాధులకు, కండ్ల జబ్బులకు కారణం కలుగుతుందని మనకు తెలియడంలేదు.

ఈ "జోళ్ళ" పుట్టుపూర్వోత్తరాలు చూడబోతే కండ్ల జోళ్ళకన్నా కాలిజోళ్ళే మొదట యేర్పడినవని తెలుస్తుంది. అసలు మన నాగరకత, వేషధారణా కాలిజోళ్ళతోనే ప్రారంభమై, క్రమేణా అంటుజోళ్ళు, కండ్లజోళ్ళ దాకా వచ్చింది. కాబట్టి మన వేషంలో సంస్కారం కలగడానికి పునాది చెప్పుల మీదనే అని వేరేగా చెప్పనక్కరలేదు. ఈ విధంగా అందానికి చెప్పులు తొడిగి, ఆరోగ్యానికి చెప్పులు తొడిగి, వానికి అధమత్వం ఆపాదించి అన్యాయం చేయడం కానిపని.

చెప్పుతో కొట్టి కసి తీర్చుకోవడం కొందరు గొప్పగా భావిస్తారు. ఆ విధంగా చెప్పుదెబ్బ తిన్న వారికి గొప్ప అవమానం జరిగినట్లు భావిస్తారు కాని, ఆ రీతిగా అనుకోవడమే గొప్ప తప్పు. కోరికోరి, ఒప్పిచ్చి చెప్పుదెబ్బ కొట్టించుకొనే పరిస్థితి లేకపోలేదు. కలియుగవైకుంఠమగు తిరుపతి యాత్రాసందర్భంలో యేడుకొండలు యెక్కడం ప్రారంభించే చోట ఒక చిన్న మంటపం వుంది. దానిని "అలిపిరి దేవస్థానం" అంటారు. అచ్చట దాసుడొకడు పెద్ద యిత్తడిచెప్పుకు పూజాపురస్కారాలు చేసుకొంటూ వుంటాడు. అతడు త్రిమూర్తిపని గద్దుమంది కానీ కానీ వసూలు చేసుకొని, ఆ చెప్పుతో ఒక చిన్న దెబ్బ తగిలీతగలకుండా కొట్టి, "మీ పాపం పటాపంచలైనాది" అంటాడు. చూచితిరా! చెప్పుదెబ్బ కోరి కొనుక్కోవడంలో గొప్పదనమూ, కోపంతో యెవరైనా కొడితే చిన్నతన

మూలా? ఇది మనబుద్ధి వ్యత్యాసాలకు తార్కాణం తప్ప మరేమీ కాదు. "కుక్క కాటుకు చెప్పుదెబ్బ" అన్నప్పుడు దాని ప్రయోజకత్వాన్ని మనము అంగీకరించవలసిందే. భూతవైద్యులకు చెప్పులు చాలా ముఖ్యం. వారు దుష్టగ్రహాలను చెప్పుల ప్రయోగంచేత తమ చెప్పుచేతలలో ఉంచుకొంటారు. వజ్రాన్ని వజ్రంతోనే తెగగొట్టవలె నన్న సూత్రప్రకారం కొందరు చెప్పు కరచిన గాయానికి చెప్పుముక్కనే కాల్చి బూడిదచేసి, ఆముదంతో కలిపి పట్టిస్తారు.


దేశకాలపాత్రానుసారం చెప్పులకు పేరు, ఆకారం, విలువ వగైరాలు మారుచుండును. "బూట్సు" అన్నా, "షూ" అన్నా, "స్లిప్పర్సు, పరాసన్న, చడావులు, చప్పల్, చెప్పులు, పాదుకలు" అన్నా పాదరక్షలకు పర్యాయపదాలే. వీనిలో పాదుకలు చాలా పురాతనమైనవి. ఇవి యిక్ష్వాకుల నాటివి. ఆ రోజులలో వీనికి రాజప్రాతినిధ్యంకూడా లభించింది. రామాయణకాలంలో పాదుకాపట్టాభిషేకం ముందటూ, రామపట్టాభిషేకం తర్వాతా జరిగింది. తదనంతరం వీనికి గౌరవం క్రమేపీ క్షీణించిపోయింది. రాముల వారి కాలంలో రాజమర్యాద లందిన పాదరక్షలు నేడు రాజకీయాలలో ప్రజలచే తమ వ్యతిరేకభావం చాటడానికి సభలలో సంకోచం లేకుండా విచ్చలవిడిగా విసరబడుచున్నవి.

పిల్లల వాఙ్మయంలో చెప్పులను గూర్చిన కథలు చాలా వున్నవి. అడుగడుగుకు ఆమడదూరం కొనిపోయే యింద్రజాలపు చెప్పులు, సిండరిల్లాకు దేవత యిచ్చిన వింతజోళ్ళు—వీనిని గురించి వినే వుంటారు.

మన జీవితంలో, ఆచారవ్యవహారాలతో చెప్పులకు చాలామట్టుకు జోక్యం కద్దు. కొత్త పెండ్లికొడుకు కాశీయాత్రాసందర్భంలో కొత్త చెప్పులజత కొనిపెడతాము. చైనాదేశ స్త్రీలు చెప్పులు ప్రేమచిహ్నంగా వాడుతారు. ఎవరైనా ఒక అందకత్తె ఒక యువకునికి తన చెప్పులలో నొకదానిని చేతికిస్తే ఆ యువతి అతనిని ప్రేమించుచున్నట్లు అర్థం. ఈ యాచారవిశేషాన్ని Good Earth అనే చిత్రంలో చూపుతారు. మన దేశంలో ప్రేమకలాపం సవ్యంగా సాగకుంటే పాదరక్షాప్రయోగం తప్పదు. ఇది గాకుండా, మనలో కొన్ని సందర్భాలలో చెప్పులదానం చేసే ఆచారం కద్దు. "ఆవును చంపి, చెప్పులదానం చేసినట్లు" అన్న సామెత దీనికి నిదర్శనం. తత్వజ్ఞశిఖామణి యగు వేమన "చెప్పు తినెడి కుక్క చెరుకు తీపెరుగునా?" అని తటాలున అన్నాడు. ఉదాహరణానికి యీ మాట చెప్తుంటాడేగాని చెరుకులో మనకున్న రుచి చెప్పులలో కుక్కలకు లేకపోదన్న సత్యం గుర్తించక కాదు. "లోకో భిన్నరుచిః" అన్న సామెత తెలియకపోతుందా అతనికి?

ఇంకా చెప్పడం సాగిస్తే చెప్పులమహిమ చేటభారతం కావచ్చును. కాబట్టి చెప్పులు మన మనుకొనేటంత చెడిపోయిన వస్తువులు కావని చెప్పడమే యీ రచనయొక్క ముఖోద్దేశము.

చె. శ్రీ. వెంకటరామయ్య.




కోలగొట్ల భీమేశ్వరస్వామిగారు
(ఖనిజశాస్త్ర ప్రవీణులు)
విజయనగరవాస్తవ్యులు. శ్రీ రిజిస్ట్రారు పట్టాభిరామయ్యగారి పుత్రులు. జననము ౧౯౦౩ జనవరి ౪-వ తేదీన.

వీరు కలకత్తాలోని సెంట్ జేవియర్సు కళాశాలయందు చదివి ౧౯౨౮ లో బి. యస్‌సి. (ఆనర్సు) పట్టభద్రులైరి. తరువాత మద్రాసుప్రభుత్వమువారి ఉచిత వేతనము గైకొని ధనబాదునందలి 'ఇండియన్ స్కూల్ అఫ్ మైన్సు'లో (౧౯౨౮-33) యథావిధి వ్యాసంగముచేసి, వారి పరీక్షలో మొదటితరగతి యోగ్యతాపత్రములతో ప్రప్రథములుగా గెలుపొందిరి. 'మైనింగ్ అండ్ జియాలాజికల్ ఇన్స్టిట్యూట్ అఫ్ ఇండియా'వారి 'హేడన్ (Hayden) బహుమతి పతకమును కూడ వీరు సంపాదించుకొనిరి. ఇదికాక, ౧౯33-3౪ సంవత్సరమునకు వీరికి కలకత్తా విశ్వవిద్యాలయము వారు ఖనిజశాస్త్రమునకై నిర్దిష్టమైయుండు పిల్లీ స్కాలర్‌షిప్పుకూడ ఇచ్చి వీరిని మరింతగా ప్రోత్సాహపరచిరి.

తదనంతరము వీరు కర్నూలులో రెండేండ్లును, బర్మాలో కొన్నాళ్ళును, హిమాలయపర్వతములమీద ౧౬,౦౦౦ అడుగుల యెత్తుననున్న కాశ్మీరసంస్థానమున కొన్నాళ్లును, ఇంకను ఇతరత్రకూడ కొన్ని మైనింగు కంపెనీలలోను, గనులలోను పనిచేసి అనితరసాధారణమైన అనుభవమును సంపాదించిరి.

౧౯౩౬ లో ధనబాదునందలి కళాశాలలో మైనింగ్-జియలాజికల్ సర్వే ఉపన్యాసకుడుగా ప్రవేశించిరి. తమ అభిమానవిషయములందు అనేక పరిశోధకవ్యాసములను ప్రచురించి, పతకములను, యోగ్యతాపత్రములను గడించిరి. ౧౯౪౬ లో భారతప్రభుత్వము వారి పంపున లండనునందలి 'రాయల్ స్కూల్ అఫ్ మైన్సు'లో తగుమైన తరిఫీదుపొందుటకై వెళ్లి, తగిన శిక్షణ పొంది, ఫ్రాన్సు, స్విట్జర్లాండు వగైరా వివిధ దేశములను పరిశ్రమముగా చూచుకొని కడచిన అక్టోబరు మాసమున స్వదేశమునకు తిరిగివచ్చి, పునశ్చ తమ ఉపన్యాసకపదవిలో ప్రవేశించిరి.

ఈరీతిని సాంకేతికవిద్యలయందు అభ్యుదయపరంపరల నందుచున్నవారు మన ఆంధ్రులలో చాల అరుదుగానున్నారు. అందులోను ఆంధ్రవైశ్యులలో మరీ అరుదని చెప్పవలయుచున్నది.



ఎలిజబెత్ రాకుమారి వివాహ సమయములో నానాదేశాలు పంపిన
సంబారాలతో తయారుచేసిన వెడ్డింగ్ కేక్



విమర్శనము

శ్రీ శివాజీచరిత్ర

మూడవ కూర్పు. రచయిత: కీ. శే. కె. వి. లక్ష్మణరావుగారు, ఎం. ఏ. ప్రకాశకులు: కొమర్రాజు వినాయకరావుగారు, అభ్యుదయ ప్రెస్, గవర్నరుపేట, బెజవాడ. వెల రు. 3.

ఆంధ్రదేశమునందు ప్రఖ్యాతిగాంచిన చరిత్రకారులలో కీ. శే. శ్రీ కె. వి. లక్ష్మణరావుపంతులవా రగ్రగణ్యులు. ఇరువదియవ శతాబ్దపు ప్రారంభదశయందు తమ రచనలచే జాతీయోద్బోధమును గలిగించిన మహనీయులలో వీ రొక్కరు. ఆంధ్రదేశమున చరిత్రపరిశోధన గతశతాబ్దప్రథమపాదమున నారంభమైనది. కావలి వెంకటబొర్రయ్యగారు ఆంధ్రచరిత్ర పరిశోధనకు పునాదులు వేసిరి. సర్వేయరు జనరలు కర్నలు కాలిన్ మెకంజీగారి పక్షమున పనిచేయుచు స్వయముగ నేమి, గుమస్తాల మూలమున నేమి దక్షిణదేశమందలి గ్రామములు, పట్టణములు చుట్టిచూచి యందలి శాసనాదిచారిత్రకసామగ్రులను పరిశీలించి వానికి ప్రతులను వ్రాయించి తెచ్చి వానిని పుస్తకరూపమున సంపుటీకరించిరి. ఈ పుస్తకసమూహమునే 'మెకంజీ మాన్యుస్క్రిప్ట్సని' యందురు. మరియు వెంకటబొర్రయ్యగారు మెకంజీగుమాస్తాలు సేకరించిన చరిత్రసామగ్రి నాధారముచేసికొని కొన్ని స్థానికచరిత్రలను రచించిరి. ఇవి యముద్రితములు. మెకంజీపుస్తకసంచయములం దణగియున్నవి. వ్రాసినవి స్థానికచరిత్రలే యైనను బొర్రయ్యగారి పరిశోధనాపద్ధతులను, చరిత్రరచనావిధానము సాధునిరూపకాదర్శప్రాయములై యున్నవి. కావలి వెంకటబొర్రయ్యగా రాంధ్రచరిత్రరచయితలలో వాల్మీకులవంటివారు. వీరిచే సమకూర్పబడిన చరిత్రసామగ్రుల నాధారముచేసికొని బుక్కపట్టణము రాఘవాచార్యులవా రాంధ్రదేశచరిత్రమును వ్రాసిరి. వీరేశలింగంగారి ఆంధ్రకవుల చరిత్రయొక్క మూలాధారములలో నీ మెకంజీవ్రాతపుస్తకములు ముఖ్యమైనవి. చిలుకూరి వీరభద్రరావుగారు తమ యాంధ్రులచరిత్రరచనకు గలసిన సామగ్రిని చాల వఱకు నీయమూల్యమైన గనినుండియే త్రవ్వితీసిరి.

మెకంజీవ్రాతపుస్తకములలోని సామగ్రిని అప్పుడప్పుడు వాడుకొన్నను లక్ష్మణరావుగారు కేవలము వెంకటబొర్రయ్యగారి సంప్రదాయమునకు చెందినవారు కారు. వీరు మహారాష్ట్రచరిత్రపరిశీలనా సంప్రదాయమున తరిఫీదునంది, రానడే, రాజవాడే మొదలయిన మహారాష్ట్రచరిత్రపరిశోధకుల రచనల నాదర్శముగ నుంచుకొని చరిత్రరచనకు గడగిరి. ఈ కారణము చేతనే వీరి మొదటి చరిత్రగ్రంథము శ్రీ శివాజీచరిత్ర యైనది. ఆంధ్రుల చరిత్రకు సంబంధించిన పరిశోధన నత్యావశ్యమైనదానిని కొంతవఱకు సాగించినను వీరు వీరభద్రరావుగారివలె దీక్ష వహించి యాంధ్రుల చరిత్రను వ్రాయలేకపోయిరి.

లక్ష్మణరావుగారు శివాజీచరిత్రను రచించి ఇప్పటికి ముప్పదియైదేండ్లయిన దని మూడవకూర్పు పీఠికయందు శ్రీ దిగవల్లి వేంకటశివరావుగారు వ్రాసియున్నారు. అప్పటికి లభించిన చరిత్రాంశముల నన్నిటిని సమకూర్చి పరిశోధించి లక్ష్మణరావుగారీ గ్రంథమును వ్రాసిరి. శ్రీ శివాజీ అఖిలభారతదేశమునకు నాదర్శపాత్రుడైన వీరుడు. అన్యసహాయము లేక తన స్వశక్తిసామర్థ్యముల మూలముననే మహమ్మదీయులపై గ[illegible]యౌరంగజేబు సైన్యంబులను [illegible] ధర్మము సంరక్షించి హిందూజాతిస్వాతంత్ర్యమును నెలకొల్పిన జగదేకవీరుడు శ్రీ శివాజీ. ఈ మహానుభావుని చరిత్ర నాంధ్రభాషయందు రచియించి యాంధ్రలోకమునకు ప్రసాదించిన లక్ష్మణరావుగా రెంతయు ధన్యులు, ప్రశంసాపాత్రులు. నాటికిని నేటికిని ఆంధ్రమున గల శివాజీచరిత్ర ఇది యొక్కటియే. లక్ష్మణరావుగారి గ్రంథము యొక్క యుత్కృష్టతను దెల్పుట కిది యొకటి చాలును.

కాని లక్ష్మణరావుగారి శివాజీ చరిత్ర ప్రకటింపబడినపిమ్మట చాల పరిశోధన జరిగినది; పెక్కు నూతనవిషయములు బయల్పడినవి. వీనివలన లక్ష్మణరావుగారి గ్రంథమున కొన్ని పొరపులు బయల్పడినవి. 3, 4 పుటలలో విజయనగరచరిత్రకు సంబంధించిన యథోక్తిక యొకటి కలదు. ఇందు రామరాజీయములోని 'శతువిజాపురవరకామినీగర్భముల'

అను సీసపద్యమందు పేర్కొనబడిన శ్రీరంగరాయలు కృష్ణరాయల యల్లుడైన అళియరామరాజు తండ్రియైన శ్రీరంగరాజే అనియు, అతడు బిజాపుర గోలకొండ అహమదనగర సుల్తానుల రాజ్యములను గెల్చెననియు చెప్పియున్నారు. ఇది తప్పు. రామరాజీయమునందు పేర్కొనబడిన శ్రీరంగరాయలు తిరుమలరాయల పుత్రుడును, క్రీ. శ. ౧౫౭౧ మొదలు ౧౫౮౫ వర్షాంతము విజయనగరసామ్రాజ్యమును పాలించిన మొదటి శ్రీరంగరాయలుగాని అళియరామరాజు తండ్రియైన శ్రీరంగరాజు కాడు. మఱియు, ౨౨౭ వ పుటయందు 'తంజాపూరుసంస్థానాధిపుండగు విజయరాఘవుని గెలిచి శహాజీ యాగ్రామమే తనకు రాజధానిగా చేసికొనెను' అని లక్ష్మణరావుగారు వ్రాసియున్నారు. ఇదియు తప్పు. శహాజీకి తంజాపూరితోగాని, విజయరాఘవునితోగాని యెట్టి సంబంధమును లేదు. తంజాపూరిని గెలిచినవాడు శహాజీపుత్రుడైన యేకోజీ కాని శహాజీ కాదు. ఏకోజీ మధురనాయకుని నోడించి తంజాపూరిని స్వాధీనపఱచుకొనెనే కాని విజయరాఘవుని గెలిచి కాదు. ఇట్టి పొరపాట్లు మఱికొన్ని కలవు. మఱియు శివాజీ గోల్కొండనవాబుతో కర్ణాటకదండయాత్రసంబంధమున జేసికొనిన యొడంబడిక ప్రకారము మాతనికి జయించిన దేశమున సగము నియ్యక చేసిన మోసమును తగినరీతిని విమర్శింపక వదలిపెట్టిరి. ఇది కథానాయకునియెడ వీరికి గల పక్షపాతమును సూచించుట లేదా. ఇట్టివి లోపములైనను పరిగణింపదగినవి గావు. పాలలోని నలుసులవంటివి. గ్రంథముయొక్క గుణాతిశయము వీనివలన తరుగజాలదు.

ఇంకొకమాట. అది భాషావిషయకమైనది. లక్ష్మణరావుగారు గ్రాంథికభాషావాదులు. మఱియు గ్రాంథికవాదమునకు మూలస్తంభమువంటివారు. శ్రీశివాజీచరిత్ర గ్రాంథికభాషయందే వ్రాయబడియున్నను అచటచట వ్యావహారికదోషములు గానవచ్చుచున్నవి. దీనికి గారణమేమో—ప్రకాశకుల సంస్కారములైయుండునా?

నే. వెంకటరమణయ్య.

* * *

కవి పూజ

రచయిత: తల్లావజ్ఝల కృత్తివాస తీర్థులుగారు. ప్రకాశకులు: త్రివేణీ పబ్లిషర్సు, మచిలీపట్టణము. వెల ౮ అ.

బమ్మెరపోతన, శ్రీనాథుడు, వేమన, వేములవాడ భీమన, నన్నయ, ముక్కుతిమ్మన, శ్రీకృష్ణదేవరాయలు, అల్లసాని పెద్దన, తెనాలి రామకృష్ణుడు, తిక్కన సోమయాజి అనెడి సుప్రసిద్ధులైన పదిమంది తెలుగుకవుల జీవితములందలి కొన్ని రసవత్తరమైన ఘట్టములను—మాధ్యమిక తరగతులలోని తెలుగు విద్యార్థులకు ఇంపు గొలుపువాటిని సేకరించి, వారి పరిజ్ఞానమునకు సుబోధమైన శైలీపాకములో సంక్షేపించి రచించిన దీ గ్రంథము. ఆంధ్రసాహిత్యముపైనను, ఆంధ్రకవులపైనను విద్యార్థులకు అభిరుచి, అభిమానమును కల్పించుటకు ఇది మిక్కిలి ఉపకరింపగలదు. విద్యార్థుల కంటికింపైన సొగసైన చిత్రములు కూడ అమరియుండుట ఇందలి మఱియొక విశేషము.

గ్రంథ స్వీకారము

సంపెంగతోట

చెహోవ్ నాటకమునకు తెలుగు. రచయితలు: శ్రీరంగం శ్రీనివాసరావు, అబ్బూరి వరదరాజేశ్వరరావు గార్లు. ప్రకాశకులు: ప్రజాసాహిత్యపరిషత్తు, తెనాలి. వెల ౧ రూ.

అమర సందేశము

ఖండకావ్యము. కవి: ముదివర్తి కొండమాచార్యులుగారు, గూడూరు. వెల రూ. ౧-౪-౦

ప్రేమపూజ

చిన్న కథల సంపుటి. కథకుడు: తలమర్ల కళానిధిగారు, తలమర్ల, అనంతపురము జిల్లా. వెల ౭ అ.

'బ్రాహ్మణనక్క' పర్వము

ద్వితీయాశ్వాసము. దుగ్గిరాల రాఘవ చంద్రయ్య శాస్త్రిగారిచే (బెజవాడ) సంపాదితము. వెల ౧౦ అ.

ఆస్తికవాదము

తాత్త్వికవిచారము. రచయిత: పండిత గోపదేవుగారు. ప్రాప్తిస్థానము: ఆర్యసమాజము, కూచిపూడి (గుంటూరు). వెల ౪ రూ.

పద్మవ్యూహము

నాటకము. కర్త: తాడేపల్లి సాంబమూర్తి శాస్త్రిగారు, సర్వతంత్ర స్వతంత్ర కళాశాల, బెజవాడ. వెల రూ. ౧-౧-౦

గీతా ప్రతిభ

పద్మపురాణములో వేదవ్యాసులు కథారూపమున కీర్తించిన గీతామాహాత్మ్యమునకు తెలుగు. రచయిత : బులుసు సూర్యప్రకాశ శాస్త్రిగారు. ప్రాప్తిస్థానము : సాధన గ్రంథమండలి, తెనాలి. వెల ౧౨ అ.

రాష్ట్రగీతం

రచయిత : ఏలేటి కామేశ్వరరావుగారు. ప్రకాశకులు : దుర్గా మాడరన్ బుక్ డిపో, బెజవాడ. వెల ౩ అ.

కర్షక సామ్రాజ్యము

కావ్యము. కవి : పానేలు హనుమంతరెడ్డిగారు, గుండ్లపాలెం, పత్తిపాటిపాలెం, తాలూకా. వెల ౬ అ.

శ్రీ జ్యోతి రామలింగస్వాములవారి జీవితచరిత్ర సంగ్రహము

రచయిత : విద్వాన్ పుల్లూరి మునిరత్నపిళ్లగారు. ప్రకాశకులు : శ్రీ శాంతానందస్వాములవారి, ఆనందాశ్రమము, ఎఱ్ఱంపల్లె, పూతలపట్టు పోస్టు, చిత్తూరుజిల్లా.

౧. తెనుగు సందేశము
౨. కుమారసంభవము
౩. సూక్తిసుధ

కర్త : పూతలపట్టు శ్రీరాములు రెడ్డిగారు, చిత్తూరు. వెలలు వరుసగా — రూ. ౧-౪-౦; ౨-౮-౦; ౦-౮-౦.

భట్టర్ చికిత్స

జ్వరమునకు దీవి కృష్ణభట్టాచార్యులుగారి చికిత్సాక్రమము. ప్రకాశకులు : విభవసగ్రంథమాల, ఎడ్లపల్లి, వయా తెనాలి. వెల ౧ రూ.

దేవీగానసుధ

గ్రంథకర్త : ఓగిరాల వీరరాఘవశర్మగారు, రైలుపేట, రేపల్లె, గుంటూరుజిల్లా. వెల ౨ రూ.

శ్రీ మహర్షి జీవితకథామృతము

పరిష్కృత ద్వితీయముద్రణము. రచయిత : బులుసు వెంకటేశ్వర్లుగారు, బి. ఏ., రామారావుపేట, కాకినాడ. వెల ౨ రూ.



Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No, 7, Thambu Chetty St., G T., Madras. Editor—S. Sambhu Prasad.